భారతి

1967 నవంబరు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒక రూపాయి

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

నవంబరు **1967**

★

సంపుటము : **44** : : సంచిక **11** :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

నవంబరు 1967

రంగులు

శ్రీ పరిగి రాధాకృష్ణ

ఎన్ని రంగులు!
ప్రకృతిలో జీవితంలో సమాజంలో
మనిషి మనసులో భావనలో ప్రవర్తనలో
ఎన్నెన్ని రంగులు
నవరసాలకీ జీవితానుభూతులకీ
చిహ్నాలై భాసించే ఈ రంగులు
మనసులను మథన పెడతాయి.
మనుషులను మభ్య పెడతాయి.
మనుగడకు మెరుగులు దిద్దినట్టు కనిపిస్తూనే
బతుకులను తికమక పెడుతుంటాయి.
ఉన్నరంగులు ఉన్నతికన్నా
ఉన్మాదాన్నే ఎక్కువగా సూచిస్తాయి!

కంటినిబట్టి రంగు మారదుకానీ
రంగునుబట్టి రసానుభూతి మారుతుంది.
రసానుభూతినిబట్టే బతుకు విలువ పెరుగుతుంది.
గాజుప్రిసమ్‌లాంటి దీ జీవితం.
సరియైన కోణంలోంచి చూస్తేనే
అన్నిరంగులూ కనిపిస్తాయి.
అన్నిమార్పులూ వ్యక్తమవుతాయి.
చూసే తీరు సరిగాలేక
రంగులు కనిపించలేదని వాపోతే
అది ప్రిసమ్ తప్పెలా అవుతుంది?

తెలుపులో వెలవెలబోయే గుణముంది
నలుపులోనూ నిజమైన అందం దాగుంది.
నలుపైనా కోయిల కూతకు కమ్మదనం కొరవడదు.
రంగులు మార్చిన మాత్రాన
ఊసరవెల్లి అంటే అందరూ ఇష్టపడతారా?

స్వరూపం స్వభావాన్ని నిర్ణయించదు
స్వభావాన్నిబట్టే స్వరూపానికి విలువౌతుంది.
రూపంకాదు ప్రకాశించేది
రూపం వెనకకల గుణం.
ఆహార్యానికీ ఆకర్షణకీ సంబంధం వున్నా
ఆకారానికీ అంతరంగానికీ సంబంధంలేదు!
ఆకర్షణ తాత్కాలికమయింది
అంతశ్శక్తి సార్వకాలికమయింది!

ఆకులన్నీ ఒకేరంగులో వున్నా
పూలు రకరకాల రంగుల్లో ఎందుకు పూస్తాయి?
పండ్లు నానారుచులతో ఎందుకు కాస్తాయి?
రక్తవర్ణం మనిషి మనిషికీ మారదు.
జీవశక్తి ప్రాణికోటికంతా ఒకటే.
ఒకే చైతన్యం ప్రవహిస్తుంది నానారూపాల్లో
ఒకే మూలసూత్రం సృష్టిలో భిన్నాకారాల్లో
భిన్నత్వంలో ఏకత్వమంటే యిదే!
ఏ రంగు విలువ దానికున్నట్టు
ఏ మనిషి ప్రత్యేకత ఆ మనిషికుంది.
ఈ వైవిధ్యమే జీవితానికి వరం.
ఇదే జీవన చైతన్యానికి మూలం.
సృజనాత్మకశక్తికీ ఇదే కారణం.

వాసనలేని పువ్వుల్లా వుంటారు కొందరు
కాలాన్ని కళ్లు మూసుకుని గడిపేస్తుంటారు.
కాగితపు పువ్వుల్లా ఆకర్షిస్తుంటారు కొందరు.
కొందరు రసార్ద్రదృష్టి తొణికిస్తుంటారు.
ప్రతి నిమిషాన్నీ జీవంతో నింపుతుంటారు.
కొందరు వస్తుతత్వాన్ని మించి వెళ్లరు.
కొందరు పశుప్రవృత్తినుంచీ మళ్లరు
కొందరే మనస్తత్వాల్ని తరచి చూస్తారు.
అందులో ఏ ఒక్కరో సత్యాన్ని పట్టుకోగలుగుతారు!
స్థూలంగా చూస్తే మనుషుల్లో రెండే రకాలు
కొందరు జీవితంనుంచీ ఎప్పుడూ ఏదో కోరుతూనే వుంటారు.
కొందరు జీవితానికే ఎప్పుడూ ఏదో యిస్తూనేవుంటారు!

తెరమీద కనిపించే రంగులు నిజమైనవికావు.
రంగు పూసుకున్న నటుడు కార్చేవి నిజమైన కన్నీళ్ళు కావు.
కాషాయాంబరధారణతో ఎవడూ సన్యాసి కాడు.
ఎంత షోకు చేసుకున్నా వేశ్య అసలురంగు బయటపడుతుంది.
రంగుటద్దాల్లోంచి కనిపించేది నిజమైన లోకం కాదు.
నైట్‌లో నగరంలో రంగుల్ని చూసి మోసపోకు.
నాగరికత నగ్నత్వాన్ని చూసి దిమ్మెరపోకు.
నియాన్‌లైట్ల కాంతిలో నీడల్ని గమనించు.
రంగురంగుల కాంతుల నడుమ
రంగులేనితనానికోస మన్వేషించు
మసి చూరిన మనస్తత్వాల జోలికి పోకు
కసి పేరిన కల్మషాన్ని దగ్గర చేరనీకు!

ఏ రంగు లానందాన్నిస్తాయో
అవే రంగులు మోసగిస్తాయి.
ఏ బ్రతుకు సుఖమయమని భావిస్తామో
అదే బ్రతుకు నీడలో వేదన వుంది.
ఎక్కడో మెరిసే చుక్కల్నిగూర్చి
ఏవేవో ఊహాగానాలు చేసినట్లు
ఏమిటో తెలీని బ్రతుకులో ఎన్నెన్నో ఊహించుకుని
అనుకున్నది జరక్కపోతే ఆవేదన పాలవటం
అన్నది నిజమైతే మన ప్రజ్ఞగా చెప్పుకోవటం
జీవితరంగంలో జరిగే నాటకాలు చూస్తూనే
నిజానిజాల్ని కప్పే రంగుల్ని గమనించలేకపోవటం
ఇదీ బ్రతుకు పరమపదసోపానపటం!
చేసిన స్వల్పాన్ని చెప్పుకోవటంలో రంగు పూయటం
చేసిన తప్పును కప్పిపుచ్చుడానికి రంగు పూయటం
నిత్యావసరాలుగా మారినప్పుడు
సత్యాన్వేషణాపథం కంటకావృతం!

గడియగడియకీ జీవితం
రంగులు మార్చుకుంటుంది.
మారే రంగులు కృత్రిమంగా మెరిస్తే
కృతకమైన ఆనందం కలుగుతుంది.
సహజత్వాన్ని పోషిస్తే
నిజమైన రసానుభూతికి దోహద మవుతుంది

ప్రకృతిని జయించాలని కంకణం కట్టుకున్న మనిషి
దాన్ని చూసి నేర్చుకోవాలనుకోడు!
మనిషికీ ప్రకృతికీ స్థూలంగా
భేద మొక్కటే కనిపిస్తుంది.
మనిషి మార్పినంత సులువుగా తొందరగా
ప్రకృతి రంగు మార్చదు!

పెరుగుదల ద్వంద్వాలకు సంబంధించింది.
మంచికీ చెడ్డకీ కూడ ఆ అవకాశముంది.
మనుగడలో మంచి పెరిగితేనే
పరిణామం ప్రగతిశీలంగా వుంటుంది.
మంచివేపు వెళుతున్నాననుకుంటూ
మానవుడు చెడువేపు పయనించే ప్రమాదముంది.
శాంతి నెలకొల్పుతున్నానని భ్రమించి
అశాంతికి బీజంవేసే అవకాశముంది!
న్యాయం ధర్మం సత్యం
మనిషి మనిషికీ మారవు.
వాటి స్వరూపం ఎప్పుడూ ఒకటే.
మనిషి దృష్టి మారుతూవుంటుంది కాబట్టి
అవీ మారినట్టు కనిపిస్తుంటాయి.


పసిపిల్లాడి మనసులో పాపానికి తావులేదు.
పసితనపు అనుభూతిని నిలుపుకోవటం,
పెరిగే మనిషికి పరీక్షవంటిది.
అందరూ ఆ దివ్యానుభూతిని నిలుపుకోలేరు.
అంతరాలు సృష్టించే అన్యాయకు దాసు లవుతారు.
అరాజకానికి తలుపులు తీస్తారు.
అరవై నిండినా కొందరు అపరిణతంగా వుండిపోతారు
అంతకు సగం వయసులోనే కొందరు
పండు టాలోచనలు వెలార్చుతారు.
ఆలోచనలో పరిణతి
అనుభూతికి మెరుగుపెడుతుంది.
పరిణతిలేని మనిషి పాపాన్నర్థం చేసుకోలేడు
పరిస్థితులకు జడిసేవా డెప్పుడూ బ్రతుకును పండించుకోలేడు.

మితిమీరి నడిచేవాడు బ్రతుకు శాపాన్నుంచీ తప్పించుకోలేడు.
దృక్పథాన్నిబట్టి నిర్ణయా లుంటాయి.
నిర్ణయాల నీడలోనే ఫలితాలు పొంచుంటాయి.
పాక్షికమైనదృష్టి పరిణామా న్నర్థం చేసుకోదు.
పచ్చదనాన్ని ఆహ్వానించదు.
సమాజంలో సంక్షేమాన్ని కాంక్షించదు.

రంగులు మార్చకపోతే
హంగులు సమకూరవని
మనిషి గట్టిగా విశ్వసించినపుడు
మనుగడలో కుదుపులు తప్పవు.
సమాజంలో అలజడి తప్పదు.
చీకట్లో రంగులన్నీ కలిసిపోతాయి.
దుఃఖంలో ఆశలన్నీ అడుగంటుతాయి.
వెలుతురులో అన్నిరంగులూ స్పష్టంగా మెరుస్తాయి.
సౌఖ్యక్షణాల్లో అన్నికోర్కెలూ స్పష్టంగా తెలుస్తాయి.
రంగులేని కష్టాల్లోంచి రంగులేని కన్నీళ్లొస్తాయి.
కన్నీళ్లు కనిపిస్తాయి బాధను పలికిస్తాయి.
కష్టాలకు బాహ్యరూపాలుగా మెరుస్తాయి.

చీకటికీ వెలుతురుకూ రంగేమిటి?
చావుపుట్టుకల నిజస్వరూప మేమిటి?
కనిపించే రంగులు కొన్నైతే
కనిపించని రంగులు కోటి.
ఈ కనిపించని రంగుల కోవలోనివే
చావుపుట్టుకల స్వభావాలు.
చీకటి వెలుతురుల నిజరూపాలు.
శూన్యంలోంచి మనిషి ఆకారం దాల్చినట్టు
రంగులేనితనంలోంచి రంగులు పుట్టుకొస్తున్నాయి.
రూపరహితమైన ఆత్మలోంచి
అన్నిరూపాలూ ఉద్భవిస్తున్నాయి.
ఇన్నిరంగుల్ని సృష్టించినవాడికి రంగులేదు.
ఇంత జీవశక్తికి కారణభూతుడైనవాడికి రంగుభేద ముంటుందా?
మనిషికీ మనిషికీ మధ్యనే రంగుభేదం
మనిషివల్లనే మనిషికి ఖేదం!

మెఱపును చూడాలనుకుంటే
మబ్బు లుండడం అత్యవసరం.
విద్యుద్దీపకాంతుల్లో పరవశించాలంటే
చీకటి అవసరాన్ని గుర్తించాలి.
చీకట్లోనే మిణుగురు పురుగులు
చూడముచ్చటగా వుండేది:
నైరాశ్యం నిండిన వేళలోనే
ఆశకోసం మనిషి వెతుక్కునేది.
కాలానికి చిహ్నమైన గడియారపు పెండులం
ఒకే చివరలో నిలవడం అసంభవం.
రెండు చివర్ల నడుమ అది ఊగుతూ వుండాల్సిందే!
పుట్టుకలో నవ్వు ఆనందం ఎంత సహజమో
చావులో దుఃఖమూ దైన్యమూ అంతే సహజం!
నలుపు తెలుపుల నడుమ నానారంగుల తోరణముంది.
చావు పుట్టుకల నడుమ విభిన్నానుభూతుల గొలుసుంది!



తెలుగు - తమిళము - ద్రావిడ భాష

- శ్రీ నిడుదవోలు వెంకటరావు

నేడు తమిళ, కన్నడ, మళయాళ భాషలు, తెలుగుతో కూడ ద్రావిడ భాషలని వ్యవహరింపబడుచున్నవి. సామాన్యముగా నీ భాషలు నాల్గింటికి ద్రావిడ భాషలని వాడుకయున్నను, వానిలో 'ద్రవిడ' శబ్దము తమిళమునకే, తొలినుండి పర్యాయపదమైనట్లు కానవచ్చుచున్నది.

తెలుగున శివకవియుగములోపాటు మనకు— ద్రవిడ భాషా సంబంధము దృఢపడినది. శివకవులలో తృతీయుడు పాలకురికి సోమనాథుడు. మొదట— నీ సంబంధము, భాషాసాహిత్యపరములుగా వ్యక్తపఱచి యున్నాడు. ఇందు 'తమిళము' అను మాటయే కానరాదు. ద్రావిడ శబ్దము భాషాపరముగా మొదట సోమనాథుని వృషాధిప శతకమున గానవచ్చుచున్నది.

పరమనె యన్న యాండవనె
పన్నుదయానె యవాద వాదనే
పెరియనె పేని వుండవనె
పేరుదయాయనె పేరు జెప్పనే
తరిమురియానె యనుచు
'ద్రావిడభాష' నుతింతు విన్నమ
ద్యర కరుణా విధేయ
బసవా! బసవా! బసవా! వృషాధిపా.

59 వ పద్యము.

సోమనాథుని పండితారాధ్య చరిత్రమున— ద్రవిడ శబ్దము ప్రయుక్తమగుటయేగాక, ఆ భాషలో కొన్ని పంక్తులను నుదాహరింపబడినవి.

(1) 'తప్పదచెల్లనను ద్రావిడ భూమి
జెప్పనొప్పు తిరువాళ్ల ప్రోవయనగ.'

దీక్ష 1 - 145. పుట.

ఇచట ద్రావిడభూమి యనగా తమిళవాడు.

(2) 'ఇలనొప్పు ద్రవిడ మహీస్థలి యందు'

మహిమ—2—124.

ఇచ్చట ద్రవిడ మహీస్థలి యనగా తమిళవాడు. ఇచ్చట—'ద్రవిడ' అను హ్రస్వరూపమున్నది.

(3) గౌళరాగములు
మాళవగౌళ రామక్రియ శాయ
గౌళ 'ద్రావిడ గౌళ కర్ణాటగౌళ

పర్వత - 2 - 454.

గుజ్జరి

'గుజ్జరి సౌరాష్ట్ర గుజ్జరి ద్రవిడ గుజ్జరి.'

2 - 454.

ఈ ప్రకరణముననే, ద్రవిడభాషలో పంక్తులున్నవి.

'అరుదొంద నట్ల యయ్యరవ దేశంబు
నరుసయు ద్రావిడభాష పొంగముగ.'

ద్రా వి డ భా ష

'అరులు గిరితి యెన్ని యరనేపిరానె
చిరిగిరివిలయనె చివనె యాణ్డవనె
అంగమాటుందానె యాయిరుందవనె
మంగయర్ పొంగనె మల్లికార్జునవె
యామ నక్కడియెనే నకిలనాయకనె
యూనమిల్లాదానె యుమయువిల్లియనె
ఆటువత్తుమువ్వర క్కొత్తనాయకనె
మఱి వాలు మఱియాద మల్లికార్జునవె
అలాలగండనె యాదియుట్టవనె
చూలియే మల్లికార్జునవె యన్నవనె
యెల్లయిల్లాదానె యెణ్ణముళ్లవనె
చొల్లవల్లాదానె మల్లికార్జునవె
ఆటుమిన్మడుం తిటువీటుముళ్లవనె
ఏఱేటుమిూచనె యెల్లమల్లయనె

వేదియురుతుదిక్కుమాదియే చివనె
చోదియే మల్లికార్జునని యన్నవనె.'[1]
2 - 388 - 404.

పై యుదాహరణలనుబట్టి — తమిళభాషకు దేశమునకు ద్రావిడ, ద్రవిడ అను పేళ్లుకాక — అరవ- అని మఱియొక పేరున్నట్లు స్పష్టము.

సోమనాథుడు 'ద్రవిడ' శబ్దమే హెచ్చుగా నుపయోగించినను - తన కాలమున, 'అరవ' అని మఱియొక పర్యాయ పదము విచ్చియున్నాడు. దీనికి కారణము లేకపోలేదు.

ద్రవిడ శబ్దము సంస్కృత శబ్దము. ఇది ద్రవిడ భాషాతత్త్వమునకు విరుద్ధమైనను చిరకాలము నుండి భారత వర్షమునందంతటనూ ప్రవారములో నున్నది. ఇక 'అరవ' శబ్దము, దేశి శబ్దము. ప్రజా సామాన్యమున వాడుకలో నున్నది. కాబట్టియే రెండింటిని సోమనాథుడు చూపించియున్నాడు.

సోమనాథుడు 'అఱవదేశము' అని పేర్కొన్నను తరువాతి తెలుగు కవులు—ద్రావిడులను, తమిళులని వాడక 'అఱవలు' అనియే వాడిరి.

(1) 'ముఱికినాటి వార లఱవలు' కేతన—ఆంధ్ర భాషా భూషణము.

(2) 'అరెలు—కన్నడి లఱవలు తెలుగులు—
తన బిరుదందియః దగిరి కాలువ'
గోపరాజు సింహాసన 1—42 ద్వాత్రింశిక

(3) 'క్రమముగ 'శ్రీమత్సకలగుణ సంపన్న'
యని యున్న జదివెదు నఱవవారు'
బిల్వేశ్వరీయము 1 చి.

ఈ అఱవశబ్ద మీ క్రింది నానుడిలో నున్నది. 'అఱవఅధ్వానము కన్నడకస్మార్తి తెలుగుతేట'.

(4) కంచి యఱవత లనమాత్రన్ ఖడ్గలతలు'
కాశీ 5 ఆ.

అని శ్రీనాథుడు—'అఱవత' అను స్త్రీ వాచకమును వాడియున్నాడు.

అఱవలని వాడుకయున్నను—అఱవ శబ్దము కన్న—ద్రవిడ శబ్దమే తెలుగునాట విశేషప్రవారములో నున్నది. తెలుగు కావ్యములలో - ద్రావిడ మధ్యభూమి-ద్రావిడాగమ పార్శ్వభాముడు-ద్రవిడవేదము — అనునవి కన్పట్టుచున్నవి. ఇక తెలుగు బ్రాహ్మణులలో 'ద్రావిడులు' అను శాఖీయులు గలరు. వీరైదు తెగలుగా వ్యవహృతులు.

1. పేరూరి ద్రావిడులు
2. దిమిలె ద్రావిడులు
3. ఆరామ ద్రావిడులు
4. పూదూరి ద్రావిడులు
5 వడమ ద్రావిడులు[2]

దక్షిణాంధ్ర వాఙ్మయము

ద్రావిడభాష

పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర వెనుక ద్రావిడభాష నుదాహరించిన తెలుగు కావ్యములు — దక్షిణాంధ్ర వాఙ్మయమునవేయని చెప్ప వచ్చును. నాయకరాజులు తమిళదేశమునకు పాలకులై నప్పుడు తమ దేశభాషయగు తెలుగును రాజభాషగా చేసినను, తమిళ ప్రజానీకము మాటలాడు తమిళ భాషలో కూడ వ్యవహరించెడివారు. ముఖ్యముగా, రాజకీయముగా - తమిళము తప్పదు. నాయకరాజులు శాసనములను తమిళములోనే వెలయించిరి. కాని విజయ రాఘవ నాయకుడు మాత్రము—నాగపట్నము రేవువద్ద వర్తక వ్యాపారములకొఱకు — ఒలాందావారి కిచ్చిన నమ్మిక శాసనము - తమిళమునవేకాక తెలుగులో కూడా వేయించియున్నాడు.[3] తక్కిన వ్యవహారములలో - తమిళము వాడుకలోనున్న ట్లీ క్రింది గ్రంథోదాహరణము లనుబట్టి తెలియగలదు.

1. ముద్రిత ప్రతిలో సరిగా లేని పాఠములను కీర్తిశేషులు వెంకటరాజులరెడ్డిగారి సాహాయ్యమున పరిష్కరించినాను.

2. పంచ ద్రావిడుల యుత్పత్తి—ఆ. రామచంద్రయ్య, కలెక్టరు, నెల్లూరు - 1890.

3. ఈ శాసనములు - వెండి రేకుపై చెక్కబడి - నేటికిని 'జావా'యందు 'బటేవియా' చిత్రవస్తు ప్రదర్శనశాలలో భద్రపఱుపబడి యున్నవి. వివరములకు— 'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము' అను గ్రంథము చూడుడు. పుటలు 546—548.

మన్నారుదాస విలాసము

అన్నగళమాట :

'శామివరాక్కు కెళక్కెమన్నారు కోవిల్లె యిరుం దుంవంగునిత్తిరుణాళుక్కు తెంగాయువాంగ, శెంగోలు పారువత్యగారనుం అంజ్జినహె నిర్యాహత్తు నంబి మారుం తలత్తారుం జియ్యాళుం యేకాంగియుళుం వైరాగియుళుం కొత్తియుళుం శ్రీపాదంతాంగియుళుం తిరువాభరణక్కణక్కప్పిళ్లెయుళుం రాగభోగత్తారుం గూడి అనెమేలె శ్రీముఖ వెళిందరుళప్పణ్ణి క్కొండు వందు శముగత్తిలె అరిక్కెవణ్ణచ్చొల్లి ఆశారవాశల్లె కాత్తిరుక్కురార్గళ్ శిత్తం.' (పుట 3)

శటిశవార్ల మాట :

'హోహోయి నంబిమారుం తలత్తారుం జియ్యాళుం కొత్తియుళుం కణక్కప్పిళ్లయుళుం రాగభోగత్తారుం యెల్లారుం శముగత్తుక్కు వారుంగో'
(పుట. 4)

కోవిల కరణికులు : లెక్కలు వినిపించుట.

మూణెముక్కాలె మూణుమాముక్కాణి, మూణెముక్కాలె, మూణుమాముక్కాణి, అరె రెండు మాక్కాణి అరె రెండు మాక్కాణి శామివరాకు, లక్షత్తంబెదునాయురం బొన్నుక్కు తిరువిళయాట్టు గ్రామంగళానడక్కురథు అధిశె గ్రామంగళాయెం శ్బెంధు, ఉక్కడయుల్ యెళువత్తునాలు, మడప్పురం పనిరెండు, కప్పనత్తిలె మూణుమహాణం నడక్కుథు యిదిక్కుమన్నంగాలులె మూణులక్షక్కలనెల్లుం, ముప్పదునాయురం పొన్నెమ్నం గుత్తహిపట్టె యెళధిక్కొండాన్. (1)

మరొక కరణం చెప్పేది :

స్వామి వరాక్కు, అందప్పడిక్కెల్లుం అళవామల్ పొన్నుం శెలిత్తామల్ మణియగారన్ కోవిలప్పత్తరం నడప్పి వియ్యామల్ అల్లాంబాత్తుకొళ్ళ రోమెన్ను నెల్లల్లాం వరంబాశాచ్చాన్, కోవిళుక్కు శిరిప్పు కట్టశయ, అరమనెయిలె దినమెన్నుకు అంబెదు పొన్నుక్కుడుక్కురా ప్పొలెయాచ్చిధు (2)

వేఱొక కరణం చెప్పేది :

శామివరాక్కు, 'యిదుతవిద, పుష్పవనత్తిలె లక్షత్తునం బెదు నాయిరం యిలెప్పెమరం, అంబెదు నాయిరక్కలక్కొట్టెకాణుం అధల్లాం కరతారయిలె శెందుపొరధు, క్రయుక్కారం గయిలె కడన్ గట్టా తిరువెళక్కు యెణ్ణెక్క్రొప్పొలెయాచ్చి, ఉత్తర పారువత్యగారన్, అంగుం యింగుం వోడిక్కొండు తిరియిరిధి వొళియ వొణ్ణుం వరామరశిక్కురుధిల్లె.

మరొకండు :

శామి అడియొణ్ణెణ్ణుప్పంకేట్టరుళ, నంబిమారు యెల్లాం కొళంబుప్పొలుం, తిరువిశాంసప్పడధివొళియ, పారువరాహిలుం వొణ్ణుం అరిక్కెయిడవాళిల్లె యిదుత్తవిర, అరమనెయిల్ కరక్కట్టు కొల్కట్టుక్కు, ముప్పాయిరం పొన్ను, మొదల్ కడన్, ముప్పాయిరముం కుడుత్తిరుక్కురదు, అదువుం అరుపుప్పణ్ణి అందప్పణముం తండయిల్లె స్వామి శిత్తం. (4)

మణియగాండు చెప్పేమాట :

సామి వి అరమనెయారిట్టు శొండెక్కెల్లాం, అడియే విరుక్కిరేనే, కణక్కు వెళింగి యెమ్మెలె శొమంద్ద ధెల్లాం కుడిక్కిరేన్.

విజయరాఘవ నాయకుని నాటకములు

రఘునాథాభ్యుదయము :

చిదంబరనాథ మొదలారి : నముఖత్తిల సింగశేన్ అడిర్ప్పి
వ్రక్టిర్ ఎల్లాం కరత్తక్కల్ చిత్తమరియుం
నుమ్మోయిరుంగో.

విప్రనారాయణ చరిత్ర :

పూజారి : ఓహోహో! యిదెన్నడా! యిదెన్నడా!
పంచపాత్రంగళిలే పొరుపొన్ను కిణ్ణె కాణోం,
మౌనం వందుదే, అడ కూరత్తాళ్వారే.

కూర— అడియేన్.

పూ - అడ ఎంబెరుమానార్.

ఎం—అడియేన్.

పూ—అడ పరాంకుశా.

పరా—అడియేన్.

పూ - సన్నిధియిల్ పొరుపొన్ను కిణం యేన్
కాణోం యిదెన్న పిళ్ళాయి?

నిరూపించితిని. అతడు వీరశైవమతప్రచారముకొఱకు ఈ 'యఱువత్తుమువ్వురు' చరిత్రలను తన గ్రంథములలో వివరించియున్నాడు. బసవపురాణములో, పండితారాధ్య చరిత్రలో, వీరి యుదంతము గలదు. ఈ అరువత్తుమువ్వురును సహస్రగణమాలికలో చేర్పబడినారు.[6] కాని యీ అరువదిముగ్గురులో నీ క్రింది వారినిగూర్చియే కథలు విశేషముగా వ్యాప్తిలోనికి వచ్చినవి.

1. సిరియాలుని కథ (చిఱుతొండనంబి).
2. కన్నప్ప—(నేత్రేశ నాయనారు).
3. నంబెన్న కథ (సుందరమూర్తి నాయనారు)
4. కుమ్మరి గుండయ్య (తిరుసీలకంఠ నాయనారు).

పై వానిలో చిఱుతొండనంబి కథను శ్రీనాథ మహాకవి తనహరవిలాస కావ్యమున — మొదటి రెండాశ్వాసములలో విస్తరించి వ్రాసియున్నాడు. వీరశైవ సంప్రదాయికములగు కథలను మతసాంకేతికత నుండి తప్పించి కేవల సాహిత్యవీథిలో మొదట ప్రవేశపెట్టిన మనీషి శ్రీనాథుడు. ఆ వెనుకనే, వీరశైవ కథలు తెలుగు కావ్యసాహిత్యములలో ప్రచారమునకు వచ్చినవి.

సోమనాథుడు పై కథలను సంగ్రహముగా తన గ్రంథములలో తెలిపియున్నాడు. కాని శ్రీనాథుడును, తక్కినవారును ఆ కథలను పెంపుచేసినప్పుడు తమిళదేశమున వ్యాప్తములోనున్న కథాంశములను చాలవఱకు గ్రహించిరి. దీనివలన తమిళమునకు తెలుగునకుగల సంబంధము చాలవఱకు దృఢపడినది.

పై కథలలో కొన్ని కావ్యసాహిత్యమున ప్రఖ్యాతములైనవి. వానినిట నుదాహరించుచున్నాను.

1. చిఱుతొండనంబి కథ (సిరియాళచరిత్ర): ప్రబంధ, ద్విపద, యక్షగాన, వచన శాఖలలోనున్నది. సిరియాళ చరిత్రమను ప్రబంధము మూడాశ్వాసముల కృతి. గరికపాటి తమ్మయకవి. అముద్రితము. క్రీ. శ. 1670.

2. కన్నప్పకథ (నేత్రేశనాయనారు):— కంచి రాజు మూరయ. ప్రబంధము లభ్యము కాలేదు. ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యము, 3 ఆశ్వాసము.

3. నంబెన్న కథ (సుందరమూర్తినాయనారు):— అజ్ఞాతపు పేరయ లింగకవి, ఒడయనంబి విలాసము.

4. కుమ్మరి గుండయ్యకథ (తిరుసీలకంఠ నాయనారు):- అమలాపురపు సన్యాసి: కుమ్మరిగుండయ్యచరిత్ర: 3 ఆశ్వాసములు: అముద్రితము (క్రీ. శ. 1850).

ఈ కావ్యముల కథావస్తువు లన్నియు, తమిళ సాహిత్యమునకు సంబంధించినవే.

పద్యము: — ఈ అరువత్తు మువ్వురు నాయనారుల చరిత్రలకు పద్యరూపమున తొలుత రచించిన కవి అత్తలూరి పాపకవి. ఈతడు క్రీ. శ. 1790 ప్రాంతమువాడు. ఈతడు రచించిన స్కాందోప పురాణము లేక హరభక్తవిలాసము అను మహాకావ్యమున నివి గలవు. ఇది అముద్రితము.[7]

వచనము:—ప్రసిద్ధవచన రచయిత – శ్రీ. వై. దొరసామయ్యగారు— క్రీ. శ. 1900 లో 'భక్తలీలామృతము' అను పేర నీ అరవత్తుమువ్వురు చరిత్రలను చక్కని వచనశైలిలో సంతరించిరి.

అద్యతనకాలమున—శివభక్త విలాసము (గ్రంథకర్త – పొంగులూరి సూర్యనారాయణశర్మగారు) వచనమున వెలసినది. ఇది పై కృతివంటిదే. క్రీ. శ. 1962.

పై దానినిబట్టి – తెలుగున తమిళ సాహిత్యము వీరశైవమతము మూలముగనే ప్రవేశించిన దనుట స్పష్టము.

---

6. ఈ సహస్రగణమాలిక – పండితారాధ్య చరిత్రమున పండితుడు పఠియించినట్లున్నది. (మహిమ ప్రకరణము). కన్నడకవి చరిత్రమున నిది పండితారాధ్యుని కృతిగానే వ్రాయబడియున్నది. (చూ. ప్రథమ సంపుటము—120 పుట). ఇది కన్నడమున గూడ నున్నది. ఇది పాల్కురికి సోమనాథుని స్వోపజ్ఞము. చూ. పాల్కురికి సోమనాథుని లఘుకృతులు— పీఠిక –15. శివశ్రీ బండారు తమ్మయ్యగారు. 1962.

7. ప్రఖ్యాత విద్వత్కవులు పూతలపట్టు శ్రీరాములురెడ్డిగారు పెరియపురాణమును సంపూర్ణముగా పద్యకావ్యముగా ననువదించిరి. ఇది యముద్రితము.

భా ష

ఈనాడు తెలుగు — ద్రావిడభాషలలో నొకటియని భాషాతత్త్వశాస్త్రవేత్తలు నిర్ణయించి యున్నారు. వీరశైవ సాహిత్యమూలమున తమిళభాషా పదములు, శివకవుల రచనలలో పొందుపడినవి. వానిలో గొన్నింటి నుదాహరించుచున్నాను.

బడరుడు తమిళ వడారన్ శివతత్త్వసారము

వాయి ,, వాయి(కుక్క) పన్నెచోడని కుమారసంభవము

మలరు ,, మలర్(పువ్వు) ,,

శివకవులలో హెచ్చు తమిళ పదము లుపయోగించినవాడు సోమనాథుడు. అలరు, అవియు, ఇండె, ఈ, ఇర్నాలుగు, ఉలివు, ఓజ, కరువు, కేనిచిలు, చూడు, చొట్లు, తెరవు, తిరుపాట, తిరువీధి, తిరుముట్టుమ్, మొసరు, సంగ, పని, పిడి, మడది, మెయి, మఱువడు, సేల్లువందు. సోమనాథుడు తమిళభాషను చూపునపుడు — సంస్కృతమువలెనే అనుకరణ విధానమునే అవలంబించియున్నాడు. మఱియు నెచ్చటను — తెనుగు, తమిళ పదములతో మిశ్ర సమాసము చేయలేదు. దీనినిబట్టి సోమనాథుడు రెండింటిని ప్రత్యేక భాషలుగానే పరిగణించెనని స్పష్టపడుచున్నది.

వైష్ణవము

విశిష్టాద్వైత మత సిద్ధాంతము రామానుజులవారు క్రీ. శ. (1017—1117) తమిళము నందే వ్యాపింపజేసిరి. వారును తమిళభాష మూలము ననే మత ప్రచారము చేసిరి. తమిళమున వైష్ణవ వేదమునకు ద్రవిడవేదమని పేరు. కాని తెలుగు దేశమున క్రీ. శ. 12, 13, 14 శతాబ్దులలో శైవమే ప్రధానముగా నుండుటచేతను, రాజులామతమునే పోషించుటచేతను సాహిత్యమున శైవమత ప్రభావమే యుండుటచేతను, వైష్ణవ మతవ్యాప్తికి పరిస్థితులు తోడ్పడలేదు. తమిళ శైవ సాహిత్యమంత విరివిగా తమిళ వైష్ణవ సాహిత్యము తెలుగుపై ప్రసరింప లేదు. క్రీ. శ. 15 శతాబ్దినుండి, వైష్ణవ సంప్రదాయ గ్రంథములు ఆళ్వారుల చరిత్రలు కావ్యసీమ నలంకరించినవి. వానిలో ప్రథమము శ్రీకృష్ణదేవరాయలవారి ఆముక్తమాల్యద తరువాత వచ్చినది. పన్నిద్దరాళ్వారులు అనబరగిన వారిలో స్త్రీ యొక్క ఆముక్తమాల్యద మాత్రమే. తక్కిన ఆళ్వారులలో బహుజనాదరణ గడించినది, తొండరడిప్పొడి ఆళ్వారు చరిత్రతో.[8] ఈ కాలముననే తాళ్లపాక చిన్నన్న పరమయోగి విలాసము — ద్విపద — (ఇది ఆళ్వారుల చరిత్రయే), సిద్ధిరాజు తిమ్మరాజు పరమయోగి విలాసము అవతరించినవి. చదలవాడమల్లన విప్రనారాయణ చరిత్ర, సారంగు తమ్మయ వైజయంతీవిలాసము నీ కథనే తెలుపును.

కాని ఇవి యన్నియు ద్రావిడమూలము ననుసరించి నవియేయని చెప్పవలనుపడదు. ఏల యనగా నీ కాలమునాటికి మూలద్రావిడ గ్రంథములు సంస్కృత భాషలోనికి అనువదింపబడినవి. తెలుగు కవులు సంస్కృత మూలమునే యనుసరించి యుండ వచ్చును. ఏమైనను కథావస్తువులు తమిళవైష్ణవ సంప్రదాయమునకు సంబంధించినవి యగుట స్పష్టము.

ద్రావిడవేదము క్రీ. శ. 1300 నాటికే కృష్ణమాచార్యుడు వచనకావ్యముగా తెలుగులో రచించియున్నాడు.[9]

దీనినే — 'దివ్యప్రబంధమని' యందురు. 'నాలాయిరమ్' అని తమిళ నామధేయము. దీనిని సంస్కృతములోను, తెలుగులోను శ్లోక పద్యములతో శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు అనువదించిరి.

భాషలో — తిరు — అను పదములోనున్న వన్నియు తమిళభాషామూలమున వచ్చినవియే యని చెప్పవచ్చును. తెలుగు కవులు వీని నుపయోగించియున్నారు.

తిరువారాధనము, తిరువరంగము, తిర్వధ్యయనము, తిరుకాప్ర, తిరుకావి, తిరుపతి, తిరుమణి, తిరుమంజనము, తిరువాయి, మొదలగునవి.

వైష్ణవమతము సాహిత్యమున వ్యాపించిన కాలమునుండియు ననగా కృష్ణదేవరాయల కాలమునుండియు, ఈ 'తిరు' సంబంధపదములు ప్రచారము

---

8. చూ. విప్రనారాయణ చరిత్ర పీఠిక — ప్రస్తుత గ్రంథకర్త. ఆంధ్రసాహిత్య పరిషత్తు ప్రచురణ — 1940.

9. వచన వాఙ్మయ ప్రథమాచార్యుడు కృష్ణమాచార్యుడు. (భారతి, జూన్ 1945).

లోనికి వచ్చినవిగాని, యంతకుముందుకాలము నం దిట్టివి లేవు. పాల్కురికి సోమనారాధ్యుడు బసవపురాణమున నొక్క పర్యాయము మాత్రమే యీ తిరు సంబంధపదము ప్రయోగించి యున్నాడు.

'అంచు దిర్నీరు మంత్రించి'

బస. 6.172 పంక్తి

భాష—వ్యాకరణము

తెలుగున తత్సమ తద్భవ విభాగమైన వెనుక మిగిలిన అచ్చ తెనుగు పదములలో పెక్కింటికి తమిళభాషతో సాదృశ్యము లున్నవి.[10] పదజాలమేకాక, భాష యొక్క ప్రత్యేక వ్యక్తిత్వమును నిరూపించు, సంఖ్యా వాచకములు, సర్వనామములు, విభక్తులు, సంధి కార్యములు, వీనియందు సమాన లక్షణము లుండుట చేత, భాషాశాస్త్రజ్ఞులు—తెలుగునకు మూలమగు అచ్చతెలుగునకు తమిళభాషతో సాహిత్యమున్నదని స్పష్టపఱచిరి. ఇంతేకాక, తమిళదేశమును, తెలుగు దేశమును ఒక దానితో నొకటి దక్షిణమున నంటి యున్నవి. తమిళులకు తిరుపతిక్షేత్రము ఉత్తరపు సరిహద్దు. తెలుగువారికి నేడు తమిళదేశమునమున్న కంచి దక్షిణపు సరిహద్దు—కాబట్టి యీ భాషా సంబంధ మనివార్యమైనది.

తమిళభాషలో తత్సమపదవిభాగము లేనందున తమిళభాషా సాదృశ్యములు, తెలుగున అవ్యుత్పన్నము లని తెలుగు వైయాకరణులు తెలుపుచున్నను, అచ్చ తెనుగు దేశిపదముల వ్యుత్పత్తులను గ్రహించుటకు తోడ్పడును. పదముల వ్యుత్పత్తులకేగాక, తెలుగు ప్రత్యయముల స్వరూప నిరూపణమునకు, సంధికార్యముల నిర్ణయమునకు తమిళభాషాతత్త్వమెంతయు ప్రయోజనకారి యగుచున్నది. ఈ దృష్టితో పరిశీలించినచో నీ రెండు భాషలకును నత్యంత సన్నిహిత సంబంధమున్నదని మాత్రమే చెప్పనగును గాని జన్య జనక సంబంధమున్నదని నిర్ధారించుట కవకాశము లేదు.

ఛందస్సు

తెలుగు భాషలో నియతములైన యతిప్రాసలు రెండును తమిళమున నున్నవి. అంతియేగాక, తెలుగు పద్యరచన నియమములుకూడ తమిళమునందున్నవి. వాని వివరము.

తెలుగు

1. మాత్ర—గురువులు
2. గణములు
3. పాదములు
4. వృత్తములు
5. యతులు
6. ప్రాసలు

తమిళము

1. ఎళుత్తు—గుర్వలఘ్వక్షరములు గూర్చినవి
2. అశై—మాత్రా సంయోగములు
3. శీర్—గణములు
4. తళై—గణబంధము
5. అడి—అడుగు లేక పాదము
6. తొడై—అంత్యప్రాసాదికముల కూర్పు
7. మోనై—యతి
8. ఎదుగై—ప్రాసము

తమిళమున 8 విభాగములున్నను అవి తెలుగుతో సరిపోవును. 3 వది శీర్ అనునది ఒక లఘువు ఒక గురువు మూడుమాత్రల గణమే. కాని అవి రెండే యక్షరములు. ఇది తెలుగున సూర్యగణముతో సరిపోవును. కాని తక్కిన గణములు తమిళమున 'శీర్' కు మాత్రలు చేర్చుటచే నేర్పడును. పిరిమ్మవరు- I∪IIII పాతాళ ∪∪I. తెలుగున-లఘువుచే ప్రారంభించునవి వేఱు-గురువుచే ప్రారంభించునవి వేఱు. ఒకటి జాతి లేక మాత్రా ఛ్ఛందస్సుల కుపయుక్తమగును. వేఱొకటి-సంస్కృత ఛ్ఛందస్సుల కుపయుక్తమగును. అరవమున సమవృత్తములవంటివి వున్నను యరవమున అవి దేశి వృత్తములే. సంస్కృత వృత్తములందు లేవు. 'తెలుగునందు దేశివృత్తములకు, 'శీర్'వంటి సూర్య ఇంద్ర, చంద్రగణములును, సంస్కృత వృత్తములకు, అక్షర నియమితమైన మూడక్షరముల గణములును

---

10. తెలుగు-తమిళమునకుగల సాజాత్య పదములను 5000 మదరాసు విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన శాఖవారు సేకరించిరి. వానిలో 2000 పదములను-Comparative Dravidian Vocabulary' అను పేర గ్రంథరూపమున ప్రకటించిరి. 1961.

వాడుదురు. 'శిర్' వంటివి నలనామక గణములనువని తెలుగున యున్నవని-విన్నకోట పెద్దన పేర్కొని యున్నాడు. కాబట్టి మాత్రా, గణ, పాద, వృత్తములు రెండింటియందు సమాన లక్షణములే గలిగి యున్నవని చెప్పవచ్చును.

తెలుగున యతిప్రాసలవలె, తమిళమునను గలవు.

యతులు—

అన్నం పోయ్‌కన్ని యరుల్‌కైయ నన్నుదలుం
ఉరువ మినియవై యుళ్లుం పడై యూవ
ఎర్నె ఇళంగిళి యే ఎన్నమురంగు దివెరా
కుత్తివిళక్కేరియ కోట్టుకాల్ కట్టి లిన్మేల్

ప్రా స లు

వళ్‌కలయుర్ వార్ శడయన్మాన్ బనణిమాఅర్
విళ్ కలయుర్ వేదమురైనావర్ నవి మెయ్యార్
ఉళ్ కలయుర్ ఉన్నయుర్ తవట్టునయి ముప్పార్
శొళ్‌కల యువలొత్తలైవిల్ తూణిగళ్ శుమవ్వార్

తమిళమున వర్కా, విర్కా, ఉర్కా అని సంయుక్తాక్షరములు వ్రాతలో నుండవు. తెలుగున నుండును. ఇది 'ర్కా' ప్రాసము.

ముడికవేన్‌దర్—మూవరుకు మరియు
దడిగళిర్‌యురు శిదాగన్నారుకు—

తెలుగువలె, అరవములో, పద్యములవలె సామెతలందును యతిప్రాసలుండును.

తె లు గు

అంగిట బెల్లము: ఆత్మలో విషము
ఆడేకాలు పాడేనోరు ఊరకుండవు
కోల ఆడితే కోతి ఆడును.

త మి ళ ము

ఉదట్టిల్ వెల్లమ్ ఉళ్లత్తిల్‌నంజం
ఆడియకాలుం పాడియవావుమ్
సుమ్మాయిరాదు
కోల్ ఆడ కురంగు ఆడుమ్

తెలుగు, తమిళములకు సాజాత్యములైన సామెతలు 500 గలవు.[11] తమిళములో నున్నట్లు, తెలుగున పదాంతములు హలంతములుగా నుండవు. ఒక్క నకారము మాత్రమే 'న్' అనురీతిని హలంతముగా నుండును.

గ్రంథ విభాగము

తెలుగులో గ్రంథములు సాధారణముగా ఆశ్వాసములుగా విభాగింపబడును. కాని తెలుగున లొలి ఛందోగ్రంథమైన కవిజనాశ్రయమున ఆశ్వాసము కాక 'అధికారము' అను పేరితో నున్నది.

1. సంజ్ఞాధికారము 2. సమవృత్తాధికారము 3. యతిచ్ఛందోధికారము 4. వియతిచ్ఛందోధికారము 5. జాత్యధికారము 6. షట్ప్రత్యయాధికారము 7. దోషాధికారము.

ఈ 'అధికారము' అను విభాగము తమిళము నుండి గ్రహింపబడినది. శిలప్పదిగారము అను తమిళ గ్రంథమున ఇరులదిగారమ్, పొరుళదిగారమ్ అను విభాగములున్నవి. 'అధికారము' అను శబ్దము తమిళమున అదిగారమగును.

క్రీ. శ. 15 వ శతాబ్దిలోనున్న మనుమంచి భట్టు అనుకవి, హయలక్షణవిలాసము[12] అను తన కావ్యమున, ఆశ్వాసములకు బదులు 'అధికారములు' అనియే పేరుపెట్టి యున్నాడు.

ఆ శతాబ్దియందే ప్రసిద్ధ లాక్షణికుడగు వెల్లంకి తాతంభట్టును—తన కవిచింతామణి యందు అధికార విభాగము చేసియున్నాడు.

అముద్రితములైన పై గ్రంథముల నుదాహరించుచున్నాను.

హయలక్షణ విలాసము

ఇది సకల సుకవిజన వినుత పంసూయమాన కవితా చాతురీ ధురీణ నిఖిల భాషాప్రవీణ భైరవాచార్య

11. Comparative proverbs in Dravidian Languages - Telugu, Tamil, Kannada Malayalam - Telugu (సామెతలు). Edited by N. Venkata Rao.

12. మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము 1917-1919 గ్రంథ వివరణ పట్టిక R. 395. పుటలు 1100 - 1101.

పుత్ర మనుమంచిభట్ట ప్రణీతంబైన హయలక్షణ విలాసంబన్న కృతియందు తృతీయాధికారము.

తాతంభట్టు కవి చింతామణి యందొక్కొక్క యధికారము నందలి విషయములు స్ఫురింపజేసెడు పేరును బెట్టియున్నాడు.

1. ఇది యష్టభాషావతార వెల్లంకి తాతంభట్ట ప్రణీతంబైన చింతామణియను కావ్యానుశాసనంబున భాషాలక్షణాధికారము.

2. ఇది శబ్దవర్ణనీయ వెల్లంకి తాతంభట్ట ప్రణీతంబైన చింతామణియను కావ్యానుశాసనంబున వర్ణనీయాధికారము.

3. ఇది సారసాహిత్య వెల్లంకి తాతంభట్ట ప్రణీతంబైన చింతామణియను కావ్యానుశాసనంబున వళిప్రాసాధికారము.

4. ఇది వినుతవిద్యావిశారద వెల్లంకి తాతంభట్ట ప్రణీతంబైన కవిచింతామణి కావ్యానుశాసనంబున దోషాధికారము.[13]

భాషా సమైక్యత ప్రధాన సమస్యగా పరిణమించిన ఈ రోజులలో విశాల దృష్టితో పరిశోధన జరుపుట యావశ్యకము. మదరాసు విశ్వవిద్యాలయమున నేను సంగ్రహముగా తెల్పిన పై విషయమై పరిశోధన జరిగినది. కాని ఆ పరిశోధనగ్రంథము వ్రాతప్రతియైన నా వద్ద లేకుండుటచే వివరములు నీయలేదు.

ఇప్పటికి, పదునేడేండ్ల క్రిందటనే ఈ విషయమై పరిశ్రమ చేసితిని.[14] అందు తెలుగు—సంస్కృతము, తెలుగు—ప్రాకృతము, తెలుగు—తమిళము, తెలుగు—కన్నడము, తెలుగు—మహారాష్ట్రము వీని పరస్పర సంబంధము వ్యక్తపఱుపబడినది. కన్నడాంధ్రముల సంబంధములను గూర్చి ప్రత్యేక గ్రంథమే ప్రకటించితిని.[15] సంస్కృతమునకు తెలుగునకుగల సంబంధ విశాదృష్టితో వ్యక్తపఱచితిని[16].

ఈ సమస్యాపరిష్కారమునకు పై రీతిని పరిశ్రమ యింకను ఎంతో జరుగవలసి యున్నది.


---

13. మదరాసు ప్రా. లి. పు. భా. వివరణ సంపుటము 5 సంఖ్య 1278 పుట. 1596—97.

14. Introduction in English to the Lives of Telugu Poets. 850—1250 A D. Madras University Publication.

15. కన్నడాంధ్రముల పరస్పర ప్రభావము

16. Telugu—A link between North & South — Andhra Souvenir, Edited by K. Eswara Dutt.



సీతారామయ్య పథకం

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

(గతసంచిక తరువాయి)

తెల్లవారుగట్ల జూట్‌మిల్లు మొదటి కూత కూసింది. ముందు గదిలో పడుకున్నాడు సీతారామయ్య. మట్టెల చప్పుడయితే వెనక్కి తిరిగిచూచాడు. పార్వతమ్మ 'చూడండి' అని మంచంకోడుదగ్గర నిలబడింది. 'ఏమిటి?' అన్నట్లు చూచాడు.

'వాళ్లు రేపు వెళ్లిపోతున్నారు. మన సంసారం చూడబోతే ఇట్లా నీళ్లుగారి పోతుందెను!. పిల్లల పెళ్లిళ్లమాట ఏమిటి? వాళ్లకువాళ్లూ మీకు మీరు ముభావంగా ఊరుకుంటే ఎలా?...' అంది 'సీరియస్'గా.

సీతారామయ్య లేచి కూచుని తలగోక్కుని 'చెబుతా చెబుతా—చెప్పకపోతే ఎలా?-సరే నువ్వు వెళ్లు...' అన్నాడు అటూ యిటూ చూచి...పార్వతమ్మ వెళ్లిపోయింది. నిజమే మరి. ఊరికేనే లోలోపల మథనపడడం, స్వగతంగా కారాలూ మిరియాలు నూరడం మినహా తనుచేసిన నిర్వాహకమేమిటి ఇంతవరకూ?

*   *   *

సాయంత్రం రామం ఒక్కడే ఉన్నాడు. ఆ మధ్య భిలాయ్‌లో పనిచేసిన 'ఎగ్జిక్యూటివ్ ఇంజనీ'రొకాయన సెలవుమీద ఏలూరు వచ్చాట్ట. ఆయనగారి భార్య 'లేడీస్ క్లబ్బు' కొచ్చిందట. ఆమెతో భుజభుజాలు రాసుకుందుకని చక్కాబోయారు కోడళ్లిద్దరూ... వంటయింటో పాత్రలు గలగలలాడుతున్నాయి. వదినలు పురమాయించిన చామంతి పువ్వుల కదంబం గుచ్చుతోంది రాధారాణీ.

'ఒరేయ్ రామం—ఇట్రా' అని పిలిచాడు సీతారామయ్య. అంతలో నళినీ ఎక్కడినించో కొంపకి చేరుకున్నాడు. లేడికి లేచిందే ప్రయాణమని, మళ్లీ ఎక్కడికేనా ఉడాయించగలడు. పిలిచాడు సీతారామయ్య. తల వంచుకొని టేబిలుపక్కని చిన్న బెంచీమీద కూచున్నా రిద్దరూ. 'ఏదో ముగ్గులోకి దింపుతున్నాడు నాన్న' అని లీలగా పసిగట్టారు సుపుత్రులిద్దరూ. కుర్చీమీద కూచుని టేబిలుమీదవున్న పేపర్ వెయిట్ను సద్దుతో ఉపక్రమించాడు సీతారామయ్య.

'ఏరా అబ్బాయిలూ-నా 'పెన్షను' రూ 73/- వస్తోంది. మీకు తెలియందేముంది—చూడబోతే పిల్లల పెళ్లిళ్లు కావాలాయెను—మరి అడుక్కునేవాడు సమేతూ రెండువేలకి తక్కువ కట్నం అడగడంలేదు. ఇట్లా వుంది పరిస్థితి. ఏమిచెయ్యమంటారు? ఏమిటి మీ వుద్దేశ్యం?' అని మెదలకుండా ఊరుకున్నాడు సీతారామయ్య...రామం ఎత్తుకున్నాడు. తనని గవర్నమెంటు 'లోన్'మీదనే చదివించారట. అది తీరుస్తున్నాడట నెలనెలా వంద చొప్పున. బలవంతాన 'ఇన్షూరు' చేయించారట. దానికో డెబ్భై అవుతున్నాయట. హైదరాబాదులో గడపదాటి తేనరి డబ్బు చిల్లపెంకులల్లే ఖర్చయిపోతుందట. పెళ్లి అయింతరవాతేగాని అంతవరకూ నెలనెలా ఏదో పంపిస్తూనే వున్నాడట. పొలా లమ్మించి చదువుకున్నవాళ్లు కొంచెం బాధ్యత వహించాలట. నళినివంక చూశాడు సీతారామయ్య. సమాధానం అల్లుకుందుకు అనుకోకుండా వ్యవధి చిక్కింది నళినికి...తల తీవిగా ఒక వెంపుకి ఓరగావంచి కిటికీలోంచీ అవతలకి నిర్లక్ష్యంగా చూస్తూ వల్లించాడు జవాబు. తనకీ 'ఇన్షూరెన్స్' బెడద వచ్చిందట. 'హౌస్ బిల్డింగ్ స్కీము'లో జేరమన్నారట. ఎవరో చెప్పారు. దానితో ఇంటిస్థలంకింద

వెయ్యిదాకానూ, 'షేర్ల'కింద కొంత 'డిపాజిట్లు' చేశాట్ట. ప్రతినెలా ఏదో వొక ఖర్చు వచ్చిపడిపోతోనే వున్నదట. అక్కడికీ తను పొదుపుగానే వుంటున్నాడట.

'ఒరే—అబ్బాయ్ — నా కుటుంబ ఖర్చులు భరించమని మిమ్మల్ని అడగడంలేదు నేను - అది నేనే సద్దు కుంటాను—సద్దుకొంటోనే వున్నాను—ఆ బరువేమీ మీ భుజస్కంధాలమీద కెత్తను — కాని ఆడపిల్లల పెళ్ళిళ్ళు ఎట్లా గట్టెక్కేనూ అని? ఆ బాధ్యత మీరు వహించక తప్పదు మరి' అన్నాడు శీతారామయ్య.

వచ్చివెలక్కాయ గొంతు కడ్డం పడినట్టు మిడుతూమిడుతూ చూస్తున్నా రిద్దరూ. ప్రతి మెట్టుకీ తనే గుచ్చిగుచ్చి ప్రశ్న తరవాత ప్రశ్న అడగాలిసిన అవసరం అడుగడుక్కీ గుర్తొస్తూనే వుంది శీతారామయ్యకి.

'మరి అక్కడ పద్దుల పుస్తకంలో పోగు పడి వున్నాయిగా రూపాయిలు— అవి పట్రండి మరి.'

'అడిగాం నాన్నా. అది మా కివ్వరట వాళ్ళు.'

'వాళ్ళెవరు?'

'కోడళ్ళు.'

'పద్దులు వాళ్ళపేర ఉన్నాట్టా?'

'అవును.'

'అయితే వాళ్ళనే పట్టమ్మనండి.'

'వాళ్ళు సంతకాలు చెయ్యరట.'

'మీతో తర్కమెందుకురా నాయనా—వాళ్ళి ద్దరినీ మా దగ్గరకే పంపేస్తాను. ఎట్లా పెళ్ళిళ్ళు చేస్తారో చెయ్యండి—నాకేమీ సంబంధంలేదు చెప్తున్నా' అని వొదిలేశాడు శీతారామయ్య. మెదలకుండా వూరు కున్న కొడుకులిద్దరివంకా పరకాయించి చూచాడు.

'అక్కడికీ నెలనెలా వందచొప్పున రెండు సంవత్సరాలు పంపాము మరి. ఈ పెళ్ళిళ్ళపేరుచెప్పి మా కంఠాలకేమైనా గుదిబండలు తగిలిస్తే' అని ముదలకిస్తున్నాడు నళిని. పెళ్ళికిముందు విజయే కావా అని తను మొరాయించిన మొరాయింపు మరుపున బడిపోయిందప్పుడే.! మధ్యలోనే మాట తుంచేసి, 'మీరు పంపిన వందలూ, యాభైలూ లెఖ్ఖ వ్రాశాన్రా' అని డ్రాయరులాగి పద్దుల పుస్తకం బైటికితీసి 'చూడండి' అని వాళ్ళముందు పడేశాడు శీతారామయ్య. తన 'జిపి ఫండూ', వాళ్ళు నెలనెలా పంపిన పైకంలో మిగిలిందీ, వేయించిన పందిళ్ళకిందా, పెట్టిన విందు భోజనాలకిందా, చదివించిన లాంఛనాలకిందా, ఏ 'అయిటం'కి ఎంతయిందో, ఆఖర్న ఎంత మిగిలిందో, ఎంత తగిలిందో సావకాశంగా చూచుకోమన్నాడు. ఇద్దరూ ఒకడిమీద ఒకడు వొరిగి మహాపరిశీలనగా చూచుకుంటున్నారు పద్దులు! తను తప్పుడు లెఖ్ఖలు వ్రాశాననో యేమో. వాళ్ళచాత పంజాయితీలు చెప్పించాలిసిందిపోయి చెయ్యని నేరాలకి తను సమాధానం చెప్పుకుంటున్న ఘట్టం విడ్డూరంగా ఉన్నదాయనికి. అక్కడికీ నెత్తురు సలసలమని కాగిపోతున్నా, ఆ 'లావా'ని శాయశక్తులా అణిచిపెడుతోనే వచ్చాడు కార్యసాధనకని. పద్దుచూచి నట్టేచూచి ఈ 'సోఫా సెట్టు' కెంతయింది నాన్నా? అని 'క్రాస్' చేస్తున్నాడు నళిని. అక్కడే వుందిగా దాని ఖరీదు! ఆ 'క్రాసింగుల్లో' అంతర్గతంగా ఒక నేరారోపణ ఉన్నదని గ్రహించలేక పోలేదు శీతారామయ్య. 'అప్పట్లో మీ ఇద్దరికీ పెద్దపెద్ద సమంధాలు వొస్తున్న సందర్భంలో, కొంచెం హుందాంగా ఉండాలనిపించి, 'టీ సెట్ల'నీ, తివాచీలనీ కొన్నమాట నిజమే. నేనేదో దర్జా వులుముకుందామని కాదు. దరిమిలా అవన్నీ అమ్మిన జమలుగూడా చిత్తగించండి దొరలు-ఎటొచ్చీ సోఫాసెట్టు ఒక్కటుంది - అదీ బేరానికి పెట్టాను' అని పేజీలు తిప్పి ఖచ్చితంగా వేలుపెట్టి చూపించాడు శీతారామయ్య 'దానికెక్కాదు నాన్నా—' అని నసుగుతోనే,...'రిక్షాలకి రెండు రూపాయిలు— చుట్టల కైదు రూపాయిలు'- అని ఏమీ ఎరగనట్టు పైకే చదువుతున్నాడు రామం. 'సేల్స్‌టాక్స్ ఆఫీసరు' లెఖ్ఖలు 'ఆడిట్'చేస్తూ 'అబ్జక్షన్లు' 'రికార్డు' చేస్తున్నట్టు 'ఫీల'య్యాడు శీతారామయ్య. ఆఖరికి పద్దుల పుస్తకం మూసిపెడుతోనే, నళిని ఒక 'జడ్జిమెంటి'చ్చాడు 'తర్కంకోసం కాదు నాన్నా—ఎట్లాగూ కొంత పొదుపుగానే పోవాలి మనం - మాట వరసకి, చుట్టలకని నెలకి అయిదు రూపాయి లవుతోందా మరి' అన్నాడు యథాలాపంగా.

'అయితే నన్ను చుట్టలు మానమంటావా?' అని నిదానంగా కుర్చీలోనించి లేచాడు శీతారామయ్య—

చూస్తుండగానే, మొహం ఉబ్బిపోయి, కళ్లు చింత నిప్పులల్లే ఎర్రబారిపడి, బీభత్సంగా తయారై పోయాడు. 'నన్ను...నన్ను...' అని పూనకం వచ్చి నట్టు ఊగిపోతూ ఆ చెంపా ఈ చెంపా ఛెళ్లుఛెళ్లు మని వాయించాడు. 'అదేమిటి నాన్నా?' అని అదిరి పడి లేచాడు నళిని. 'మీ 'గేబర్డీన్ సూట్లూ', 'ఎంబాసడర్ బూట్లూ'—అటు ఢిల్లీకీ ఇటు బొంబాయికీ 'టూరింగు'లూ-వీట్లమధ్య నా చుట్టాల కట్ట దుబారాకింద అవుపించిందట్రా రాస్కెల్' అంటో అమట్న కత్తిదూసినట్టు, వంకీమున్న తోలు పటకా చర్రునలాగి నళినిని పట్టుకుని ఛక్‌ఛక్‌మని ఒకటే బాదేస్తున్నాడు: వొళ్లు తెలీకుండా వొంటికి పోతున్నాడు: తూలిపడబోతున్నాడు. నళినిమాత్రం నిటారుగా నిలబడి దెబ్బలుతింటోనే నవ్వుతున్నాడు నవ్వుతోనే దెబ్బలు తింటున్నాడు ఏమీ పట్టించుకో నట్టు. శీతారామయ్యని పట్టుకుని, 'పడిపోతావు నాన్నా! ఏమిటా వెర్రికోపం? కొడుదువుగానిలే కూచో,' అని హాలులో సోఫామీద కూచోబెట్టి అనునయిస్తున్నాడు ఎదురు. ఈ సందు చూసుకుని రామచంద్రం చల్లగా బైటికి ఉడాయించేశాడు— ఇదంతా అన్నాయిమీద కొట్టుకుపోతోందిగదా అన్న దిలాసాతో. పార్వతమ్మ హడావుడిగా వొచ్చేసి అగ్గగ్గలాడిపోయింది. 'అయ్యో—అయ్యో - వొదలండి— చిన్నసన్నాసిని చంపేస్తారాయేం?' అని వాణీ, తనూ కలిసి విడదీసి, నళినిని వాటేసుకుని, వంటింట్లోకి లాక్కెళ్ళి ముక్కాలిపీటమీద కూచోబెట్టి తలుపేసింది. నళిని నంగనాచిలా మెదలకుండా ఊరుకున్నాడు, దెబ్బ లెక్కడెక్కడ తగిలినయ్యో తరవాత సావకాశంగా చూసుకోవచ్చునని. ముక్కూ మొహమూ జేవురించి పోయినై. చేతులమీదా, మెడమీదా దద్దుర్లు తేలాయి. కాని చిత్రం! ఖంగారు పడకుండా స్థిమితంగా చిన్నగా నవ్వుతోనే వున్నాడు. శీతారామయ్య హాలులో అలంగం తిరుగుతున్నాడు. 'ఛామీ పుత్రా అమ్మో, నా జి. పి. ఫండులోంచి 'విత్‌డ్రా'చేసి, ఎన్నిసార్లు రుణాలుతెచ్చి ఎన్నిసార్లు నా జీతంలో తీర్చాను? నానాగడ్డి కరిచానా— తర్వాత తల కెత్తుతారని కొండంత ఆశలు పెట్టుకుని కుంగిపోతున్నానా ఒకచెంప! అవన్నీ అడుగున పడిపోయి, నా చుట్టాలకట్ట పయికొచ్చిందంట్రా స్కౌండ్రల్?' అని రంకెలు వేస్తున్నాడు: రగిలిపోతున్నాడు. వంటింటో నించీ నళిని ఏదో సమాధానం ఇవ్వబోతే, 'నోరు ముయ్యి' అని గదమాయించింది పార్వతమ్మ. కుక్కిన పేనల్లే, కిక్కురుమన కుండా ఊరుకున్నాడు.

అవతల వాటాలోనించీ ఇంటి యజమాని రఘు రామయ్యగారూ, ఇంకా ఇరుగు పొరుగు పోగయ్యారు. ఎక్కడెక్కడి వాళ్లూ జనం ఎక్కడవో ఇళ్లంటు కుంటున్నాయని బిలబిల లాడుతో వచ్చేశారు. కొంత మందికి, 'ఈ శీతారామయ్య మొన్న మొన్నటిదాకా గుమాస్తా గిరీ వెలిగించినవాడేను!—ఇంటో సోఫాలూ, కిటికీలకి 'కర్టెన్లూ'—మూడు పువ్వులూ ఆరుకాయ లుగా వున్నదే ఈయన పని' అని కొంత కన్నెర్రగానే ఉంటున్నారు. వచ్చి భలానా సంగతి అని తెలుసుకుని, తండ్రీ కొడుకుల్ని విడదీసి, పైపెచ్చు, 'పెద్దలు తమరే అలా తొందరపడితే ఎలా?' అని చెక్కా బోయారు. గుమ్మం దిగుతో కొంతమంది 'అయింది— బాగా వెలుగూను—అంతా తోడిపెట్టాడు కొడుకు లికి...కొంప గుండమయింది...వాళ్లు సరేసరి. ఉద్యో గాలు దొరకబుచ్చుకొని, పెళ్లాల్ని పక్కల్లోకి తెచ్చు కుని, ఒకడక్కడా ఒకడిక్కడా టింగురంగా అని కొండెక్కి కూచున్నారు' అనుకున్నారు.

శీతారామయ్య శివాలు తొక్కుతోనే వున్నాడు.

'నా నెత్తురూ, నా ఆర్జనా, నా సర్వస్వమూ మంచి నీళ్లల్లే గడగడ త్రాగేసి, నా ఆస్తిపాస్తి మేసేసి, కండబలిసి ఆంబోతులల్లే రంకెలు వేస్తు న్నారా రాస్కెల్స్? నాకట్రా మీరు ధర్మపన్నాలు చెప్పేదీ? పొదుపును గురించి హితబోధలు చేసేదీని? నేను మట్టితిని మీ కన్నం తినిపించానే! నేను గంజి తాగి మీకు అమృతం పట్టించానే! పాలుబోసి పని గట్టుకుని పాముచాత కాటువేయించుకున్నట్టయిందే నా రాత! ఇంత అక్రమానికి ఒడిగడతారట్రా? పిల్కులూ, టెరిలిన్లూ, పెత్రీకాటన్లు తప్ప మామూలు చొక్కాలూ 'పాంట్లూ' తొడిగారట్రా మీరు? 'పిక్ నిక్కు'లా?' 'డిన్నర్లా'?'ఎగ్జిబిషన్లా'? తీర్థయాత్రలా? మీ చావులా? మీ శ్రాద్ధాలా? కొవ్వుబలిసి పెళ్ళాల కొంగులు పట్టుకుని సినిమాలా? షికార్లా? ఇవన్నీ మీరు సంపాయించుకున్న ఉద్యోగాలే అను కుంటున్నారేమిట్రా? 'డొనేషన్లు'కట్టి అడ్డమైన ఆఫీసర్ల కాళ్లూ కడుపులూ పట్టుకుని, పేదరుపు

మానారు. ఏ సమంధాలు వొచ్చినా నీ ఇష్టం నాన్నా అంటున్నారు, తనకి భారం తగ్గిద్దామని... అయ్యో, నోరులేని ఈ పసివాళ్ళని నిష్కారణంగా అన్యాయం చేశానే అనిపించింది సీతారామయ్యకి.

*　　*　　*

ఒకనాడు భోజనానికని వంటింటికేసి వెడుతుంటే రెండు కొత్త చీరలు మడతపెడుతోంది పార్వతమ్మ. 'ఎక్కడివే'? అని అడిగాడు సీతారామయ్య. నేతిగిన్నె కుంపటిమీద పెడుతూ, 'నళిని తెమ్మన్నా' అన్నది. 'ఏమిటేమిటీ? అయితే అడుక్కున్నావన్న మాట? దేహీ అన్నందుకు ఫలించింది మొత్తానికి. ఏమేవ్ రాధీ! చిన్నన్నాయని నువ్వూ అడుక్కోక పోయినావుటే? నాలుగువోణీలు తీసుకొచ్చి పడేసేవాడు' అని ఎద్దేవా చేస్తున్నాడు సీతారామయ్య.

'అబ్బ పోనిస్తురూ—నా పేగులో పేగు వాణ్ణి అడిగినా అడుక్కున్నా నామర్దాలేదు నాకు...'

'పేగులో పేగు! ఆ పేగులే మిగిల్చారులే నీకూ నాకూ—ఒసేవ్, నీకు బుద్ధీ శరమూ లేదటే? సిగ్గూ లజ్జా లేవూ? ఏ మొహం పెట్టుకుని అడిగావే వాణ్ణి?—అదుగో చూడు—ఆ శనివారప్పేట మలుపులో నాలుగు రోడ్ల మొగని ఒక చిన్న చినిగిన తువాలు పరుచుకుని కూచుంటివా, సాయంత్రానికల్లా పది రూపాయిలు రాలతాయే!' అని నవ్వుతోనే అంటించాడు సీతారామయ్య.

వాణీ రాధారాణీ హాల్లోకి తప్పుకున్నారు, ఈ తుపాను తమమీద పడినా పడవచ్చుని.

*　　*　　*

విజయరాఘవంగారు గుంటూరు మారారు ఈ మధ్య. ఇట్లా కాదని సీతారామయ్య వియ్యంకుడి దగ్గిరికి వెళ్ళాడు. కాళ్ళు కడుక్కోందుకు నీళ్ళివ్వడం గాని, కుశలప్రశ్నలు వెయ్యడంగాని చెయ్యలేదాయన. అదేమిటి? ఆయన అల్లుణ్ణి కాదుగా తను కొడతా. తనే కూచున్నాడు. తప్పుతుంది గనకనా? ఆయన ఉపోద్ఘాతం లేకుండా 'ఏమండీ బావగారూ - వాళ్ళది పడుచురక్తం — మన నేనెమో కాగిచల్లారిన పాలాయెను— పెద్దలయ్యుండీ చెట్టంత కొడుకుమీద చేయిజేసుకుంటారా— అంత రాక్షసంగా?'. చ్రరున కోపమొచ్చేసింది సీతారామయ్యకి. ఆనాడు తనని ఆవహించిన భూతమేదో మళ్ళీ మేలుకున్నట్టయింది లోపల. అనువుగాని చోటాయెను — తమాయించుకున్నాడు. ఎంతో ఓర్పుగా వివరించాడు. తర్జనభర్జన జరిగింది కాస్సేపు. కొసకి 'జరిగిందేదో జరిగిపోయింది లెండి' అనేసుకున్నా రిద్దరూ. ఇష్టాగోష్ఠిలో ఆడపిల్లల పెళ్ళిళ్ళమాట ఎత్తాడు సీతారామయ్య.

'ఎక్కడిదక్కడ బిగించుకుని కూచుంటే ఎట్లా నేను గట్టెక్కేనూ?' అని నిగ్గదీశాడు. విజయరాఘవంగారు గొప్ప వ్యవహర్త. కళ్ళజోడు తీసి ఎడమచేత్తో పట్టుకుని, కుడిచేతి చిటికెనవేలితో సిగరెట్టు నుసి విదిపి, కొసని వెలుగుతున్న ఎరుపు వంక తీక్షణంగా చూస్తో మందహాసం చేశాడాయన. 'చూడండి బావగారూ - నాకు నలుగురాడపిల్లలు— నేను లక్షాధికారినే అనుకోండి—నలుగురికీ నాలుగు పదిహేన్లు అరవైవేలు ధారపోసి బ్రతికి బైటపడేసరికి నా ముగ్గురు కొడుకులకీ ఏమి మిగులుతుందో చెప్పండి. నేను ముట్టజెప్పిన పదిహేనువేలూ మీ పిల్లల పెళ్ళిళ్ళకని వెచ్చిస్తే, నా బిడ్డ ఏమికాను? మీ ఆస్తి చూచి ఇచ్చానా నేను? చదువు చూచి ఇచ్చాను అమ్మాయికీ, దానినిబట్టి అల్లుడికీ ఆధారంగా వుంటుందని కొంత ఆస్తి ఆడపిల్లలపేర వ్రాశాం...అది తేతెమ్మనమంటే ఎట్లా?'

'అదుగో- పిల్లల ఆస్తి అంటారేమిటండీ?' అని తర్జుమా చేశాడు సీతారామయ్య.

'కట్నమని ఎవరు చెప్పారండీ మీకు?, మాచేతిమీదుగా మీకు ముట్టే మొత్తమది. నా కూతురూ, నా అల్లుడూ అనుభవించాలది. నా అల్లుడేగాని మీ కొడుకు కాదాయేం?'

ఈ నాటకం వెనక ఈ మామయ్యల మంత్రాంగం పూర్తిగా వున్నట్టుంది.

ఆయనన్నదీ సబబుగానే వుంది సీతారామయ్యకి. తనకూతుర్ని ఆస్తిలేని అల్లుడికి దయాధర్మ భిక్షం కింద ఇచ్చినందుకు కొంత ఆధారం చూపించాడా ఇద్దరికీని. తను పడిన శ్రమంతా ఈయనగారి కొమార్తెకి మాంచి అల్లుణ్ణి పెద్దపెద్ద చదువులు చెప్పించి, మంచి మంచి ఉద్యోగాలు తెప్పించి, కండా

కొవ్వు పట్టేలా తయారు తినిపించి సిద్ధం చేసేందుకన్నమాట! బావుంది. సందర్భవశాత్తూ ఆ ఖాతా పద్దులూ అతని కళ్లబడినై. అట్లాగే వున్నయి అవి. కోడిగుడ్లు పెట్టేనట్టు ఫాయిదాలు పెంచుకొంటూ. ఏవీ వాడుకోలేదు వాళ్లు.

* * *

సీతారామయ్య ఏలూరు వచ్చేసి 'ప్లీడరు' దగ్గరికివెళ్లి ఉన్న పరిస్థితి వివరించాడు. 'ప్లీడరు'గారు అవీ ఇవీ తిరగేసి, చప్పరించి 'ఏమీ లాభం లేదని' 'లా' బుక్కులన్నీ మూసిపెట్టేశాడు. 'ఆ డబ్బంతా ఆడపిల్లలకి తండ్రి ఇచ్చిన ఆస్తికింద లెఖ్ఖలో వుంది మరి. అది స్త్రీ ధనం. కోడళ్లకే హక్కుంది ఆ పైకమ్మీద. అది నీకు కట్నంకింద దఖలు పడలేదు. 'అది కట్నమేను' అని నువ్వు తర్జునా చేశావంటే జైలుకు పోతావు జాగర్త. కట్నాలు నిషేధమిప్పుడు. నీకు తెలీదేమో గోలం' అని హెచ్చరించాడు.

కండువా చంకనెట్టుకొని తలకాయి వంచుకుని ఇంటికి తిరిగి వచ్చాడు సీతారామయ్య.

సరే ఎక్కడేనా కొంత బదులుతెచ్చి పిల్లలకి పెళ్లిళ్లు చెయ్యాలని సంకల్పించుకున్నాడు సీతారామయ్య. ఆ మధ్య ఏదో మూడువేలు కావాలి, అని అడిగితే, 'మూడు కాదు నాలుగు తీసుకో—నీ కివ్వడానికేమయ్యా బంగారు పిచ్చుకవు' అని ఆకాశాని కెత్తిన కరణం సుబ్బారాయుడు, మళ్లీ ఆ ప్రస్తావన తెచ్చేసరికి, 'అరె ఇంకా కూచుంది? నిన్న నడిగితే ఇచ్చేవాణ్ణేస్మీ' అని నాలిక కరుచుకున్నాడు. ఇద్దరు ముగ్గుర్ని కదిపి చూచాడు. తొంట చెయ్యి చూపారు. ఆ వాడు తను అనాలోచితంగా పెట్టుకున్న గలాటాలో కొడుకులకీ తనకీ పడడంలేదనీ, వాళ్లని దృష్టిలో పెట్టుకుని ఈయనకేదో ఇవ్వడం ప్రమాదమనీ అప్పుడే 'పల్లిగ్గా' తెలిసిపోయింది. ఇహను ఇక్కడ తన పరపతి చచ్చింది. ఇదివరకే ఈ వూహ తట్టేవుంటే బదులు తీసుకొచ్చి కొడుకుల్ని తీర్చమనేవాడు. రోగం కుదిరేది దానితో. తరవాత వాళ్లూ వాళ్లూ గంగలో కలవనీ.

* * *

సమంధాలకోసం మళ్లీ తడిమన్ను పాడిమన్నయేలా తిరుగుతున్నాడు సీతారామయ్య. ఎక్కడికి వెళ్లినా మీ అబ్బాయి లేమిచేస్తున్నారూ అన్న ప్రశ్న వస్తోంది చెప్పాడు. చెప్పక తప్పుతుందా? ఆ చెప్పినప్పుడు ఒకానొక గర్వరేఖ మెరిసింది కూడా తన కళ్లల్లో. కాని కట్నమెంతా అన్న ప్రశ్న ఎదురుకోగానే పలాయనం చిత్తగించక తప్పడంలేదు. వచ్చిన వాళ్లు పిల్లని చూచి, పనిలోపనిగా చుట్టుపక్కల ఏదో కొంత వాకబుచేసుకుని, 'తనకీ ఈయన కొడుకులకీ పడటంలేదట. ఏమి విదుపుతాడూ ఇహ?' అని తిరుగుముఖం పడుతున్నారు. వాళ్లు తీసుకొచ్చిన బత్తాయికాయలూ, పటికబెల్లం పొట్లాలూ ఇంటో వీళ్లు ఊదేస్తున్నారు. తను పెట్టిన కాఫీలూ, కలర్లూ వాళ్లు ఊదేస్తున్నారు. పర్యవసానం తన 'పెన్షన్'లో ఒక పెద్ద మొర్రి ప్రతినెలా!

క్రితం రోజున ధవళేశ్వరంనించీ ఎవరో వచ్చి చూచిపొయ్యారు. రాధనయితే చేసుకుంటారట! ఇదో కొత్త ఆపత్తు వొచ్చిపడింది. అరుగుమీద కూచుని, 'రాధ ఇట్రా' అని పిలిచాడు. జడ అల్లుకొంటో వచ్చింది. ఈ మధ్య పిలవగానే పలక్కపోతే పెంకు లెగిరేలా కేక లేస్తున్నాడు సీతారామయ్య. 'ఇటు చూడమ్మా — వాణీ పెళ్లిచూపుల కెవరేనావస్తే కొంచెం నీ అలంకారం తగ్గించు—తెలిసిందా? దాన్ని వొదిలి నీకూడా పడుతున్నారు అప్రాచ్యులు. ఆ 'పవుడరు' అంత వొత్తుగా మెత్తనక్కర్లేదులే, జడలో రిబ్బను అంత నాజూగ్గా మిసమిస లాడనక్కర్లేదు—కొంచెం షోకులు తగ్గించు—లేకపోతే ఏ వంటింటోనో కాస్సేపు అఘోరించు.'

'అట్లాగే నాన్నా' అని మెల్లిగా వెళ్లిపోయింది రాధ.

'దొరసానివేషాలూ నువ్వూను! మహా అందంగా వున్నావని మిడిసిపాటుగా వుందిలే—నీ అందం అందల మెక్కినట్టే వుంది! కొంచెం నిదానంగా నడు—అదేమి నడక? సివంగి నడక!—అమ్మో వీరా—పెళ్లిపెడాకులూ లేవుగాని, అయితేనా, పైనబెడితే వానలుండవు—కిందబెడితే పంటలుండవు—పట్టపగ్గాలుండేవా?' అని సణుగుతోనే వున్నాడు వెనకాల. 'ఎందుకట్లా చిన్నపిల్లాన్నల్ని వేపుకుతింటారూ?' అని ముదలకించింది పార్వతమ్మ. తన గదిలోకి దూరి చెక్కా పూరుకున్నాడు.

ఒక విచిత్రమైన ధోరణి వచ్చేసింది సీతారామయ్యకి.

వాణీ రాధారాణీ ఎవళ్లకివాళ్లు సీతారామయ్యకి కనబడకుండా దాక్కొంటువున్నారు. కొండగుహలో ఆకలిగొన్న సింహంలా రుసరుసలాడుతో కూచుంటువున్నాడు ముందుగదిలో సీతారామయ్య.

* * *

ఎక్కడనించో హడావుడిగా వచ్చేసి,...'ఏమర్రోయ్ ఎక్కడ చచ్చారే లోపల' ఒక్క పొలికేక పెట్టాడు. 'ఏం కావాలి?' అని ఎంగిలి చేత్తో హడావుడిగా వచ్చింది పార్వతమ్మ 'నీ శ్రాద్ధం' అని చక్కాపోయాడు గదిలోకి. 'ఏమిటీ మనిషి?' అనుకుంది పార్వతమ్మ.

* * *

వాణీ ఏదో పుస్తకం చదువుకుంటోంది. 'ఏమిటీ ఆ పుస్తకం? డిటెక్టివ్ నవలా?' నాన్న గదమాయింపుకి గభాల్న లేచింది వాణీ. 'అట్టా తెల్లమొహం వేస్తావేమిటే నీ మొహంమండా...చదివింది చాలులే తల్లీ...నవలలు చదువుతోంది!... అదిగో ఆ కిటికీలోనుంచీ పరకాయించి చూస్తున్నావేమిటీ, పక్కింటి కిటికీలో ఎవడేనా వున్నాడాయేం? ఇహానదే తరవాయి. వంటింటోకి తగలడే తగలడు. పెళ్లయ్యేదాకా మాట దక్కించండి. ఆ తరవాత గంగలో కలవండి'—రివ్వున తనగదిలోకి దూరాడు సీతారామయ్య. 'వెధవ మొహాలంటూను వెధవ మొహాలు! ఇట్లాంటి దిష్టిపిడతలకే పెళ్లిళ్లయ్యేది. టాయిలెట్టు అరగంటా? రోజు రోజుకీ మొహాన్ని తిలకంమాత్రం పెద్దదవుతోంది!...'అని గొణుక్కొంటానే వున్నాడు.

పిల్లలిద్దరూ పెద్దవాళ్లవుతున్నారు. మీద కొచ్చిపడుతున్న అందాన్నీ వయస్సునీ ఎక్కడ దాచుకోగలరూ?

సాదా పరికిణీ వోణీ వేసుకుని అగుపిస్తే, 'ఏమిటా అవతారం వెధవముండా వేషాలూ నువ్వూను! అది మొగుడు చచ్చిం తరవాత—ఇప్పుడుకాదు తెలిసిందా?' అని రొక్కిస్తున్నాడు. మొహం కాస్త సబ్బుతో తోముకుని తలలో ఏ ఎర్రగన్నేరు పువ్వో తురుముకుంటే చాలు, 'ఎక్కడికి వేంచేస్తున్నారు రంగసానులు—మేరకవీధికా?' అని శూలాలు పొడుస్తున్నాడు.

ఘడీ ఘడీకీ తనమీద చేస్తున్న ఈ దండయాత్రలో అక్కచెల్లెళ్లిద్దరూ జడివానలో తడిసిన కాకులల్లే ముడుచుకుపోయి ఏ వంటింటి మూలనో నక్కుతున్నారు తల్లి పంచని.

ఎంత మారిపోయాడు నాన్న! ఎంతో అపూరుబంగా చూసుకున్న నాన్న! కాలు కింద పెట్టనిచ్చేవాడా? సిగపువ్వు వాడనిచ్చేవాడా? ఒక్క తుమ్ము తుమ్మితే చాలు, కాస్త తలనొప్పిలే చాలు అడ్డమైన మందులూ పట్టుకొచ్చేవాడు. రొంప 'బ్రాంఖాయిటిస్'లోకి దింపుతుందనేవాడు. జ్వరం రెండు రోజులు పొడిగిస్తే చాలు 'టైఫాయిడ్'కాదుగదా అని గాబరా పడిపోయేవాడు. నీళ్లల్లో కాస్త తడిస్తే చాలు—జలుబు చేస్తుందనేవాడు. రాత్రి పదిదాటి చదువుకుంటే నిదర చాలక వేడిచేస్తుందనేవాడు. అట్లాంటి నాన్న ఇప్పుడు దుర్నిరీక్ష్యంగా వున్నాడు......ఆ కోపం! అది కోపం కాదు—ఆ కోపానికి గురి అవుతున్నందుకుకాదు వాళ్లు బాధపడుతుంటా. ఆ కోపానికి వెనక ఓడిపోయి, రూపం మార్చుకొని, మారువేషం వేసుకొని కఠోరంగా బైటపడుతున్న మమత్వం! ఆ మమకారానికి ఈ కోపం ప్రతిరూపం. వాత్సల్యప్రేమ అన్నది సహజంగా, ధారాళంగా, ఆరోగ్యంగా బైటపడినప్పుడే తేనెసోనలా వుంటుందికాని సందు దొరక్కక గిలగిల కొట్టుకునే ప్రేమ, గుండెలు దొలిచే ప్రేమ, కోపంకిందా, రోషంకిందా, ద్వేషంకిందా, వెటకారంకిందా, తిట్లకిందా, చివాట్లకిందా విషం కక్కుతో బైటపడుతుంది క్షణక్షణమూ.

* * *

ఇంటి సామాన్లన్నీ ఒకదాని తరవాత వొకటి తాకట్టులోకి నడిచివెళ్లి వాకట్టయి ఊరుకున్నాయి. సీతారామయ్య చూస్తూ ఊరుకున్నాడు. ఇంటి అద్దె బకాయిపడింది. ఏదో వొకనాడు గప్‌చిప్పుగా ఇంటికి తాళంపెట్టి ఏదో ఊరు, ఏ పల్లెటూరో ఉడాయిస్తేసరి! ఎవడు చూడొచ్చాడు? పార్వతమ్మకి సూచనగా అందించాడొకనాడు. 'అవ్వ' అని నోరు నొక్కుకుంది పార్వతమ్మ. 'నీ శ్రాద్ధం—నువ్వొకత్తివి

శకునపక్షివి! న్యాయంట న్యాయం!' విదిలించి చక్కా బోయాడు శీతారామయ్య.

* * *

ఒకనాడు దొంగచాటుగా వంటింట్లోకి తొంగి చూశాడు శీతారామయ్య. కళ్ళు మూసుకుని గౌరీదేవి పటంముందు జపంలో వుంది పార్వతమ్మ. 'మావె తగలేస్తోంది దీన్దుంపతెగా' అనుకున్నాడు. అగలొత్తు లొకటా? ఈవిడకి జపాలూ తపాలూ ఎక్కువయి పోతున్నట్టున్నాయి. దీని నాడి ఇంతవరకూ పట్టుకుని చూడలే దింతవరకూ తను. ఈ రోగం సెల వేయక క్రితమే జాగర్తపడాలి. కొక్కిరాయిచేష్టలు మానిపించాలి - లేకపోతే, అరిటిపళ్ళనీ, కొబ్బరికాయలనీ, హారతి కర్పూరమనీ తేలెమ్మంటుంది. ఆపద మొక్కులేమైనా మొక్కుతోందేమో, లోలోపల కొంప తీసి. అనక తీర్చమంటుంది...శీతారామయ్య గుండె తీవ్రంగా కొట్టుకుంది. కాని అలికిడయితే ఆవిడ జపమెక్కడ భంగమవుతుందోనని గుండె పీకుతోనే వుంది ఒక చెంప పిల్లిలా అడుగులు వేసుకొంటూ హాలులోకి వెళ్ళిపోయాడు.

* * *

ఒకనాటి మధ్యాన్నం, శీతారామయ్యా పార్వతమ్మా ఒక చిన్న చిట్కా ఆలోచించారు. అందరూ కట్టగట్టుకునివెళ్లి భిలాయ్‌లో ఆ పెద్దాడిమీద పడితే సరీ—తిండిపెట్టను పొమ్మంటాడా? పెళ్ళిళ్ల మాట తరవాత చూడవచ్చును. బాగుండంటే బాగుం దనుకున్నారు. ఇన్నాళ్ళా ఇంత చిన్న ప్రక్రియ ఊహాకి తట్టలేదేమా అనిపించింది. కాని పార్వతమ్మ ఒక చిన్న 'బ్రేక్' వేసింది. ఫలానానాడు, ఫలాని 'ట్రెయినుకి' వస్తున్నాము అని ముందస్తుగా వ్రాయమంది. ఈ మధ్య పార్వతమ్మ మాటమీద శీతారామయ్యకి కొంత గురి కుదిరింది. ఉత్తరం వ్రాశాడు. చిత్రం! తిరుగుటపాలో జవాబు వచ్చింది. అంతావస్తే పెద్ద ఇల్లొకటి తీసుకోవాలిసుంటుందనీ, ఇంటికోసం గాలిస్తున్నాననీ, ఇల్లు దొరకగానే ఉత్తరం వ్రాస్తాననీ. ఆ పెద్దయిల్లు ఛస్తే దొరకదు! దొరకలేదుకూడా!! ఉత్తరాలమీద ఉత్తరాలయితే వ్రాశారు. ఇట్లాంటి పరిస్థితుల్లో బిర్ర పెట్టుగావెళ్ళి పీకలమీద కూచుంటే బైటికీడుస్తాడేమో గోల. తనకీ వాడికీ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోందాయెను. మా అమ్మా నాన్న వీళ్ళుకాదు అని బుకాయిస్తే? ఇరుగూ పొరుగూ నమ్మినా నమ్మవచ్చు. నమ్మరూ? అబద్ధం ఎంత పెద్దదయితే అంత సులభంగా నమ్మించవచ్చును. 'మీది మరీ విడ్డూరమండీ—అందాకా వెడుతుందా?' అని అన్నదేగాని పార్వతమ్మకీ సంకోచంగానే వుంది లోపల. ఈ మధ్య శీతారామయ్య ఏదేనా ఒక చిన్న ఉపాయమాలోచించాడంటే దానిని వెయ్యి అపాయాలు ముట్టడిస్తున్నాయి. మళ్ళీ ఒక్కొక్క అపాయానికీ ఉపాయాలల్లుకు పోతున్నాడు. మెదడు మహాచురుగ్గా పనిచేస్తోంది. ఎవరో చెబితే విన్నాడు—మెదడు ఆగి పోయేముందు అతితీవ్రంగా ఆలోచిస్తుందట.

చుట్టూతా తనకి పిచ్చెక్కిందని పుకార్లు రేగుతున్నాయి. ఒకవేళ తనకి పిచ్చేమో గోల. ఆలోచనా పాలోచన అంతా శుభ్రంగానే వుంది మరి లోపల. పిచ్చివాడికి పిచ్చెక్కుతున్నట్టు తెలుస్తుందా అసలు? ఏమో మొదట్లో మెదడు ఒకవేపునించీ కుళ్ళి పోతుంటే ఇంకోవేపున అటుకేసి కుళ్ళుపడుతున్నట్టు తెలివిడి పనిచేస్తుందేమో. క్రమేణా మెదడంతా కుళ్ళి పోయి, పిచ్చిముదిరి...శీతారామయ్యకి బుర్ర వేడెక్కి పోయింది.

* * *

ముంగిట్లో బాదంచెట్టుఆకులు రాలుతున్నాయి. కిందపడిన ఆకుల్ని మేకలు పరపర నములుతున్నాయి.

శీతారామయ్య వచారికొట్లో ఖాతా పుస్తకమ్మీద బ్రాటోవర్లదగ్గర ఘర్షణపడి ఇంటికి వస్తున్నాడు. కనుచీకటిగావుంది. రాధారాణీ ఎక్కడికో వెళ్ళి తిరిగివస్తూ కనిపించింది. 'ఎక్కడికి వెళ్ళావు?' అధాత్తుగా అడిగాడు వెనకాలనించీ. బిక్కచచ్చిపోయింది రాధ. ఏదో జరుగుతున్నదని లీలగా అనుమానం సోకింది శీతారామయ్యకి. అతనికి మానవత్వంమీదా మంచితనమ్మీదా నమ్మకం క్షీణించిపోయింది. 'పద ఇంటికి' అని నడిపిస్తూ, 'ఏమిటి కథ?' అని లాలనగా అడిగాడు. 'ఎంప్లాయిమెంటు ఎక్చేంజ్ ఆఫీసు' కెళ్ళి వస్తున్నా నాన్నా—వాణీకీ నాకూ 'పోస్టింగులు' పడినై.' 'ఎక్కడా?'

'డిస్ట్రిక్ట రిజిస్ట్రార్ ఆఫీసులో నాకూ,

జిల్లా పోలీసు ఆఫీసులో అక్కయ్యకేమ...అన్నది నేరం చేస్తుండగా దొంగ దొరికిపోయినట్టు. ఇంటో అడుగు పెడుతోనే, 'ఏమండోయ్ పార్వతమ్మగారూ— తమ పుత్రికామణులు ఉద్యోగాలు సంపాదించుకొన్నారేవ్— బలేబలే-అవునే- కొమాళ్ళు నాకు మల్లే గుమాస్తాలై ఎక్కడ నలిగిపోతారో అని వాళ్ళని ఆ గాడిలోనించి తప్పించా వాళ్ళని వొదిలి అమ్మాయిల్ని వరించిందిలే గుమాస్తాగిరీ. ఆనవాయితీ తప్పిస్తే ఎలా? అవతల వీధిని శ్రీరామచంద్రమూర్తిగారి యింటో వంటమనిషి కావాలిట...'అప్లికేషను ఇవ్వు దాఖలుచేస్తా. ఇదంతా నన్ను ఏ షావుకారు గుమాస్తాగానో అఘోరించమని పాతమా యేం?' అన్నాడు.

అన్నంగిన్నె పొయిమీదనించి దింపి విసవిస నడిచివచ్చింది పార్వతమ్మ. 'చూడండి— మీరు వేళాకోళంగా అంటున్నారుగాని, ఇప్పుడు మీరన్న పనులన్నీ అక్షరాలా జరిగితే ఆ దుర్మార్గుల చేతిలో పడకుండా దివ్యచక్రంగా గడిచిపోతుంది మనకి.' తెల్ల మొహం వేశాడు శీతారామయ్య. కొబ్బరినూనెలేక ఆమె జుత్తు రాగిరంగు పడిపోయింది. ఈవిడ కెట్లాగూ చొరవ ఎక్కువయిం దీమధ్య ఈవిడకీ ఇష్టమే గావును— దీనికి నోరొస్తోంది మెల్లిగా— అనుకున్నాడు శీతారామయ్య.

ఆ బులపాటమూ అయింది. షావుకారు మల్లికార్జునంగారి కొట్లో చిట్టా ఆవర్జాలు వ్రాశాడు కొన్నాళ్ళు శీతారామయ్య. ఒక వారం రోజులదాకా 'పంతులుగారూ' అని సంబోధించాడు షావుకారు. తరవాత 'పంతులూ' అని పిలిచాడు. 'ఏమండి'తో మొదలై, 'ఏమోయ్'దాకా దిగజారింది కొనకి. సరిపెట్టుకొన్నాడు. ఒకనాడు బజారుకెళ్ళి కూరగాయల పట్టమ్మనాడు. చేతికిచ్చిన వలసంచీ మొహాన్ని కొట్టి చక్కావచ్చాడు. క్రిమినల్ కేసు పెట్టడుకదా? ఇంకా నయం. నౌఖర్ననుకుంటున్నాడు గామాలు!

* * *

మర్నాటినించీ వాణీ రాధారాణీ ఉద్యోగాలు చూసుకున్నారు. దొడ్డిదారినవెళ్ళి, నాన్నకి కనపడకుండా మెలకువగా ఇంట్లోకి జొరబడుతున్నారు. దొంగకి తేలుకుట్టినవతుగా శీతారామయ్య తెలిసీ తెలీనట్టే నోరు మూసుకుని ఊరుకున్నాడు. ఇన్నాళ్ళూ అయిందానికీ కానిదానికీ నోరుచేసుకుని వాళ్ళని నానాహింసాపెట్టి, మాటలతో కుళ్ళబొడుస్తూ, 'ఈ పని ఎందుకు చెయ్యరూ వీళ్ళు?' అనేవాడు. తన అంతరాత్మే తనకి ద్రోహం చేస్తోందా.' ఈ మధ్య తనలోపల ఒక మనిషీ, బైట మరోమనిషీ పని చేస్తున్నట్టు అనుమానం పాకింది శీతారామయ్యకి.

* * *

మెల్లిమెల్లిగా చుట్టూపేరుకున్న అప్పులు తీర్చేశాడు శీతారామయ్య. కొంపలో కూరా, నారా పాలూ పంచదారా పుష్కలంగా అమురుతున్నాయి. మళ్ళీ సంసారం పచ్చపచ్చగా రంగులు మార్చుకుంటోంది.

ఒకనాడు రాధారాణీ నాన్న దగ్గరకి పరిగెత్తుకొచ్చింది. చేతులు రెండూ వెనక్కి పెట్టుకొని 'నాన్నా, నీకో తాయిలం తెచ్చా' అంది. అట్లా అల్లారు ముద్దుగా తన బిడ్డలు నిర్భయంగా తన దగ్గరకెప్పుడు వస్తారా అని ఎదురు చూచి చూచి కళ్ళుకాయలు కాచిపోయాయి శీతారామయ్యకి. ఏ కళ మన్నాడో తల కుర్చీ వెనకాలమోపి, 'పెట్టు' అని నోరు తెరిచాడు చిన్నపిల్లడికి మల్లే. రాధ గోముగా కుర్చీచేతులమీద కూచుని, నాలుగు పొగాకుకాడలు టేబిలుమీద వుంచి, 'చుట్ట కావు నాన్నా?' అని గునిసింది. ఏదో బాంబు పేలినట్టయి, భళ్ళున దుఃఖం వచ్చింది శీతారామయ్యకి. ఆయన జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి, 'ఆడపిల్లలకి మాత్రం అమ్మా నాన్నని పోషించుకునే హక్కులేదా యేమిటి నాన్నా' అని అనునయించింది రాధ. డగ్గుత్తికతో కళ్ళు వొత్తుకున్నాడు శీతారామయ్య.

* * *

వాణీ కొంచెం మెతక - నల్లనివన్నీ నీళ్ళూ తెల్లనివన్నీ పాలూ అనుకుంటుంది. ఆఫీసులో పక్క సీట్లోవున్న రహమాన్ కలగజేసుకుని ఏ కాయితం ఎట్లా 'డిస్పోజాఫ్' చెయ్యాల్నో ఓపికగా చెప్పాడు. పాపం మంచివాడు అనుకుంది. 'మీ వ్రాత ముత్యాల కోవన్మంక్షి' అన్నాడు 'హైపిట్టు' గౌరీపతి. కాబోలనుకుంది. ఇవన్నీ తరవాత తరవాత మింగబోయ్యే చేదు మాత్రల్లకి పంచదార కోటింగని తెలీదు. 'ఎక్కౌంటెంటు' రామనాథం ఒకనాడు చేతిలో కాయితం

అందుకోబోయి చెయ్యి పట్టుకుని లాగాడు. ముచ్చెమటలు పట్టినై వాణీకి. 'రిజై'నిచ్చి చక్కావచ్చింది. రాధకి అట్లాంటి ఘట్టమే ఒకటి ఎదురైతే, చెంప ఛెళ్ళుమనిపించి, ఆ వేళనించీ 'ఆఫీసరు' పక్కనే కుర్చీ వేసుకుంది. ఆ తరవాత ఆమెని తేరపార జూచేందుకు గుండె నిబ్బరం ఎవ్వరికీ కలగలేదు. 'ఆఫీసరు' సమేతూ తప్పనిసరిగా విగ్రహం అలవాటు చేసుకున్నాడు.

* * *

ఎన్నడూ లేనిది ఆనాడు శీతారామయ్యని పెద్దాసుపత్రికి తీసికెళ్ళింది రాధ. పరీక్షచేసి 'షుగరుం'దన్నాడు డాక్టరు. రక్తపుపోటు విస్తారంగా ఉందన్నాడు. గ్రహణి జీర్ణించిందన్నాడు. లివరు సరిగ్గా పని చెయ్యడం లేదన్నాడు.

'లేనిరోగ మేమిటండీ?' అని అడిగాడు శీతారామయ్య. ఎగా దిగా చూశాడు డాక్టరు. ఉప్పూ కారం పులుసూ పూర్తిగా మానమన్నాడు. 'మంచినీళ్ళు తాగవచ్చాండీ?' అని అడిగాడు శీతారామయ్య 'సీరియస్'గానే. మందపాటి కళ్ళద్దాలలోనించి కొరకొర చూశాడు డాక్టరు. ఆసుపత్రి మందులు పనిచెయ్యవూ అని, కసిదీరా ఓ వందరూపాయిల ఔషధాలు కొని తెచ్చి వాడమని చాటభారతమంత 'ప్రిస్క్రిప్షన్' వ్రాసి ఇచ్చాడు. రాధ అందుకోబోతుంటే లాక్కుని జేబులో పెట్టుకున్నాడు శీతారామయ్య.

* *

ఇంటికి వెళ్ళేసరికి వాణీని చూడడానికని ఎవరో వచ్చారు. రెండో సమంధం పెళ్ళికొడుకు! తను వచ్చి చూసుకోమని చెప్పనేలేదు. కాని వాళ్ళ ధైర్యం! మొగ్గకపోతారా అని. కట్నం అక్కర్లేదట. పాపం అదే పోనీ లెమ్మని త్యాగం చేసేశాడు పెళ్ళికొడుకు! పెళ్ళిచూపులయినై. వెళ్ళారు, పిల్ల నచ్చిందట. ఇంటో అంతా సై అంటే సై అనుకుంటున్నారు. ఇహనేముంది, పెళ్ళి నిశ్చయమై పోయినట్టే. శీతారామయ్యకి లోపల దేవినట్టుగా వుంది. సన్నజాజులచెండు తీసి నీళ్ళ చెంబులో వేస్తున్న వాణీ వంకచూసి, 'నీ కిష్టమేనేమిటే?' అని అడిగాడు. ఇష్టమే అన్నట్టు తలవూపింది. 'పిల్లలెంతమందటా?' అని రెట్టించాడు. 'ఇంటిదగ్గర పిల్లలెవరూ లేరన్నాడు వెంకటశాస్త్ర్లు' అని వంటింటోనించి అరిచింది పార్వతమ్మ. 'వెంకటశాస్త్ర్లా? అట్లా చెప్పు,' అని, 'ఓసి నిన్ను తగలేసిరిగదే—నీ బుర్ర ఏమయిందే? వాడికిద్దరు కూతుళ్ళు, ఒక కొడుకూను. నాకు తెలుసు. కొడుక్కీ వీడికీ పడక తెగతెంపులు చేసుకున్నారు. కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయినై. పిల్లల్ని కంటున్నారుకూడా. ఆ కొడుకు రోగం కుదర్చాలని ఈ బ్రాహ్మడు రెండోపెళ్ళికి తయారయ్యాడు—చేసుకో అమ్మా చేసుకో—మొగుడంటూ ఒకడు దొరికితే చాలు. కొన్నాళ్ళు కాపరం చెయ్యా, పిల్లల్నికని వాళ్ళనిపెంచి పోషించా, వాళ్ళకి మళ్ళీ పెళ్ళిళ్ళా పెడాకులూచేసి వాళ్ళచాత పిల్లల్ని కనిపించా......ఆ ముచ్చట్లన్నీ, ఒకదాని తరవాత ఒకటేమిటి ఖర్మ...అన్నీ అత్తారింటో అడుగుపెట్టగానే ఒక్కబిగిని తీరిపోతై, పీడాబాయిరి... నీ మొహమెట్లావుందే! తెంపిపోసినట్టు' అని ఒక్క ఉరుమురిమాడు శీతారామయ్య. పార్వతమ్మ, ఇంతకథ వుందీ, అని కొయ్యబారిపోయింది. వాణీ ఏడుస్తో వెనకాల గదిలోకి వెళ్ళిపోయింది. ముందు గదిలోకి దూరి టేబిలు అంచుమీద తాళంవేస్తూ కూచున్నాడు శీతారామయ్య.

* * *

మిట్టమధ్యాహ్నం—ఆకాశంమీద తెల్లగద్దలు చక్కర్లు కొడుతున్నాయి దీర్ఘప్లుతులలో శ్రీకృష్ణుణ్ణి పిలుస్తో. 'ఏమేవ్' ఒక్క గావుకేక పెట్టాడు శీతారామయ్య. చీరకి పట్టిన కొత్తచిరుగు కుచ్చిళ్ళలో కలిపెయ్యడ మెట్లాగా అని తాపత్రయం పడుతో చక్కావచ్చింది పార్వతమ్మ. 'సూటుకేసు' తీసి హాల్లో దులుపుతున్నాడు శీతారామయ్య. 'ఎక్కడికీ?' అంది. 'హైదరాబాదు పోతున్నా—వాడూ డాక్టరేగా? నాకేమో వొంటో బావుళ్ళేదు...ఆస్పత్రి మందులేగా? వాడు మొయ్యాలిసిన బరువేముందీ? ఏమంటావు?' ఇష్టంగా అడిగాడు. అందాకా మందుమాట ఎత్తితే టపాకాయిలా పేలిన భర్త, ఈనాడు తనకుతానే ఆ ప్రస్తావన తెచ్చేసరికి పట్టలేని ఆనందమయింది పార్వతమ్మకి. మళ్ళీ గుబులు తిరుగుతుందేమోనని, చొక్కాలూ పంచెలూ చకచక సర్దేసింది...

బండిటైము కావచ్చింది. పార్వతమ్మా రాధా రాణీ హడావుడిగా తిరుగుతున్నారు. వంటింట్లోకి తొంగిచూశాడు శీతారామయ్య. అక్కడ కావిడిపెట్టె మీద కూచుని కిటికీలోనించీ బైటికిచూస్తో ఏడుస్తోంది వాణీ. వెనకాలనించీ వెళ్ళి భుజమ్మీద చెయివేసి 'కోపమా అమ్మా?' అని అడిగాడు. ఉలిక్కిపడి గిరుక్కున వెనక్కితిరిగి గబగబ కళ్ళు తుడిచేసుకుంది వాణీ. 'నా కండువాలు సర్దవా అమ్మా?' అని వెళ్ళిపోతున్నాడు శీతారామయ్య. ఆయన మాటలో కంపంలేదు. కంఠంలో గాద్గద్యం లేదు. వెనకాలే హాలులోకి నడిచివెళ్ళింది వాణీ. రాణీ పొగాకు గొట్టం తీసుకొచ్చి ఒకమూల నొక్కింది. వాణీ 'ఫ్లాస్కు' తీసుకొచ్చి ఒకవేపున కుక్కింది. ఈ గందరగోళమంతా బెంచీమీద కూచుని నిశ్శబ్దంగా చూస్తున్నాడు శీతారామయ్య. పార్వతమ్మ వచ్చి సీసాకి అడుగున మిగిలివుంటే కాస్త మందారాయిలు రుద్దింది నెత్తిన. రాధ తనూ వస్తానంది, నాన్న ఒక్కడూ వెళ్లగలడో లేడోనని. సరే రమ్మన్నాడు, కాని మళ్లీ మార్చుకున్నాడు. 'మనమిద్దరమూ కట్టగట్టుకుని దేనికి పయనం? అక్కడ కొన్నాళ్లు ఉండాలిసివస్తే తక్షణం ఉత్తరంరాస్తే, వాణీని రమ్మను. లేకపోతే అమ్మని పంపు—నాకు ఒత్తులెవడు ఒత్తుతాడు అక్కడ?' అన్నాడు. యాభై రూపాయిలు 'పర్సులో' పెట్టింది రాధ....'యాభయ్యెందుకమ్మా? పర్సులో అంత డబ్బు చూస్తే తిరుగుప్రయాణానికైనా డబ్బిస్తాడా వాడు? ఆ 'ఛార్జీ' వాడిమీద నే రుద్దుతా. ఎక్కడికక్కడే!' అని వారించాడు శీతారామయ్య. అట్లా కాదన్నది రాధ. వాడేమైనా అంటే పడవద్దంది. ఈ పరీక్ష చేయించుకుని ముప్పాతిక మూడుపాళ్లు మందులు రాయించుకుని వచ్చెయ్యమంది. ఆసుపత్రిలో ఉండాలిసివస్తే ఉత్తరం రాయమంది. 'ఓ— వస్తే వాడి చేతిలో పడను' అన్నాడు శీతారామయ్య. స్టేషన్లో టిక్కట్టు కొనడమొక 'సర్కస్‌ఫీటు' అని పస్తాయిస్తున్నాడు. 'ఎందుకూ? నేను వస్తాగా' అంది వాణీ. నేనూ వస్తానని పంతంపోయింది రాణీ. 'ఇద్దరూ రండే. టిక్కట్టుకొని బండెక్కించి తిరిగి వద్దురుగాని...ఆదివారమేగా...రైళ్లు జంక్షనుగావు నిప్పుడు...అటువెళ్లే రైలెక్కేబదులు ఇటువెళ్లే రైలెక్కెయ్యగలను...నా కసలే గాభరా... అని బట్టలు మార్చుకున్నాడు శీతారామయ్య.

వాణీ రాధారాణీ ఇద్దరూ వచ్చారు స్టేషనికి. అటు వాణీ, ఇటు రాణీ చెరోవేపునా నిల్చుంటే వాళ్ళ భుజాలమీద చేతులానించి 'ప్లాట్‌ఫారం' మీదకి నడిచాడు శీతారామయ్య.

రైలు వచ్చేసింది.

ఖాళీగాఉన్న ఒక పెట్టెలో కూచోబెట్టి, సూట్‌కేసు పక్కనే పెట్టుకోమని, ఆ పెట్టెలోనే హైదరాబాదువెడుతో ఎరిగినాయన ఒకాయనవుంటే... 'మా నాన్నారిని జాగర్తగా దింపండి?' అని చెప్పింది రాధ. 'పర్సు జాగర్త నాన్నా' అని హెచ్చరించింది.

టైమయింది. గంట కొట్టారు.

ఇద్దరూ గబగబా బండి దిగిపోయారు.

ఘణిల్లుమని రైలు కదిలింది.

'చప్పున వచ్చేసెయ్యి నాన్నా...వాడు ఉండమని ప్రాధేయపడితే ఉత్తరం రాయి' అని కేకేశారు.

'ప్లాట్‌ఫారం' మీద నిలబడి అట్లాగే కళ్లప్పగించి చూస్తున్నారిద్దరూ. 'ప్లాట్‌ఫారం' దూరమవుతున్న కొద్దీ వాళ్ళిద్దరూ క్రమక్రమంగా రెండు పూల మొక్కలల్లే, రెండు నీడలల్లే, ఆఖరికి రెండు చుక్కలల్లే మారి, ఆకాశపుటంచుల్లో లీనమయ్యే దాకా చూస్తూనే కూచున్నాడు శీతారామయ్య.

* * *

ప్రొద్దున్న పదింటికి 'ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం' వచ్చింది. శీతారామయ్య రైలుకిందపడి చచ్చిపోయాడట. శవాన్ని టాక్సీమీద తీసుకొస్తున్నాడట. టెలిగ్రాం రామచంద్రమిచ్చాడు.

ఇల్లు దుఃఖ సముద్రంలో మునిగింది. పార్వతమ్మ శోషవొచ్చి పడిపోయింది. ఇరుగూ పొరుగూ మూగారు. ఊరడించారు.

మధ్యాహ్నం మిడిఎండలో 'టాక్సీ'మీద శవం వచ్చింది. హైదరాబాదు స్టేషన్లో రైలు ఆగేముందు ఆదరాబాదరా దిగడంలో కాలుజారి 'ప్లాట్‌ఫారానికి' రైలు చక్రాలకీమధ్య పడ్డాడట. కాళ్లూ చేతులూ

తునాతునకలయిన్నై. నెత్తురులో తడిపి ఆనవాళేనా, దొరకని ఆ చల్లని మాంసం ముద్దలో ఎన్ని ఆశలు, ఎన్ని నిరాశలు! ఎన్ని ద్వేషాలు, ఎన్నిరోషాలు, ఎంత రక్తి, ఎంత విరక్తి, ఎంత తామసం, ఎంత కసి, వేగి వేగి మూగవోయినయ్యో ఎవరికీ కనిపించలేదు, వినిపించలేదు.

పిండప్రదానాలూ, శ్రాద్ధకర్మలూ, తెంపి పోతలూ గట్రా యధావిధిగా జరిగిపోయిన్నై. రాధ ఉద్యోగంచేస్తూ ఏదో చక్రం తిప్పుతోందని కనిపెట్టి సెలవలైపోయినయ్యని అదరాబాదరా టపాకట్టేశారు సుపుత్రులిద్దరూ.

* * *

మర్నాడు పోస్టులో ఒక కవరు వచ్చింది. కవరు చించింది రాధారాణి. అవి 'ఇన్షూరెన్స్ ప్రీమియం నోటీసులు.' పెద్దకళ్లు చేసుకుని పరీక్షగా చూచింది రాధారాణి. అమ్మా నాన్నా నాలుగేసివేలకి జీవిత భీమా చేశారు ఏనాడో! ఒక్కసారీ చెప్పలేదు.

'అమ్మా, నాన్నారు...కాయితా లెక్కడపెట్టేవారే?' అని లోపలికి'వెళ్లి అడిగింది రాధ. డ్రాయర్లో చూడమంది పార్వతమ్మ. 'డ్రాయరు' తెరిచింది. చుట్టలు చుట్టుకున్న నాగుపాములల్లే రెండు 'పాలసీలూ' భద్రంగా ఉన్నాయి. శీతారామయ్య 'పాలసీ' తెరిచిచూచింది. లోపలనించీ ఒక చిన్న చీటీముక్క కిందపడింది. తీసుకుని చదువుకుని చప్పున దాచేసింది రాధ.

* * *

పార్వతమ్మ అన్నీ వింది. 'పాలసీ అంటే ఏమిటీ?' అడిగింది. రాధారాణి వివరంగా చెప్పింది.

* • *

ఆలస్యం చెయ్యకుండా డెత్‌సర్టిఫికెట్టు దాఖలుచేసి 'కార్పొరేషన్'నించీ నాలుగువేలూ పట్టుకొచ్చింది.

మూడో నెల తిరక్కుండానే వాణికి పెళ్లి ఖాయమయింది. డబ్బు శాశ్వతమా అంటారు తెలివితక్కువగా! డబ్బంటే లక్ష్మి! విష్ణుమూర్తి భార్య!! దాన్ని నిర్లక్ష్యంచేస్తే ఆ దేవుడికే కోపం రావచ్చు!!

* * *

రాధ ఉద్యోగం చేస్తోంది. తనకట్నపు సొమ్ము తనే సంపాయించుకొంటోంది. ఒకనాడు ఆఫీసునించీ వచ్చేసి, ఫోంచేసి పడుకుని, కొంచెం సేపు ఏదో పుస్తకం చదువుకుని, 'స్విచ్చి' 'ఆఫ్'చేసి, ఆవలింతలొస్తుంటే, చిటికలు వేసుకొంటూ కళ్లుమూస్తుంటే పార్వతమ్మ మంచం పట్టిమీద కూచుని కనిపించింది. ఎప్పుడొచ్చిందో యేమో. అంతరంగికంగా మాట్లాడవలసిందేమయినా వుంటే పార్వతమ్మ ధోరణి అది!

'అయితే రాధీ... నాన్నగారు వెళ్లిపోయారు కదా...ఏదో మహరాజా! చచ్చిపోతూ కూడా ఒక పిల్లదాని కన్నెచెర విడిపించి మరీ తనదారి తను చూచుకున్నారు...ఎవరికేనా అదే దారి అనుకో...ఎదో ముందూ వెనకా అంతే...ఉట్టిగట్టుకుని కలకాలం ఊగులాడతామా?'

'ఏమిటమ్మా ఈ ధోరణి?' అని విసుక్కుంది రాధ.

'అది కాదమ్మా...మరి...ఆ కాయితం, మనిషి పోతే అంటేనేగాని మారదాయేం?' చటుక్కున ఆగింది.

రాధ మెదలకుండా ఊరుకుంది.

'అయితే మరి...నాన్న కాయితానికి నాలుగు వేలొచ్చినయి కదా, నా కాయితానికీ నాలుగు వేలొస్తయ్యన్నమాటే కదా? వస్తే మరి నీ...'

మాట మధ్యలో తుంచేసి చప్పున ఆమె నోరు మూసింది రాధ.

(అయిపోయింది)

నిజం

శ్రీ సి. నాగేశ్వరరావు

మనస్సాగరపు అగాధం
లోతుల్లోకి వెళ్లాను.
ఆలిచిప్పలు—ముత్యపు చిప్పలు
దొరికినవి—తీసుకున్నాను.

పవిత్ర మేమిటి?
అపవిత్ర మేమిటి?
అబద్ధ మేమిటి?
అతిసత్య మేమిటి?

దేవత్వపు ఉపలబ్ధు లేమిటి?
రాక్షస ప్రవృత్తు లేమిటి?

ఆకలి రోదన ఏమిటి?
అతితిండిరోగ మేమిటి?

అగాధంలోకి దూకి
ఏరిన ఏ చిప్పలో
నిజమైన ముత్యముందో
నన్న జిజ్ఞాసతో వా టన్నిటిల
వెదుకుతూనే ఉన్నాను.

మనస్సు పొందే అనుభవాలు
నిజం కావని, నిజానికి రూపం
లేదని, అది అతిదూరమని,
అది ఎంతో అసాధ్యమని
అఖరికి ఒక శుక్తిలో ఈ
ముత్యాన్ని కనుగొన్నాను.
అదే నిజమనుకున్నాను.



విష్ణుకుండినులు - కాలనిర్ణయము

శ్రీ బి. ఎన్. శాస్త్రి

ఇంద్రపాలనగర తామ్రశాసనములలో గోవిందవర్మ వేయించిన శాసనము,[1] విక్రమేంద్ర భట్టారకవర్మ వేయించిన శాసనము[2], భారతి మాసపత్రికలో నాచే ప్రకటింపబడినవి. చారిత్రక దృష్టితో జూచిన ఈ శాసనముల కెంతేని ప్రాముఖ్యము కలదు. విష్ణుకుండిన వంశమును గూర్చి నూతన విషయములు తెలిసికొనుటకే శాసనము లుపయోగపడు చున్నవి. ఈ వంశీయుల కాలనిర్ణయమునకు విక్రమేంద్ర భట్టారక వర్మ శాసనము మిక్కిలి ఉపయోగపడుచున్నది.

సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు డా॥ మారేమండ రామారావుగారు ఇంద్రపాలనగర తామ్రశాసనములను గూర్చి New Light on the Vishnukundins అను వ్యాసమును Journal of Indian History Vol. XLIII, Part–III లో ప్రకటించి తమ అభిప్రాయమును తెలిపినారు. డా. మారేమండ రామారావుగారు నాకు గురుతుల్యులు. వారు ప్రకటించిన భావములతో నే నేకీభవించ లేనందుకు విచారించుచు, విష్ణుకుండిన వంశమును—విష్ణుకుండినుల కాలమును భారతిలో నేను ప్రకటించిన విధమునే సమర్థించుచు ఈ వ్యాసమున చేర్చుచున్నాను.

ముఖ్యముగా డా. మారేమండ రామారావుగారు విష్ణుకుండినుల రాజ్యారంభకాలమును, రాజ్యపతన కాలమును, గోవిందవర్మ శాసనమున పేర్కొనబడిన రాజుల విషయమునను నా వాదము నంగీకరింప లేదు. డా. రామారావుగారు విష్ణుకుండినులు క్రీ. శ. 450 నుండి రాజ్యపాలన మారంభించినట్లు తెలిపినారు. నేను భారతిలో ప్రకటించిన గోవిందవర్మ శాసనమున విష్ణుకుండిన మహా రాజేంద్రవర్మ క్రీ. శ. 388 లో రాజ్యము స్థాపించినట్లు తెలిపినాను. విక్రమేంద్ర భటా రకవర్మ శాసనమున పేర్కొనబడిన పల్లవ సింహవర్మను క్రీ. శ. 600 – 630 వరకు ఆంధ్రదేశపు తూర్పుతీర ప్రాంతమువరకు పాలించిన మొదటి మహేంద్రవర్మ తాతగా డా. రామారావుగారు గుర్తించినారు. ఈ పల్లవ సింహవర్మ క్రీ. శ. 555 - 575 వరకు పాలించినట్లు తెలిపినారు.

విష్ణుకుండిన వంశవృక్షమును కాలమును విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనమున పేర్కొనబడిన శక సంవత్సరము ననుసరించి నిర్ణయించినారు.[3] విష్ణుకుండిన వంశమునకు, విష్ణుకుండినుల కాలమునకు సంబంధించిన విషయము లను కుప్తముగా నిచట తెలుపుట సమంజసమనియే భావించి వ్రాయుచున్నాను.

---

1. భారతి. జూన్ 1965 Page 14 -28.

2. భారతి జూలై 1965 Page 2–14.

3. '.....The Commencement of Vishnukundin rule has to be assigned to about the middle of the fifth Century A. D. and its end to 615 A. D.

Taking saka 488 expired, corresponding to 566–567 A. D. and the regnal years mentioned in the C. P. grants as the basis the Chronology of the Vishnu-Kundins may be restated as follows.

Vikramendra Varman	450–458
Govinda Varman	458-468
Madhava Varman	468-518
Vikramendra I	518-528
Indrabhattaraka Varman	528-555
Vikramendra II	555–566
Indra Varman	566-570
Madhava Varman	570-575
Govinda Varman	575–615

—Journal of Indian History Vol. XLIII, Part. III

ఇంద్రపాల నగర తామ్రశాసనమువలన మనకు విష్ణుకుండిన వంశీయులకు సంబంధించిన నూతన విషయములు తెలియుచున్నవి. గోవిందవర్మ ఇంద్రపాల నగర తామ్రశాసనమువలన విష్ణుకుండిన వంశకర్త మహారాజేంద్రవర్మ. అతని కుమారుడు మాధవవర్మ. మాధవవర్మ కుమారుడు గోవిందవర్మ. గోవిందవర్మ తన 37 వ విజయ రాజ్య సంవత్సరమున వేయించిన ఈ శాసనమున 'సత్వ సత్య త్యాగాభిజన నయ వినయోత్సాహాది గుణగణ సంపదా స్వయమధిగత రాజ్యానాం సమ్యక్ప్రజాపాలనా ప్రథితావదాత పృథుయశసాం రాజ్ఞాం విష్ణుకుణ్డీనా మమల విపుల సకలకుల తిలకేన శ్రీ మహారాజేన్ద్రవర్మణాసత్పుత్రేణ మహారాజశ్రీ మాధవవర్మణః సుపుత్రేణ స్వకీయ భుజ బలోత్సాహ ప్రభావానురాగావాప్త స్వరాజ్యేన......... మహారాజశ్రీ గోవిన్దవర్మణా......' అని వర్ణింపబడుటవలన విష్ణుకుండినులు స్వపరాక్రమంబునం రాజ్యమును పొందిరని తెలియుచున్నది. అనగా సత్వము, సత్యము, త్యాగము ఉన్నతవంశసంజాతత్వము, నయ వినయోత్సాహాది సద్గుణ సంపత్తిచే స్వపరాక్రమంబునం రాజ్యమునుపొంది సక్రమప్రజాపాలనమువలన కీర్తిగాంచి అనేక దానములవలన విస్తారకీర్తిం బొందిన విష్ణుకుండిన రాజలోకములో నందరికిని తిలకాయమానుఁడగు శ్రీ మహారాజేంద్రవర్మ సత్పుత్రుడై మహారాజశ్రీ మాధవవర్మకు సుపుత్రుఁడై తన భుజ బలోత్సాహముచేతను ... మహాబోధివిత్తముగలవాఁడును అగు మహారాజ గోవిందవర్మ...వర్ణింపబడినాడు.

ఇంద్రపాలనగర తామ్రశాసనమువలన తెలియుచున్న ముఖ్య విషయములు:—

1. గోవిందవర్మ శాసనమున పేర్కొనబడిన 1. మహారాజేంద్రవర్మ 2. మాధవవర్మ 3. గోవిందవర్మ.
2. విష్ణుకుండినులు బౌద్ధమతానుయాయులు, బౌద్ధ మతాభిమానులు. శ్రీ పర్వతస్వామి పాదానుధ్యాతులు. క్రతుసహస్రయాజులు.
3. ఇంద్రపాలనగరము – బౌద్ధవిహారము.
4. విష్ణుకుండినుల కాలనిర్ణయమునకు సంబంధించిన విక్రమేన్ద్ర భట్టారకవర శాసనమున పేర్కొనబడిన శకసంవత్సరము 488.
5. విక్రమేన్ద్ర భట్టారకవర్మ శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ వాకాటక రాజకుమారిని వివాహమాడిన మాధవవర్మ తండ్రి. విష్ణుకుండినులు బ్రహ్మ, క్షత్ర తేజస్సు కలవారు.
6. విక్రమేన్ద్ర భట్టారకవర్మ కుమారుడు మాధవరాజు.
7. విక్రమేన్ద్ర భట్టారకవర్మచే ఓడిపోయిన పల్లవ సింహవర్మ.
8. విక్రమేన్ద్ర భట్టారకవర్మ శాసనమున కాఞ్చిపతిపులలో ప్రముఖుఁడైన శ్రీ మూలరాజు.

పైన పేర్కొనబడిన విషయముల నొక్కొక్కదానిని గ్రహించి విపులీకరించిన విష్ణుకుండినుల విషయమునగల సంశయములు కొంతవరకు తీరుననుటలో సందేహము లేదు.

1. గోవిందవర్మ శాసనమున పేర్కొనబడిన 1. మహారాజేంద్రవర్మ 2. మాధవవర్మ 3. గోవిందవర్మ.

విష్ణుకుండినులకు సంబంధించిన ఆరు తామ్ర శాసనములు ఒక శిలాశాసనము ప్రకటింపబడినవి.

1. ఈపూరు శాసనము

మాధవవర్మ
|
దేవవర్మ
|
మాధవవర్మ
47 వ సంవత్సరము

2. రామతీర్థ శాసనము

మాధవవర్మ
|
విక్రమేన్ద్రవర్మ
|
ఇంద్రవర్మ
27 వ సంవత్సరము

3. చిక్కుళ్ళ శాసనము

మాధవవర్మ
|
విక్రమేన్ద్రవర్మ
|
ఇంద్రభట్టారకవర్మ
|
విక్రమేన్ద్రవర్మ
10 వ సంవత్సరము

4. తుండి శాసనము

మాధవవర్మ
|
విక్రమేన్ద్ర భట్టారకవర్మ
|
ఇంద్రవర్మ
|
విక్రమేన్ద్ర భట్టారకవర్మ
14 వ సంవత్సరము

5. ఈపూరు శాసనము	6. పొలమూరు శాసనము
గోవిందవర్మ	విక్రమేన్ద్రవర్మ
మాధవవర్మ 37 వ సం.	గోవిందవర్మ
మంచన భట్టారక	మాధవవర్మ 48 వ సం.

ఇంద్రపాలనగర శాసనములు

గోవిందవర్మ శాసనము	విక్రమేన్ద్ర భట్టారకవర్మ శాసనము
మహారాజేంద్రవర్మ	గోవిందవర్మ
మాధవవర్మ	మాధవవర్మ
గోవిందవర్మ 37 వ రాజ్య సం.	విక్రమేన్ద్రవర్మ
	ఇంద్రభట్టారకవర్మ
	విక్రమేన్ద్ర భట్టారకవర్మ 11 వ విజయరాజ్య సం.
	మాధవరాజు

1. రామతీర్థ శాసనము 2. చిక్కుళ్ళ శాసనము 3. తుండి శాసనము 4. ఈపూరు శాసనము 5. పొలమూరు శాసనముల నమసరించి శాసనములలో పేర్కొనబడిన రాజులపేళ్ళు, విక్రమేంద్ర భట్టారకవర్మ వేయించిన ఇంద్రపాలనగర శాసనములోని రాజుల పేళ్లతో సరిపోవుచున్నవి. కాని విక్రమేంద్ర భట్టారకవర్మ శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ పేరు పైన పేర్కొనబడిన నాలుగు శాసనములందు లేదు. పొలమూరు, ఈపూరు శాసనములందు పేర్కొనబడిన గోవిందవర్మ మాధవవర్మ తండ్రిగా చెప్పబడినాడు. విక్రమేన్ద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర తామ్రశాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ సైతము మాధవవర్మ తండ్రిగానే పేర్కొనబడినను ఈ మాధవవర్మలు మాత్రము వేర్వేరని చెప్పుట కవకాశమున్నది. విక్రమేంద్ర భట్టారకవర్మ శాసనమున పేర్కొనబడిన మాధవవర్మ గోవిందవర్మ పుత్రుడు. వాకాటక మహాదేవిని వివాహమాడినవాడు. ఏకాదశాశ్వమేధ, రాజసూయ, వాజపేయ, పురుషమేధ క్రతు సహస్రము లాచరించిన వాడు. మాధవవర్మ కుమారుడు విక్రమేంద్రవర్మ. వాకాటక మహాదేవి సుతుడు.

పొలమూరు, ఈపూరు శాసనములందు పేర్కొనబడిన మాధవవర్మ గోవిందవర్మ కుమారుడే యైనను విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనమున పేర్కొనబడిన మాధవవర్మ మాత్రము కాదు. ఈ మాధవవర్మ కుమారుడు మంచన భట్టారకుడు. ఈ మాధవవర్మ జనాశ్రయుడు. త్రివర నగర భవన గత పరమ యువతిజన విహరణ రతి రనన్య నృపతి సాధారణుడు.

రామతీర్థ శాసనము, చిక్కుళ్ల శాసనము, తుండి శాసనము, విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్ర పాలనగర శాసనములందు పేర్కొనబడిన మాధవవర్మ గోవిందవర్మ కుమారుడు. దేవవర్మ కుమారుడగు మాధవవర్మ తన 47 వ సంవత్సరమున వేయించిన ఈపూరు శాసనమున దేవవర్మ తండ్రిగా పేర్కొనబడిన మాధవవర్మ పైన పేర్కొనబడిన శాసనములందలి గోవిందవర్మ కుమారుడగు మాధవవర్మయే కాని అన్యుడుకాడు.

విక్రమేన్ద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర తామ్ర శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ మాధవవర్మ తండ్రి. గోవిందవర్మ షడభిజ్ఞ ప్రతిపాద్య దర్శనానుగ్రహమువలన సుగతసిద్ధాంతములందు గౌరవము కలిగిన వాడును సర్వలోకములకు దీటైన అందముతో గూడిన మహావిహారములను నిర్మించుట వలన బ్రాహ్మణోపకారజనితంబగు పుణ్య సంభారమును పొందినవాడు నై యుండెను.

పొలమూరు శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ 'అనేక సమర సంఘట్ట విజయినః పరనరపతి మకుటమణిమయూఖావధూత చరణయుగళ విక్రమాశ్రయస్య శ్రీ గోవిందవర్మణః' అని ప్రశంసింపబడినాడు.

ఈపూరు శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ 'భగవచ్ఛ్రీపర్వతస్వామిపాదానుధ్యాతస్య విష్ణుకుండీనామాపరిమితబలపరాక్రమస్య పరమ ధార్మికస్య ప్రణత సకల సామంత స్యానేక గోహిరణ్య భూమి ప్రదానస్య మహారాజస్య 'శ్రీ గోవిందవర్మణః' అని ప్రశంసింపబడినాడు.

గోవిందవర్మ ఇంద్రపాల నగర తామ్రశాసనమున గోవిందవర్మతండ్రి మాధవవర్మ, తాత మహారాజేంద్ర వర్మ పేర్కొనబడినారు. ఈ శాసనమును గోవింద వర్మ తన 37 వ రాజ్య సంవత్సరమున వేయించి నాడు. మహారాజేంద్రవర్మ వంశపరంపరగా వచ్చిన రాజ్యమున కధికారికాడు. 'సత్య సత్వ త్యాగాభిజన నయ వినయోత్సాహాది గుణగణ సంపదా స్వయమధిగత రాజ్యానాం సమ్యక్ప్రజాపాలనాత్ప్రథిత తావదాత ప్రథుయశ సాం రాజాం విష్ణుకుండీనా మమల విపుల సకల కుల తిలకేన శ్రీ మహారాజేన్ద్రవర్మణా' అని ప్రశంసింప బడినాడు. ఇతని పుత్రుడు మాధవవర్మ మహారాజగా పేర్కొనబడినాడు. శాసనము వేయించిన గోవిందవర్మ 'సకలసత్వధాతుత్రాణాయోత్పాదిత మహాబోధివిత్తేన మహారాజశ్రీ గోవిందవర్మణా' అని వర్ణింపబడి నాడు. ఇతడు మహాదేవి విహారమునకు పేన్కాపర గ్రామమును దానము గావించెను.

విక్రమేంద్రభట్టారకవర్మ శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ బౌద్ధమతాభిమాని. ఇతడును బౌద్ధమతానురక్తుడు. విక్రమేంద్ర భట్టా రకవర్మ శాసనమున 'ప్రతివిషయమతి బహుప్రకార మణరమోదారక కవర్మణాద్భుత న్యాస విహార చూడామణిభి రలంకృత సకలదక్షిణాపథస్య శ్రీపార్వ తేయ పూర్వాణ పరక్షితిపతి పరంపరాహార మద్ధ్య నిరుపమ విరాజితయా కౌస్తుభాయమాన యశో జన్మనః గుణరూప సంపద్భి రనుగత గోవిన్దస్య శ్రీ గోవిన్ద రాదస్య మూర్తిణామలీం శ్రియం ప్రత్య విష యాకృత మనోరథయా పరమభట్టారికా మహా దేవ్యా శ్రీమ ద్విన్దపుర ముచ్చై రలంకర్తుణకామ యేవ ప్రతిష్ఠాపితే శ్రీమతి పరమభట్టారికా మహా విహారేస్మాభి ప్రవర్ధణమాన విజయరాజ్య సంవత్స రైకా దశే కార్తిణకమాస కృష్ణపక్షేష్టమ్యా చాతుర్దిణ శార్యవరభిక్షుసంఘపరిభోగాయ సర్వణదాన సహిత స్సర్వణ బాధా పరిహారేణ ఇరుణ్డారో నామ గ్రామో దత్తః' అని కలదు.

గోవిందవర్మపైగల అభిమానము వలనను సింహవర్మను జయించుట వలన కలిగిన సంతోషాతి శయము వలనను విక్రమేన్ద్ర భట్టారకవర్మ 'ఇరు ణ్డారో' గ్రామమును భిక్షు సంఘములకు దానమిచ్చి నాడు. విక్రమేన్ద్ర భట్టారకవర్మ చిక్కుళ్ల, తుండి శాసనములందు అతని ప్రపితామహ, పితామహ, పిత రులు మాత్రమే పేర్కొనబడినారు. కాని ఇంద్ర పాలనగర తామ్రశాసనమున ప్రపితామహుడగు మాధవవర్మ తండ్రి గోవిందవర్మ పేర్కొనబడినాడు. ఈ గోవింద్రవర్మ తండ్రి మాధవవర్మ. గోవిందవర్మ ఇంద్రపాలనగర శాసనమున పేర్కొనబడినవాడు. గోవింద వర్మ తండ్రిపేరును కుమారునకు పెట్టియుండ వచ్చును. ఈ కారణమువలన విక్రమేన్ద్ర భట్టారక వర్మ శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ—ఇంద్ర పాలనగర తామ్రశాసనమును వేయించిన మహారాజేంద్ర వర్మ పౌత్రుడును మహారాజశ్రీ మాధవవర్మ పుత్రు డును నగు గోవిందవర్మ ఒక్కరేనని తెలియుచున్నది. కావున విష్ణుకుండిన వంశకర్త మహారాజేంద్రవర్మ యనియు అతని కుమారుడు మొదటి మాధవవర్మ, మనుమడు గోవిందవర్మ యని విశదమగుచున్నది. ఈ గోవిందవర్మ కుమారుడే ఏకాదశాశ్వమేధ క్రతుసహస్ర పౌండరీక వాజపేయ పురుషమేధాదులు చేసి, విష్ణు కుండిన సామ్రాజ్యమును విస్తరింపజేసి వాకాటక రాజకుమార్తెను వివాహమాడిన వాడు.

2. విష్ణుకుండినులు బౌద్ధమతాను యాయులు. బౌద్ధమతాభిమానులు. వైదికమతాను యాయులు. శ్రీ పర్వతస్వామి పాదానుధ్యాతలు. క్రతుసహస్రయాజినులు.

విష్ణుకుండిన వంశస్థాపకుడు మహారాజేంద్ర వర్మ—ఇక్ష్వాకు వంశ పతనానంతరము ఆంధ్రదేశ మును వివిధ వంశములకుఁ చెందిన రాజులు పాలిం చిరి. అందు బృహత్ఫలాయన, ఆనంద గోత్రిక, శాలం కాయన, పల్లవ వంశీయులు ముఖ్యులు. విష్ణుకుండి నులు ఇక్ష్వాకు వంశీయులకు మండలాధిపతులుగనో లేక సామంతమాండలికులుగనో వ్యవహరించియుందురు. కృష్ణానదికి ఉత్తరమున విజయపురికి దగ్గరలో నల్లగొండమండలమున ఏలేశ్వర ప్రాంతము విష్ణు కుండినుల కావాసస్థలముగా నుండియుండవచ్చును. మూసీనదీతీరమునున్న ఇంద్రపాలనగరము ఇక్ష్వాకుల కాలమున బౌద్ధక్షేత్రముగా వర్ధిల్లియుండును. మూసీనది నల్లగొండ మండలమున ప్రవహించు

చున్నది. వాడపల్లి వద్ద కృష్ణానదిలో సంగమమగుచున్నది. నల్లగొండమండలములోని సూర్యాపేట నుండి జనగామ వెళ్ళు మార్గమున ఫణిగిరి గ్రామమున బౌద్ధస్తూప మున్నది. ఫణిగిరి, గాజులబండ, కొండాపురము బౌద్ధుల కావాస స్థలములు. కొండాపురము ఆంధ్రరాజులకాలమున అత్యంత వైభవముగా నున్న నగరము. హైదరాబాదు నగరమునకు 40 మైళ్ళ దూరమున మెదకుజిల్లాలోనున్న గ్రామము. ప్రస్తుతము ఖమ్మంజిల్లాలోనున్న వేలకొండపల్లిలో బౌద్ధులకు సంబంధించిన దిబ్బ యున్నది. ఖమ్మం, నల్లగొండ, మెదకు, హైదరాబాదు, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాలు వాడు విష్ణుకుండినులు మొట్టమొదట పాలించిన ప్రాంతములుగా యూహింపవచ్చును. ఇప్పటి కృష్ణాజిల్లా విష్ణుకుండినులు తొలుత పాలించిన ప్రాంతమే. జగ్గయ్యపేట రామిరెడ్డిపల్లి ప్రాంతమున ఇక్ష్వాకుల శాసనములు లభించినవి. కావున ఇక్ష్వాకుల కాలమున బౌద్ధ మవలంబించిన విష్ణుకుండినులు బౌద్ధమతానురక్తులై యుండిరని యూహింపవచ్చును.

విష్ణుకుండిన వంశీయులలో మహారాజేంద్రవర్మ అతనిపుత్రుడు మాధవవర్మ పౌత్రుడు గోవిందవర్మ బౌద్ధమతానుయాయులు. బౌద్ధమతాభిమానులు. రెండవమాధవవర్మ దేవవర్మ మూడవ మాధవవర్మ వైదిక మతానుయాయులు. విక్రమేంద్రవర్మ బౌద్ధుడు. ఇంద్రభట్టారకవర్మ, విక్రమేంద్ర భట్టారకవర్మ బౌద్ధమతాభిమానులు. గోవిందవర్మ మాధవవర్మ IV వైదిక మతానుయాయులు.

విష్ణుకుండినులు బౌద్ధమతానుయాయులు, మతాభిమానులనుటకు వారిశాసనములందుగల వర్ణనలే తార్కాణము. ఇంద్రపాలనగరశాసనము వలన ఈ విషయము తెలియుచున్నది. గోవిందవర్మ 'సకలదిగన్తరేణ భిక్షుద్విజావాధయాచకవ్యాధితదీనకృపణజనోప భుజ్యమాన న్యాయాధిగత విభవ ధన సముదయేనా...... మహాబోధివిలేత్రన...' అని వర్ణింపబడినాడు. విక్రమేన్ద్ర భట్టారకవర్మ శాసనమున గోవిందవర్మ 'షడభిజ్ఞ ప్రతిపాద్య దర్శనానుగ్రహ జనిత సుగత శాసనాభిప్రసాదస్య విబుధ భవన ప్రతిస్పర్ధి శోభా సముదయానేక మహావిహార ప్రతిష్ఠాపనాధిగతానన్త బ్రాహ్మణ పుణ్య సంభారస్య' అని వర్ణింపబడినాడు. అట్లే విక్రమేన్ద్రవర్మ 'మహారాజశ్రీ మాధవ వర్మణః ప్రియపుత్రస్య వాకాటకమహాదేవీసుతస్య మహాకవేః పరమసౌగతస్య' అని పేర్కొనబడినాడు.

విష్ణుకుండినులలో రెండవమాధవవర్మ, మూడవమాధవవర్మ, నాలుగవమాధవవర్మ వైదిక మతానుయాయులు.

రెండవమాధవవర్మ, మూడవమాధవవర్మ వేయించిన ఈపూరు శాసనమున[4] 'ఏకాదశాశ్వమేధావభృతావధౌత జగత్కల్మషస్య క్రిష్టోమసహస్రయాజినో నేకసామన్తమకుటమణిఖచిత చరణయుగళ కమలస్య మహారాజస్య శ్రీ మాధవవర్మణః' అనియు, విక్రమేన్ద్ర భట్టారకవర్మ ఇంద్రపాలనగర శాసనమున 'ఏకాదశాశ్వమేధ బహుసువర్ణ పౌణ్డరీక వాజపేయ క్రతూ సహస్రసర్వమేధ రాజసూయ పురుషమేధాద్య హరహస్సమ్యగనుష్ఠిత శ్రుతివిహితాశేష దుష్కర కర్మణా కర్మానుష్ఠానస్య—'అని వర్ణింపబడినాడు. మూడవమాధవవర్మ తాను వేయించిన ఈపూరు శాసనమున 'భగవచ్ఛ్రీ పర్వతస్వామి పాదానుధ్యాతో' అని వర్ణింపబడినాడు.

నాలుగవమాధవవర్మ పొలమూరు శాసనమున 'క్రతుసహస్రయాజి హిరణ్యగర్భ ప్రసూతః ఏకాదశాశ్వమేధా వభృదస్నాన' అని వర్ణింపబడినాడు.

ఇట్లు విష్ణుకుండినులలో మొదటి రాజులు బౌద్ధమతానుయాయులుగా నుండిరి. రెండవ మాధవ వర్మ వాకాటక రాజకుమారిని వివాహమాడిన యనంతరము బౌద్ధమతమును వీడి, వైదికమత మవలంబించి వాకాటకరాజావలె యజ్ఞయాగాది క్రతువులు అశ్వమేధ పురుషమేధాది క్రతువు లాచరించి వైదిక మతోద్ధరణకు పాటుపడినాడు. బౌద్ధమత గురువుల యొక్కయు, సన్యాసులయొక్క ప్రవర్తనలో మార్పు వచ్చినది. బౌద్ధ సంఘారామములు అవినీతికి నిలయములైనవి. వైదికమత ప్రాబల్యము అధికమగుట వలన మాధవవర్మ వైదికమత మవలంబించి యజ్ఞ

4. E. I. Vol XVII Page 337.

5. J. A. H. R. S. Vol VI Page. 17.

యాగాది క్రతువు లాచరించినవాడు.

3. ఇంద్రపాలనగరము – బౌద్ధవిహారము.

ఇంద్రపాలనగరము మూసీనదియొడ్డున నున్నది. ఇంద్రపాలగుట్ట, కోట, శిథిలరూపముననున్న కట్టడములు, నాగవరము - తుమ్మలగూడెము, వలిగొండ ప్రాంతములందు కనిపించు శిథిలరూపములు, ఇండ్ల అడుగులు, పునాదులు పరిశీలించిచూడ, ఇంద్రపాల నగర ప్రాంతమున, శాసనములందు వర్ణింపబడినట్లు మహాద్భుతమైన కట్టడములతో బౌద్ధారామవిహారము లిచట వర్ధిల్లినట్లు తోచుచున్నది. అంతియేకాక, విజయపురిలో ఇక్ష్వాకువంశ మంతరించినపిమ్మట, పల్లవ, శాలంకాయన వంశీయుల ఏలుబడిలో కృష్ణకు దక్షిణముగానున్న గుంటూరు మున్నగు ప్రాంతములందు బౌద్ధమతమునకు రాజాదరము సన్నగిల్లుట వలన తెలంగాణప్రాంతమున బౌద్ధము వ్యాపించినట్లు భావింపవచ్చును. ఇంద్రపాలనగరముననున్న మహాదేవి విహారము ముఖ్యమైనదై యుండవచ్చును. ఈ విహారముననున్న బౌద్ధమతాచార్యుడు ఫణిగిరి, గాజుల బండ, కొండపల్లి, మున్నగుప్రాంతములందున్న విహారములపై ఆధిపత్యము నెఱపి యుండవచ్చును. పురావస్తుశాఖవారి ప్రయత్నమువలన మహాదేవి విహారము బయల్పడవచ్చునని ఆశింపవచ్చును.

4. విష్ణుకుండినుల కాలనిర్ణయమునకు సంబంధించిన విక్రమేన్ద్ర భట్టారకవర్మ శాసనమున పేర్కొనబడిన శక సంవత్సరము 488.

విక్రమేన్ద్ర భట్టారకవర్మ శాసనమున 'పాష్టశీతి చతుశ్శతే శకవతే సంవత్సరాణాంగతే' అని యుండుటవలన విష్ణుకుండినుల కాలనిర్ణయమునకీ శక సంవత్సరము 488 తోడ్పడుచున్నది.

ఇంతవరకు విష్ణుకుండినుల శాసనములందు విజయరాజ్య సంవత్సరములేతప్ప శక సంవత్సరములు పేర్కొనబడలేదు. కావున ఈ శాసనమున కెంతేని ప్రాముఖ్య మివ్వవలసి వచ్చుచున్నది. విష్ణుకుండినుల వంశ నిర్ణయముతోపాటు రాజుల పరిపాలనా కాలము కూడ నిచట పేర్కొని కాలనిర్ణయము చేయుట సముచితమని తలుతును.

- మహారాజేంద్రవర్మ (388—390)
  - మాధవవర్మ I (390—398)
    - గోవిందవర్మ I (398—435)
      - మాధవవర్మ II (435—470)
        - దేవవర్మ (470—473)
          - మాధవవర్మ III (473—522)
        - విక్రమేంద్రవర్మ (522—528)
          - ఇంద్రభట్టారకవర్మ (528—556)
            - విక్రమేన్ద్ర భట్టారక వర్మ (556—570)
              - ......
                - మాధవరాజు
                - గోవిందవర్మ II (570—573)
                  - మాధవవర్మ IV (573—623)
                    - మంచన భట్టారక (623—624)

సముద్రగుప్తుడు దక్షిణాపథముపై దండెత్తి వచ్చినపుడు దక్షిణభారతమున వివిధ వంశీయులు పాలించుచుండిరి. అలహాబాదు శాసనమున హరిసేనుడు సముద్రగుప్తుని దిగ్విజయము వర్ణించుచు దక్షిణాపథమున జయించిన రాజ్యములను రాజులను పేర్కొనినాడు.

'కౌసలక — మహేంద్ర; మహాకాంతారక — వ్యాఘ్రరాజ; కౌరాలక – మంత్రరాజ; పిష్టపురక— మహేంద్ర; గిరికొట్టూరక – స్వామిదత్త; అరింద పల్లవ – దమన; కాంచేయక – విష్ణుగోప; అవముక్తక– నీలరాజ; వైంగేయక – హస్తివర్మ; పాలక్కక— ఉగ్రసేన; దైవరాష్ట్రక – కుబేర; కౌశస్థలపురక— ధనంజయ; ప్రభృతి సర్వదక్షిణాపథ రాజగ్రహణ మోక్షానుగ్రహజనిత ప్రతాపోన్మిశ్ర మహాభాగ్యస్య'[6]

సముద్రగుప్తుని దక్షిణదేశ దిగ్విజయానంతరము శాలంకాయన, పల్లవ, ఆనందగోత్రికుల బలము క్షీణించుచున్న సమయమున విష్ణుకుండినులు కృష్ణానదికి ఉత్తరమున రాజ్యము స్థాపించు ప్రయత్నములు చేయసాగిరి. విష్ణుకుండిన మహారాజేంద్రవర్మ ఏలేశ్వరము, మిర్యాలగూడ, నల్లగొండ, భువనగిరి ప్రాంతములను తన అధికారము క్రిందికి తెచ్చుకుని ఇంద్రపాలనగరమును రాజధానిగా క్రీ. శ. 388 ప్రాంతమున రాజ్యమును స్థాపించినట్లూహింపవచ్చును. అప్పటికి ఆనందగోత్రికులు బలహీనులై పల్లవ రాజాతో యుద్ధములు చేయుచుండిరి. కళింగులు - శాలంకాయనులు - పల్లవులు పరస్పరము కలహించుచుండుటవలన విష్ణుకుండినులు రాజ్యము స్థాపించి స్థిరపడుట కవకాశము కలిగినది.

శాలంకాయన హస్తివర్మ యనంతర మాతని తనయుడు నందివర్మ ఆంధ్రదేశాధీశు డయ్యెను. ఇతడు ధర్మప్రధానుడు. నందివర్మ యనంతరము చండవర్మ! చండవర్మ తరువాత విజయనందివర్మ రాజయ్యెను. ఈతని కాలమున శాలంకాయన రాజ్యము క్షీణింప మొదలిడెను. అప్పుడు విష్ణుకుండిన గోవిందవర్మ విజృంభించి కృష్ణకు దక్షిణమునున్న గుంటూరు మండలమును, క్రమముగా కృష్ణా గోదావరీ మధ్య భూభాగమును జయించి విష్ణుకుండిన సామ్రాజ్యమును విస్తృతపరచెను. అటు కళింగమున సముద్రగుప్తుని దిగ్విజయానంతరము శాలంకాయన హస్తివర్మ సామంతులు స్వతంత్రరాజ్యముల నేర్పరచుకొనుచుండిరి. కళింగమున శక్తివర్మ రాజ్యవిస్తృతికి ప్రయత్నించుచుండెను. పల్లవులు కదంబులతో పోరాడుచుండిరి. ఇట్టి తరుణమందే విష్ణుకుండిన రాజ్యము వృద్ధిచెందుట కవకాశము కలిగెను. విష్ణుకుండినుల కాలనిర్ణయమునకు విక్రమేంద్ర భట్టారకవర్మ శాసనమున పేర్కొనబడిన శకసంవత్సరము 488 ప్రాతిపదికగా తీసుకొనిన ఎడల—

విక్రమేంద్ర భట్టారకవర్మ 11 వ రాజ్య సంవత్సరమున వేయించిన శాసనము కనుక అతడు రాజ్యమునకు వచ్చిన సంవత్సరము క్రీ. శ. 556. తుండి గ్రామశాసనము[7] 14 వ రాజ్య సంవత్సరపుది కావున విక్రమేంద్ర భట్టారకవర్మ కాలము 556–570 అని నిర్ణయించడమైనది. ఇతని కుమారుడు గోవిందవర్మ రాజ్యకాలము 570 573.

నాలుగవ మాధవవర్మ 48 వ రాజ్య సంవత్సరపు పొలమూరు శాసనమునుబట్టి అతని కాలము 573—623 అనియు, అతని పుత్రుడు మంచన భట్టారకు డొక సంవత్సరము మాత్రమే పాలించినాడని (623–624) అని తెలిపినాను. విక్రమేంద్ర భట్టారకవర్మ తండ్రి ఇంద్రభట్టారకుడు 27 వ రాజ్య సంవత్సరమున రామతీర్థ శాసనము వేయించినాడు: కావున అతని రాజ్యకాలము 528–556గా నిర్ణయించినాను. విక్రమేంద్రవర్మ వృద్ధాప్యమున రాజైనవాడు కావున అతడు 522 528 వరకు పాలించియుండవచ్చును. మూడవ మాధవవర్మ ఈపూరు శాసన మాతని 47 వ రాజ్య సంవత్సరమున వేయించినది. ఇతని పాలనాకాలము 473 - 522. రాజేంద్రవర్మ 388 - 390, మాధవవర్మ 390 - 398, గోవిందవర్మ 398–435, మాధవవర్మ 435-470 దేవవర్మ 470—473 అని నిర్ణయించడమైనది. ఐన చాళుక్యుల రాజ్యస్థాపనము ఆంధ్రదేశమున క్రీ. శ. 610 నాటికే ఏర్పడినట్లు చారిత్రకు లంగీకరించినారు. అప్పటికి విష్ణుకుండిన వంశ మంత

6. సముద్రగుప్తుని అలహాబాదు శాసనము. Fleet - Gupta Inscriptions. C. i. i. Vol III No. 1.

7. Hyd. Arch. series No. 8.

రించినట్లు భావించుచున్నారు. రెండవ పులకేశి 609 వ రాజై దండయాత్రకు బయలుదేరెను. రెండవ పులకేశి మారుటూరు శాసనము[8] క్రీ. శ. 616 లో వేయబడినది. రెండవ పులకేశి కొప్పారపు శాసనము[9] వేయించుటకుముందు అనగా క్రీ శ. 631 నాటికి కుబ్జ విష్ణువర్ధనుడు ఆంధ్రదేశమునకు యువరాజుగా లేక ప్రతినిధిగా నియమింపబడినాడని భావింపవచ్చును.

కుబ్జవిష్ణువర్ధనుడు క్రీ. శ. 641 వరకు రెండవ పులకేశి మహారాజ ప్రతినిధిగా ఆంధ్రదేశమును పాలించెను. ఆతని మరణానంతరమే కుబ్జ విష్ణువర్ధనుడు మహారాజై చీపురుపల్లి శాసనమును వేయించెను. ఈతని కుమారుడు జయసింహవల్లభుడు. విష్ణుకుండిన నాలుగవ మాధవవర్మ పొలమూరు శాసనము[10], జయసింహవల్లభుని శాసనము ఒకేచోట కలిసి దొరికినవి.

పొలమూరు శాసనము	జయసింహవల్లభుని శాసనము
గౌతమ గోత్రము	గౌతమ గోత్రము
రుద్రశర్మ	దామశర్మ
దామశర్మ	శివశర్మ
శివశర్మ (ప్రతిగ్రహీత)	రుద్రశర్మ (ప్రతిగ్రహీత)

ఈ రెండు శాసనములలో పేర్కొనబడిన ప్రతిగ్రహీతల పేళ్ళు, వారి తాత, తండ్రుల పేళ్లను గుర్తించినయెడల, పొలమూరు శాసన ప్రతిగ్రహీత కుమారుడే జయసింహవల్లభుని శాసన ప్రతిగ్రహీత యని తెలియుచున్నది. మాధవవర్మ IV శివశర్మకు గుద్రవాడి విషయములోని పులుంచూరును దానమిచ్చినట్లుండ, జయసింహవల్లభుడా గ్రామమునే శివశర్మ కుమారుడగు రుద్రశర్మకు స్థిరపరచినాడు. కావున మాధవవర్మ తన అవసానదశలో ఈ దానమొసంగియుండును. ఈ శాసనమును మాధవవర్మ ఫాల్గుణ పౌర్ణమి చంద్రగ్రహణ నిమిత్తము గావించినట్లు తెలియుచున్నది. చంద్రగ్రహణము ఫాల్గుణమాసమున వచ్చు సంవత్సరములు క్రీ. శ. 575; 593; 594; 612; 621; బ్రహ్మశ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు మాధవవర్మ పొలమూరు శాసనమును తన 48 వ రాజ్య సంవత్సరమున అనగా క్రీ. శ. 594 వ సంవత్సరము ఫిబ్రవరి 10 వ తేదీన వేయించినట్లు నిర్ణయించినారు.[11] కాని విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనము ననుసరించి మాధవవర్మ IV రాజ్యమునకువచ్చిన కాలము 573 అగుచున్నది. అప్పుడు 48 వ రాజ్య సంవత్సరమున వేయించిన పొలమూరు శాసనము క్రీ. శ. 621 వ సంవత్సరమునకు సరిపోవును.

రెండవ పులకేశి కృష్ణానది దక్షిణ ప్రాంతమును జయించి తన రాజధానికి వెడలునపు డాంధ్రదేశమున తన ప్రతినిధిని నిలిపియుండెను. నాలుగవ మాధవవర్మ కాలము నాటికి విష్ణుకుండినుల రాజధాని బెజవాడ. పులకేశి ప్రతిస్పర్ధులు కాంచీపురాధీశులు కావున వారితో యుద్ధములు చేయుచు కృష్ణానదికి దక్షిణముననున్న గుంటూరు తదితర ప్రాంతములను జయించియుండును. మాధవవర్మ పులుంచూరు గ్రామ దానమునకు ప్రతిగృహీత శివశర్మ. జయసింహవల్లభుడు శివశర్మ కుమారుండగు రుద్రశర్మకు పులుంచూరు అగ్రహారము నొసంగి స్థిరపరచినాడు. ఇది అతని ఐదవ విజయరాజ్య సంవత్సరమున జరిగిన విషయము. ఈ అగ్రహారము నతఁడు విజయస్కంధావారమునుండి పునరుద్ధరించెను. జయసింహవల్లభుని కప్పటివరకు కృష్ణానది కుత్తరమునమున్న ఇప్పటి గోదావరి మండలములోని రామచంద్రాపురము తాలూకాలోనున్న పొలమూరు ప్రాంతము వశము కాలేదని స్పష్టమగుచున్నది. విష్ణుకుండిన మాధవవర్మ IV కుమారుడగు మంచనభట్టారకుని యుద్ధమున జయించి విజయస్కంధావారమునుండి పులుంచూరు శాసనమును పునరుద్ధరించినట్లూహింపవచ్చును. ఈ రెండు శాసనము లొకేచోట దొరుకుటనుబట్టియు, ఒకే వంశమునకుజెందిన వారును — రెండు శాసనముల లోని ప్రతిగ్రహీతలు తండ్రికొడుకులు కాబట్టి మాధవవర్మ క్రీ. శ. 623 వరకు జీవించియుండ

8. C. P. Inscriptions of A. P. Govt. Museum. Hyd. Vol I. Page II.

9. E. I. Vol XVIII Page 257.

10. J. A. H. R. S. Vol. VI; P. 17.

11. భారతి. ప్రమోదూత — భాద్రపదము. P. 474.

వచ్చుననుట కవకాశమున్నది. అంతియేగాక మాధవ వర్మ 623 వరకు జీవించియున్నట్లు మరియొక విధముగను భావింపవచ్చును. నల్లగొండ మండలము లోని దండపాడు గ్రామమున 1335 ఫసిలీలో నొక నాణెముల బిందె లభించినది. నాణెముల తూకము 4920 తులములు. ఈ నాణెములపై నోరు తెరచుకొని లంఘించుటకు సిద్ధముగానున్న భయంకర సింహరూపము, సింహముముందు అడ్డముగా విచ్చు కత్తియు, 'సత్యాశ్రయ విషమసిద్ధి' అను పేరును చెక్కియున్నవి. ఈ నాణెములు విష్ణుకుండినులవి. విష్ణుకుండినుల నాణెములపై లంఘించు సింహము, పూలతొట్టె చిహ్నములు కనిపించుచున్నవి. కుబ్జవిష్ణు వర్ధనుడు 624–631 మధ్య ఈ ప్రాంతము నాక్రమించుకొని యుండును. అప్పుడే విష్ణుకుండి నుల నాణెములపై తన విజయ చిహ్నముగ సింహము ముందు కత్తి—తన పేరును చెక్కించియుండును. కుబ్జవిష్ణువర్ధను డాంధ్రదేశమును పాలించుటకు, పులకేశి ప్రతినిధిగా క్రీ. శ. 624 లో స్థిరపడి క్రమముగా తూర్పుచాళుక్య సామ్రాజ్య నిర్మాత యయ్యెను.

కుబ్జవిష్ణువర్ధనుడు రెండవ పులకేశి వేయిం చిన మారుటూరు శాసనమున యువరాజుగా పేర్కొన బడలేదు. ఆ శాసనము క్రీ. శ. 616 లో వేయించి నది. కొప్పారము శాసనకాలము క్రీ. శ. 631. అనగా క్రీ. శ. 616 వరకు కుబ్జవిష్ణువర్ధను డాంధ్రదేశ మున ప్రతినిధిగా నియమింపబడలేదు. దక్షిణాపథ మున విష్ణుకుండినులు బలవంతులై యుండుటవల నను, తన ప్రతినిధి పరిపాలన బాగుగాలేకుండుటవలనను పులకేశి, సమరయోధుడైన తన తమ్ముడగు కుబ్జ విష్ణువర్ధనుని ఆంధ్రదేశమును పాలించుటకు ప్రతి నిధిగా పంపెను. కుబ్జవిష్ణువర్ధను డాంధ్రదేశము నకు క్రీ. శ. 620 ప్రాంతమున వచ్చి, క్రీ. శ. 620–623 వర కాంధ్రదేశమున సుస్థిరమైన ప్రభుత్వము నేర్పరచి క్రీ. శ. 623 లో విష్ణు కుండిన మాధవవర్మ నోడించి, బెజవాడ–జగ్గయ్య పేట, నల్లగొండ మున్నగు ప్రాంతములను జయిం చెను. కుబ్జవిష్ణువర్ధనునితో జరిగిన యుద్ధమున నాలుగవ మాధవవర్మ మరణించియుండును. మంచన భట్టారకుడు తండ్రి మరణానంతరము, తన యము చరులతో గోదావరి మండలమున రాజ్య మేర్పరచు కొని, జయసింహవల్లభుని కాలమువరకు చాళుక్యు లతో పోరాడుచు క్రీ. శ. 646 లో జరిగిన యుద్ధ మున మరణించియుండును.

5. విక్రమేన్ద్రవర్మ భట్టారకవర్మ శాసనమున పేర్కొనబడిన గోవిందవర్మ వాకాటక రాజ కుమారిని వివాహమాడిన మాధవవర్మ తండ్రి. విష్ణుకుండినులు బ్రహ్మక్షత్రతేజము కలవారు.

విక్రమేన్ద్ర భట్టారకవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనమున విష్ణుకుండినులు 'బ్రహ్మక్షత్ర తేజో భృతాం...షడభిజ్ఞ ప్రతిపాద్య దర్శనానుగ్రహ...మహా రాజశ్రీ గోవిన్దవర్మణః పుత్ర స్యైకాదశాశ్వమేధ బహుసువర్ణ పౌణ్డరీక వాజపేయ......మహారాజశ్రీ మాధవవర్మణః ప్రియపుత్రస్య వాకాటక మహా దేవీ సుతస్య మహాకవే పరమ సౌగతస్య......' అని వర్ణింపబడుటవలన విష్ణుకుండినులు పల్లవులవలె బ్రాహ్మణులనియు, గోవిందవర్మ బౌద్ధమతావలంబియై, విహారముల నిర్మించెననియు, అతని పుత్రుండు ఏకా దశాశ్వమేధ పౌండరీక వాజపేయక్రతు సహస్ర పురుష మేధము లొనర్చిన మాధవవర్మయనియు, మాధవవర్మ కుమారుడు మహాకవియు, వాకాటక మహాదేవి సుతుడును, సుగత సిద్ధాంతావలంబియు నగు విక్రమేంద్రవర్మయని తెలియుటవలన—మాధవవర్మ తండ్రి గోవిందవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనమును తన 37 వ రాజ్య సంవత్సరమున వేయించిన వాడే యని భావింపవచ్చును.

6. విక్రమేన్ద్రవర్మ భట్టారకవర్మ కుమారుడు మాధవరాజు.

విక్రమేంద్ర భట్టారకవర్మ శాసనమువలన ఈ రాజుకు మాధవరాజను కుమారుడున్నట్లు తెలియు చున్నది. ఈ మాధవరాజు బలపరాక్రమ శౌర్య ధైర్య సంపన్నుడు. అందమైనవాడు. వంశాలంకారుడు. విక్ర మేంద్ర భట్టారకవర్మ జ్యేష్ఠపుత్రుండు. మాధవరాజు అకాలమృత్యువువాత బడుటవలననో లేక యుద్ధము అందు వీరస్వర్గ మలంకరించుటవలననో విక్రమేంద్ర భట్టారకవర్మ తదనంతర మాతని రెండవ కుమారు డగు 2 వ గోవిందవర్మ రాజయ్యెను.

7. విక్రమేంద్ర భట్టారకవర్మచే ఓడిపోయిన పల్లవ సింహవర్మ.

విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాలనగర శాసనమున 'కృత్వా పల్లవ భంగపేలవబలం సింహోవ్యయం పల్లవం భూత్వా వృత్యయదాగతః ప్రథమ తశ్శక్రాభిధానం పురం ప్రాదాచ్ఛాసన ముత్తమాశ్రయ ఇతిఖ్యాతన్తదేవం నృపః సాష్టాశీతి చతుఃశ్శతే శక పతే సంవత్సరాణాం గతే' అని యుండుటవలన ఈ సింహవర్మ ఎవ్వరను ప్రశ్న ముదయించును. డా. మారేమండ రామారావుగారు సెలవిచ్చినట్లు ఈ సింహవర్మ రెండవ కుమార విష్ణువు పుత్రుడనియే భావింపవలయును.

పల్లవ వంశ వృక్షము


- సింహవర్మ (మంచికల్లు శిలాశాసనము) 290 A. D.
  - కుమారవిష్ణు
    - స్కందవర్మ I—310 A. D
      - బుద్ధవర్మ
        - బుద్ధ్యాంకుర
      - వీరవర్మ
        - స్కందవర్మ II
          - సింహవర్మ II
          - యువమహారాజు విష్ణుగోపుడు—350 A. D
            - ఉగ్రవర్మ
            - సింహవర్మ III
              - విష్ణుగోప II
                - స్కందవర్మ III
                  - సింహవర్మ IV
                    - నందివర్మ
                    - కుమారవిష్ణు I
                      - బుద్ధవర్మ
                        - కుమారవిష్ణు II
                          - సింహవర్మ V. 550—566
                            - సింహవిష్ణు
                              - మహేంద్రవర్మ I. 600—630

కావున విక్రమేంద్ర భట్టారకవర్మచే ఓడి పోయిన పల్లవరాజు, ఆంధ్రదేశమునుకూడా పాలించిన మొదటి మహేంద్రవర్మ పితామహుడు. సింహవిష్ణువు తండ్రి మరియు రెండవ కుమార విష్ణువుయొక్క పుత్రుడునైన ఐదవ సింహవర్మయే.

8. విక్రమేన్ద్రభట్టారకవర్మ శాసనమున కాఙ్క్షిత సత్రపులలో ప్రముఖుడైన మూలరాజు.

ఈ శాసనమున 'యేనోద్ధృతా భర్త్రా కులస్య లక్ష్మీ రథప్రతిష్ఠి నయవిక్రమాభ్యాం ఆజ్ఞాపనాఖ్యాత కులప్రసూతః శ్రీమూలరాజః సత్రపేషు ముఖ్యః' అని యుండుటవలన — సత్రపులలో ప్రముఖుడై శ్రీ మూలరాజు విక్రమేంద్ర భట్టారకునకు యుద్ధములందు సహాయపడి ఎనలేని సహాయము చేసియుండును. ఆతని వంశీయులు సైతము విష్ణుకుండిన వంశీయుల కీర్తి ప్రతిష్ఠలను నిలబెట్టి సామ్రాజ్య నిర్మాణమునకు దోహదము చేసియుందురు.

విష్ణుకుండినులకు సంబంధించిన పై విషయములను ఇంతకు పూర్వము ప్రకటింపబడిన శాసనముల నాధారముగా తెలిపినాను. విష్ణుకుండినుల కాలనిర్ణయమునకు సంబంధించినంతవరకీ వ్యాసము కొంతైనను తోడ్పడునని భావించుచున్నాను.



పర్యాప్తి

శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి

ఓ ప్రభూ! నీ వెచట నుంటివో
ఊహ కందిన చాలు నించుక
రసవదాశాలతలు నాలో
కిసలయించును పిసాళించును

చాలు నీ విట కడుగు సాచిన
గాలివార్త రవంత చాలును
నా మనోనందనవనమ్మున
నవ వసంతము కిలారించును

తొలకరించిన చాలు నొక స్మిత
కళిక నీ రుచిరాననమ్మున
నిండుపున్నమి పండువెన్నెల
నిండి గుండెలు పులకరించును


స్వామి! నీ పదధూళి లేశము
పడిన చాలును నా శిరమ్మున
కప్పురమ్ములు కుప్పలై పడి
గుప్పుమను నా జీవితమ్మున

నా యెడద నీ భక్తితో నిం
డార నేర్చిన చాలు దేవా!
నాదు నిశ్వాసము జగత్ప్రా
ణము సదాగతియై రహించును

ఎట్టులో ఒక్కింత నీ మృదు
హృది గదల్చిన చాలు స్వామీ!
నాదు హీనవిదీనగానము
నవ్యతర సామగానమ్మగు

లీలగా దర్శింప జాలిన
చాలు నీ దివ్యస్వరూపము
చూఱలిచ్చును నా కనులు తే
జో విశేషము నర్కవిధులకు

నీ పదమ్ముల బట్టి విడువక
నిలువగలిగిన చాలు తండ్రీ!
నా కరమ్ములు కాల్వలై చె
న్నారు నీ కృప భువి స్రవింపగ



మోతీ

శ్రీమతి ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి

నా కిప్పటికింకా బాగా జ్ఞాపకం వుంది. పది పన్నెండేళ్ల క్రితం సంగతయినా! ఇప్పటికి కూడా 'మోతీ' చిన్నప్పటి ముఖం, ముద్దులు మూటగట్టేట్టుండే, ఆ పసితనపు పాలమరుగులాంటి మృదుత్వంతో అమాయకత్వం తొణికిసలాడే, ఆ 'మోతీ' ముఖం కళ్లకి కట్టినట్లు కన్పించుతోంది! అసలు 'మోతీ' అనే పేరు నా కెందుకనో, చిన్నప్పట్నించీ అమితి ఇష్టంగా వుండేది. 'మోతీ' అంటే మంచిముత్యం! మంచిముత్యాలంటే నాకు, వజ్రాల కన్నా ఎక్కువ ఇష్టం! నా దుద్దులు, ముక్కుపుడకలు, మెళ్లో ఒంటిపరస హారం, అన్నీ మంచి ముత్యాలవే! పెళ్లిఅయినాక మా అత్తవారు ముత్యపు దుద్దులు, ముక్కుపుడకలు తీయించి, వజ్రాలని పెట్టారు! ముత్యాన్ని హిందీలో 'మోతీ' అంటారు! ముత్యం, ముత్యాలమ్మ, ముత్తమ్మ - ఇల్లా పేరు పెట్టి పిలుచుకోటంకంటే, మన్నితంగా 'మోతీ' అని పిలుస్తుంటే ఎక్కువ శ్రావ్యంగా వినపడుతుంది. అంచేత నాకు మోతీ అనే పేరే 'ముత్యం' అనే దాని కన్న ఎక్కువ నాజూకుగా వినపడుతుంది. చిన్నప్పుడు నా గదిలో ఒక పిల్లికి మూడు పిల్లలు పుట్టాయి. రెండు పిల్లిపిల్లలకి నల్లనల్లని మచ్చలున్నాయి. మూడో పిల్లిపిల్ల మచ్చలు లేకుండా, తెల్లగా దూదిపింజల్లే వుంది. ముందస్తుగా దానికి 'మోతీ' అనే పేరుపెట్టాము. దానిచేత వెండిప్లేటులో చిక్కని గేదెపాలు తెచ్చి నాకించేదాన్ని. కొంచెం పెద్దయినాక, మెళ్లో సన్నని బంగారు ఛాయగల పూసలు కట్టేము. అది ఎక్కడెక్కడికి తిరిగినా, రాత్రుళ్లు నా కాళ్ల దగ్గకువచ్చి పడుకునేది. తెల్లవారి లేచేప్పుడు, కాళ్లు తీసుకోబోయేసరికి మ్యావ్‌మంటూ 'గుడ్ మార్నింగ్' చెప్పేది. లేవగానే పిల్లి ముఖం చూడకూడదని, మా అమ్మ కేకలేసేది. కాని మా 'మోతీ' ముఖం చూస్తే నా కేమీ అయ్యేదికాదు. 'మోతీ' పిల్లల్ని పెట్టకపోయినట్లయితే మా ఇంట్లోనే వుండేది. కాని కొన్నాళ్లయ్యేసరికి, అది పెద్దదయి, పిల్లల్ని పెట్టింది. వాటిని తీసుకుని ఎటో వెళ్లిపోయింది. నన్ను, నా ఆదరణనీ, ఆ పిల్లలకోసం వదులుకుని, వాట్ని రక్షించుకొని పెంచుకుందుకు, మా ఇంటినించి వెళ్లిపోయింది. అది వెళ్లిపోయిన వారం పదిరోజులదాకా, నా కాళ్లదగ్గర రగ్గుక్రింద పడుకుని 'గుర్ర్' మంటోన్నట్లు నా కనిపించేది. కొన్నాళ్లుపోయేక, మా తమ్ముడు, చిన్నబొచ్చు కుక్క పిల్లని పట్టుకొచ్చేడు. తెల్లగా బొద్దుగావున్న ఆ కుక్కపిల్లకూడా చాలా ముద్దుగానే వుంది. దానికి 'మోతీ' అనే పేరు పెట్టమన్నాను నేను. 'ఛీ ఛీ! వెధవ పిల్లిపేరు నా కుక్కకి పెట్టటానికి వీల్లేదు' అన్నాడు వాడు. కాస్సేపు రాజా అనీ, మరో కాస్సేపు జిమ్మీ అనీ పిలిచేవాడు. నాకు ఆ కుక్కపిల్లన్నా సరదాగానే వుండేది. కాని నేను చెప్పినపేరు పెట్టలేదనే కోపంతో అటొచ్చీ ఇటొచ్చీ, కాళ్లతో తన్నుకుంటూ పోయేదాన్ని! అది మహారాక్షసి! కాస్త కాలు తగిలీ తగలకుండానే, కుంయి కుంయిమంటూ ఒక గంటదాకా అరుస్తూ ఇల్లంతా గిరుగారు మనిపించేసేది. దానితో మా తమ్ముడు, 'దానిపిల్లి ఎక్కడికో పోయిందని, నా కుక్క పిల్లని చంపేస్తోంది అక్క!' అంటూ గోలచేసేవాడు. ఇంకొంచెం పెద్దయినాక, మా యింటి ప్రక్కన అద్దెకు దిగిన అరవవాళ్లింట్లో, రెండు తెల్లని కుందేళ్లు వుండేవి! వాటిపేర్లు, మోతీ, జోతీ! వాటిని వదలి నేను ఒక్కక్షణంకూడా వుండేదాన్ని కాదు! కాని అకస్మాత్తుగా ఆ కుందేళ్లని, ఎవరిదో కుక్కవచ్చి చంపిపోయింది. పాపం వాళ్ల పిల్లలుకూడా చాలా బెంగపెట్టుకున్నారు. నాకూ బెంగవేసింది! నేను పెరిగి పెద్దయ్యాక గృహిణిగాకూడా మారేక,

'మోతీ మోతీ' అనే సన్నటి పిలుపు మృదుమధురమైన సంగీతంలా వినిపించింది!

అది భాద్రపదమాసం! వర్షాలు జోరుగా కురిసి వెలిసిపోయే కాలం! కాస్తలో నాలుగుప్రక్కలనించీ, నీలి నీరదమేఘాలు ఆవసోపాలుపడుతూ ఆకాశాన్నంతా అలుముకునేవి! అంతలో చిటుకు, చిటుకుమంటూ సన్నసన్నటి జల్లులుగా మొదలయిన వర్షం, క్షణంలో కుంభవృష్టిగా కురిసిపోయేది! కురిసీ కురిసీ విసుగెత్తిపోయిన మేఘాలు, తమ మనస్సుల్లోని బరువునంతా కన్నీటితో క్షాళితం చేసుకున్న వ్యక్తుల్లా, తేలికగా, తెల్లబోయి, సూర్యకాంతి వెచ్చదనానికి కరిగిపోతూ చిన్నచిన్న దూదిపింజలల్లె గాభరాగా అటూ ఇటూ ఆకాశాన్నిండా పరుగులెత్తుకునేవి! అంత క్రితంరోజు రాత్రి సినిమాచూసి రావటంనించి, ఉదయం ఏడుగంటలయినా, నేను ప్రక్కమీంచి లేవకుండా, అల్లానే దొర్లుతున్నాను. ఇంతలో 'మోతీ, మోతీ' అనే పిలుపు క్రింది వాటాలోంచి వినిపించింది! ఆ పిలుపు నా చెవిని సోకగానే, నా నిద్ర బద్ధకం అంతా ఒక్కక్షణంలో ఎగిరిపోయింది!

మేము వుండేది మేడమీద చివరిభాగంలో! మేడమీద మేముకాక, మా ఇంటియజమాన్లు కూడా వుంటున్నారు. మేడక్రింద వరసగా నాలుగయిదు వాటాలు వున్నాయి! నాలుగయిదు కుటుంబాలవారు అందులో వుంటున్నారు. సాధారణంగా అవి ఎప్పుడూ ఖాళీగా వుండవు! ఒక సంసారం ఖాళీచేస్తారని తెలియగానే ఇంకో కుటుంబంవచ్చి దిగిపోతూవుంటారు! అసలు ఖాళీచేయకుండానే ఎడ్వాన్సులు పుచ్చేసుకుంటూ ఆ ఇంటి వాటాలను, వాగ్దత్తం చేస్తూవుంటారు మా ఇంటివారు! మేము ఆ మేడలోకివచ్చి రెండేళ్లు దాటుతోంది! మేము అక్కడ వుంటూండగానే, ఆ క్రింది వాటాలలో అయిదారు కుటుంబాలు మారటం జరిగింది! ఆ మేడకి మేమే పాతకాపుల మయ్యాము అన్నమాట! 'మోతీ' అనే పేరు వినగానే, 'మళ్లీ' ఏదో కొత్తసంసారం, క్రింది వాటాలోనికి వచ్చివుంటుందని వూహించాను. లేచి మంచం నడుంగా కూర్చొనే కిటికీలోంచి క్రిందకు చూశాను. మేము వుండే మేడకి పెద్దకాంపౌండూ, గేటూ వున్నాయి. ఒకమూలగా రెండు కుళాయి లున్నాయి! కాంపౌండుఅంతా నాలుగయిదు బాదంచెట్లూ, నాలుగయిదు రాచవుసిరిచెట్లూ, రెండు పొన్నచెట్లూ వుండి నీడగా వుంటుంది. బాదంచెట్ల మొవ్వలనిండా, నల్లని పెద్దచీమలు ఏకాలమూ పాకుతూవుంటాయి! వానవచ్చి వెలిసినాక పొన్నపూలు అన్నీ తడిసి రెక్కలూడిపోయి క్రిందికి రాలిపోతాయి!

రాచవుసిరి చెట్లమీద చేరిన కాకులూ, పిచ్చికలూ, ఒకటే రణగొణ ధ్వనిచేస్తూ, నసిరికాయలన్నీతెంపి క్రిందపోస్తూ వుంటాయి. పెరడు అంతా ఎండిపోయి రాలిపోయిన బాదం, పొన్న ఆకులతో నిండిపోయి, గత్తరగా వుంటుంది. సాయంకాలాలు క్రింది వాటాల్లోని పిల్లలూ, వాళ్ల స్నేహితులయిన ఇరుగు పొరుగు ఇళ్లల్లోని పిల్లలూచేరి గోలగోలగా అరుస్తూ, ఆటలు ఆడుకుంటూ వుంటారు. అప్పుడప్పుడు, క్రింది వాటాల్లోని ఇల్లాళ్లు ఆ చెత్త ఆకుల్ని వూడ్చి కుప్ప పెట్టి అంటించి, దానిమీద ఒక కుండెడు నీళ్లు కాచుకొంటూ వుంటారు. గాలి వేసినప్పుడు ఆ బూడిదంతా ఎగిరి పెరడంతా పరుచుకుంటూ వుంటుంది. క్రితంరాత్రి చివరి ఝాములో వర్షం కురిసినట్లుంది. ఆకాశం అంతా, శుభ్రస్నాతలా, నీలంగా నిగనిగలాడుతోంది! చెట్ల ఆకులన్నీ ముదురాకు పచ్చగా, చేయితిరిగిన చిత్రకారుడు రచించిన తడియారని, వర్ణప్రకృతి చిత్రంలోలా పచ్చిగా కళ్లకి చల్లగా కన్పించుతోన్నాయి!

ఆ సుప్రభాత సమయాన్ని, ఆ పెరట్లో ఒక మూలగా, కుళాయివద్ద ఇత్తడిబాల్చీతో నీళ్లుపట్టుకుంటోన్న—పది ఏళ్లపైగా వుండవచ్చు అనుకునే పిల్లమీద నా దృష్టి పడింది! ఆ పిల్ల గోధుమరంగుగా వున్న చిన్నలాగూ వేసుకుంది. అంతకన్న వేరేబట్ట ఆ పిల్లవంటిమీద లేదు. ఆ లాగూకూడా నీళ్లు జేరవేయటంనించి, తడిసిపోయి, పిక్కలకి అంటుకుపోయింది. పిల్ల చక్కగా గుండులాగుంది. చామనచాయలో గుండ్రటిముఖం! పెద్దపెద్ద కళ్లు. తీరైన ముక్కు, బుల్లిమందారమొగ్గలాంటి నోరు. ముద్దుగా వుంది! గుండ్రంగా బలంగావున్న తొడలకి అంటిపెట్టుకునున్న ఆ లాగూ ఆ పిల్లకి నడుందాకా రాలేదు! బొడ్డుక్రిందకి మాత్రమే సరిపోయింది! ఆ పిల్ల బాల్చీ నింపుకుని, రెండు చేతులతో ఎత్తిదింపుతూ,

ఎత్తలేక దింపుతూ దింపుతూనే ఎల్లావో చివరి వాటా లోనికి నీళ్ళు జేరవేస్తూంది. అరగంట గడిచేసరికి ఆ పిల్లపేరే మోతి అని నిర్ధారణ అయిపోయింది! నాకు ఆ పిల్లని చూస్తుంటే పారిపోయిన తెల్లపిల్లి, తెల్లకుక్క జిమ్మీ, తెల్లని కుందేలు పిల్లలూ జ్ఞాపకానికి వొచ్చాయి! చక్కగా ఆరోగ్యంగావున్న పిల్ల! అందమైన పేరు!

మోతీ నీళ్ళు పట్టుకుంటూ వుండగా ఇంకా ముగ్గురు నలుగురు పిల్లలు, అంతకు మునుపు నేను చూడని పిల్లలు, మోతీవద్దకుచేరి కబుర్లు చెబుతున్నారు. మోతీ కళ్ళు పెద్దగా గుండ్రంగా వుండి, చూసే వాళ్ళకి జాలి చూపులు చూస్తున్నట్లు కనిపించేవి! మధ్యాహ్నం భోజనాలయినాక, నేను క్రిందికి వెళ్ళి 'మోతీ'ని పలుకరించాను. మోతీ వాళ్ళింట్లో నేను వెళ్ళేసరికి పరిచయం చేసుకోదగ్గంత పెద్ద సభ్యులెవరూ లేరు! మోతీతో నలుగురు పిల్లలు మటుకు వున్నారు!

నలుగురు పిల్లలూ ఎనిమిదినించీ, మూడు ఏళ్ళ వయసులో వున్నారు. మోతీ వాళ్ళకి పెద్దదిక్కన్నమాట! ఆ పిల్లల తల్లి ఇందిరమ్మ, తండ్రి రాజారావూకూడా ఏవో ఆఫీసుల్లో ఉద్యోగాలు చేస్తున్నారట! ఇందిరమ్మకి 'మోతీ' ఎక్కడ్నో దూరపు వరస మేనకోడలు అవుతుందిట! మోతీ తండ్రి ఏదో ఆఫీసులో ప్యూన్‌గా వున్నాడట! ఎనమండుగురు పిల్లలున్న కుటుంబంలో 'మోతీ' ఆరో ఆడపిల్ల! కడం వాళ్ళిద్దరే, మోతీ తల్లిదండ్రులుకి మగపిల్లలు! 'మోతీ' చాలా కలుపుగోలుతనంగా వుండేది. ఇందిరమ్మ పిల్లలచేత శుభ్రంగా పళ్ళుపెట్టి వళ్ళు తోమి స్నానాలు చేయించేది. ఏ పూట కాపూట ఆ పిల్లల బట్టలన్నీ ఉతికి ఆరవేసేది! పిల్లల పోషణంతా మోతీయే చేసేది! ఇంట్లో అంట్లగిన్నెలు తోమటం, నీళ్ళు జేరవెయ్యటం, కూరా నారా తరిగి ఇవ్వటం, భోజనాలయ్యాక ఎంగిలి పళ్ళేలూ, గిన్నెలూ కడగటం—ఒక పనేమిటి? ఇల్లు సర్వమూ ఆ పిల్లే చక్కబెట్టేది! ఇందిరమ్మ సన్నగా పొడుగ్గా, రివట లాగుండేది! నూట యాభయి రూపాయిలు దాకావచ్చే వుద్యోగం ఏదో చేసేది! రాజారావుకికూడా రెండు వందలదాకా వచ్చేది! ఏవేవో కాంపులుండే వుద్యోగం చేసేవాడు! మనిషి పొడుగ్గా దృఢంగా పచ్చగా వుండే వాడు. అతని ముందు ఇందిరమ్మ ముక్కుతూ మూలుగుతూన్నట్లు, తోస్తే పడిపోయేట్లు వుండేది! అసలే చామనచాయరంగు ఇందిరమ్మది! ఆ పయిన సన్నటి నాజూకు వళ్ళు! దృఢమైన రాజారావుముందు ఇందిరమ్మ తీసికట్టుగా వుండేది! పిల్లలూ నలుగురూ సామాన్యంగా వుండేవాళ్ళు. అంత జనముద్దయిన పిల్లలుకారు! ఆ కుటుంబానికంతటికీ, మంచి బట్టలు ధరించలేకపోయినా కడిగిన ముత్యంలా, 'మోతీ'యే ఆకర్షణీయంగా కనిపించేది!

మోతీకి నా వద్ద బాగా చనువయిపోయింది. ఇందిరమ్మకూడా అప్పుడప్పుడు మేడమీదకువచ్చి నాతో నాలుగు కబుర్లుచెప్పిపోతూ వుండేది! ఇందిరమ్మకి అస్తమానూ 'మోతీ' గురించి పొగడటంతోనే సరిపోయేది!

'ఏదో చిన్న పిల్లది అయినా ఇల్లంతా సర్దుకుని వస్తున్నది వదినగారూ! అది వున్నది కనుక, నేను, నలుగురు పిల్లలున్నా, బయటికిపోయి వుద్యోగం చేసుకురావటానికి వీలవుతున్నది! అన్నిపనులూ నా చేతిలోని అందుకుని చేసుకుపోతుంది!' అనేది.

ఇంకోసారి 'మోతీ పెళ్ళి బాధ్యత మాదే వదినగారూ! ఇంతలా ఇల్లు దిద్దుకునే ఆడపిల్ల ఎవరున్నారు? ఈడేరగానే, రెండు మూడు వేలు ఖర్చుపెట్టి అయినా, నాలుగు డబ్బులు వెనక వేసుకున్న వాడికిచ్చి కట్టబెడతాం!' అనేది. 'మోతీ' మీద ఇందిరమ్మకి అపాయకరమైన వాత్సల్యమూ, నమ్మకమూ వుండేవి!

ఇందిరమ్మ ఇల్లా అస్తమానూ మోతీని పొగుడుకుంటూ కబుర్లు చెప్పేదా? మోతీమటుకు ఇందిరమ్మమీద ఏ మాత్రం మంచి కబుర్లు చెప్పేది కాదు! మోతీకి వున్నవి పదకొండేళ్ళయినా పాతికేళ్ళు పైబడిన పడుచు కబుర్లలా ముదిపాపసానిలా మాట్లాడేది!

'మా అమ్మతో నాకు పై చదువులు చెప్పిస్తానని చెప్పి తీసుకొచ్చింది! తీరా ఇక్కడకు వచ్చేక, వున్న పనిమనిషిని మానిపించేసి ఆ దాసీ పనులన్నీ నాకంట గట్టింది! తీరా వచ్చేక పనులు చేయలేనని, మొరా

ఇంటకు కూర్చుంటే బాగుంటుందా చెప్పండి!' అంది.

'నువ్వెంతవరకు చదువుకున్నావు?' అడిగాను.

'మా వూళ్లో వీధిబడిలో అయిదో క్లాసు వరకూ చదువుకున్నాను. తనకి సాయితాగా ఒక పిల్ల కావాలనీ, నాకు ఎంతవరకు చదువుకోవాలని వుంటే అంతవరకూ తను చదువు చెప్పిస్తానని, మా అమ్మతో చెప్పింది! ఇక్కడికివచ్చి ఏడాదిపైన అయిందా? నా చదువు వూసే ఎత్తటం లేదు మా అత్త!' అంది మోతీ.

మోతీ జుట్టు పొత్తుగా ఎర్రగా వుండేది భుజాలమీదికి పడేట్లు కత్తిరించి వుండేది!

'ఎదగనిస్తే పొడుగాటి జడ అవుతుంది నీకు. అదేం అల్లా పొట్టిగా కత్తిరిం చేసుకుంటావు?' అన్నాను ఒకసారి.

'మా అత్త తలకు రాసుకుందుకు నూనె వారానికోసారన్నా ఈయదు! జుట్టు పొడుగు పెరుగుతే నూనె ఎక్కువ పీలుస్తుందని జుట్టు పొట్టిగా కత్తిరించేసుకోమంటుంది! నేను కత్తిరించుకోక పోతే తనే కత్తిరించేస్తుంది! నాకు పెద్దజెడ వేసుకోవటం సరదా! మా అక్కలకయితే మోకాళ్ల దాటేవరకూ పెద్దపెద్ద జడలున్నాయి!' అంది పాపం.

చిన్నపిల్లని చదువు చెప్పిస్తానని ఆశలుపెట్టి తీసుకువచ్చి, ఇంటి పనుల్లో రాచిరంపాన్న పెట్టటం నాకు అశాంతి కలిగించింది! విరియని గులాబీ మొగ్గ లాంటి మోతీకి, అంట్లుతోమటం, బట్టలుతకటం లాంటి బండపనులు చెప్పగలిగిన దాష్టీకం పీలగా రోగిష్ఠిలావుండే ఇందిరమ్మకి, నలుగురు పిల్లల్ని కన్న పిల్లల తల్లి ఇందిరమ్మకి ఎల్లా కలిగిందో నా కాశ్చర్యం కలిగించింది! మోతీ జాలి గొలిపే చక్రాల్లాంటి కళ్లచూపులు, ఎప్పుడూ తడి ఆరకుండా అప్పుడే విచ్చుకున్న పారిజాతపు పూవులాంటి మృదువైన మోతీ లేత శరీరం, నా గుండెల్లో బలంగా చెరగని ముద్రవేసుకుని అహోరాత్రాలు నన్ను వెంటాడేవి! నాది ప్రయోజనంలేని సానుభూతి కాకూడదు! నా అంతట నేను మోతీకోసం, నా తీవ్రమైన పేరుగల మో కోపం ఏదన్నా సాయం చేయగలగాలి అన్న పట్టుదల నా నరనరాల జ్వలించి పోయింది!

'ఇందిరమ్మ మన మనుకున్నంత మంచి మనిషి కాదు!' ఒకనాడు ఆయన భోజనం చేస్తుండగా నాంది ప్రస్తావనగా అన్నాను.

'ఏం! వుద్యోగం చేస్తోందనా?' అన్నారు.

నాలాంటి, ఇంట్లో కూర్చునే ఇల్లాళ్లకి (ఆయన దృష్టిలో కూపస్థమండూకాలు) బయటకు వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకోగలిగిన చదువుకున్న ఇల్లాళ్లంటే జెలసీ పుట్టుతుందని, మా ఆయన అభిప్రాయం! (చాలామంది మగమహారాజుల కదే అభిప్రాయం కలగొచ్చును.)

'ఛ! ఛ! అది కాదు. పాపం, మోతీని చూడండి! చదువు చెప్పిస్తానని తీసుకొచ్చిందిట! ఆ వంకతో ఆ పిల్లని తీసుకొచ్చి ఇక్కడ ఆమెగారు నేర్పిస్తున్న విద్య ఏమిటో చూశారా? అంట్లు తోమటం, పిల్లల్ని కనిపెట్టుకుని వుండటం! చూడండి! ఎంత అన్యాయమో!' అన్నాను.

'అన్యాయ మేమిటి పిడివాదం! అదీ ఒక చదువే! హోంసైన్సు అన్నమాట! రేప్పొద్దున్న ఆ పిల్ల పెద్దదయితే పనిమనుషుల్ని భరాయించాల్సిన అవసరం లేకుండా ఇల్లంతా దిద్దుకోగలదు! ఇంటి విషయాలకి పనికిరాని చదువు లెందుకు? డిగ్రీ లెందుకు? స్క్వ్యేర్‌వాచీలు, రెండు జడలూ, నైలాన్ చీరలూ కట్టుకుని తిరగటానికా! ఈ విషయంలో ఇందిరమ్మ గారిని అభినందిస్తున్నాను!' అన్నారు. నాకు చిరాకెత్తుకొచ్చిన మాట నిజం!

'తలకు రాసుకుందుకు నూనె కూడా ఈయదట! నూనె ఎక్కువ అవుతుందని, జుట్టు కత్తిరించేసుకోమంటుందిట! పాపం మోతీకి చదువుకోవాలని ఆశ! కాని ఆ పిల్లకి ఇంటిచాకిరే సరిపోయే! ఇంక చదువుకుందుకు తీరికెక్కడుంటుంది?' అన్నాను జాలిగా.

'భేష్! పొదుపుచేయటం ఇందిరమ్మ దగ్గరే నేర్చుకోవాలి! ఏ తలనూనె సీసా ఖరీదు చూసినా ఆరూ, ఏడూ రూపాయిలు పెడితేకాని రావటం లేదు! బాబ్డ్‌హెయిర్ అయితే, ఈ నూనె ఖర్చు తగ్గుతుంది! అప్టుడేటుగానూ వుంటుంది!' ఏమి

ఐడియా! ఆమె తెలివితేటలకి ఆర్థిక మంత్రిణి అవ్వొచ్చును. కాని జాతకం కలిసిరావటం లేదు కాబోలు! నువ్వా వున్నావు! వున్నజుట్టు చాలక, తెగబారెడు నవరానికి కూడా పూస్తూ వుంటావు నూనెని! నీ తలకి నూనె రాస్తే జుట్టు పెరుగుతుంది అనుకోవచ్చును! నవరానికికూడా నూనె పూస్తూవుంటావు దేనికి? ఆ జుట్టుకూడా పెరుగుతుందా! అహా! నాకు తెలీక అడుగుతున్నా!' ఆయన తీరు ఇది! ఆ వేళాకోళానికి నాకు ఏడుపు వచ్చినంతపని అయ్యింది. కాని కార్యార్థినై వున్నాను కనుక కళ్లమ్మట గిరుమని తిరగబోయే కన్నీరుని కళ్లల్లోనే ఇంకించుకొందుకు ప్రయాసపడి సాధించాను. ఒక్కక్షణం వూరుకుని మళ్లీ అన్నాను:

'పాపం! మోతీని చూస్తే జాలివేస్తూంది! హాయిగా ఆడుతూ పాడుతూ పెరగాల్సిన పిల్ల కదా! ఆ వయస్సులోనే తన పొట్ట తాను పోషించుకుందుకు కష్టపడి పనిచేయాల్సివస్తోంది. నలుగురు పిల్లల్ని నెత్తిదిద్దుకుంటూ, ఆ పిల్ల ఇంకేం చదువుకుంటుంది? అంచేత పోనీ మనింట్లో వుంచుకుందామనివుంది! మనింట్లో అయితే ఇద్దరమే కాబట్టి పని తక్కువగా వుంటుంది! తీరికవేళల్లో చదువు నేనైనా చెప్తాను. కొంచెం స్టాండర్డు పెరిగాక, ప్రయివేటుగా ఏ థర్డ్‌స్టాండర్డ్ పరీక్షకో కట్టించవచ్చును! అల్లా దాని భవిష్యత్తుకి ఒక బాట ఏర్పాటుచేయవచ్చును! ఏమంటారు?' బితుకు బితుకుమంటూ నా మనసులోని మాట చెప్పాను. ఆయన ఫక్కుమని నవ్వారు.

'పిచ్చిదానా! నువ్వు ఒకర్తివీ ఎంతమందిని ఉద్ధరించగలవు? అంత దయగా తీసుకువచ్చి, తన పిల్లలతో సమానంగా పెంచుకొస్తూన్న ఇందిరమ్మ మీదే అది చాడీలు చెప్పుకొచ్చింది! ఇప్పట్నించీకూడా ఆ పిల్లకి తప్పిచూచి అందరూ జాలిపడాలి అనే మనస్తత్వం బాగా పేరుకొంది! నీవయినా, నీ ఇంటి పనులు చేయించుకుని; ఇంత తిండి పడేయగలవుకాని, నీ ఐశ్వర్యానికి దత్తత చేసుకుంటావా? ఇందిరమ్మ మీద చాడీలు చెప్పినది, నీ విషయమటుకు చెప్పదని రుజువు ఏమిటి! ఆ పిల్లకి యజమాని స్థానంలో వుండి నీవు చేయగల ఉపకారంకంటె, ఇల్లా పరోపకారంగా, సానుభూతిగా చేయగల ఉపకార మేదైనా వుంటే చేయి! యజమానిస్థానం నువ్వు తీసుకున్న మర్నాడు, ఆ పిల్ల మనసులో నీ పట్లవున్న కృతజ్ఞత మాసిపోతుంది! ఆ పిల్ల కళ్లకి నీవు మరొక ఇందిరమ్మలా కనిపించుతావు. అంతే!' అన్నారు. మోతీని మా ఇంట్లో వుంచుకోవటం ఆయనకి ఇష్టం లేదని తేలింది.

'రోజూ మధ్యాహ్నంపూట పంపుతూండు మోతీ! ఎక్కాలూ హిందీ నేర్చుకుందుకాని!' అన్నాను. అప్పట్నించి మోతీ రోజూ మధ్యాన్నం మా ఇంటికి వచ్చేది. మొదట్లో ఒకటి రెండు రోజులపాటు, నాలుగోఎక్కం, హిందీలో క గుణింతం శ్రద్ధగా చదివి దిద్దుకునేది. రానురానూ తనకి అవి రావటంలేదనీ, ఇంట్లో పని తీరటంలేదనీ, చదువుకోవటం ఎగగొట్టేది! మా ఇంట్లో ఏవన్నా ఫలహారాలు చేసుకుంటే పెట్టేదాన్ని! మేడ దిగకుండానే తినేసేది! నలుగురు చిన్నపిల్లలున్నారుకదా—వాళ్లకి కాస్తన్నా పెట్టేదికాదు!

'వాళ్లా పసివాళ్లకదా! వాళ్లని కూడా పిల్చిపెట్టు!' అనేదాన్ని.

'వాళ్లకేం మాయరోగమా! పీకనిండా అన్నం తిన్నారా? వాళ్లమ్మ వాళ్ల ఫలహారాలకోసమని అర్ధరూపాయి ఇచ్చివెళ్తుంది రోజూనూ! నేను కాని పెడుతున్నాగా!' అనేది. నా అంతట నేను ఏదో ఒకటి చేసిపెడుతూనే వుండేదాన్ని! అదికాక రోజూ ఏదో వకటి అప్పులు పట్టుకెళ్తూ వుండేది. ఒక పావు మైదా అనీ, ఇంకో పావు శనగపిండి అనీ, ఒక గిన్నెడు డాల్డా అనీ, ఇల్లా రోజూ ఏదో ఒకటి ఇందిరమ్మ ఇమ్మన్నదని అడిగి పట్టుకువెళ్తూవుండేది! కొన్నికొన్ని సామాన్లు తిరిగి ఇచ్చేది. కొన్నిసామాన్లు తిరిగి ఇచ్చేదికాదు!

'మోతీ' వాళ్లు ఆ ఇంటికి వచ్చేక, మేము ఆ వూళ్లో ఆరునెలలు మాత్రమే వున్నాము. మా వారికి ట్రాన్స్‌ఫర్ అవటంనించి మేము ఇంకో వూరు వెళ్లిపోయాము. మేము వెళ్లిపోతూంటే 'మోతీ' దిగాలుగా నించుంది. నేను అయిదు రూపాయలు ఆ పిల్లచేతిలో పెట్టాను!

రెండేళ్లు గడిచాక మా బంధువుల ఇంట్లో

పెళ్ళిఅయితే, ఆ వూరు వెళ్ళటం తటస్థించింది. అప్పుడు మేము వుండే ఆ మేడకి కూడా వెళ్ళేను. మా ఇంటావిడ నన్ను చాలా మర్యాద చేసింది. ఆమెని 'మోతీ' గురించి అడిగాను. ఇందిరమ్మ వుద్యోగం మానేసిందట! రాజారావుకి మంచిప్రమోషన్ వచ్చిందిట! రెండునెలలు క్రితమే ఇంకోవూరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళారుట! ఇంటావిడ చెప్పారు.

'మోతీ బాగా వుందా? బాగా ఎదిగివుంటుందనుకుంటాను' అన్నాను.

'బాగా పొడుగెదిగింది! వోణీలు వేసుకుంటోంది! ఆ ఇందిరమ్మ ఎంత బాగాపెట్టినా, అదేం ఖర్మమోకాని, ఆ పిల్ల ఇరుగిళ్ళకి పొరుగిళ్ళకి వెళ్ళి అవి లేవు, ఇవి లేవు అని అడిగితెచ్చుకోవటం మానేది కాదు! ఆ ఇందిరమ్మ ఎంతో దేవులాడేది పాపం!' అంది ఇంటావిడ!

'ఎదిగే పిల్లకదా! సహజంగా ఆరోగ్యవంతమయిన పిల్ల! ఆకలికి ఆగలేక అడిగివుంటుంది!' అన్నాను. ఏది పెట్టినా అవురావురుమంటూ తినేసే జాలికళ్ళ మోతీ నా గుండెల్లోంచి ఒక్కసారి తొంగి చూసింది!

'ఇందిరమ్మ అంత కక్కుర్తి మనిషి కాదువ్మండీ! కడుపునిండా తన పిల్లలతో సమానంగా పెట్టేది భోజనం! అయిదు గురికీ సరిపడగా మధ్యాహ్న ఫలహారాలకి డబ్బు లిచ్చేది! ఇది ఏంచేసేదో తెలుసునా! ఆ డబ్బులన్నీ పెట్టి తను కడుపునిండా, హోటల్లోపడి మెక్కేసేది! ఒక అణావో, బేడోపెట్టి కారపుశనగలో, వేరుశనక్కాయలో కొని, ఆ పిల్లల ముఖాన్న పడేసేది! ఆ కుర్రవెధవలు అవే నములుకుంటూ కూర్చునేవారు! పిల్లల్ని సినిమాలకి తీసుకవెళ్ళమని డబ్బులిస్తే, ఆ డబ్బులూ అల్లానే తను తినేసేది! సినిమా వదిలే టయిమయిందాకా ఏ పార్కులోనో పిల్లల్ని పెట్టుకుని కూర్చుని సినిమాహాలు లోంచి, జనం బయటకు రాంగానే తనూ పిల్లలని తీసుకునివచ్చేది! కొంచెం జ్ఞానం తెలిసిన పెద్ద పిల్లలు, అమ్మతో చెబ్తామనిఅంటే, వాళ్ళని గిల్లి రక్కి హింసించేది! దానికి భయపడి, ఆ పిల్లవెధవలు కిక్కురుమనేవారుకారు! పైకి అల్లా వుంటుంది కానీ, 'మోతీ' పుత్త వాలిముచ్చుముండ!' అన్నారు.

ఆవిడ 'మోతీ'ని అల్లా విమర్శిస్తూంటే నాకు కష్టం తోచింది! 'మోతీ' అమాయకపు పిల్ల! రోజల్లా చాకిరీ చేసేది కనుక, కాస్త ఆకలి ఎక్కువగానే వుండి వుంటుంది! దానికి ఇంత కఠినమైన మాటలు పడాలా!

'అన్నీ తెలివితేటలున్న పిల్లలా కన్పించేది కాదండీ మోతీ!' అన్నాను బాధగా. కుర్రపిల్ల కడుపాకలికొద్దీ ఏదో తింటే, దానిని నీచబుద్ధి క్రింద జమచేస్తారా! ఆకలి ఎరుగని ఆజీర్తి వ్యక్తులు?

'అమ్మమ్మ! అది రావణాముండనమ్మండీ! దాని దెంత ఆకలో! దానిది కడుపో, కాళింగ మడుగో కాని, ఒక్కరోజన్నా ఆ పిల్లవెధవలకి సరయిన ఫలహారం తెచ్చిపెట్టేదికాదుకదా! ఆ పిల్లలు సరయిన పోషణలేక 'గీరుగారు'మంటూవుంటే, ఇది తెగతిని రోజురోజుకీ అడివిపందిలా బలిసిపోయేది! ఇంక ఈ ముండ ఎదిగాక, ఆ రాజారావు ఇందిరమ్మకన్న పెందరాళే ఆఫీసునించి ఇంటికి రావటం ప్రారంభించాడు! పెద్దజెడా, ఛాతీమీదకు సగానికి తక్కువ వెడల్పుగా వోణీ వేసుకుని, మామయ్యగారూ, మామయ్యగారూ అంటూ అతగాడి కూడా తిరుగుతూంటే నాకు మాచెడ్డ సిగ్గేసేది!'

'మీ కెందుకు మధ్యన సిగ్గు?' అందామనుకుని నాలికని కట్టేసుకున్నాను.

'మా రాజాగాడు ఇంట్లో వున్నాడంటే చాలు! జడ ముందుకువేసుకుంటూ చకచకా మేడమీదకు వచ్చేసేది! వెధవకళ్ళు జాలిగా త్రిప్పుకుంటూ మాట్లాడుతూంటే వయసులో మగపిల్లలు వలలో పడటం ఎంతసేపు చెప్పండి! అందులో ఈ సినిమాలు చూసారా! ఎంతసేపూ ప్రేమించుకోడాలూ, తోటలమ్మటా, దొడ్లమ్మటా ఒకళ్ళవెంట ఒకళ్ళు పరుగులు పెట్టుకుంటూ కెవ్వుమంటూ పాటలు పాడుకోడాలూతప్ప, కాస్త నీతీ నియమాలూ చెప్పేవి ఏమన్నా వున్నాయా! ఇందిరమ్మతో కచ్చితంగా చెప్పేసేను! 'నీ వుద్యోగం వూళ్ళే—! ముందు నీ భర్త సంగతి చూసుకోవే, పిచ్చిరండకానా! నాలుగు రోజులు గడిచాయంటే, నువ్వూ, నీ

పిల్లలూ, నా బొందో అంటూ రోడ్డట్టుకుని బయటకు పడవ్వాలసిందే! ఈ సంసారం అంతా 'మోతీ మహల్' అయిపోతుంది, నన్ను కానుకో కుంటేను.' అని చెప్పాను. దానితో ఇందిరమ్మ వుద్యోగానికి రిజైన్ ఇచ్చేసింది. ఇక్కడ్నుంచి వెళ్లే సరికి ఇంకా మోతీ వదలలేదు వాళ్ళని. ఇప్పు డింకా వుందో వెళ్ళిపోయిందో మరి!' అన్నారు ఇంటావిడ. నేను ఎంత గింజుకున్నా నా మనోయవనికమీద, ఆకలి చూపుల పెద్దకళ్ళు, పదకొండేళ్ల 'మోతీ'యే కాని, యవ్వనాన్ని నింపుకుంటూ, కోర్కెలవెంట పరుగులు తీసే చైతన్యమూర్తియైన 'మోతీ' వచ్చి నించో లేకపోయింది!

తర్వాత నాలుగయిదు సంవత్సరాలు గడిచాయి. మేము ఈలోగా రెండు మూడు వూళ్లు మారేము. ఒకసారి మేము ఎక్కడ్నించో వస్తోండగా, బస్సు స్టాండ్‌లో కనిపించింది మోతీ. ఎర్రటి ఫోకబారు ముతకచీరలోవున్న మోతీని నేను గుర్తుపట్టలేదు! తను నన్ను గుర్తుపట్టి పలకరించింది. 'బాగున్నారా రాధమ్మగారూ! నేను మోతీని! మర్చిపోయేరా?' అంది. నేను గుడ్లప్పగించి నిలబడ్డాను. 'మోతీ' జుట్టు పత్తుగా, మోకాలిమడతదాటి పెరిగింది. చెవులమీదకు కప్పేట్టు జుట్టుజార్చి, వదులుగా వాల్జడ వేసుకుంది. తలనిండుగా చామంతి పూలున్నాయి. అయిదడుగుల నాలుగంగుళాల పొడు గెదిగింది! గుండ్రటి జబ్బలతో, చేతికి కంటికి నిండుగావుంది మోతీ!

'కులాసాగా వున్నావా? మీ అత్తయ్యగారూ పిల్లలూ బాగున్నారా? ఇప్పు డేవూళ్లో వుంటున్నారు?' అని అడిగాను.

'ఆఁ! అంతా బాగున్నారు. పిల్లలంతా స్కూళ్లల్లో జేరారు. ఇందిరమ్మ ఉద్యోగం మానే సింది! రాజారావుగారికి ప్రమోషన్ వచ్చింది! ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చున్నాక, మా అత్తయ్యకి భలే అనుమానం పిచ్చిపట్టుకుంది! ఈ చిత్రం చూడండి రాధమ్మగారూ! మా అత్తయ్యకి అను మానం ఎక్కువయి నన్ను కూర్చున్నా నించున్నా ఒకటే సాధించిపోసేది! మా మావయ్యగారికి చూడ బోతే షేవింగ్ సెట్ దగ్గర్నించి, బూట్ల పాలిష్ చేయటంనించి, బాత్‌రూంలో సోపూ, టవలూ పెట్టటంనించి, అన్నీ నేనే చేయవాల్సివచ్చేది! ఒక్క క్షణం, తను ఆఫీసునించి రాగానే నేను ఎదురుగా కనపడకపోతే 'మోతీ ఏది?' అంటూ అడిగేసేవారు! పోనీ ఆయనకి కావాల్సిన పనులన్నీ ఇందిరమ్మత్త చేసుకోగలదా అంటే - మూడుకాళ్ల ముసలమ్మలా కూర్చున్నచోటినించి లేవలేకుండా వుండేది! చలాకీగా నాలుగు పనులూ చిన్నప్పట్నించీ చేసివున్నదాన్నికనుక, ఆయనకి ఏమి కావాల్సవచ్చినా, నన్ను పిలిచేవారు! దానితో మా అత్తమ్మ వూహ రుంజాకుపోయేది! చివ రికి ఆ అనుమానం ఎక్కువయిపోయి, నన్ను పని లోంచి తీసేసింది! చూడండి! ఆ ఇల్లాలు చదువు చెప్పిస్తానని కొన్నాళ్ళు, మంచిసంబంధం చూసి పెళ్లి చేస్తానని కొన్నాళ్లు బురిబుచ్చికాలమాటలు చెప్పి, నాచేత అడవాచాకిరీ అంతా పైసా ఖర్చుచేసి పైమనిషిని పెట్టుకోనవసరంలేకుండా చేయించు కుంది. చివరికి ఇంట్లోంచి పైసాఅన్నా చేతులో పెట్టకుండా వెళ్లగొట్టేసారు!'. దీనంగా అంది మోతీ!

'మరి ఇప్పుడెక్కడుంటున్నావు? మీ వాళ్లింటికి వెళ్లిపోయేవా?' అన్నాను.

మోతీ నవ్వింది! ఆమె కళ్లు తళతళా మెరిసాయి!

'మావాళ్లింటికి వెళ్లి ఏం బావుకుంటాను? నాపయిన అయిదుగురక్కలున్నారు! వాళ్లకే ఒకదారి చూపలేక మావాళ్లు తంటాలు పడుతోంటారు! ఇక నేనుకూడా వెళ్లి వాళ్ల నెత్తిమీద కెక్కటం ఎందుకు? ఒకపూటవుంటే ఇంకోపూట పస్తులు పడుకుంటారు వాళ్లు! మా నాన్న ప్యూన్ వుద్యోగం లోంచి రిటైరయినాడుట! వాళ్లకి కడుపులు నిండ టానికి రూపాయలు మూటలు కట్టుకుని కూర్చో లేదుకదా! మా అక్కలు ఎవరిళ్లల్లోనో పనికి కుదురుకునివుంటారు! ఇక్కడ నేనేదో చదువులు చదువుకుని వుద్యోగస్థురాలి నవుతానని, వాళ్లు వూహించుకుంటారు. నా కిక్కడకు వచ్చినందువల్ల వంటబట్టిన విద్య అంట్లు తోమటం, బట్ట లుత కటం! అలవాటు అయిన సంస్కారం, ఏదో ఒక విధంగా కడుపు నింపుకోటం! ఈ నిజ జీవితం

వాళ్ళకి తెలియనిచ్చి, నేనున్నా సుఖపడుతున్నానన్న వాళ్ళ భ్రమని ఎందుకు మట్టిచేయాలి?' అంది మోతీ !

నిజంగానే మోతీ చాలా ఎదిగిపోయిందనిపించింది నాకు ! వాస్తవిక జీవనానికి ప్రతీక మోతీ !

'అయితే మరి ఎక్కడుంటున్నావ్ !' అన్నాను.

నల్లగా పొడుగ్గా వున్న మనిషి ఒకడువచ్చి, అరటిపళ్ళు చామంతిపూలూ వున్న ప్లాస్టిక్ వైర్ సంచీ ఒకటి మోతీ చేతికిచ్చి

'ఇంకా బస్సువచ్చేది కావడం లేదా!' అంటూ నించున్న చోటనే తుపుక్కుమని నమలుతూన్న కారా కిళ్ళీని వుమ్మేశాడు. డబ్బులాంటి క్రాఫింగ్! నల్ల కళ్ళద్దాలు! చారల పైజామాలోనుంచి అల్లిక బనీను కన్పబడుతోన్న పల్చని, తెల్లని వాయిల్ లాల్చీ! అతని వేషం అంతా నాకు అదోలా అన్పించింది.

'ఇతనితో ఈ వూరు వచ్చేసాను! సినిమా హాల్లో గేటుకీపర్‌గా చేస్తున్నాడు! ముప్ఫయ్ రూపాయి లిస్తారు. నేను హోటలు అడింతాలో పప్పు రుబ్బటానికి కుదిరాను. రోజుకి తిన్నంతా టిఫెన్లుపెట్టి రెండు రూపాయిలు ఇస్తారు!' అంది మోతీ !

'ఎక్కడికి వెళ్తున్నారు?' అన్నాను.

'అతని చెల్లి పెళ్ళి రాత్రికి ! పక్కవూరే ! వెళ్తున్నాం' అంది !

అనుకోకుండా తర్వాత నాలుగైదు సంవత్సరాలకి ఇందిరమ్మ కన్పించింది. ఆ మాటా ఈ మాటా అడిగాక మోతీ గురించి అడిగాను. ఇందిరమ్మ బాధగా నిట్టూర్చింది !

'చూడండి వదినగారూ! నా డబ్బు పాపిష్ఠిదయిపోయింది! కన్నపిల్లలా చూసుకున్నాను. నా పిల్లలతో సమానంగా బట్టా పాతా కొని వేసేదాన్ని! అయినింటిపిల్లకదా! ఏదో దానికి తగ్గ సంబంధం చూసి ముడిపెట్టేద్దామనుకున్నాను. ఏదో నాకు చేతిక్రింద సాయంతాగా వుంటుందని తీసుకొచ్చి పెంచాను! బుద్ధిః కర్మానుసారిణీ! అని దాని బుద్ధులన్నీ పాడుబుద్ధులయి కూర్చున్నాయి! చదువు చెప్పిద్దామని మేష్టార్ని పెట్టాను! రెండు నెల్ల గడిచినా, 'అ,' దిద్దలేదుట! ఇంకేం చేస్తాను? పోనీ కుట్టుపని నేర్చుకోకూడదా అంటే, నేను ఆ మిషన్ తొక్కలేను; నా కాళ్ళు నొప్పులు పెడతాయి అనేది! పోనీ, ఏదయినా తగిన సంబంధం చూసి పెళ్ళి చేద్దామని, నాకసలు చేస్తూనేవున్నా! ఇంతలో హోటల్లో సర్వరుపనిచేసే 'చిన్నారావు'ని తీసుకుని చెప్పాపెట్టకుండా ఎటో వెళ్ళిపోయింది! పోనీ అతన్నే పెళ్ళి చేసుకుంటానని చెప్పితే మేము కాదంటామా! సంసారం పెట్టుకుందుకు, రెండు మూడు వందలు సర్దుదుము కదా! ఏం తిప్పలు పడుతోందో! నాని నాలుగైదు చీరలు పట్టుకుపోయింది! అవి ఎన్నాళ్ళు వస్తాయి చెప్పండి! మంచితనంగా చెప్పి వెళ్ళితే, ఏడాది కేదో విధంగా ఒక వందరూపాయిల సొమ్ము ముట్టచెప్పుదుము! దొంగలాగా పారిపోయింది! ఇంక మళ్ళీ ముఖం ఎల్లా చూపెట్టుతుంది? దాని ఖర్మ అది!' ఇందిరమ్మ కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి! నా కాశ్చర్యం వేసింది. 'మోతీ'ని అనుమానించి వెళ్ళగొట్టిన ఇందిరమ్మలా ఆమె మాట్లాడలేదు! ఈ విశాల ప్రపంచంలో యవ్వనంలోవున్న ఆడపిల్లపడే అవమానాలన్నీ తలుచుకుని కుమిలిపోయే మాతృమూర్తిలా మాట్లాడింది ఇందిరమ్మ!

'వాళ్ళ కన్నవాళ్ళదగ్గరకు వెళ్ళిపోయిందేమో!' అన్నాను.

'దానికి ఈ లోకంలో నా అని చెప్పుకోగలిగే బంధువుని నేనే! దాని తల్లీ తండ్రి చిన్నప్పుడే పోయేరు! చనిపోతూ చనిపోతూ, దాన్ని పదేళ్ళవరకూ పెంచిన అమ్మమ్మ నా చేతికి అప్పచెప్పింది, నా కర్తవ్యం నేను నిర్వహించలేకపోయేను, వదినగారూ! మాలో ఎక్కడో లోపంవుంది! అందుకనే మోతీ ఇల్లు వదిలి బీరువులా పారిపోయింది! మేము ఎంత ప్రేమగా చూసినా 'మోతీ' మా ప్రేమని నమ్మలేకపోయింది!' అంది ఇందిరమ్మ!

తల్లితండ్రులులేని అనాథ మోతీ అని నాకిప్పుడే తెలిసింది!

'తనకి తల్లితండ్రి తోబుట్టువులూ వున్నారని చెప్పేది మాతో!' అన్నాను.

'ఏమిటో! అందరికీ తలొక మాదిరిగామా చెప్పేది. అమాయకురాలు!' అంది ఇందిరమ్మ.

ఆ రోజు బస్టాండ్‌లో కన్పించిన సంగతి, కూడావున్న యువకుని సంగతీ చెప్పాను.

'నల్లగావున్నతను అయితే చిన్నారావు కాదు! చిన్నారావు నాయుళ్లబ్బాయి! పచ్చగా వుండేవాడు!' అంది ఇందిరమ్మ.

'మోతీ' గురించి రోజురోజుకీ క్రొత్త విషయాలు తెలుస్తున్నాయే అనుకున్నాను. చివరికి మోతీ పదేళ్ల పిల్లప్పట్నించీ కట్టుకథలు చెప్పి, నలుగురి వల్లా సానుభూతి పొందటం అద్భుతంగా నేర్చుకుందన్నమాట! చిత్రమయిన పిల్ల అనుకున్నాను!

పన్నెండేళ్లు పూర్తిఅయినతర్వాత నిన్నసాయంకాలం ఎంపోరియంలో కన్పడింది! 'మోతీ'ని మర్చిపోదామని ప్రయత్నిస్తుండగానే మళ్లీ కన్పడుతూంటుంది మోతీ! చాలా ఫాషనబుల్‌గావుంది! నైలక్స్ చీర! రెండు జడలు! చెవులకి పెద్ద రింగులు, చేతికి స్క్వేర్‌వాచీ. నన్నుమటుకు మర్చిపోలేదు పాపం! నవ్వుతూ 'బాగున్నారా!' అంది.

'వూఁ!' అన్నాను. తన జీవితం ఎల్లా గడుస్తోందో నేను అడగదల్చుకోలేదు! కనపడుతోందిగా! ఇంకా అడగటం, అన్నీ చెప్పించటం దేనికి? ముంజేతి కంకణానికి అద్దం అవసరం ఎందుకు?

నాలుగయిదు చీరలు, జాకెటుపీసులూ తీసుకుని మూడువందలు రూపాయిలదాకా బిల్లు చెల్లించింది!

'ఈ వూరికి వచ్చేరా! ఎన్నాళ్లయిందివచ్చి! మేము ఈ వూళ్లోనే వుంటున్నాము! మావారు ఇక్కడ బిజినెస్‌చేస్తూ స్థిరపడిపోయేరు! గాంధీభవన్‌కి ఎదురుగ్గావున్న సందులో వుంది మా ఇల్లు. అటుకేసి ఎప్పుడన్నావస్తే మా ఇంటికి రండి!' అంది మోతీ!

'అల్లాగే' అన్నాను! ఇంతలో 'మోతీ'కోసం వాళ్లాయన వచ్చేడు! పొడుగ్గా బలంగా వున్నాడు! తుట్టపెదవులు! గుబురుమీసాలు! గోల్డుఫ్రేమ్ కళ్లజోడు! చేతికి ఖరీదయిన వాచీ! జరీపంచె లుంగీలా కట్టుకున్నాడు! పైన టెర్లిన్ షర్టు వేసుకున్నాడు. అతన్ని చూస్తూనే—

'హల్లో పొన్నా!' అంటూ ఆయన సంతోషంతో కావిలించుకున్నంత పనిచేశారు.

'ఇతను నా బాల్యమిత్రుడు. క్లాస్‌మేటు. పొన్నుసామి! ఈమె నా భార్య రాధమ్మ!' అంటూ ఒకరికొకర్ని పరిచయం చేశారు!

'మోతీ' ఇతన్ని ఎల్లా వల్లో వేసుకుందా అని ఆలోచిస్తూనే ఇంటికి వెళ్ళిపోయేను.

'పొన్నుసామి కిదివరకు పెళ్ళి అయ్యిందా!' అన్నాను ఆయనతో!

'నా కన్న ముందే అయ్యింది వాడికి పెళ్లి! అయిదారుగురు పిల్లలుకూడా వున్నారు! మరి ఈ 'మోతీ' ఎలా దాపరించిందో వాడికి!' అన్నారు.

'పోనీలెండి! మోతీ గురించి ఏమీ చెప్పకండి ఆయనతో!' అన్నాను.

'మోతీ' పేరు నా కిష్టం! మోతి చిన్నప్పట్నించీ, అబద్ధాల కుప్పలా పెరిగింది! ఎందువల్ల మోతీకి అబద్దాలు అలవాటు అయ్యేయి! దానికి మనం జవాబు చెప్పుకోలేమేమో! తనకి కావల్సినవి ఇందిరమ్మ సమకూర్చలేదనే అపనమ్మకం! తన్ని తనే నిలబెట్టుకోవాలనే అజ్ఞాతమైన ఆవేదనతో కూడుకున్న ఏకాకితనం, 'మోతి'ని అబద్ధాల జీవితాలపాలు చేసేయి! గాలికి పుట్టి ధూళికి పెరిగే 'మోతి' లాంటి స్త్రీలు ఈనాటి నాగరిక సమాజంలో వేలకు వేలు వున్నారు! కాని నాకు ఆ స్త్రీలందరి జీవితాలూ పరిశీలించేంత తీరుబాటు లేదు! నా క్కావల్సిన స్త్రీ 'మోతీ'! ఆ పేరు నా కిష్టం! స్వచ్ఛతకి, ధవళతకి చిహ్నం 'మోతీ'! తెల్లకుందేలుపిల్లా, తెల్లకుక్కపిల్లా, తెల్లపిల్లిపిల్లా—వీటన్నిటికంటే నేను జీవితాంతం మరువలేని రూపం నా చిన్నారి మోతీది!

నాకు బాగా జ్ఞాపకం వుంది ఇప్పటికీ! చామనచాయలో గుండ్రటి ముఖం! జాలిగొలిపే పెద్ద కళ్లు! తీరైన ముక్కు! బుల్లినోరు! అరటిదూట లాంటి వళ్లు! ఆ మోతీకీ,

'లిప్‌స్టిక్' పెదాలూ, వయ్యారాల వంపులు ప్రదర్శించే శరీరమూ, చమక్కుగాచూసే పెద్దకళ్లూ, ఎప్పుడూ బద్ధకంగావుండే సోమరితనమూ, ఈ మోతీకీ సహస్రం తేడా వుంది!

ఆ మోతీని మర్చిపోలేను!

ఈ మోతీని మర్చిపోవటానికి ప్రయత్నిస్తాను.

ఆ మోతీని అభిమానించకుండా వుండలేను.

ఈ 'మోతీ'ని అవమానించకుండా వుండగలందులకు ప్రయత్నిస్తాను!

ఆ మోతీ ఇక కన్పించదు!

ఈ మోతీ కన్పించకుండా వుండాలన్నావుండదు తన జ్ఞాపకాలను తవ్వుకుంటూ కన్పిస్తూనేవుంటుంది!

బుచ్చిబాబు

శ్రీ రామమోహనరాయ్

తెలుగు సారస్వతానికి బుచ్చిబాబు ఏమిచ్చాడంటే ఎన్నో కథలు, కొన్నినాటికలు, మరెన్నో వ్యాసాలూ, ఒకేఒక్క నవల, చివరగా కొంత కవిత్వమూ ఇచ్చాడని సూక్ష్మదృష్టికి తోస్తుంది. బుచ్చిబాబు నవలా రచయితా? కథకుడా? లేకపోతే వ్యాస రచయితా? కవియా? అనే ప్రశ్నలొస్తే కవి యనే వాళ్ళెక్కువగా ఉండరేమోగాని మిగిలినవన్నీ ఎవరి అభిరుచి ననుబట్టి వాళ్ళు నిర్ణయిస్తారు. చింతనకు ప్రాధాన్యమిచ్చేవాళ్ళు మాత్రం బుచ్చిబాబు జిజ్ఞాసువు, సౌందర్యోపాసకుడు, వేదనాజీవి, సౌందర్యతృష్ణత భరించలేని కళాజీవి, జీవిత స్వరూపాన్ని వివిధ కోణాల్లో దర్శించి, చిత్రించి ప్రదర్శించిన తత్త్వవేత్త అని అనుకోవచ్చు. అన్నింటినీ మించి బుచ్చిబాబు నవలా రచయిత. 'తెలుగులో ఉన్న ఉత్తమ నవలల్లో 'చివరకు మిగిలేది' ఒకటి. పాత్రలన్నీ జీవంతో నిండినవే. వర్ణనలు చెయ్యటంలో అతడికతడే సాటి; పాత్ర చిత్రణ బుచ్చిబాబు ప్రత్యేకత. జీవితాన్ని గూర్చిన చిత్రమైన, తాత్త్వికమైన, చక్కని చిన్ననిర్వచనాలు చెయ్యటంలో అతనిది అందెవేసిన చెయ్యి'అని పాఠకు లనుకోవచ్చు. 'చివరకు మిగిలేది'లో అమృతాన్ని నారయ్యనూ హఠాత్తుగా ఏ పల్లెటూళ్ళోనో చూస్తామనిపిస్తుంది' అంటారు శ్రీమతి ఆచంట శారదాదేవి. ఏ నవలా రచయితకైనా యింతకు మించిన కితాబు ఏం కావాలి?

నవల జీవితాన్ని సమగ్రంగా ప్రదర్శించటానికి అనువైన మంచి సాహిత్యప్రక్రియ. జగన్నాటకాన్ని చూపించటానికిది 'Pocket Theatre' అనుకుంటే 'చివరకు మిగిలేది' నాటకీయమైన సంభాషణలకు పెట్టింది పేరు. పాత్ర లందరినీ పాఠకుడు ఎరిగున్నట్లుగానే భావించుకుంటాడు. మరీ కొంచెం Sentimental గా ఉండే పాఠకుడైతే నవలలో చెప్పిన, సృష్టితాలూకు ప్రతిచిన్నదృశ్యమూ సౌందర్యమయమని బుచ్చిబాబు చెప్పే మాటలకు కన్నీళ్ళు పెట్టుకొంటాడు. ఏమాత్రం entimental గా ఉన్నా బుచ్చిబాబు రచనాశక్తి పాఠకుణ్ణి దయానిధిగా మార్చి ఏకాంతంలోకి పంపిస్తుంది. చింతనతో వ్యక్తిని అంతర్ముఖుణ్ణి చేస్తుంది. గతించిపోయిన యౌవనం, జాడ్యం, బీదతనం, మృత్యువు - ఇవేవీ జీవితంలో గుండె బాదుకోవల్సిన విషాదాలు కావనీ, నిజమైన విషాదం ప్రేమించలేకపోవడమనే నగ్న సత్యాన్ని మనస్సుకు హత్తుకుపోయేటట్లు చేస్తుంది.

జీవిత సంఘటనల వైవిధ్యాన్ని ప్రదర్శించేటందుకు మహారచయిత లెందరో ఎన్నో నవలలు వ్రాశారు. ఐతే ఒకే నవలతో జీవిత స్వరూపాన్ని ఏదో కొంత (లేకపోతే చాలవరకు) అర్థం చేసుకున్నామన్న సంతృప్తిని ఏ ఒక్క తెలుగు రచయితా బుచ్చిబాబుకు మల్లే చేశారని నా కనిపించదు. అందుకేనేమో బుచ్చిబాబు ఒకే నవల వ్రాసి విరమించాడు. చెప్పవలసినదంతా ఆ ఒక్క నవలలోనే చెప్పాడని నా వలెనే అనుకునే పాఠకులు చాలమంది ఉంటారని అనుకుంటాను. 'ఆయన ఎన్నో నవలలు వ్రాస్తే బాగుండును. కనీసం మరొక్క నవలైనా వ్రాస్తే బాగుండును' అని నేనెప్పుడూ అనుకోను. సృష్టిలో పరిపూర్ణ సౌందర్యాన్ని మానవుడు భరించలేడని బుచ్చిబాబు అంటాడు. 'ఖజురాహోలో స్త్రీ శిల్పపు చన్నున ఏమైంది'? అని గాజుమేడలో ప్రశ్నించాడు.' 'చివరకు మిగిలేది' మానవ జీవితపు పరిపూర్ణ చిత్రణం కాదు. కాకపోవటమే ఆ నవల గొప్పతనం.

'చివరకు మిగిలేది'లో అనుసరించిన తత్త్వం సజీవ వాదానికి (Existentialism) సంబంధించినట్టిది. 'ఎగ్జిస్టెన్షియలిజం'కి అస్తిత్వవాదం; సత్తావాదం అనే పేర్లు వ్యవహారంలో ఉన్నా బుచ్చిబాబు సజీవవాదమనే దాన్ని వ్యవహరించేవారు. సార్త్రే

భావాలపట్ల బుచ్చిబాబుకు సంపూర్ణాంగీకారం ఉన్నదని ధ్రువపరచలేంగాని సార్త్రే భావంతో వైముఖ్యం కానరాదు. సార్త్రే ప్రకృతి వర్ణనలకు, జీవిత సంఘటనలకు సన్నిహిత సంబంధాన్ని కలుగజేసినట్లు కనిపించదు. బుచ్చిబాబుమాత్రం యీ విషయంలో మామ్‌కు ప్రియశిష్యుడు. కొన్నిచోట్ల అంతేవాసి కూడ. బుచ్చిబాబు మరణించినప్పుడు అభిమాన లోకరు 'మాకు చెప్పని కథల్ని చెప్పటానికి అవతరించావా' అంటూ వాపోయారు. ఈ విషయం బుచ్చిబాబు రచనాతత్వాన్ని వెల్లడిస్తుంది. కథకు కావలసిన వాతావరణాన్ని కల్పించటంలో బుచ్చిబాబు 'మామ్' శిల్పాన్ని ప్రదర్శిస్తారు. 'చివరకు మిగిలేది' నవలలో గడ్డిలోపడుకుని, సంధ్యకేసిచూస్తూ, ఏకాంతంగా అంతర్ముఖుడయ్యే దయానిధి, చివరకు మిగిలేదేమిటని ప్రశ్నించుకున్నప్పుడు గూడ కథతో విడదీయలేని ప్రకృతి వర్ణన పాఠకుణ్ణి పట్టుకుని విడువదు.

'దయానిధి'నికూడ హేమ్లెట్‌ని వేధించిన సమస్యవంటిదే బాధిస్తుంది. తనతల్లి తప్పు చేసిందనీ లోకపు ఆరోపణను ఎదుర్కోలేడు. ఆ తల్లి రూపానికి ఎవరు కళంకం ఆపాదించినా సహించలేడు. వారిపైన పగబట్టి హతమార్చాలనీ అనుకోడు. హేమ్లెట్‌కూడ తనతల్లిని హతమార్చబోయే ముందెంతో సంఘర్షణకు గురియౌతాడు. షేక్‌స్పియర్ నాటకాలను, ఆ నాటకాల గురించి ప్రపంచమందంతటా వెలువడిన విమర్శనూ జీర్ణించుకున్నవాడు కావటం వలననే తన నవలలో ఆ సంఘర్షణకు ప్రతిరూప మివ్వగలిగాడు. ఈ విషయంలో బుచ్చిబాబే ఇలా అంటాడు. 'హామ్‌లెట్ నాటకం గురించిన విమర్శలు చదివాక నాలుగైదేళ్ళు నేను ఈ సమస్యను గురించి ఆలోచించాను. ఆలోచించాక నాకూ ఒక సిద్ధాంతం తట్టింది. అదేమిటో చెప్పేస్తాను. కొందరు తల్లి పంచనే పెరుగుతారు. ఆ బిడ్డలకు తండ్రితోకంటె, తల్లితోనే ఎక్కువ చనువుంటుంది. తమకి ఏది కావల్సినా తల్లినే అడుగుతారు. తండ్రంటే భయం, దూరంగా వుంటారు. హామ్లెట్‌కి తల్లి అంటే అమితమైన ప్రేమ. ఈ ప్రేమ ప్రధాన లక్షణం ఏమిటంటే మనం ప్రేమించిన వ్యక్తి సుఖంగా వుండాలని కోరుకోవటం, ఆ వ్యక్తి ఆనందంగా, సుఖంగా గడపాలి. కష్టాలకు గురికాకూడదు. గెర్‌ట్రూడ్ సుఖపడడం కోరుతాడు హామ్లెట్. పినతండ్రి తండ్రిని చంపాడు. అందుకు ఆమె బాధ్యురాలు కాదు. ఆమె తప్పిదం ఏమిటి? భర్తని చంపిన వ్యక్తిని పెండ్లాడటమే. ఎందుకు పెండ్లాడింది? క్లాడియస్ తన భర్తను పోలియున్నాడు గావున; ఈ రెండో భర్తతో సుఖిస్తోంది. సుఖించనీ! ఆ భర్తని చంపితే ఆమె విధవ అవుతుంది సుఖించదు. కష్టపడుతుంది. ఆమె పూర్తిగా సుఖించాలి. పెద్దదైపోతోంది. ఇంక ఎంతకాలమో సుఖించలేదు. ఆ కాస్త వాంఛా తీర్చుకోనీ. అప్పుడు చంపుతాను. అనుకొని హామ్లెట్ క్లాడియస్‌ని చంపకుండ జాప్యం చేస్తాడు. అదీ నా సిద్ధాంతం.' గెర్‌ట్రూడ్ క్లాడియస్‌ను పెండ్లాడటానికి కారణం అతడు తన భర్తను పోలివుండటమేననే విషయంతో తెలుగు పాఠకు లేకీభవించకపోయినా, తల్లిమీద ప్రేమ హామ్లెట్‌ని కార్యదూరుణ్ణి చేసిందన్న సిద్ధాంతంలోని నిజాన్ని గ్రహించగలరు. ఈ విషయంలో ఎన్నోవిమర్శలున్నా యింత స్ఫుటంగా హామ్లెట్ జాప్యంపట్ల కారణాన్ని వెల్లడించిన ప్రతిభ నిరుపమానం. ఈ పరిశోధన బుచ్చిబాబు స్వంతమే. ఏ ఆంగ్ల విమర్శకుడినీ ప్రతిధ్వనించలేదు.

పై సంఘర్షణను పురస్కరించుకుని దయానిధి జీవితం ఎన్నో మలుపులు తిరుగుతుంది. అసలు దయానిధి రాయలసీమ ఎందుకుపోయాడు? అనేది యీ నవలలో ఆలోచించదగిన ప్రశ్న.

దయానిధి జీవితంలోకి ఎందరో స్త్రీలు ప్రవేశిస్తారు. ఏ ఒక్కరినీ దయానిధి ప్రేమించలేదనే చెప్పాలి. కోమలిపట్ల అతనికి ఆరాధనీయమైన భావం మొదట్నించీ ఉన్నది. 'కోమల్ని ఎవ్వరూ పెండ్లి చేసుకోకూడదు; ఏ మొగాడికీ చెందకూడదు. చంద్రుడు, నక్షత్రాలు, సముద్రం, తాజ్ మహల్-వీటిని అందరూ దూరానికే చూసి ఆనందిస్తారు. ఏ ఒక్కరూ యివి నావి అనరు, అట్లాగే కోమలి. ఆమె పెండ్లాం కాకూడదు—ఆమె ఒక సామ్యవాదపు సౌందర్యసంస్థ' అనుకుంటాడు దయానిధి. ఒక స్త్రీనిగూర్చి స్వేచ్ఛగా యిటువంటి విశృంఖల భావాన్ని వెలువరించినా పాఠకు

లెవ్వరూ అనీతిని బోధిస్తున్నాడని బుచ్చిబాబుపై విరుచుకుపడలేదు. దానికి కారణం అతని రచనాశక్తి; అతడి ఊహలలోని నిప్పులాంటి పవిత్రత. కోమలితో దయానిధి శారీరక సంబంధాన్ని అపేక్షించడు. అందుకే 'చూడు కోమలి — నాకు ప్రేమంటే ఏమిటో యింత వరకూ తెలిసిందికాదు. అందరిలాగ శరీరవాంఛనే ప్రేమనుకుని, నన్ను నేను దగా చేసుకోలేను. ఇతరులు ఎవ్వరితోనూ, ఏ ఒక్కరితోనూ పంచుకోలేనిదే నా ప్రేమ.'

ముద్దిడు కోవటానికి ప్రయత్నిస్తున్న కోమలి నోటిమీద తన అరచేతిని నొక్కి 'వొద్దు కోమలీ — నా ప్రేమను పంచుకుని పాడుచెయ్యను. నాకు మిగిలింది ప్రేమ ఒక్కటే' అన్నాడు. ఈ మాటలు దయానిధి స్వరూపాన్ని పూర్తిగా తెలియజేస్తాయి.

ఐతే శారీరక సంబంధం ఉన్న అమృతంతోనూ అతడు ప్రేమను పంచుకోలేదు. నిధి అమృతంచేత ప్రేమింపబడ్డాడు. నిధి కోరుకొనేదీ ప్రేమింపబడటమే. అమృతం ప్రాణమున్న పాత్ర. అందుకనేనేమో శ్రీ రావూరి భరద్వాజగారు తమ కథానికా సంపుటం ఒకదాన్ని 'చివరకు మిగిలేది'లోని అమృతానికి అంకితం చేశారు. అమృతం అనగానే పసుపు పచ్చరంగుపై ఆకుపచ్చ పువ్వుల ఖద్దరుచీర, జబ్బల్ని పట్టుకున్న అంగుళం వెడల్పు జరీగల నల్లరంగు ఖద్దరు రవిక దానిపై తెల్లపూలు — వీటితో ఓ మూర్తి కళ్లముందు మెదుల్తుంది. 'ఖద్దరు చీరలో నిద్రపట్టదు. సిల్కుచీర చలేస్తుంది ఎల్లా బావా' అని జాలిగా అడుగుతుంది. కోమలి అన్నట్లు అమృతం గుండ్రంగా, దర్జాగా, ఠీవిగా ఉంటుంది. మరొకరి భార్య నిధి నంతగా ప్రేమిస్తుందేమిటనే సందేహం రానే రాదు మనకు. మనిషి మనిషినెందుకు ప్రేమించాలో తెలియజెప్పే సంఘటనలను బుచ్చిబాబు అలా అల్లుకుంటూ వెళ్లగలరు. మరి కామం మాటేమిటి? శారీరక సంబంధంతో పవిత్రత మంటగలిసిపోదా? పోదనే బుచ్చిబాబు సమాధానం. సముద్రంలో కొట్టుకుపోయే వ్యక్తికి, రబ్బరుబంతి దొరికినట్లుగా, ఏదో శక్తి అతన్ని కిందికి నెట్టేసింది. భరింపరాని సౌందర్యపు వెలుగులో అతనికి స్పృహ తప్పింది. ఆలోచనా, విమర్శనా, తర్కం, చైతన్యా — అన్న ఉద్రేకాల ప్రవాహంలో కెరటంపై నురుగులా కొట్టుకుపోయాయి. 'సర్వేంద్రియాలు విడిపోయి జీవకణాలుగా శరీరాన్ని మార్చే శరీరం అనుభవంతో అత్మైక్యమైపోయింది' ఈ చివరి వాక్యాన్ని అర్థం చేసుకుంటే అమృతం, నిధి తప్పు చేశారనిపించదు. అది తప్పనే భావమే రాలేదు. అందుకే నవలలో ఎక్కడా వాళ్లల్లో ఏ ఒక్కరూ పశ్చాత్తాప పడలేదు. అల్లా పశ్చాత్తాప పడటం వాళ్ల నైజంకాదు. ఇది సజీవవాదం (Existentialism) సమర్థిస్తున్న నైతికజీవనం. దీన్ని అర్థం చేసుకునే శక్తి, నవలలో ప్రవేశపెట్టగలిగిన ధైర్యమూ ఉన్న కొద్దిమందిలో బుచ్చిబాబు ప్రముఖులు. గోపీచంద్, భాస్కరభట్ల మరికొంతమంది ముఖ్యులు. అమృతం గురించి చెప్పేటప్పుడు బుచ్చిబాబు కవిత్వంలోకి దిగిపోతాడు. 'రాతి శిథిలాలమధ్య వుండవల్సింది అమృతం. ఎక్కడో, ఏ హంపీలోనో, అన్నీ రాళ్ల — భగ్నప్రతిమలు ఒంటరిగా నిల్చిపోయిన స్తంభాలు, ప్రేమకోసం గుండె రాయి చేసుకున్న రాకుమార్తెల విగ్రహాలు — అన్నీ శిథిలమైపోయి, ఏ అర్ధరాత్రో అడుగుల చప్పుడూ, నిట్టూర్పు వినబడితే కదుల్తామేమో ననిపించే ప్రమాదస్థితిలో పడివుంటే వాటిమధ్య అమృతం కూచుని, విషాదంతో నవ్వుతుంది. ఆమె గడిచిపోయిన అనుభవపు వైభవాలను తల్చుకుని ఏడ్చి అతీతం ఐనప్పుడు కన్నీరు చుక్కలు చుక్కలుగా రొమ్ములమధ్యనుంచి జారి యీనాటికి నదిగా ప్రవహిస్తోంది. తన దుఃఖం నదులై పొంగిపొంగి దేశాన్ని ముంచివేస్తుంది. తప్పు! తను ఏడ్వకూడదు; విషాదంతో నవ్వుతుంది. అనాడు సౌందర్యం తన యాత్ర ముగించుకుని ఆమెను శిలగా మార్చివేస్తుంది. ఏ రాతిని నిట్టూర్పుతో కదిల్చినా అమృతం కంట్లో కార్చిన కన్నీరల్లే నీరైపోతుంది' — ఈ పంక్తులు తెలుగులోని ఉత్తమ కవితాఖండికలలో ఒకటిగా యెంచుతాను నేను.

సుశీల, నాగమణి, ఇందిర, శ్యామల, కాత్యాయని నిధి జీవితంలో సంచలనం కలిగించిన మరికొందరు స్త్రీలు. సుశీలకు నిధి అంటే కసితో కూడిన ప్రేమే ఉన్నది. తన ఆధిక్యాన్ని గుర్తించడని బాధ, ఇతర స్త్రీలతో అతని ఆత్మీయతను సహించలేని కసి ఆమెను నిధినుండి దూరంచేస్తాయి.

బ్రతుకుతో సమాధానపడి సాంసారిక ఆనందాన్ని పొందకుండానే ఆమె బిడ్డను కని లోకాన్ని వీడిపోతుంది. విధిలో ఉన్న లోపాన్ని సుశీల గుర్తించింది. గుర్తించటమేకాక కుండ బద్దలుకొట్టి చెప్పేసింది, 'సంగీతం, చదువు, ఆస్తి, చక్కదనం, యివన్నీ వుంటేనే నచ్చడం జరిగితే ఎంతమందికి వివాహా లవుతా యంటావు' అని విధి అన్నప్పుడు సుశీల 'నువ్వేదో ప్రత్యేకమైన మనిషివి అనుకునేటట్లుగా మాట్లాడుతుంటావులే – అందుకన్నాను' అంటుంది. ఇదే విధిలో లోపమైతే యీ లోపం బుచ్చిబాబులోనూ ఉన్నది.

ఇతరులతో తన ప్రత్యేకతను నిరూపించుకున్నట్లు తెలుగు రచయితలలో బుచ్చిబాబు చిత్రకారుడు. ఆంగ్లభాషా వైదుష్యంతో తనదైన వాక్య విన్యాసాన్ని ప్రత్యేకించుకున్నాడు. అది మరెవ్వరికీ అనుకరణ కాదు. బహుశః రాబోయే రచయితల కది అనుసరణీయం కావొచ్చు. ప్రకృతిపట్ల ప్రగాఢమైన ప్రేమ అతని మరో ప్రత్యేకత. సంధ్యచేసిన ఆఖరి ఆక్రందనం, గడ్డిపోచ ఆర్తనాదం, పరిమళపుబరువు, శిథిలాల గాంభీర్యము, ప్రవాహంలో గడ్డిపోచ ప్రయాణం — యివన్నీ బుచ్చిబాబే చూడగలరు. చూపించగలరు. ఆయన ప్రకృతిలో వొకరు. ఐతే మరొకరు గూడ యీ పని చెయ్యగలరు. అతడు జగన్నాథం. గోదావరొడ్డున పాకవేసుకుని, ప్రకృతిలోని ప్రశాంతతను పొందుతూ జీవితాన్ని పూర్ణంగా అనుభవించిన ఘనుడు. అమృతం తర్వాత జగన్నాథమే నవలలో విశిష్టమైన పాత్ర అని నేననుకొంటాను. 'గిరీశం' ప్రభావం జగన్నాథం పాత్రచిత్రణలో ఉపయోగపడిందని బుచ్చిబాబే అంటారు. జగన్నాథం 'జగ్గూ' అంటే ఊరుకోడు. మామ్మూలుగా మాట్లాడటం జగన్నాథానికి చేతకాని పని. గిరీశం మాట్లాడినంత చురుగ్గా, అర్థవంతంగా మాట్లాడతాడు. ప్రతిమాటలోనూ చమత్కారం ఉట్టిపడుతుంది. ఎవ్వరివేపు సూటిగా చూడలేడు. ఏదో కొంటెగా మాట్లాడి నవ్విస్తాడు. తాను నవ్వేటప్పుడు మెడపక్కకు వాల్చి మరీ నవ్వుతాడు. జీవితమంటే తగని ప్రేమ. సన్యాసమంటే తగని వెగటున్నూ. అతడి మాటలు కొంటెగా ఉన్నా అందులో గంభీరమైన సత్యం దాగుంటుంది. థోరో Walden ప్రభావం జగన్నాథం ఆశ్రమాన్ని వర్ణించటంలో ఉపయోగపడింది.

విధి treat చెయ్య పూనుకొన్న రోగి శ్యామల. సౌందర్య రాహిత్యం ఆమె జబ్బు. జీవితమంటే మక్కువనూ, సౌందర్యంయొక్క నిజస్వరూపాన్ని తెలియజెప్పి బ్రతుకుపట్ల ఆమెకు గాఢవిశ్వాసమూ, అభిమానాన్ని ఏర్పరచటంలో విధి కృతకృత్యుడు కాలేకపోతాడు. లోకం అపనిందతో శ్యామలను దూరం చేస్తుంది. ఆమె మానసిక జాడ్యం కుదర్చగలననే విశ్వాసం ఉన్నా లోకాన్ని ఎదుర్కోలేక బాధతో చిలుకలేని ఖాళీ పంజరంగా తన హృదయావేదనను అణచుకుంటాడు.

కాత్యాయని మనోహరమైన సంజకిరణం లాంటిది. ముగ్ధ; అమాయికంగా కన్పిస్తుంది. అమాయికంగా మాట్లాడుతుంది. పెండ్లిమాట వినగానే సిగ్గుపడుతుంది. దయానిధిని వెర్రిగా అభిమానిస్తుంది. కాత్యాయనితో సంబంధాన్ని గూర్చిన అభాండాన్ని విధి తట్టుకోలేక పోతాడు. కోమలితో విధి సాహచర్యాన్ని చోద్యంగా చూస్తుందేతప్ప ద్వేషించదు.

రాజభూషణం బుచ్చిబాబు అభిప్రాయాలకు నిలువుటద్దంగా కన్పిస్తాడు. వాదంలో ఉన్న పస రాజభూషణం చిత్రణలో లేదు. నవలలో ఆ నాటి రాజకీయ, సాంఘిక జీవితాన్ని, శిల్పం చెడకుండానే రచయిత గడుసుగా కథ కనుగుణంగా మలచుకోగలిగారు.

'చివరకు మిగిలేది' ముగింపు, నవలకే మకుటాయమానం. ఏ వ్యక్తి జీవితంలోనైనా కలకాలం జ్ఞాపకముంచుకోదగిన గంభీర తాత్త్విక పరిశీలన యిది. ఇట్టే తేలిపోతుంది; మళ్ళీ మరపురాదు — 'చివరకు మిగిలింది – దాని సమాధానం కాదు; సమాధానం తెల్సుకునేటందుకు తను చేసిన యత్నాల — జ్ఞాపకాలు; తనలో తాను సమాధానపడటం — అది మిగిలింది.'

క థ లు :

ఎన్నోకథలు వ్రాసినా ఒక కథకు ఇంకొక కథకు ఎక్కడా సామ్యం ఉండదు. వస్తువైవిధ్యం

ఆ కథలను పేటికవే వేర్వేరు కళాఖండాలుగా మార్చి వేస్తుంది. ఏ కథలో చూసినా ఒకేవిధమైన వైచిత్రితో కూడుకొన్న వర్ణనలే చేస్తాడని బుచ్చిబాబుపై ఒక ఆరోపణ ఉన్నది. కథలోని వాక్యాలను ఆంగ్లంలో ఆలోచించి తెలుగులో వ్రాయటంవలన వాక్యవిన్యాసంలో వైచిత్రి గోచరిస్తుందంటారు. కథలో వైచిత్రి కిచ్చిన ప్రాముఖ్యం వాస్తవికత కివ్వడనికూడ ఆరోపణ చేస్తారు. ఈ విషయం పూర్తిగా సత్యమనటానికి వీల్లేదు. తన కథల కేవిధమైన వచనరచన సరిపడుతుందో బుచ్చిబాబే నిర్ణయించుకున్నాడు. కథలలో సౌందర్యానికి విచిత్రతకు యిచ్చిన ప్రాముఖ్యం వాస్తవికతకు యివ్వకపోవటం అతని అభిరుచినిబట్టి నిర్ణయమవౌతుంది. అంతేగాని ఆకలి, దారిద్ర్యం, ధరల పెరుగుదలే కథావస్తువులని శాసించే లధికారం ఎవ్వరికీలేదు. బుచ్చిబాబు ప్రత్యేకత కథలకు శీర్షికలను నిర్ణయించుకోవటంలోనూ వ్యక్తమౌతుంది. కీ. శే. మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి విధంగానే శీర్షికతోనే పాఠకుణ్ని ఆకట్టుకొనేవారు. మల్లాదివారికి బుచ్చిబాబు శీర్షిక లనుకరణమేమీ కావు. తన ప్రత్యేకత తనదే. 'కలలో జారిన కన్నీరు; దిగజారిన మాలిన్యం; అరుకులోయలో కూలిన శిఖరం; దేశం నాకిచ్చిన సందేశం; ఎల్లోరాలో ఏకాంతసేవ; నన్నుగురించి వ్రాయవూ; అడవికాచిన వెన్నెల: 'బీ'; తడిమంటకు పొడినీళ్ళు; అన్నవి అన్నీ ఆలోచింపచేసే శీర్షికలే. ఒక్కకథ చదివినతరువాత చాల కాలంవరకు ఆ అనుభూతి దూరంకాదు. పత్రికలు వెలువడగానే బుచ్చిబాబు కథకోసం ఆతృతగా వెదికే పాఠకుల్ని అసంఖ్యాకంగా సంపాదించుకున్నాడు. పాఠకుల నాలోచనాపరులుగాకూడ చేశాడు. కథాశిల్ప నైపుణ్యంలో బుచ్చిబాబు ఏ ఆధునిక, ఏ పాశ్చాత్య కథారచయితకీ తీసిపోడు. మామ్ ముద్ర బుచ్చిబాబు కథల్లో కొట్టొచ్చినట్లు కన్పించినా అవి మామ్ కథల కనువాదాలు కావు. మామ్‌ను గురుతుల్యునిగా స్వీకరించటంవలన ఏర్పడిన ముద్రలు.

బుచ్చిబాబు ఆషామాషీగా కాలక్షేపాని కెన్నడూ కథలు వ్రాయడు. చెప్పదలచుకున్న విషయమేదో ఉంటేనే కథకు శ్రీకారం చుడతాడు. మరి ఆ కథలు సాంఘిక ప్రయోజనాన్ని సాధించలేకపోవచ్చు. దారిద్ర్యాన్ని తొలగించటానికో, సాంఘిక సంస్కరణకో కథకులు పూనుకోవాలనటం వెర్రిమాట. ఏ ఉత్తమ కళాకారుడుకూడ కళ నందుకోసమే వినియోగించడు. ఓ కళాఖండం సాంఘిక ప్రయోజనాన్నికూడా సాధించిందంటే అది మంచి విషయమే. ఏ విషయాన్నైతే చెప్పదలచుకున్నాడో ఆ విషయాన్నిగూర్చి కూలంకషంగా, పరిశోధన చేసినంతగా తెలుసుకునిగాని కథ కుపక్రమించడు. వైద్యంగురించి వ్రాస్తే ఏవైద్యునికీగూడ అతనికి వైద్యశాస్త్రం గురించి తెలియదనిపించదు. ఆటవిక జీవితానికీ, భూగర్భ శాస్త్రానికీ, శిల్పానికీ చిత్రలేఖనానికీ, 'ఇంజనీరింగ్'కీ వేటికి సంబంధించినవైనాసరే ఆ విషయాలు కథకునికి కూలంకషంగా తెలుసుననిపిస్తాయి. ఇంతటి విషయ పరిశీలనాసక్తి, సహనమూ ఎందరు కథకులకుంటాయి? అసలెందుకు యీ విషయాలన్నీ తెలుసుకోవాలి? అని ప్రశ్నిస్తే బుచ్చిబాబు యిలా అంటాడు. ఈ రకం వైజ్ఞానిక విషయాల సమీకరణ పాండిత్యం. నవలకి అవసరం. కాని కథానికకి అక్కర్లేదు. ఈయన హడావిడి చేస్తున్నాడు— అనుకోవచ్చు కొందరు. అక్కర్లేదు, నిజమే. నేను తెలుసుకున్న వాటిని ఒకటి రెండు తప్ప కథలో వాడకపోవచ్చు...భోగట్టా అంతా తెలుసుకున్నాక మనస్సులో వస్తువు కనువైన మానసిక స్థితి ఏర్పడుతుంది. ఒక వాతావరణం ప్రబలుతుంది. దానికి సరిహద్దు లేర్పడతాయి. అందులోంచి ఒక తీక్షణమైన పరిశీలనాశక్తి, దీక్షతో ఆకళింపు చేసుకొని, ఆ చేసుకున్న దాన్ని మాటగా, శక్తివంతంగా పాఠకుడితో పంచుకోవాలన్న కళాతృష్ణ ప్రత్యక్షమవుతాయి.'

'రచయిత ప్రతిదీ జాగ్రత్తగా వినాలి, చూడాలి, తెలుసుకోవాలి. కాని ఉద్రేకంతో దానికి లొంగిపోకూడదు. ఆ విషయాన్ని మనస్సులో ఒక మూలపడేసి వుంచాలి. ఎప్పుడో దాని అవసరం రావొచ్చు. అదొక మంచికథ అవొచ్చు.' ఇది వర్ధమాన కథకులకి బుచ్చిబాబిచ్చే సందేశం. జీవితంలోని ఒడిదుడుకులు, ఎదురుదెబ్బలు కథావస్తువులుగా ఉపయోగపడవచ్చునంటాడు. అందుకు తార్కాణగా పద్మరాజుగారి 'గాలివాన' కథ చూడమంటాడు. గాలివానవల్ల పద్మరాజుగా రుంటున్న ఇల్లు కూలింది.

అతని భార్యకు తీవ్రమైన గాయాలు తగిలాయి. ఈ అనుభవాలే తర్వాత కాలంలో 'గాలివాన' అనేగొప్ప కథగా మారాయంటాడు. 'మళ్లీ మళ్లీ చదివే ఖండ కావ్యంలా కొనసాగాలంటాను కథానిక' అంటాడు.

దేశం నాకిచ్చిన సందేశం; ఎల్లోరాలో ఏకాంతసేవ; దిగజారిన మాలిన్యం; అరుకులోయలో కూలిన శిఖరం; నన్ను గురించి కథ వ్రాయవూ; ఆరుగురు కథకులూ—ఒకే వాయిక; కొత్త నీతన—పాతనీరు; మొదలైనవన్నీ ఖండకావ్యంలా మళ్లీ మళ్లీ చదవాలనిపించేవే.

ఉద్యోగం చేస్తున్న వారెవరైనా 'దేశం నాకిచ్చిన సందేశం' కథలోని సమస్య నెదుర్కొంటారు. 'మీకెం తిస్తారు'? అని అడగకుండావుంటే మనిషిని సామాన్యంగా ఏ ఉద్యోగీ ఎదుర్కోడు! అడిగి ఊరుకుంటే ఫరవాలేదు. జీతమెంతో చెప్పగానే అతడి సాంఘిక విలువల్ని నిర్ణయించి పారేస్తారు. ఎదుటి వ్యక్తి జీతమెంతో తెలుసుకోవాలని ప్రయత్నించే తహతహను, అందమైన కోణంలో పట్టుకున్నాడు బుచ్చిబాబు. జీతమెంతో చెప్పకుండానే మరపిద్దామని కథకుడు ప్రయత్నించడమూ, ఎదుటి వ్యక్తి హఠాత్తుగా ఆ మాట అడిగెయ్యటమూ చిత్రంగా కన్పిస్తాయి. ఎన్నిసార్లైనా యీ కథలో సంభాషణలు చదవాలనిపిస్తుంది.

'ఎల్లోరాలో ఏకాంతసేవ'లో అజంతా ఎల్లోరా గుహలలో కళానైపుణ్యమూ, ఆ అందాలకు రూపం కల్పించాలని ఉవ్విళ్లూరే 'జియాలజిస్టు' ప్రయత్నమూ, ఉద్విగ్నమైన అతడి వాంఛకు భార్య అక్కయ్య Model గా ఉపయోగపడటమూ, శ్రమించి అతడు తయారుచేసిన శిల్పపు ప్రతిరూపాన్ని భార్య అనుమానించి, తన అక్కయ్యచే నిందించి, నిందవేసి శిల్పాన్ని భగ్నం చేస్తుంది. ఐతే అసలు చిత్రాన్ని (స్వేచ్ఛ అనేది) అతడు పోటీకి పంపి బహుమతి గెలుచుకోవటమూ జరుగుతూంది. ప్రకృతినీ, సృష్టి రహస్యాల్ని తెలుసుకోవటానికి శిల్పి తాపత్రయాన్ని. బాలవితంతువులో అందచందాలను గూర్చిన ఆలోచనలను, మనస్సులోని మారుమూలలను వెలికితీసి కథారూపాన్నిచ్చాడు బుచ్చిబాబు.

ఈ విధంగా చెప్పుకుపోతే బుచ్చిబాబు వ్రాసిన ప్రతికథా విశిష్టమైనదే. అన్నికథలూ ఒక యెత్తు—అతడు వ్రాసిన ఊహాచిత్రం 'నా గాజుమేడ' ఒక యెత్తు. ఇది చదివితే అతడి తత్త్వం బాగా తెలుస్తుంది. ఎవరేనా పెదవి విరిచి బుచ్చిబాబు 'గాజుమేడవాసి' అనేయవచ్చు. ఆ మాటలో యథార్థం ఉండొచ్చు. ఐతే అతడు కళాజీవి; సౌందర్యోపాసకుడు, వ్యుత్పన్నుడు; ప్రతిభాశాలి అని ఒప్పుకుతీరాలి.

'సెక్స్' సమస్యల్ని చర్చించటంలో బుచ్చిబాబు స్వేచ్ఛ నవలంబిస్తాడు. ప్రేమనూ, కామాన్ని, తుదకు సంభోగాన్నికూడ వివరంగా వ్రాస్తాడు. లోకం ఆక్షేపించే ఎన్నోసంబంధాలను కథావస్తువులుగా స్వీకరించాడు. ఐతే బుచ్చిబాబు చలానికి మల్లే దూషణకు గురికాలేదు. ఆక్షేపించిన వాళ్లున్నప్పటికీ అసహ్యించుకునే వాళ్లుండరేమో! దానికి కారణం అతడి రచనాశక్తి—అంటే భాష అని కాదు. భాష చలాన్ని మించి మరెవ్వరు వ్రాయగలరు? సంభోగాన్ని ప్రేరేపించటానికి కావలసిన సంఘటనల నల్లటంలో బుచ్చిబాబుకున్న చాకచక్యం పాఠకుల్ని ఆకట్టుకొంటుంది. విమర్శించనివ్వదు. విధి, అమృతం కలయిక సహృదయుడెవ్వడూ అసహ్యించుకోడు.

శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మగారొకచోట 'బుచ్చిబాబు కథ బట్ట లిప్పుకొంది' అన్నారు. ఐనప్పటికీ వారి కథలోని శిల్పనైపుణ్యాన్ని, మానసిక జగత్తును పరిశీలించి చెప్పే వాస్తవాలను త్రోసివేయలేరనుకొంటాను. అవినీతిని ఆకర్షవంతంగా బుచ్చిబాబేవాడూ చిత్రించలేదు.

బుచ్చిబాబు కథలలో ఏ కథ చదివినా అతడి తత్త్వం తెలుస్తుంది. ఏ ఒక్క కథనూ యిది అంతమంచికథకాదని త్రోసివేయలేదు. ఉత్తమ కథానికా రచయిత కింతకన్న సార్థకత మరేముంది? వ్రాసిన అన్ని కథలూ మంచి కథలుగా పేరొందాయి. అన్నీ మంచి కథలు వ్రాసిన కొద్దిమందిలో ఆయనొకరు.

నాటకాలు; నాటికలు:

తిష్యరక్షిత; రాయల కరుణకృత్యం; ఉమర్ ఖయ్యాం; ఒకే నిద్ర—ఎన్నో కలలు; ఆద్యంతాలు

మధ్యరాధ; ఉత్తమా యిల్లాలు; ఆత్మవంచన; దారినపోయే దానయ్య; గెలుపు — ఇవి సుప్రసిద్ధమైన బుచ్చిబాబు నాటికలు. వీటిల్లో చాలవరకు ప్రదర్శన యోగ్యాలూ, లేదా శ్రవ్యయోగ్యాలున్నూ. అన్నింటిలోను అంతరంగ పరిశీలనం ప్రధాన అంశం. శిష్య రక్షిత చిత్రాంగివంటిదే. రచయిత శిష్య పక్షమే వహిస్తాడు. శ్రీ వేలూరి చంద్రశేఖరంగారి 'కాంచనమాల' నాటకం వొడుపు వీరి యీ నాటికలో కన్పిస్తుంది. 'ఉమర్ ఖయ్యామ్' ఖయ్యాం తత్వాన్ని కాచివడపోసింది. సాఖీ మరపురాని పాత్ర. 'రాయల కరుణకృత్యం'లో తిమ్మరుసు పాఠకులందరిచేత కన్నీళ్లు పెట్టిస్తాడు. 'ఒకే నిద్ర — ఎన్నో కలలు' దేశసమైక్యతను చాటిస్తుంది. అలాగని ప్రచారంకోసమే వ్రాసింది కాదు. బుచ్చిబాబు మనస్సులోని స్నేహభావం భారతీయులందరినీ ఏకం కమ్మనే ప్రబోధిస్తుంది. ద్వేషాన్ని విడనాడంది ముక్తి లేదంటాడు ఈ నాటకంలో. ఇది బహుమతి పొందింది. 'ఉత్తమా యిల్లాలు'లో ఎంకి పాటలను రమణీయంగా రూపొందించారు. చలంగారి తర్వాత ఎంకిపాటల సౌందర్యాన్ని బుచ్చిబాబులా మరొకరు అనుభవించారని నా కనిపించదు. 'దారినపోయే దానయ్య' విలక్షణమైన సాంఘిక నాటకం. ప్రదర్శనలో అద్భుతమైన విజయాలను సాధించింది.

బుచ్చిబాబు నాటక రచయితగానేగాక ప్రయోక్తగాను మిక్కిలి సమర్థుడు. నాటికను నేపథ్యంలో ధ్వనులను అందంగా సమకూర్చగలడుకూడ.

వ్యాసాలు:

'నన్నుమార్చిన పుస్తకం' అనేది బుచ్చిబాబు వ్రాసిన వ్యాస సంపుటి. ఇదిగాక అప్పుడప్పుడు 'భారతి'లో ప్రచురించిన బెర్ట్రాండ్ రసెల్ భావప్రపంచం; సోమర్‌సెట్‌మామ్; ఆల్డస్ హక్స్లీ; జీన్‌పాల్‌సార్త్రే రచనలు భావాలపట్ల సుదీర్ఘమైన వ్యాసాలు ఉన్నాయి. మరికొన్ని మనస్తత్వ శాస్త్రానికి సంబంధించిన 'మనస్సులో మారుమూలలు'; నవలాకారుడి నాలుగో పరిణామం మొదలైనవి వ్రాశాడు. అన్నింటిలోనూ బుచ్చిబాబు నిష్పాక్షికమైన సమీక్షా ధోరణిని, జిజ్ఞాసువుగా ఆయా రచయితల నర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్న రీతిని వెల్లడిస్తాడు. ఏ రచయితపట్ల ద్వేషాన్నీ, కసినీ ప్రదర్శించడు. కసి అంటే జ్ఞాపకం వొచ్చింది. 'కసిత్వం'; 'మహామహుల మొదటి మాటలు' మొదలైనవికూడ మంచి వ్యాసాలు. అన్నివ్యాసాలలోను సోమర్‌సెట్‌మామ్‌గురించి, రసెల్‌గురించి వ్రాసినవి ఎక్కువ బాగున్నాయి. కారణం బుచ్చిబాబుకు మామ్ అన్నా, రసెల్ అన్నా అపరిమితమైన అభిమానం. వారి అడుగుజాడల్లో నడవటానికి ప్రయత్నించాడు. వారి తత్వాన్ని వొంట పట్టించుకున్నాడు. బుచ్చిబాబు వ్యాసాలు ఆయన కథలకు తీసిపోవు. విశ్వసాహిత్యంలో ప్రసిద్ధులైన ఆ మహారచయితల భావప్రపంచాన్ని పరిచయం చేసిన ఖ్యాతి బుచ్చిబాబుదే.

కవిత్వం:

బుచ్చిబాబు చాల ఆలస్యంగా కవిత్వాన్ని ప్రారంభించాడు. కవిత్వపు లోతుల్ని చూడకుండానే మరణించాడు. కవిగా శిఖరాన్ని అధిరోహించనేలేదు. వ్రాసింది వచన కవిత్వం — ఆయన వ్రాసిన కవిత్వాంశం ఎల్లెడలా కన్పించినా కవిత్వంలో ఆయన వ్యక్తిత్వం స్ఫుటంగా కన్పించదు ఆ కవితలు బుచ్చిబాబును కవిగా తెలుగు సాహిత్యంలో నిలబెట్టలేవు.

చిత్రకళ:

బుచ్చిబాబు గొప్పచిత్రకారుడైనట్లు ఆయన రచనలు చదివినవారికి అనిపిస్తుంది. ఆయన పద చిత్రాలు అంత బాగుంటాయి. ఆయన స్వయంగా గీచిన తైలవర్ణచిత్రాలు ఎన్నో ఉన్నాయి. అవి చాలవరకు మిత్రబృందానికే పరిమితాలు. ఆయన చిత్రాలు అచ్చయితేగాని వాటి విలువ అందరికీ అర్థంకాదు. రంగుల మేళనంలో అయన నైపుణ్యం చిత్రాలదాకా పోనక్కరలేదు, రచనలే చాలు.

మహారచయితల ప్రభావం:

షేక్‌స్పియర్, సోమర్‌సెట్‌మామ్, బెర్ట్రాండ్ రసెల్, జీన్‌పాల్‌సార్త్రే, భారతీయులలో వాల్మీకి, భవభూతి బుచ్చిబాబు కిష్టమైన రచయితలు. షేక్‌స్పియర్ హేమ్లెట్ ప్రభావం 'చివరకు మిగిలేది'లో నిధి సంఘర్షణలో కన్పిస్తుంది. నవలకది అనావశ్యకమైన పెంపుదల అనుకోకుండ హేమ్లెట్ నాటకాన్ని గురించి సుదీర్ఘంగా చర్చించారు. షేక్

స్పియర్ 'సాహితీ పరామర్శ' అనే గ్రంథానికి బహుమతి పొందారు. ఇంతవరకూ తెలుగులో వెలువడిన షేక్‌స్పియర్‌ను గూర్చిన రచనలలో యిది అత్యుత్తమ మైనదనటం అతిశయోక్తి కాదు.

సోమర్‌సెట్ మామ్ ముద్ర బుచ్చిబాబు కథల్లో అడుగడుగునా కన్పిస్తుంది. బుచ్చిబాబు కథలనే ఆంగ్లంలోకి సమర్థులెవరైనా అనువదిస్తే అవి మామ్ కథలని భ్రాంతి పొందేటంతగా ఉంటాయి. మామ్ కథల ననువదించకపోయినా, అతడువయోగించుకున్న కథావస్తువులనే మరొక విధంగా మరికొన్ని కథలలో మలచుకొన్నాడు. 'మామ్ చెప్పేది కథల్ని చెప్పటానికి వచ్చావా' అన్నమాటలో ఎంతో అర్థం ఉన్నది.

రసెల్ కంకితమిచ్చిన కథలు చదివితే బుచ్చిబాబుకు రసెల్ తత్వంపట్లగల గాఢాభిమానం విశదమౌతుంది. 'బెర్ట్రాండ్ రసెల్ భావ ప్రపంచం' అనే వ్యాసం తెలుగు వ్యాసాలలోనే మణిమకుటం. అటువంటి వ్యాసాలు ఆయన మరెన్నో వ్రాస్తాడన్న ఆశల్ని త్రుంచేసి వెళ్ళిపోయాడు. రసెల్ ఎక్కడో చెప్పిన మాటల్ని ఆయన చమత్కారంగా కథావస్తువులుగా వినియోగించుకున్నాడు.

సార్త్రే సజీవవాదం(Existentialism) బుచ్చిబాబు రచనల మూలతత్వం. నీతి అవినీతుల కుహనా అడ్డుగోడలను, పాపపుణ్యాలపట్లగల మూఢనమ్మకాలను సార్త్రే స్థాపించిన నూతన భావ విప్లవ పంథాలో బుచ్చిబాబు బ్రద్దలు కొట్టాడు. ఆత్మానుభూతికిచ్చిన ప్రాధాన్యం ఆయన పశ్చాత్తాపాలకు, స్వర్గనరకాలకు యివ్వనే లేదు.

వర్ణనలు చెయ్యటంలో బుచ్చిబాబు పాశ్చాత్యుడనే అపప్రథను తొలగిస్తూ ఆయన తన వర్ణనలెన్నో వాల్మీకి రామాయణంలోంచి, భవభూతి ఉత్తర రామచరితలోంచి గ్రహించుకొన్నట్లు చెప్పాడు. రామాయణం బుచ్చిబాబుకు ప్రాణప్రియమైన కావ్యం. కొన్ని వర్ణనలను తాను స్వతంత్రించి చేశాననుకోగా అవి రామాయణంలో ఉన్నట్లు తెలుసుకొని తాను దిగ్భ్రమ చెందానన్నారు.

ఆధునిక రచయితలలో నండూరి, కృష్ణశాస్త్రి, చలం, గోపీచంద్, మల్లాది వారలు బుచ్చిబాబు అభిమానపాత్రులు. నండూరి 'యెంకి పాట'లను సర్వాత్మనా అనుభవించాడు. కృష్ణశాస్త్రి సౌందర్య దాహాన్ని తనలో నింపుకొన్నాడు. భాషా సౌందర్యమూ, భావ విప్లవమూ చలంగారి ఆస్తి అయితే బుచ్చిబాబు పాలు పంచుకొన్నాడు. గోపీచంద్‌లాగే నవ్యమానవవాదంపట్ల తన మనస్సు నిల్పాడు. చివరకు మిగిలేదిలోని Existentialism వంటిదే, గోపీచంద్ 'మెరపుల మరకలు'లో అనుసరించాడు. గోపీచంద్ బుచ్చిబాబు లిరువురూ ప్రాచ్యపాశ్చాత్య తత్వశాస్త్రాలను కాచి వడపోసిన ధీమంతులు. గోపీచంద్ ముఖ్యంగా మధ్య తరగతి జీవితాన్ని చిత్రించే వాస్తవికవాదికాగా, బుచ్చిబాబు సౌందర్యోపాసకుడైన కళాజీవి. గోపీచంద్‌ను గూర్చి బుచ్చిబాబు 'నే నెరిగిన గోపీచంద్' అనే రచనలో తెలియజేశాడు. వీ రిరువురు గూడ సెక్సు సమస్యలను

చర్చించటంలో వెనుదీయలేదు. కామోద్రేకాలను రెచ్చగొట్టే దుస్సంకల్పం వీరి రచనలలో లేనేలేదు.

ఇచ్చిందేమిటి :

రచయితగా బుచ్చిబాబు యిచ్చిపోయిందేమిటి? అతని వ్యక్తిత్వమే ఆదర్శప్రాయమైన అడుగుజాడలను నెలకొల్పింది. బుచ్చిబాబు సిగ్గరి. గంభీరోపన్యాసాలు చెయ్యడు. సన్మానసభలకు బహుదూరంగా ఉంటాడు. తనని అబాసుతో విమర్శించేవారి నెన్నడూ ఎదుర్కోలేదు. పెద్దగా హోరుమనే నవ్వుతో మిత్రబృందాన్ని ఉత్సాహపరచే నిత్యసంతోషి. వ్యాధిపీడితుడై కూడ తన జబ్బు వివరాలతో యితరులను బాధించని యోగి. చెణుకులను రచనలలోనూ, జీవితంలోనూ కురిపించటం ఆయనకు బాగా చేతనవును.

మహాకావ్యంలా రసానుభూతి నిచ్చే గొప్ప నవల నిచ్చాడు. ఏదో వ్రాసి తన భావాల నన్నింటినీ వెల్లడించాలనే తాపత్రయం ఆయనలో లేదు. అందుకే మరో నవల వ్రాయలేదు. జీవనకోణాలను కిరణాలుగా ప్రసరిస్తూ ఎన్నోకథల నిచ్చాడు. కవిగా ఆయన రాణించకపోయినా 'నీకూ నాకూ మధ్య నిశీధిలా నీ జుట్టు'వంటి పంక్తు లెన్నో కవులు, కవితాభిమానులు కళ్ళ కద్దుకొంటారు.

'నా కథ వ్రాయవూ' అనే కథను వ్రాసిన బుచ్చిబాబు తన 'అంతరంగ కథనం' ప్రారంభించి ముగించనే లేదు. రచయిత జీవితానికీ, రచనల ప్రేరణకూ సంబంధాన్ని వివరిస్తూ వచ్చిన ఆత్మకథ తెలుగులో ఏ రచయితా యింతకుముందు వ్రాయలేదు. బుచ్చిబాబుకూడ అసంపూర్ణంగానే వదిలివేశాడు. ఏమిచ్చాడు? అనే ప్రశ్నకు జవాబుగా 'ముగింపు మీకు తెలుసు' అంటూ రారచయిత.! అవును. ఆయన వ్రాసిన ప్రతి రచనా ఆలోచనాత్మకమే, సౌందర్యమయమే, రసభరితమే.



దశకుమార చరిత్రము

"భాస్కర్"

పై శీర్షికతో సెప్టెంబరు 67 భారతి సంచికలో ప్రకటితమైన వ్యాసమును జూచుట తటస్థించినది. పై వ్యాసమును బురస్కరించికొనియు, ఎకాడమీ వారు ప్రచురించిన 'దశకుమార చరిత్ర' ముద్రణమును గూర్చియు నాకుఁ దోచిన కొన్ని యంశముల నిట ప్రస్తావించుచున్నాను. విజ్ఞులు పరిశీలింతురు గాక!

కేతన కృతిని యాంధ్రలోకమున కందించిన కీర్తి నవయుగవైతాళికుఁడైన కందుకూరి వీరేశలింగం పంతులుగారిది. వారు దశకుమార చరిత్రమును 1888 లో చింతామణి పత్రికయందు నాల్గాశ్వాసములు మాత్రమే ముద్రించిరి. అప్పటి కాపత్రిక ఆగిపోయెను. 1901 వ సంవత్సరమున మద్రాసు చింతామణి ముద్రణాలయములో ద్వాదశాశ్వాసముల పూర్తిగ్రంథమును మానవల్లి రామకృష్ణకవిగారి సహాయముతో సంస్కరించి ప్రకటించిరి.

1925 లో వావిళ్లవారు దీనిని శేషాద్రిరమణ కవుల పీఠిక (తొలిపలుకు)తో ముద్రించిరి. దీని పరిష్కరణ భారమును శ్రీ మద్దులపల్లి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు వహించిరి. ఈ సంవత్సరము ననే దీనిని 'Telugu classics popular Edition series'—అను శీర్షిక క్రింద శ్రీ బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రిగారి సంపాదకత్వమున వెలయించిరి.

1901 వ ముద్రణమునకు, 1925 వ ముద్రణమునకు నడుమ నెవరో ద. కు. చ.ను ముద్రించినట్లు 10-6-1915 వ తేదీన వీరేశలింగం పంతులుగారు ఆంధ్రపత్రికలో వ్రాసిన లేఖనుబట్టి తెలియుచున్నది. కాని వారు వివరము లియ్యరైరి. ఆ లేఖ తేదీ 7-7-'15. అది యిది.

'అయ్యా!

దశకుమార చరిత్రమును గూర్చి విూ యైదవ తేదీ పత్రికలో రాజమండ్రి విద్యార్థి వ్రాసిన దానిని జదివితిని. ఎంతో కష్టపడి పురాతన తాళపత్ర పుస్తకములను సంపాదించి సాహిత్యమును చక్కఁబఱచి వ్యయప్రయాసలకోర్చి పూర్వకవి ప్రణీత గ్రంథములను నేను ముద్రింపించి ప్రకటింపఁగా నితరులు వాని ననాయాసముగ మరల ముద్రింపించి ప్రకటించుచు వచ్చినందున నేనట్టి పుస్తకముల పునర్ముద్రణమును మానుకొంటిని. అట్టి పుస్తకములలో దశ. కు. చ. యొకటి. ఆ పుస్తకము లొక్క ఫారము తక్కువగా నూఱుప్రతులు నా యొద్దనున్నవి. ఆ పుస్తకము మిగిలిన ఫారమును నాలుగుదినములలో ముద్రింపించి పుస్తకమును సిద్ధపఱచెదను.

(పుస్తకము వెల పోస్టేజికాక రెండణాలు)

7—7—'15 కందుకూరి వీరేశలింగము

రాజమహేంద్రవరము'

పంతులుగారు వాగ్దానము చేసినట్లు ముద్రించిరో లేదో తెలియదు. ఎకాడమీ సంపాదకులకు వీరేశలింగం పంతులుగారి ప్రతి దొరక లేదు. నాయొద్దనున్న ప్రతినుండి వారి పీఠికను యథాతథముగా నాంధ్రలోకమున కందించుచున్నాను.

* * *

ఉపోద్ఘాతము

పూర్వకవు లనేకులు సంస్కృతమునుండి పురాణేతిహాసములను దెలిఁగించిన రీతిగా నే 'యభినవదండి' యను బిరుదనామముగల కేతనార్యుడు దండికృతమయిన దశకుమార చరిత్రమును సంస్కృతమునుండి

తెనిఁగించినవాఁడు. ఈ దండికృత వచనకావ్యమును పద్యకావ్యముగాఁ దెనిఁగించుటచేతనే యీతని 'కభినవ దండి'యన్న బిరుదు వచ్చినది. ఇత రాంధ్రకవులవలెనే యితఁడును సంస్కృత కావ్యమును సరిగా నాంధ్రీకరింపక కథాంశమును మాత్రము గైకొని వర్ణనాంశములను విశేషముగా విడిచియు మార్చియుఁ జేర్చియు యథేచ్ఛముగా రచన చేసియున్నాఁడు. ఈతని కవిత్వము కదళీపాకమయి సలక్షణమయి మనోహరముగా నున్నది. ఆంధ్రమునందుఁ గవిబ్రహ్మయని పేరొందిన తిక్కన సోమయాజియే దీనిని మెచ్చుకొన్నప్పుడు నావంటివాఁడు దీనిని శ్లాఘింపఁబూనుట వృథాయాసము. ఈ దశకుమార చరిత్రమును గూర్చి కవియే తన 'యాంధ్రభాషాభూషణము' నందిట్లు వ్రాసికొనియున్నాఁడు.

ఆ. కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చఁ
బరగ దశ కుమార చరితంబుఁ జెప్పిన
ప్రోడ నన్ను వేఱ పొగడనేల.

దశకుమార చరిత్రము తిక్కన సోమయాజి కంకితము చేయఁబడినది. కాఁబట్టి కేతన, తిక్కన సోమయాజితో సమకాలీనుఁ డగుటచేత నితఁడు పదమూఁడవ శతాబ్దము యొక్క యుత్తరార్ధము నందుండిన వాఁడనుట స్పష్టము.

మనదేశమునందలి లిఖిత పుస్తకస్వాములు తమ యొద్దనున్న పుస్తకములను దాము ప్రచురింపక ప్రచురింపఁ దలఁచుకొన్నవారికి వ్రాసికొనుటకైన నియ్యకపోయెడి దురాగతమువలన నీ యుత్తమకావ్య మించుమించుగా నామమాత్రావశేషము కావలసిన గతిని పొందెను. కొన్నిసంవత్సరముల క్రిందట నాంధ్ర దశకుమార చరిత్రము తంజావూరిలోని సరస్వతీ భాండాగారము నందున్నట్లు విని నే నచ్చటికిఁ బోయి చూచి పుస్తకమును వ్రాయించి తెప్పించితిని. ఆ ప్రతి యందుఁ గొన్నిభాగములు శిథిలము లయియున్నవి. సరి చూచుటకయి ప్రత్యంతర మెంత ప్రయత్నము చేసినను నాకు దొరికినదికాదు. అందుచేత నింకను నుపేక్షించినయెడల నీయున్న పుస్తకము కూడ నశింపవచ్చునని భావించి నాచేతనైనట్లుగా లేఖక ప్రమాద జనిత దోషములను సంస్కరించి నాలుగాశ్వాసములు చింతామణి పత్రికలో మూఁడు సంవత్సరముల క్రిందటఁ బ్రకటించి నాను. అప్పుడు చింతామణి పత్రిక నిలిచిపోయినందున నిటీవల మిగిలిన భాగమును గూడ సమగ్రముగా వేఱుగా ముద్రింపఁబూనియు నాకు దీక్ష లేకయు దేహారోగ్యము చక్కగా నుండకయు నాలస్యమగుచు వచ్చెను. ఇట్లుండగా నిచ్చట నా పరిచితులైన బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణయ్యగారు నన్నుఁ జూడవచ్చినపుడు తామీ గ్రంథమును ముద్రింపించుట కనుకూలముగా వ్రాసి యిచ్చెదమని వాగ్దానముచేసి యెంతో శ్రమచేసి నాయొద్దనున్న ప్రతిననుసరించి* పూర్ణముగా వ్రాసి యిచ్చినారు. ఆయన యీ సాయమును చేసి యుండని యెడలఁ బుస్తక ప్రచురమగుట కింకను నాలస్యమయి యుండును. ఈ సాహాయ్యమునకుఁ గృతజ్ఞత గలవాఁడనయి యాయన కనేక వందనములు చేయుచున్నాను. వ్రాఁత ప్రతియందుఁ గొన్నిచోట్లఁ గొన్ని యక్షరములును, గొన్నిచోట్లఁ గొన్ని పదములును, గొన్ని చోట్లఁ బాద భాగములును, గొన్నిచోట్లఁ బద్యములును బోయియున్నవి. చదువు వారికిఁ గథా సందర్భము తెలియుటకయి పోయిన భాగములను నేను బూరించి నాఁడను. అక్షరములును, జిన్న పదములును, గ్రొత్తగా వేసిన చోట గుఱుతులేవియు వేయలేదు గాని రెండు మూఁడు పదములను, పాదభాగములను బూరించిన చోట నా మాటలకు '( )'కుండలీకరణము చేసియున్నాను.

పంచమాశ్వాసములో 59 వ పుటయందు 19వ పద్యములో నుత్తరార్ధములో ముప్పాతిక భాగమును, 20వ పద్యమంతయు, 21 వ పద్యములో 'వింత తథ్యము సువిప్ర' యున్నది తప్పఁ దక్కినదంతయు నాచేతఁ జేయఁబడినది. ఈ ప్రకారముగనే దశమాశ్వాసములో 135వ పుటలో 97 వ పద్యమునందుత్తరార్ధమును, 98 వ

---

* వీ. వేంకటులుగారిట్లు వ్రాసినను 1924 రక్తాక్షి జ్యేష్ఠమాసపు పత్రికయందు (పుటలు 1-6) ద. కు. చ. లో 'నైదవ యాశ్వాసమునుండియుఁ గడపటికుఁ దన్ముద్రాపకులకు యథాశక్తి మేము మాతృకను ముద్రణమునకు సవరించి యిచ్చియుంటిమి.'

పద్యమునందుఁ బూర్వార్ధమును నాచేఁ బూరింపఁబడినవి. ఏకాదశాశ్వాసములో 151 వ పుటలో 70 వ పద్యమునందర్ధభాగము, 71 వ పద్యమునం దర్ధ భాగమును నాచే రచయింపఁబడినవి.

గత్యంతరము లేకపోవుటచే నీ ప్రకారముగా విస్పష్టములైన మాటలతో, బాధ, పద్య పూరణములు చేయసాహసించిన నా చాపలమును దీనిం జదువువారు మన్నింతురని వేఁడుచున్నాను.

ఇప్పుడయినను దశకుమార చరిత్రము సమగ్రముగాఁ దమయొద్ద నున్నవారు నా యందనుగ్రహించి తమ ప్రతిని దయచేసినచో ముద్రితములైన పద్యిపతులను వెంటనే పంపుటయేకాక ప్రక్షిప్త భాగములను మరల ముద్రింపించినపుడు పద్యిపతులనుగూడ వారికిఁ గృతజ్ఞతా పూర్వకముగాఁ బంపెదనని యిందుమూలమున వాగ్దానము చేయుచున్నాను.

చెన్నపురి, పరశువాకము కందుకూరి వీరేశలింగము.
20, వెళ్లాలవీధి.
20 నవంబరు 1901 వ సం.

* *

లక్షంకొలది ద్రవ్యమును సాహిత్య సేవకై వెచ్చించుచు ఎకాడమీవంటి సంస్థవారు పై ప్రతి కోసము గవేషణము చేయకపోవుట యత్యంత విషాదకరము. ప్రాచీనాంధ్ర గ్రంథములను శ్రమపడి సంపాదించి ప్రకటించిన కీర్తిమూర్తులలో బ్రౌనుదొర తరువాత వీరేశలింగంపంతులుగా రెన్నదగినవారు. మనకోసమై మహనీయుఁడైన వీరేశలింగంపంతులుగారు గ్రంథ ప్రకటన విషయమై యెట్టి యిడుములఁ బడిరో తెలిసికొని శ్రద్ధాంజలి సమర్పించుటకు బదులు వాంధ్రవిద్యల్లోకమును ఎకాడమీవారు కృతఘ్నతాబద్ధులను గావించినారు.

ఇక నేటి ముద్రణ సంపాదకత్వ విషయమును గూర్చి:—

1. దశకుమార చరిత్రకు ఒకేఒక తాళపత్ర ప్రతి నేటివరకు లభ్యమైనది. అది తంజావూరు పుస్తకశాలలో గలదు. దాని ననుసరించి వ్రాయించిన వ్రాతప్రతి కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్ కార్యాలయమున గలదు.

2. 1901 ముద్రితప్రతి తంజావూరు ప్రతికి ప్రతిక. తాళపత్ర గ్రంథములోని లుప్తభాగములను కం. వీ. పంతులుగారు పూరించిరి. కాని సప్తమాశ్వాసాంతమాలినివిగాని గ్రంథాంత పద్యములనుగాని వీ. పం.గారు పూరించక వదలిరి.

3. 1925 లో ముద్రించిన ప్రతికి 1901 ముద్రిత ప్రతి ఆం. సా. ప. కాకినాడ వ్రాతప్రతి యాధారములు. మూలతాళపత్రప్రతికి వ్రాత ప్రతి ప్రతిక గాన రెంటియందును లుప్తభాగములు సమానములు. వావిళ్లవారికి శ్రీ మద్దులపల్లివారు స్వయముగా లుప్తభాగములను పూరించుటయేగాక నాశ్వాసాంత పద్యములనుకూడ వ్రాసి చేర్చియుండిరి. వావిళ్లవారి ముద్రణమునకు ముందు అనగా 1924 భారతి పత్రికలో శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు దశకుమార చరిత్ర పాఠములను (ముద్రిత ప్రతి - 1901 లోని) విమర్శించిరి. వీ. ప. ప్రతిలో లేని రెండు పద్యములనుగూడ చూపిరి. బహుశః దీనిని బట్టియే వావిళ్లవారు ద. చ. పునర్ముద్రణావశ్యకతను గుర్తించి శ్రీ మద్దులపల్లివారిచే పరిష్కరింపచేసి ప్రకటించిరి.

4. ఎకాడమీ సంపాదకులకు 1901 వ ముద్రణము లభించని కారణమున 1925 వావిళ్ల ముద్రణమునే (అధోజ్ఞాపికలతోసహా) ముద్రణమున కిచ్చిరి. వీరి సంపాదకత్వ మిందేమియు గోచరించుట లేదు. సంపీక్షాకర్తల కొన్ని వాక్యములిట విమర్శనీయములు—

(i) 'శ్రీ మద్దులపల్లి వేంకట సుబ్రమణ్య శాస్త్రిగారు విద్వాంసులు— పరిష్కారామభవముకలవారు ఈ గ్రంథాన్ని తాళపత్ర ప్రతితోను........................ పూరించినవారు శ్రీ శాస్త్రిగారే' పుట (పుట—51. ఎకా. ము. 1967) అనియున్నది. కాని 50 వ పుటలో (1901) అముద్రితప్రతినీ, ఆంధ్రసాహిత్య పరిషత్తులోని వ్రాతప్రతినీ ఆధారముగా తీసికొని బ్ర. శ్రీ.

మద్దులపల్లి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు......... పరిష్కరించి యిచ్చినట్లున్నా' కలదు. శ్రీ మద్దులపల్లివారు పరిశీలించినది వ్రాతప్రతిగాని తాళపత్రప్రతి గాదని శేషాద్రిరమణ కవుల 'తొలిపలుకు' (1925) వల్లనే స్పష్టమగుచుండగా సంపీక్షాకర్తలెట్లు పై వాక్యములను సమన్వయింతురో!! ఈ సందిగ్ధము శ్రీమద్దులపల్లివారే స్వయముగా పత్రికా ముఖముననే తెల్పినచో కృతజ్ఞుడను.

(ii) ప్ర. ఆ. 73 వ పద్యము :-

"ఇమ్మడి మనుమని తమ్ముఁడు......ముల్లోకములన్!'

ఈ పద్యము శ్రీ పీ. పం. గారి ప్రతిలో కానరాదని 'అథోజ్ఞాపిక'. సంపీక్షాకర్తలకు 1901 వ ముద్రణము (కం. పీ) దొరకలేదు గదా! లేదని యెట్లు వ్రాయుదురు? ఈ విషయము 1925 ప్రతిలో (వావిళ్ల) 73 వ పద్యము (ఇమ్మడి) వద్ద లేదుగదా!! ఇక్కడి కెట్లు వచ్చినది? దీనికి సమాధానమును సంపీక్షాకర్త లివ్వవలసిన బాధ్యతగలదు. వాస్తవమునకు పై పద్యము 1901 (కం. పీ) ప్రతిలో గలదు.

నాకు తోచిన విషయములు విద్వల్లోకమునకు వెల్లడించితిని. ఇందలి బాగోగులను పరీక్షించుటకు వారే సమర్థులు. ప్రాచీనాంధ్ర గ్రంథముద్రణ, పరిష్కరణల విషయమై మానవల్లి వారి వాక్యము నిట నుదహరించుచు నీ వ్యాసమును ముగించుచున్నాను.

'ప్రాచీనాంధ్ర గ్రంథములలో నొకటి రెండు మాతృకలతో ముద్రింపబడియుండి సమస్త గ్రంథములను శుద్ధములుకావని మా యభిప్రాయము... ఎఱ్ఱాప్రెగ్గడ నృసింహ పురాణము, కేయూరబాహు చరిత్ర, ఉత్తర హరివంశము, దశకుమార చరిత్రము, క్రీడాభిరామము, భీమఖండము మున్నగునవి యబద్ధపాఠ పూరితము లనుటలో సందేహము లేదు. (1924 జూన్ భారతి.)



ఉగ్రాటవి

శ్రీ సోమసుందర్

మంచిపరుకువంటి సౌందర్యం
ముస్తాబయి నిల్చున్నది బజారులో
ఉరోజ మధ్యస్థమైన కలుగులోంచి
బుభుక్షోరగం పడగెత్తి ఆడుతోంది.

అన్యాయం తాలింఖానాలో
వ్యాయామం చేస్తోంది న్యాయం
గానం కడుపు గడవక
మానం పణంగా పెడుతోంది.

బాధలతో నిండిన బతుకు
వానలో తడిసిన గొంగళీపురుగు
భారంగా నడుస్తోంది; పొంగిన పురుగు
ప్రమాతీత పదార్థంలా సాక్షాత్కరిస్తోంది.

నా జాతి స్వప్నాలు పరిపక్వం కాకుండా
చిట్లిపోయిన పక్షిగుడ్లు

ప్రగతిపథంనిండా పరపీడకులు
పరచిన పీడకలల నీడలు.

ద్యూతవ్యసనంలో చిక్కుకున్న
నేటి ప్రజాపాలకుడైన నలుడ్ని
అధికార వ్యామోహ వ్యాజమనే
కర్కోటకుడు కాటు వేశాడు!

రూపు చెడి
పచ్చిభౌతిక వాదంలా
వికారంగా మిగిలి
దురాశా వ్యాఘ్రవ్యాళ గండభేరుండ

నిరంతరోగ్రాటవీ వ్యగ్రుడై
త్యాగాల పూర్వసువాసనల్ని
ప్రసారం చేస్తున్నాడు—
స్వార్థలోభగ్రస్తుడైన బాహుకుడు!

శ్రీ మరింగంటి వేంకటనృసింహాచార్యులు వారి
తాలాంకనందనీ పరిణయము

శ్రీ శేషం రామానుజాచార్యులు

ఉత్తమ ప్రబంధ వర్ణన ధోరణిలో కవిత్వము నడిపి సరస హాస్యచతురోక్తులం గూడి చిత్రకవిత్వరీతులను సర్వంకష ప్రౌఢిమచే జతపరచి నిగూఢ తత్త్వభావములు పామరులకు సైతము అర్థమగుటకై హృద్యములగు సందర్భముల కలము నడిపిన రీతులు సహజత్వమును స్ఫురింపజేయు మహాకవీశులు మరింగంటి వారి వంశమం దుద్భవిల్లిరి. అందు శతఘంటావధానులు, శతాధిక గ్రంథకర్తలు, చిత్రకవిత్వ ప్రబంధ నిర్మాతలు గలరు. వీరి వంశము సుకృతమైనది. శ్రీ రంగేశ్వరుని వాక్యమువలన ఈ వంశీయులు మరింగంటివారైరట. ప్రౌఢరచనాధురీణుడగు 'తాలాంకనందనీ పరిణయము' కర్తయైన మరింగంటి నరసింహాచార్యులు వారి వంశము గూర్చి నుడివిన యొక చిన్న కథ నిట యుదాహరింతును. శ్రీ రామానుజాచార్యుల వారును కురుశేఖర సాధుభట్టారకులవారును శ్రీరంగములోని రంగనాథుని సేవించుటకై వెళ్లిరట. అప్పుడా రంగేశుడు యతిరాజును జూచి యిట్లు పలికెనట.

'కంటిమి మిము కూరేశుల
గంటిమి మీవెంట వచ్చు ఘను లెవరో మరిం
గంటిమని పల్కినది మా
కింటికి పేరుంట నా మహిన్ రహికెక్కెన్.

అని తన స్వీకృతమయిన 'తాలాంకనందినీ పరిణయము'లో పేర్కొన్నాడు. ఈ గ్రంథము సంస్కృత సమాసభూయిష్ఠము. ఇది సుమారు క్రీ. శ. 1872 ప్రాంతమున ముగింపబడినదని 'గోలకొండ కవుల సంచిక'ద్వారా పేర్కొనవచ్చును. శశిరేఖ, అభిమన్యుల వివాహకథ యిందు చక్కగ గూర్పబడినది. మేనరికపు వివాహవ్యవస్థల నిందు చక్కగా చూపించినారు. తాలాంకనందని యనగా శశిరేఖ. తాలాంకుడు బలరాముడు.

'నీలాంబరో రౌహిణేయస్తాలాంకో ముసలీహలీ:' అని అమరము. ఇందు అన్న కుమార్తెను తన కొడుకునకు చేసుకొనవలెనని సుభద్ర యభిలషించును. ఇట్టి సంబంధములెల్ల ఆంధ్ర కుటుంబీకులకు పరిచితమే. ఈ కథ నాధారముగా జేసికొని గ్రంథకర్త షష్ఠ్యాశ్వాస ప్రబంధము నిర్మించెను. ఇతని కవిత్వమం దనేక యమక శ్లేషాలంకారములు ప్రయోగములు కానబడును. అర్థాంతరన్యాసములు కన్పించును. యమకమన్న ప్రీతి మెండితనికి. నారద పాత్రను బహు చమత్కృతిగా వర్ణించినారు. పాండవు లైశ్వర్యహీను లని దుర్యోధనుని సంబంధము కోరదగినదనియు నచ్చజెప్పి బలరాముని మనస్సు త్రిప్పెను. శశిరేఖను లక్ష్మణ కుమారున కిచ్చి పెండ్లిచేయుటకు సర్వసన్నాహములు జరుగుచుండగా, అభిమానవతియైన సుభద్ర సోదరునితో నిష్ఠురములాడి 'పుట్టిల్లు' విడిచి కుమారునితో పాండవులున్న అడవికి బయలుదేరుట— ఇత్యాది ఘట్టముల ఆంధ్ర గృహస్థుల యిండ్లలో జరుగు సన్నివేశముల మనమునం దుంచికొని యీ భాగమును కవి మిక్కిలి హృదయంగమముగా చిత్రించెను. లక్ష్మణ కుమారుని వ్యంగ్యచిత్రీకరణ అతిసహజముగా గూర్చినారు. 'లక్ష్మణుడు గాడు నీ డవలక్షణుండ'ని చమత్కారముగా నుడివిరి. ఘటోత్కచునకు ఈ ప్రణయవృత్తాంతము తెలిసి తన మాయాశక్తిచే శశిరేఖ నెత్తుకొనివచ్చి యభిమన్యుని పెండ్లి చేయించును. గౌరవభంగముకాకుండ ఘటోత్కచుని పాత్రకు వన్నె చేకూర్చుటకై యాతని మాయాబలముచే 'మరదలు ముట్టకూడ'దని మంచము

తోడనె లేవనెత్తెవాడట. ఎంత రాక్షస సంభూతుడైనా, పాండవ సాంగత్యముచే కలిగిన నైతికవర్తన యిందు ద్యోతకమగుచున్నది.

వచన రచనలోను, వీరే ప్రబంధకవికి తీసిపోరు. ఘటోత్కచుని మాయాజాల యుద్ధవర్ణన ఫక్కి, ఎట్టన రణరంగమును స్ఫురింపజేయును. ప్రాసక్తికముగా యమక శ్లేషాలంకార ప్రయోగము నడిచినది.

విరహవర్ణనలలో చంద్ర, మన్మథ దూషణలు కన్పించును. సౌభద్రుని రాక లేమిచే నైరాశ్యము చెందిన శశిరేఖ కుసుమాస్త్రుని బాధల తాళజాలక, మన్మథుని దూషించును. 'తుంటలై నీ విల్లు ధూళి లోన నణంగె' అను పద్యము ఉదాహృతము. ముద్దులొలికెడి సుకుమారమైన రచనకూడ వీరు సాగింతురు.

ఎండకన్నును నీడ కన్నెరుగకుండ
పాదముల ముద్దరాలొత్త బరగు సతికి
ఎండకన్నును నీడ కన్నేకమగుచు
పాదముల ముద్దరాలొత్త పదిగమించె.

ఘోరదుర్గాటవిలో సుభద్రాభిమన్యులు పయనించుచు చూచిన దృశ్యముల నించుక నెట్లు చిత్రించెనో పరిశీలింతుము.

ఈ రీతి సర్వరాత్రిని
ఘోరాటవిలోన జొచ్చి కొడుకుం దావ
య్యేరులు, పల్లేరులు, న
ల్లేరులు పాదశల్ల గడిచె యేగుటవేళన్.

ఇట్లు గడచి నొక కొంత విశ్రాంతిపొంది, యా రాకుమారుడు గాంచిన దృశ్యములను చిత్రీకరణ మొనర్చిన విధమున కొన్ని చూతము. ఉత్సాహవృత్తములో వారిట ప్రదర్శించిన ఔచిత్యము ప్రశంసనీయమే. ఇందలి వస్తువులన్నియు చతుష్పథములవే.

ఉ. 'రాకుమార శేఖరుం డరణ్య భూమిగాంచె
భల్లూకముల్ వనౌకముల్,
జలూకముల్. బలాకముల్ ఘూకముల్,
మహోకులోగ్ర కూకముల్, బలాకముల్
దాకి మూకలై చికాకు
గాకొనంగ చైకొనెన్.

జీవజంతువులేకాక ఆతడు చూచిన వనావళుల నించుక చిత్రిత మొనర్చి దృశ్యమానమోద మొనర్చుచున్నాడు.

చవిచవి కాంచె ముందట
రసాలతమాల విశాలసాల
చందన కృతమాల కౌశుకర
దధ్రుకపిత్థ కురంట కాభయార్జున
వకుళామ్ల పీత నఖరోచన
తాల కదంబ నింబ కాంచన
కరవీర...జంబైత్ర వట
ప్రముఖద్రుమావళుల్.

ఈ రీతిగా జనగా జనగా తూరుపు తెల్లవారినదట. పద్మములు వికసించినవట. శరము లమ్ములు ధరించి వీరవిక్రమ సాహసముతో విపినములు, శైలములు, వాహినులు దాటి ఘటోత్కచా శ్రమము చేరినాడట. రమణీయ మందిరారామ సౌఖ్యములు పొందుతల్లి ఘోరాటవిలో సంచరించవలసివచ్చె, సరోవర క్రీడాసుఖము వీడి బురదలో తిరుగాడవలసె, కమనీయతరతూలికాతల్పముల సుఖించు జనని చేటుల దర్భల పెజ్జపై శయనించగలిగె, కొంచెన మయడోలికా విద్రలు తొలగి కంటకస్థలిపై విద్రించ సాగె, మంజుల మనోహరమైన శుక పిక శారికావళుల తీయందనపు పాటలు వినవేర్చిన, యింతి కఠినతర శరభ శార్దూల ఘోషణముల విననాయె గదా, విధికృతమేమందు నంచు తన మామచేసిన యపకృతి మరువ రాదు గదా యనుచు చింతాక్రాంతుడై దూరపిల్లచు అమిత మార్గాయాస మూహించి, తల్లికడ శయనించిన శశిరేఖను మనమునందు తలంచుచు, పిన్నతనంబు నుండి అధికమైన ప్రేమచే ముచ్చటలాడి తిరుగాడితిమిగదా! కన్నెతనంబువీడి వయసెన్నడువచ్చి మన్నన తోడ గైకొందునో, నను కన్నునెడ సేయ న్యాయమా! యని మదనాయాసము కల్గి కుందిపోవును.

అభిమన్యునియెడ కవి ప్రవర్శించిన మనోభావ వ్యక్తీకరణము, విరహతాపాతిశయము మేళవించి, యాతని యెడ నాటకీకరణము ప్రదర్శనౌచిత్యము నాపాదించి చక్కని రసపుష్టి కలిగించినాడు.

వీరి రచనలో కొన్ని కొన్ని 'విజయ విలాసము' కళాపూర్ణోదయ మందలి పద్యముల స్ఫురించుచుండును.

గొప్పసీలవుకుప్ప లప్పమోపరిలెప్ప
అప్పడంబుక...కప్పకొప్పు
మరువాలుగమివోలు మరివాలుగలసేలు
కథకీలు చెరివాలు గనులడాలు
కంబు బింకంబు పోగంబు పొక్కంబు ని
క్కంబు బింబోష్ఠి కంఠంబు డంబు
కల్కిచిల్కల కుల్కు మెల్క క్రొవ్వుపల్కు
కులుకుతేనియ...బల్కుచిల్కు
తమ్మిలద్దమ్ములను గ్రమ్ము నెమ్మొగంబు
మించు క్రొమ్మెరచు మించు నెమ్మేనిసంచు
చక్కవలకెక్కు మతికెక్కు చన్నుదోయి
....

శృంగార అహల్యా సంక్రందనమందలి ప్రథమ, తృతీయాశ్వాసములలోని 'కన్నులు జేరలన్ గొలు వగా' అనునది, 'ఏల సృజించె' అనునవి సామ్యములు—ఇట్లే అనేక తెనుగు ప్రబంధములతోడి సామ్యముగల దీ చక్కని ప్రబంధము.

ఈ ప్రబంధమందలి చతుర్థాశ్వాసము ప్రాణము వంటిది. ముఖ్యమైన కథ, పాత్రలు, వర్ణనలు అన్నీ యిందులోనే కూర్పబడినవి. ఘటోత్కచుని మాయ, మాయా శశిరేఖ, వివాహ ఘట్టములు మొదలగునవి వర్ణితములు. బలరాముని కూతురగు శశిరేఖ ఈ కవి గారికి మోముగన్న మాత్రనే నామము శశిరేఖ యనుచు దోచెనని యనుట ఎంతయు సమయస్ఫూర్తి సూచితము. వీరి కవితయందు సమసోక్తులు, జాతీయములు హితబోధ అంతటా నిండియుండును. ప్రబంధ నాయికలకు ప్రియుని సమాగమ నిరీక్షణయందు, ప్రియభావనలు వ్యక్త మొనర్చుటకు, తెల్పుటకు యొక దూత్యవస్తువు కావలెను. ఇందు ఈ శశిరేఖకు చిలుక యుపకరించును. హృద్యమైన రచనా ధోరణిలో సాగిన 'శుకదూత్యము' యందలి చక్కని ఘట్టము. అభిమన్యుడు పంపిన సందేశములో, 'తను నెడబాసిన మొదల్......తదేక విలోకన జృంభణమున నున్నవాడ ననుమా అనుమానములేక కీరమా' అని విన్నవించిన తీరు ఏ రసికునకైనను మనస్సు గిలింపక పోదు. అమరప్రేమానుభూతి వారి సొత్తు. వీరు తెలుగు పలుకుబడులలో గడుసరి రచనల యందు సిద్ధహస్తులు. కౌరవ పాండవుల మధ్య వియ్యమునకు పూరికొన్న తాలాంకుని రాధారమణుడు సుభద్ర యెంత వారించినను వినడు. వారి నెయ్యమే గొప్పది. సామ్రాజ్యాధిపత్యము, యిష్టభోగ సంపద కలిమిచెలిమి గలవాడు రారాజు అని విఱ్ఱవీగును. నయోక్తుల చెల్లెలిమాట చెవి పెట్టడు. కౌరవులు మాత్రము చుట్టములు గారా, అని ఎత్తిపొడుచును. సుభద్ర కమలనాభుని చెంతకు వెళ్లి పాండవుల బాధ్యత యొక్కనాటితో తీరునదికాదు కదా: అన్నా! 'తగునా, భవదగ్రజు డిట్లగు నాయము దప్పి కన్య నన్యుల కిడ మేలగునా, నేటికి వీరకున్, తెగునా పాండవులతో నధికబాంధవ్యముల్' అని బ్రతిమాలును అయినను కృష్ణుని మాటయు సైతము తాలాంకుడు తిరస్కరించును. పైగా దురుసుగా మాటలాడును.

'నిష్కారణ భక్ష్యభోజ్యములకై నెడ ద్రోయుచు చేదుకాయలున్, గోరి భుజించునట్లు లోనగూడిన'దట పాండవుల బాంధవ్యము. ఇకను 'దుర్వార గహనవన్యశైలాగ్రచరు'లట పాండవులు. కావున వారికి నా కూతు నివ్వనని నిష్కర్షగా చెప్పినాడు. ఇట్లు ఆంధ్ర కుటుంబినుల యిండ్లలో జరుగు వివాహ వ్యవస్థ యందలి అగచాట్లు సంభాషణరీతిలో చక్కగా తెలియ జేసినాడు. సంభాషణలయందు నిగూఢ తత్త్వమును స్ఫురింపజేయును. ఈ విధముగా హలాయుధుచే నిరాకరింపబడిన సుభద్ర దురంతచింతిత స్వాంతయై సాయంతనమున అలుకచెంది, యొక చీకటింట; 'శుద్ధాంతము జేరి యొక్క శిరినావని కంకటికయ్య పైని, మేనంతయు జేర్చి, లోవెతల నేరికి దెల్పక' బాధ బడినదట. లోగ సిరి చీకటింటికడ కంకటి పైన శయనించి పొందిన విషాదవేదనాభరితయైన సత్యభామ యందు స్ఫురింపకపోదు.

శుకదూత్యము :

పంచమాశ్వాసములో మాయాశశిరేఖ వివాహము, కౌరవుల శృంగభంగము, ఘటోత్కచుని

ఐంద్రజాలిక విద్యాప్రదర్శనము చాలా చక్కగా చిత్రించబడినది. ఇందు మరియొక్క ముఖ్యమైన ఘట్టము శుకదూత్యము: శశిరేఖ తాను పెంచిన చిలుకతో, ఎప్పుటనైన గంటివా! అర్జున సుతుని, కన్నచో తనికి నా విరహబాధను గూర్చి చెప్పుమని అట్లు చెప్పిన, 'పానకంబును పడపప్పు పంచదార కలిపి బంతి సాగించి విందొన రింతు చిలుక' అని ఫలకాంక్ష తెలియజేయును. అట్లే అది రివ్వున యెగసి; ఘటోత్కచాశ్రమములో నున్న అభిమన్యుని చూచి తిన్నగ ముచ్చటించి శశిరేఖ బాధం తెలియజేయును. విరహభ్రాంతయై విప్రలంభ శృంగారము పొందిన తీరును, లక్షణము లను తెలియజేయును.

'అంగన నిన్ను చిత్రపట
 మందు లిఖించు, లిఖించి కోర్కెలు
పొంగగ జూచు, జూచి వలపుం
 గొని మెచ్చును, మెచ్చి నీ పరి
ష్వంగము కోరు, కోరి వల
 పంతల జింతిలు, చింతిలన్ మన
స్సంగతి నూర్చు, నూర్చి పర
 పంబు విసంబుగ దాన మాగొనన్.'

ఇది విని అభిమన్యుడు గూడ 'నేనట్లె బాధ పడుచున్నాను. ఇదిగో నేడే లగ్నమనగా నే వత్తునని' సందేశ మంపును. ఈ సందేశము గొని చిలుక కఠిన శిలా వృత భూస్థలి శయనించియున్న ప్రియుని మనోవేదనను శశిరేఖకు వ్యక్తీకరించును. 'నిద్దురలేకతపించుచు ఎప్పుడు నీ రూపమునే తలంచుచు, సౌఖ్యముల త్యజించుచు వియోగసాగరమునబడి నిను బోలు సతినెందు గాన నంచు నీరు నించిన కను లప్పళించి, నీకొరకె తపించు చున్నాడని' అతని సందేశము గొనివచ్చును. ఈ విధముగా ప్రియులవద్ద రాయబారము నెరపిన 'చిలుక' పాత్ర నతిసమర్థముగా ప్రవేశపెట్టి ఫలవంతముం జేసినాడు.

ఇంతేకాక ఆ చిలుక సర్వజ్ఞమట. బంగరు చిలుకా నీ వలె నింగితము లెరుంగ జాణలెవ్వరు? నీ వాక్సంగతుల నేర్పు దనరకురంగాక్షికి దెల్పు పోయిరమ్మని పంపగా రివ్వున నెగసి యువ్వనజాక్షి సౌధమందు డిగ్గినదట. అత్యంత కుతూహల సంజనితాంతరంగయై యా కురంగనయన, ఓయి! శుకరాజ వచ్చితివా, యిచ్చట గంటి వర్జునాత్మజు నీవున్, బోయిన కార్యమెల్ల కాయెనో పండో వచింపుమని వేడుకొనినది. ఘటోత్కచు మందిరమున నిద్రించుచున్నవాడు ఎప్పుడు నీ హృదయ మందే లగ్నమయి యున్నవాడు—అని శుకము చెప్పినది. అంతేగాక విరహభ్రాంతి సూచించినది. విప్రలంభ శృంగారముకూడ ద్యోతకమగును. 'కనునిద్దుర లేక తపించువాడు, సౌఖ్యముల త్యజించును. నిను బోలు సతిన్ గననంచు నీరునించిన కనులప్పళించు చిత్తరువందునిల్పి నిన్నే తలంచు' నని విన్నవించినది. ఇట్టి రాయబారములు అనేక ప్రబంధములందు కన్పించును. హంస, చిలుక, తుమ్మెద, మేఘములు దూతలు. వుణికి పుచ్చుకొన్న ప్రబంధ రచన వీరిది.

రౌద్రరసము నందలి వీరి ప్రతిభ నన్నయగారి భీముని స్ఫురింపజేయును. ప్రకటిత కోపవేగమున అను పద్యము రౌద్రావేశమున దంత్య ప్రస్ఫుట మగును.

'పెటపెట పండ్లు గీటుచును
భీమ పరాక్రమ కంతకాహా
ర్భటి దశదిక్తటుల్ బెటిలి
బ్రద్దలుగాగ హుటాహుటిన్ స్వదో
స్తటి పటుఘాటనల్ సెలగ
తర్జన భర్త్సన సూపుచు న్నట
న్నిటలతటాక్షు నింబలెను
నిర్భయుడై చనుదెంచి యిట్లనున్.'

కోప భయ ప్రకట సూచితమగు ట కార ప్రయోగమువలనను దంత్యముల ఉచ్చారణ వలన కోప స్ఫురణమగును.

కవి విశ్వశ్రేయోభిలాషి. స్వల్పాంశమునైనను భావానుసరణముగను సమయోచితముగను వర్ణించి నీతిబోధక శైలిలో తన రచన కావించును. కావ్య

ములలో హితబోధ కావించును. ఇతడు నైజాము రాష్ట్ర వాసులగుటచే ప్రాసక్తికముగా, ఉర్దూ భాషాపదములు ప్రయోగించెను.

అచటచ్చట జాతీయము లుపయోగించి కావ్యమున ఔచిత్యము కాపాడిరి. 'వేళకు కూరలేక పలవించెడి వానికి వంటయింటి కుందేలును గాంచినట్లు రుగుదెంచి'నాడట భీమసుతుడు. అభిమన్యు ఘటోత్కచుల యుద్ధవర్ణనము చక్కగా చిత్రీకరింపబడినది. ఇతడు భారత కవులను అనుసరించియు స్వయముగా ప్రతిభను గూడ చూపినాడు. వారిరువురును సమముగా దేహము జల్లెడయగునట్లు శరాసనముల వేసికొనిరట. 'నరచాపప్రవిముక్త దారుణ బృహన్నారాచధారల'ను పద్యమునకు చక్కగా ప్రతిబింబించునట్లు 'ఈ రసముల్ దొలంగక' అనుపద్యము చిత్రించినారు. రణరంగమున భుజపరాక్రమోన్నతిచే యిరువురు సములు కాగా, శరధాటి కెరలిన శోణితాంచితశరీరములు 'భూరి వసంతకాలమున పూచిన మోదుగుపూవులో' యనునట్లున్నవట. చక్కని యుపమానము. దేహమంతయు రక్తసిక్తము. ఇదియుగాక వారిరువురు వ్యాయామకర్కశ స్థిరకాయులు. నన్నయగారి మల్లయుద్ధ వర్ణనము ఇందు స్ఫురింపకపోదు. భీమజరాసంధులు, సింహ గజేంద్రములట్లు వజ్ర పర్వతముల యట్లు పోరాటము సలుపగా, ఇచట విజయనందనుడు, భీమసుతుడు.

పోరి పోరి బెబ్బులు లట్టుల
నిరువురు బలములను దక్కువెక్కువలేకన్—
కరికరియున్ గిరిగిరియున్
హరిహరియున్ బెనగినట్టు వాహవమయ్యెన్.
(చ- ఆ - 287 పద్యము).

వారిరువురి ఘోర సమరము నానాటికి హెచ్చుచుండగా ప్రళయ ఝంఝూ మారుతములో, లయకాయ దండధరుని అట్టహాసములో యనునట్లు పోరాడిరట.

'ధరణీతలంబు దద్దరిల్లె
తారలుగూలె నభంబు దిర్దిరన్
దిరిగె సుధాంశు భాస్కరుల
దీధితి క్రుంగెను బద్దలై దిశల్
దెరిచెను పచ్చిగోడల గ
తిన్ జతురంబుధు లింకె నద్రులున్
మొరసె నభంబునన్ సురస
మూహము లార్చె విమాన పంక్తిత
త్తరమున డుల్లెనాయువు ధ్రు
వంబనగెన్ ప్రళయాంత సూచనన్'

ఇతని కవితలో ఎన్నియో ప్రత్యేకకూర్పులు కన్పించును. బంధకవితలు, గర్భమధ కవిత లున్నవి. తన సహజపాండితీ గరిమచే 'సోష్ఠ్య ద్వ్యక్షర కందము' రచించి ప్రతిభ వెలయించెను.

మాపో (పా) భూభామామా
మాపై బ్రాము బాము మాపుమి ప్రాపై
మీ ప్రేమ బావ మీపై
మా పాపము మోపు బాపుమా మా బాపూ!

శశిరేఖ ప్రియుని నెడబాసిన ఘట్టమున విరహ భ్రాంతి సూచించుచు, చంద్రమన్మథ దూషణలు కావించిన సందర్భమున గూర్చిన పద్యములు చాలా చక్కగా నున్నవి. ఇందు వంశక్రమానుక్రమణిక, ఋతువర్ణనలు, వచన రచన, ఫలశ్రుతి మున్నగునవన్నియు గూర్పబడినవి. ఇది చక్కని రసవత్ప్రబంధము.

ఈ కవి ఆశ్వాసాంతమున వేంకటాచలపతి వరప్రసాద కరుణాలబ్ధుడనని—భావనాచార్యుల పుత్రుడనని—మౌద్గల్యగోత్రుడనని తెలిపియున్నాడు. ఈ ప్రబంధమును గూర్చి యింకను ఎన్నో అంశములను వ్యాసవిస్తరణభీతిచే స్పృశించలేదు. ఆశ్వాసాంతమున వివిధవృత్తముల నుపయోగించినాడు తనను గురించి

'ఇది శ్రీశేషకుభృచ్ఛిరస్తటకుటీ
రేఖానువర్తి ప్రథా
మృదు శ్రీవాసగురుప్రసాద కలనా
మేయార్థ్య మౌద్గల్యవం

శ్య దయా సంయుత భావనార్యజని శ
శ్వచ్ఛీ నృసింహార్య మో
హద తాలాంక సునందనోద్వహ చతు
ర్థాశ్వాస మొప్పున్ భువిన్'

(చ-ఆ - 353 - ప)

అని చతుర్థాశ్వాసాంతమున తెలుపుకున్నాడు

ఇట్టి అత్యంత ప్రామాణికమైన ప్రబంధమును గుర్తించి ఆంధ్ర సారస్వతపరిషత్తు లేక సాహిత్య అకాడెమీలాంటి సంస్థలు గైకొని ప్రాచుర్యభాగ్యము కల్పించి మన (మా జిల్లా) ప్రాచీన తాళపత్ర గ్రంథాల దుస్థితి తొలగించి, వాని పునరుజ్జీవనమునకు పూను కొనిన సాహితీసేవ యొనర్చి ఆదర్శవంతులగుదురని విశ్వసించుచున్నాను.



గ్రంథ విమర్శలు

వేద సమీక్షా

సంపాదకులు : డాక్టరు ఇ. ఆర్. శ్రీకృష్ణ శర్మ
ప్రకటన కర్తలు : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటి, తిరుపతి. రాయలు 1/4 సైజు, పేజీలు 176 పోక్ కాలిక్. వెల రు. 6—00.

ఇది 1964 ఫిబ్రవరిలో తిరుపతిలో జరిపిన వేదసంబంధమైన సెమినార్‌లో చదివిన వ్యాసముల సంకలన గ్రంథము. వ్యాసకర్త లందరును వేదవిద్వాంసులు. వారిలో కొందరు ప్రాచీనపద్ధతి వారు, మరి కొందరు పాశ్చాత్యరీతులను అవగాహనము చేసికున్న ఆధునిక పద్ధతి విద్వాంసులు. ప్రాచీన విద్వాంసుల వ్యాసములు సంస్కృతభాషలో దేవనాగరలిపిలో 44 పేజీలలోను, ఆధునిక విద్వాంసులవి ఆంగ్లభాషలో తక్కినభాగమందును గలవు. ఈ రెండింటి సమ్మేళనము వలన ప్రాచీన పద్ధతులును నవీన పద్ధతులును ఏ ఏ మార్గములలో ఉపయోగపడునో, రెండిటి అవగాహనము వేదస్వరూపము పరిపూర్ణముగా గ్రహించుటకు ఎంత యవసరమో బోధపడును. వేదమందు శ్రద్ధాభక్తులు కలవారందరును ఈ గ్రంథరాజము ఆమూలాగ్రముగా పఠించి మననము చేయదగినది. ఆంధ్ర, మదరాసు, కేరళ, మైసూరు రాష్ట్రములలోని కళాశాలలనుండియు విశ్వవిద్యాలయములనుండియు ఉద్దండ వేద పండితులు సమావేశములో పాల్గొని కృతార్థులైరి. అందుచే ఈ వ్యాసములో వైవిధ్యమెంతయో ప్రదర్శింపబడినది. డాక్టరు కె. సంపాతిరావుగారు ప్రారంభోపన్యాసములో 'మనము చూడదలచుకొన్నది ఏదైనను వేదములో చూడవచ్చును. కెమిస్ట్రీ, ఆర్థిక జ్ఞానము, తత్త్వవిచారము—అన్నియు చూడదగును.' అనుచు కొంత హాస్య ధోరణితో ప్రారంభించిరి కాని ఆయా వ్యాసములు పఠించినప్పుడు, వ్యాసకర్తలు తాము చూడదలచినది వేదములో చూచుటకు ప్రయత్నింపలేదనియు, దేనినైనను వేదములో ఉన్నంత మాత్రమే శాస్త్రీయ దృక్పథముతో ప్రదర్శించిరనియు స్పష్టపడగలదు.

వేదోచ్చారణము అంతట నాకరీతిగానే ఉండునను ప్రతీతి కలదు. కాని ఈ సమావేశములో వేద మంత్రోచ్చారణములో గూడ గోదావరీ మండలము ఇత్యాది ప్రాంతములలోనివారి పద్ధతికిని, కేరళ విద్వాంసుల పద్ధతికిని ఎంతో తారతమ్య మున్నదని స్పష్టపడినది. అందులో ముఖ్యముగా సామవేద పాఠములో కేరళ విద్వాంసులకును తక్కిన ప్రాంతముల విద్వాంసులకును ఎంతో భేదము వ్యక్తమయినది. ఆ విషయమునే 'కేరళేషు వేదాధ్యయన సంప్రదాయః' అను వ్యాసములో శ్రీ ఇట్టిరవి నంబూతిరి స్పష్టముగా వివరించిరి. వారు సామవేదము జైమినీయశాఖలో పండితాగ్రేసరులేకాక శ్రౌతమర్యాదలు నేర్చిన అరుదైన విద్వాంసులు. సామవేద ప్రచారము ఇప్పటికి కొలది కాలము క్రిందటివరకు కేరళలో విస్తారముగా ఉండెడిది. తమశాఖ వేదమును అధ్యయనము చేయునది ఇతర శాస్త్రములు అధ్యయనము చేసెడివారు కాదు. వారి వ్యాసములో ఋగ్వేదము, యజుర్వేదము విషయములో కేరళ పాఠమునకును ఇతర ప్రాంతములవారి పాఠమునకును ఎక్కువ భేదము కనుపింపలేదు కాని సామపాఠమందు మహదంతరము గోచరించినదని వక్కాణించిరి. సామపాఠములో కేరళీయులలో కంపము అధికతరమై యుండగా, ఇతర ప్రాంతీయుల పాఠములో గీతస్వరములైన షడ్జాదుల కెక్కువ ప్రాధాన్యము చూపట్టినది. కేరళీయులు కేవలము మధ్యమస్వరమునే ఆశ్రయింతురుగాని సప్తమమగు నిషాదమును ఉపయోగింపనే ఉపయోగింపరు. అన్యదేశీయుల సామపాఠములో అర్వాచీనమైన సంగీత సంప్రదాయ ప్రభావము గోచరించినదని వారు ఉద్ఘాటించిరి. ఇది ముఖ్యముగా సామవేదాధ్యాపకులందరు గుర్తించి గమనింపదగిన అపూర్వ విషయముగా గోచరించుచున్నది. అనేక కారణములచేత కేరళ ప్రాంతములో ప్రాచీనతర సంప్ర

దాయము విశృంఖలంకముగా నిలిచి యున్నదని భావింప దగును.

అట్లే 'శౌనకీయా శిక్షా' అను వ్యాసములో శ్రీ వే. వెంకటరామశర్మగారు ఋగ్వేదమునకు అన్వయించు ఆ శిక్షలోని విశేషములలో వీరకరణము, రంగము, సంయుక్తవర్ణోచ్చారణము ఇత్యాదులలోని మెళకువలు కొన్ని వివరించిరి. వారుకూడ వేదోచ్చారణమందు కేంద్రీయులం కున్నంత శ్రద్ధ ఇతర ప్రాంతముల పండితులలో కనబడలేదని ఉద్ఘాటించుట గమనింపదగినది. ఈ వ్యాసకర్త ప్రాతిశాఖ్యలలోనను శిక్షలలోనను అసాధారణ విద్వాంసులైనందున వారి వాక్యములు వేదవిదులందరును గాఢముగా ఆలోచింప వలసినవై యున్నవి.

శ్రీ ప్ర. భ. అణ్ణంగరాచార్యులుగారు 'పదపాఠ పరిశుద్ధిః' అను వ్యాసములో, తైత్తిరీయ సంహితలో 1,09,287 పదములు కలవని లెక్కింపబడినవనియు, అందులో ఏకాక్షరములు, ద్వ్యక్షరములు, బహ్వక్షరములు కలవనియు, ఒకేపదము స్థలాంతరములలో భిన్నస్వరములతో నుచ్చరించుటకు కారణమేమని ప్రశ్నించుకొని, 'అది వేదపురుషుని ఉచ్చారణ విశేషమే' అని కేవల ప్రామాణిక దృష్టితో భావించు వారి మాట ఏ మాత్రము సరికాదనుచు వేదపురుషుడట్లు భిన్నరూపములతో నుచ్చరించుటకు హేతువులు ప్రధానముగా దశవిధములని వానిని వివరించిరి.

ఇక శ్రీ వే. వేంకటరామశర్మగారు 'వైదికః ప్రకృతిపాఠః' అను వ్యాసము నేటి వేదాధ్యయనపరులే కాక వేదమందు అభిమానముకల వారందరును గమనింపదగినది. అందులో వేదపాఠము ప్రకృతి వికృతి భేదముచే ద్వివిధమనియు, వానిలో ప్రకృతి పాఠము సంహిత, పదము, క్రమము, అని మూడుగా అంతర్భాగములు కలదనియు, వికృతిపాఠము ఘనజటాది రూపముగా అష్టవిధమనియు ఉపక్రమించిరి. వికృతి పాఠమును వ్యాడ్యాచార్యులు 'వికృతివల్లి' యను గ్రంథమున వివరించిరి. వ్యాడి పాణిని మేనమామ కుమారుడట ఆయన లక్షశ్లోక పరిమితిగల పాణినీయమును ప్రపంచించు గ్రంథముకూడ రచించెనట. ఈ వ్యాసము పసంహరించుచు యజ్ఞమందుగాని స్వాధ్యాయమందుగాని సంబంధముండుటచే సంహితార్థ పరిజ్ఞానమునకు పదాధ్యయనమునకు ప్రయోజనము కలదనుట ప్రసిద్ధమనియు, క్రమపాఠమున కట్టి ప్రసిద్ధి లేకున్నను, స్మృతి ప్రయోజనము కలదని సమర్థించి క్రమముకూడ నార్షమే యనుచు, అందువల్లనే వ్యాకరణ శాస్త్రమందు, 'తదధీతే తద్వేద' అని ఉపక్రమించి 'క్రమాదిభ్యో వున్' అను చో క్రమాధ్యయనము చేసినవారు 'క్రమకు' లనియు, పదాధ్యయనము చేసినవారు 'పదకు' లనియు శబ్దసిద్ధి కలుగునని ప్రదర్శింపబడుటచే క్రమపాఠము అంగీకృతమైనదని ఉపపత్తి చూపిరి. ఈ సందర్భములో వారు వాచ్యముగా చెప్పకున్నను, ఘన జటాది వికృతి పాఠములు యజ్ఞమందుగాని అధ్యయనమందుగాని నిష్ప్రయోజనము లనియు, అనార్షములనియు సూచించిరి. వేద స్వరూప ప్రయోజనములు తెలియక, ఘనపాఠులు 'ఘనస్వస్తి' చెప్పుచున్నామని ప్రకటించుకొనుటయు, ఘనపాఠము రానివారుకూడ, ఒకటి రెండు పనసలకు ఘనపట్టించి వానితో ఆశీర్వచనమున కుపక్రమించుటయు ఆంధ్రదేశములో ఇటీవల ఆచారమగుచున్నది. ఇది ఎంతవరకు ఆదరింపదగినదో వేదవిదులును వేద ప్రామాణ్యము గలవారును గాఢముగా ఆలోచింపదగినది. రసస్ఫూర్తిలేని చిత్రకవిత్వమే కవిత్వమని వివదించి పొంగిపోవు కాలములలో, యజ్ఞములందును, స్వాధ్యాయమందును ప్రయోజనములేని ఘనజటాది వికృతులకు ఎక్కువ వ్యాప్తి కలుగుట సహజమేమో యని బుద్ధిమంతులకు సంశయము కలుగకపోదు.

శ్రీ మ. రామనాథ దీక్షితులుగారు 'సామవేదః లౌకికో వ్యవహారశ్చ' అను వ్యాసములో 'వేదానాం సామవేదోఽస్మి' అని గీతలోను 'సామగానప్రియా' అని లలితాసహస్ర నామమునను గల వచనాదులతో సామవేద విశిష్టత నుగ్గడించి, అందలి బ్రాహ్మణాదులను నిర్వచించి, అదృష్టములైన స్వర్గాదులేకాక, దృష్టప్రయోజనములుగల లౌకికసిద్ధులకు గూడ సామ మంత్ర ప్రయోగము ఏయేవిధములుగా ఉపయోగించునో సూచించిరి.

'శుక్లయజుర్వేద మీమాంసా' అను వ్యాసములో శ్రీ వే. జగదీశ్వరశాస్త్రిగారు శుక్లయజుర్వే

త్నముగా వేదర్షుల మార్గమునే అవలంబించిరి. సాయనభాష్యముపై నాధారపడక వేదములను స్వతంత్రముగా పరిశీలన చేయగా, అందలి యంతస్సాక్ష్యమును బట్టి, అవి విశార్థమునే బోధించుచున్నవనియు, విజ్ఞాన విషయమున నెంతో ముందడుగువేసిన సంఘమునుండి వేదము లుద్భవించినట్లును అరవిందులు గ్రహించిరని తెలిపిరి.

శ్రీ ఇ. అనంతాచార్యులుగారి 'ఆపోవిషయక వేద భావన' అను వ్యాసములో వేదమునందు ఆపోభావన ఎంత విశిష్టమైనదో విపులీకరించి ఈ క్రింది వాక్యములతో ముచ్చటగా తమ వ్యాసము ముగించినారు:

"It is from the flow of the ocean of universal consciousness that our human hearts too receive the flood of universal consciousness. The waters are therefore said to contain the Powers of immortality and rectitude and the Devas alone are capable of declaring the Powers of the waters."

మీమాంసా శాస్త్రములో గొప్పపండితులైన శ్రీ డి. టి. తాతాచార్యులుగారు 'శ్రౌతసూత్రములు' అను వ్యాసమున కుల్లప్తముగా సూత్రలక్షణమును, యజ్ఞస్వరూపమును, కర్మవైవిధ్యమును తెలిపి, వేద కర్మలు ప్రధానముగా ఇష్టి, పశు, సోమ - అను మూడు విధములైనవని వివరించి, యజ్ఞమంత్రోచ్చారణము స్తోత్రము, శస్త్రము అను రెండు భేదములతో నుండునని చెప్పి, ఏవేవేదశాఖకు ఏవిశ్రౌత సూత్రములు పుట్టినవో, వానిలో నేవేవి నేడు ఉపలబ్ధ మగుచున్నవో చక్కగా నిర్వచించిరి. యజ్ఞ కర్మలు కర్తకేకాక దేశమునకును విశ్వమునకును గూడ మహాప్రయోజనము సమకూర్చగలవని వేద శాస్త్రము ఉద్ఘోషించుచున్నను, నేటి కాలమున నా సంగతి విస్మృతప్రాయ మగుచున్నందుకు విచారపడిరి. ఈ వ్యాసము స్పష్టతకు, క్రమవిన్యాసమునకు, సంక్షేపముగా అనేక విషయములు ప్రపంచించుటకును ఉత్తమోదాహరణముగా నున్నది.

శ్రీ వి. వరదాచార్యులుగారి 'గృహ్య సూత్రములు' అను వ్యాసముకూడ ఎంతో బాగున్నది. బహువిధములైన గృహ్యసూత్రములను తెలిపి, నేటి యాచారము లెన్నియో వానిలో కనబడునని సందర్భవశమున కొన్ని ఉదాహరించిరి. ఈ వ్యాసమునుబట్టి స్మార్త కర్మలలో ఎంత వైవిధ్యము, మార్పు కలదో ఊహింప వీలగుచున్నది.

శ్రీ యస్. భాస్కరరావుగారు 'వైదికచ్ఛందస్సు' మీద వ్రాసిన వ్యాసము ఎంతో మననమునకు దోహదము కలిగించునట్లున్నది. శ్రీ డి. అర్కసోమయాజిగారు 'వేదములలో జ్యోతిశ్శాస్త్ర స్మరణము' అను వ్యాసములో సంధ్యావందనము మొదలు పిండ పితృయజ్ఞమువరకును, యజ్ఞవేదికలు నిర్మించుటకును కాలజ్ఞానము ఎంత సున్నితముగా తెలిసి ఉండవలెనో సూచించిరి. శ్రీ పి. నాగరాజరావుగారు 'వేదములలో తత్త్వశాస్త్రము' అను వ్యాసములో మాధ్వ రామానుజమతములందు తమకున్న అభిమానము ప్రకటించిరి. 'సామవేదములో సంగీతము' అను వ్యాసములో శ్రీ బృందా వరదరాజన్‌గారు అమూల్య విషయముల ననేకము వివరించిరి.

శ్రీ కె. మహాదేవశాస్త్రిగారు 'వైదిక సంస్కృతము లౌకిక సంస్కృతము' అను వ్యాసములో లౌకిక సంస్కృతములోని కొన్ని లక్షణములు ద్రావిడభాషాదికములతో సంపర్కమువలనవచ్చి యుండవచ్చునని సూచించిరి.

శ్రీ అగ్నిహోత్రము రామానుజతాతాచార్యులుగారు 'వేదములలో రాజకీయ భావనలు' అను చిన్న వ్యాసములో వేదములో సభా, సమితి, గణములు ఇత్యాది శబ్దములవలన ప్రజాతంత్ర రాజ్యములు కలవనియు, రాజసూయ ప్రకరణమునుబట్టి రాజు ఎన్నుకొనబడి అభిషేకింపబడుచుండెననియు, సమ్రాట్, విరాట్, ఏకరాట్, అధిరాట్—ఇత్యాది శబ్దములనుబట్టి చక్రవర్తిత్వ భావనకూడ కలదనియు అనేక విషయములు సూచించిరి.

శ్రీ వి. సుబ్బారావుగారు 'వేదములలో భూగోళ విషయములు' అను వ్యాసములో ఇండో ఆర్యులు, ఏఏ భూములను ఏ వరుసలో నివాస స్థానములు కావించుకొనిరో. వానిని సూచించు ఋక్కులను గూర్చియు, వారెరిగిన వృక్షములు, పంటలు ఇత్యాదులు ఎట్లు అనుమేయింపవచ్చునో సూచించిరి.

బ్రహ్మ సూత్రార్థ వివృతి

[వ్యాఖ్యాత: శ్రీ వంగల వేంకటరామశాస్త్రి; ప్రాప్తిస్థానము: సాహితీ సమితి, తాడికొండ; సైజు: డెమ్మీ 1/8 : పేజీలు 410. కాలికో బైండు మూల్యము : రు 10/-]

ఇది బ్రహ్మ సూత్రములకు శ్రీ విద్యాశంకర భగవత్పాదులు రచించిన శారీరక మీమాంస భాష్యము ననుసరించి తేటతెలుగులో సంక్షేపవివృతికల గ్రంథము. ఇందలి అధికరణ విభాగము శ్రీ శంకర భగవత్పాదులనే అనుసరించినది. శ్రీ శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులగు జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీస్వాముల శ్రీ చరణ సన్నిధిని భాష్యశ్రవణము చేసినది మననము చేయుచు బహుకాలము తర్వాత తామీ గ్రంథము రచించినట్లు గ్రంథకర్త 'వినతి'లో తెలిపిరి. మరియు ధర్మాభట్ట విరచితమగు 'బ్రహ్మామృత వర్షిణి' అను వ్యాఖ్యానమును, 'బ్రహ్మ సూత్రార్థ దీపిక' యను మరియొక వ్యాఖ్యాన గ్రంథమును తమకు ఈ గ్రంథ రచనలో సహాయభూతము లైనట్లును, రత్నప్రభాది వ్యాఖ్యాన గ్రంథములను గూడ పరిశీలించి ఇది వ్రాసితి మనియు తెలిపిరి.

సూత్రార్థములను సంక్షేపముగా వివరించుట ఎంతవరకు సాధ్యమో అంతసంక్షేప రూపములో ఈ వివృతి రచన సాగినది. భాష సరళ గ్రాంథికము. అయినను శాస్త్రగ్రంథమగుటచే అర్థప్రతీతికై పారిభాషిక పదములు ఉపయోగింపక తప్పినదికాదని గ్రంథకర్తయే అంగీకరించిరి.

అందువలన భాష్యశ్రవణము చేసియుండని వారికి ఈ గ్రంథము సూత్రార్థమును భాష్యానుకూలముగా గ్రహించునట్లు చేయుటకు సమర్థము కాదు. కాని భాష్య శ్రవణము చేసినవారు ప్రధాన విషయములు మరపు తగులకుండ కొంతవరకు ఉపస్థితిలో నుంచుకొన గోరుచో ఈ వివృతి ఉపయోగకారిగా నుండగలదు.

గ్రంథాంతమందు సూత్రానుక్రమణిక అకారాదిగా నుండుట ఈ గ్రంథమందొక విశేషము. కాని అంతకంటె సూత్రపాఠమే వరుసగా నిచ్చినచో నిత్యపారాయణము చేయుచు కంఠస్థ మొనర్చుకొనుటకు ఉపయోగపడి ప్రయోజనకారి యయ్యెడిది. ఎట్లున్నను సూత్రపాఠము కూడ ఇచ్చియుండుటవసరము.

గ్రంథము మంచి కాగితములమీద తక్కువ అచ్చుతప్పులతో చక్కగా ముద్రింపబడినది.

—నోరి నరసింహ శాస్త్రి.

సమ్రాట్ పుష్యమిత్ర

(నాలుగు చారిత్రక నాటికలు)

[రచన : ముదిగొండ శివప్రసాద్. వెల : నాలుగు రూపాయలు. ప్రాప్తిస్థానము : జ్యోతిర్మయి ప్రచురణలు. హైదరాబాదు 7]

పతనమై, అశక్త ధూర్తత్వమును అలవరచుకొన్న జాతి ఆత్మవిమర్శ చేసికొనలేదు. చేసికొనవలయునను దలంపు సైతము దానికి కలుగదు. ఆ జాతికి చేతనగునది యొకటే-వివేకమును కోల్పోయి రాగద్వేషములను పెంచుకొనుట. పెంచుకొని సత్యమును గుర్తింపలేదు. గుర్తించినను దానిని తలక్రిందులు చేయును. అట్టి జాతి తన దుస్థితికి తానును కారణమనుకొనదు. కారణములను మరొకరి నెత్తిపై రుద్దును. వర్తమానకాలమును కాలపరిణామమును గూడ విస్మరించుట ఆ జాతికి అబ్బెడు ముఖ్యలక్షణము. అది చరిత్రదిశకు తిరిగిపోవును. ఇతర మతములపై, ఇతర జాతులపై కచ్చెపట్టిన మనస్తత్త్వములో, స్వపరభేద బుద్ధితో చరిత్రకు వ్యాఖ్యానము చేయును. అయినవారికి ఆకులలో, కాని వారికి కంచములలో వడ్డించును. నవయుగ భావములను చరిత్రలో దర్శించును.

అచ్చముగా ఈ పోకడ పోయిన గ్రంథము ఇది. ఇందు నాలుగు చారిత్రక నాటికలు కలవు. నాటిక యనుదాని కిట శాస్త్రపరముగా అర్థము చెప్పికొనరాదు. కేవల మీనాడు వ్యవహారముననున్న సామాన్యార్థమునే చెప్పికొనవలయును. ముదిగొండ శివప్రసాదుగారే ఇలా క్రిందివిధముగా తమ నాటికలను గూర్చి తాము పొగడుకొనిరి. 'ఈ దేశ ఉచ్ఛపతనాలకు కారణమైన చారిత్రక పురుషులకు సంబంధించిన నాలుగు నాటి

మాటలు వినుడు. '...ధర్మమే అంతిమ లక్ష్యంగా, విప్లవమే కార్యక్రమంగా, మరణాన్ని పుష్పమాలగా దాల్చి మహోన్నత పురుషార్థసాధనలో తమమనోధనాలు సమర్పించిన మానవంతుడైన మేవాడ సింహం...' 'అక్బర్! ఎవడివి నీవసలు నాదేశంలో సామ్రాజ్య నిర్మాణం జరపటానికి! నీ పూర్వీకులు ఛంగిస్‌ఖాన్, తైమూర్లేనూ నా రత్నగర్భను దోచుకోవటంకోసం వచ్చిన బందిపోటులు. నీ తాత నా ఢిల్లీ సింహాసనాన్ని ఆక్రమించిన ఒక విదేశీయుడు. నీవు సహాన మనే- కొత్త కుట్రతో నా జాతిని భ్రష్టంజేస్తున్న స్వార్థపరుడివి. ఎవరు పిలిచారు నిన్ను బొట్టు కాటుకపెట్టి నా దేశం పాలించమని......' ఇది రాణాప్రతాపసింహుని యాక్రోశమా? శివప్రసాదు గారి పలవరింతా? 'ఈ బందిపోటు ఇంకా మాట్లాడు తున్నాడే. సైనికులారా...' అని ఔరంగజేబనగా: 'ఔరంగజేబ్! బందిపోటెవరో భావికాలం నిర్ణయిస్తుంది. భారతీయార్ష లేఖినులు వ్రాస్తాయి నిజమైన భారతదేశ చరిత్రను...' అని శివాజీ-- శివప్రసాదుగారివంటి 'చరిత్రకారులు' ఇకముందీ వేదభూమిలో జనింతురని యనుకొన్నాడేమో —చాటును. అసలు అక్బరునకు సంబంధించిన నాటికలో ఔరంగజేబ్ శివాజీల రంగము ఉండదగినట్టిదా? వైష్ణవ పీఠాధిపతియగు తాతాచార్యులు ఈ క్రింది విధముగా బోధించును. '......పవిత్ర భగవాధ్వజం సువిశాల హిందూ సామ్రాజ్యంలో ఎగరడం చూడలేని ఆసురీ శక్తి— పోర్చుగీసువారి రూపంలో నీ ముందు నిలిస్తే వాళ్లా నరులేనని భావిస్తున్నావా?...కంసుడూ, రావణుడూ, దుర్యోధనుడూ, చార్వాకులూ, నవనందులూ, శ్వేతహూణులూ, మ్లేచ్ఛులూ, మొగలాయీలూ వీరంతా ఎటువంటి నరులో ఈ బుడతకీచులూ అటువంటి నరులే...' తాతాచార్యుల వారు భారతదేశచరిత్రను ప్రధాన విషయముగా చదివి నట్టున్నది. శివాజీ చేపట్టిన భగవా జండా (కాషాయాంబర పతాకము) ప్రస్తావన రఘునాథదేవరాయులు, తాతాచార్యులవారు చేయుట తగునా?

ఈ విధముగా సంభాషణములు వ్రాయుటచేత పాత్రల యుదాత్తత యడుగంటిపోయినది. వానికి లేకితనము సంక్రమించినది. చరిత్రలో ఈ పాత్రల నిజస్థితి వేరు. ఈ నాటికలలో వానిస్థితి వేరు. శివప్రసాదుగారి ఆక్రోశమునకు, సిద్ధాంతమునకు బలియైపోయి సొంతడబ్బా కొట్టుకొనుచు బాకా ఊదినవి.

సమ్రాట్ పుష్యమిత్రనాటికకు, విజయశిథిలాల నాటికకు సంవాదమున్నది. బృహద్రథుడు అరుణదత్తుని మాట వినడు. విజయరాఘవుడు గుణసాగరుని మాట వినడు. రాజు లిరువురు మంత్రుల చెంపలు వాయింతురు. పుష్యమిత్రునివలె అమ్మంగదేవుడును మారువేసము వేయును. అక్బరును మరణశయ్యపైనుంచి, బైరాంఖాను మున్నగువారిచేత తూర్పార బట్టించుటయే 'పిశాచరాత్రి' కథ గదా? ప్రేక్షకు లెంతసేపని అక్బరు మరణశయ్యా దృశ్యమును చూడగలరు? ఎంతసేపని అక్బరును తిట్టుట వినగలరు? 'మహామల్లియము'లో ఎంతో గొప్పగా పాత్ర పోషణము చేయవచ్చును. కావ్యోదాత్తతను సృష్టింపవచ్చును. కాని మహమ్మదీయ మతద్వేషము శివప్రసాదుగారిచేత ఆ పని చేయింపలేకపోయినది. పుష్యమిత్రుడు, అమ్మంగదేవుడు నిజస్వరూపములను జూపినపుడు, అల్లాయుద్దీనే ద్వారారెడ్డియని తెలిసినపుడొక కొంత యుత్కంఠ కలుగవచ్చును. రచయిత వర్తమానకాల భావములను పాత్రల నోట పలికించుటచేత, తదనుగుణముగా సన్నివేశములు కల్పించుటచేత, తన రాగద్వేషములలో ముంచియెత్తి పాత్రలను విలుపుటచేత, ఔచిత్యము శూన్యమై కళ చచ్చిపోయినది.

నాటికలు ప్రచారసాహిత్యస్థాయికి దిగజారినవి. ఇక కథావస్తువును పరిశీలింపవలయును.

పనిగట్టుకొని హైందవ ధర్మముయొక్క గొప్పతనమును - దోషములను గప్పిపుచ్చి—వెల్లడింప బూనినవారు గావున, శివప్రసాదుగారు జాతిమత దృక్పథముతో భారతదేశ చరిత్రను పరిశీలించిరి లభించిన సాక్ష్యమును పురస్కరించికొని, సమచిత్తముతో వ్యాఖ్యానించుట చరిత్రకారుల విధి. ఇటపూర్వవాసనకు,రాగద్వేషములకు తావులేదు. సామాన్యముగా చరిత్రను రచించునపుడు మూఁడు దోషములు దొరలుచుండును. మొదటిది ఔపదేశిక దోషము (Didactical error) మన రాగద్వేషములనుబట్టి మనము బోధింపనెంచిన సిద్ధాంతములు చరిత్రములో వెదకుట యీ దోష లక్షణము. ఇందు ఇప్పటి మాపుతో చరిత్రను దర్శించుట సంభవించును. రెండవది స్వదేశాభిమానదోషము (Patriotic error). దురభిమానముచే మాతృదేశ చరిత్రయంతయు స్వర్ణయుగములతో నిండియున్నదని యనుకొనుట యీ దోష లక్షణము.'......... And one of the most typical forms this error has taken in our land (in India) is the attempt to discover the latest political devices in the most ancient literature and institutions of our land. Innocent words have been made to yield meanings which they could never bear......' అని చరిత్రకారులు చెప్పిరి. మూఁడవది పక్షపాతదోషము(Partisan error). వ్యక్తుల, సన్నివేశముల పట్లగల పక్షపాతముతో, కేవలము ఒకవైపు కొపువేసికొని చరిత్రను వర్ణించుట యీ దోష లక్షణము. ఇతిహాసములలో, పురాణములలో ఈ దోషము పుష్కలముగా నుండును. శివప్రసాదుగారి యీ గ్రంథములో ఈ మూడు దోషములు పీటవెట్టుకొన్నవి.

వినాయక సావర్కార్ 'భారతేతిహాసమందలి స్వర్ణపత్రము'లను నొక గ్రంథము రచించిరి. బౌద్ధమతము మౌర్య సామ్రాజ్య పతనమునకు కారణమని సావర్కారు వ్రాసెను. శివప్రసాదుగారా పలుకులనే చిలుకపలె పల్లించిరి. గురుదత్త 'పుష్యమిత్ర' అను నవలను హిందీ భాషలో రచించెను. కందర్పరామచంద్రరావుగారా నవలను తెలిగించిరి. అది శోభకృత్తు సంక్రాంతికి (1964 జనవరి) వెలువడినది. శివప్రసాదుగారు 1964 జనవరి ఫిబ్రవరి నెలలో 'సమ్రాట్ పుష్యమిత్ర' నాటికను రచించిరట! ఆ నాటిక 1965 మే జూన్ మాసములలో ఒకానొక వారపత్రికలో ప్రచురింపబడినది. కారణమేదైననేమి? పుష్యమిత్ర నవలయందలి మొదటి 106 పేజీల కథకు, సమ్రాట్ పుష్యమిత్ర నాటిక కథకు పోలికలు కన్పట్టుచున్నవి. ముఖ్యపాత్రలమాటయటుండనిండు. నవలయందలి బాదరాయణ మహాప్రభువు, సౌమ్య నాటికలోకూడ కలరు. నవలలో పెద్దరాణి విదిశ తనసోదరుడగు లక్ష్మణపుర రాజప్రతినిధికి సైన్యసమీకరణార్థము రెండులక్షల సువర్ణములు కావలయునని కోరును. సౌమ్య తన తండ్రియగు వీరభద్రుని లక్ష్మణపురరాజ ప్రతినిధిగా నియమించినచో, సొమ్ము లేకుండగనే సైన్యము సమకూర్చునని చెప్పును. నాటికలో సౌమ్య నూరువేల రజత ముద్రలు కోరినట్లున్నది. కారణము తెలియదు. రెండు గ్రంథములలో కుమారుడైన పుష్యమిత్రుని సేనాసమీకరణము తండ్రియగు అరుణదత్తునకు మొదట తెలియనియట్లు కలదు. బౌద్ధమతమువల్ల రాజ్యమెట్లు దెబ్బతిన్నదో రెండింటను నిరూపింపబడినది. బాదరాయణ మహాప్రభువు మున్నగువారు యవనులకు తోడ్పడుచున్నట్లు రెండు గ్రంథములలో చెప్పబడినది. డెమిట్రియస్ వ్రాసిన లేఖను గూర్చి జరిగిన చర్చ రెంటను తుల్యమే.

శుంగవంశము సామాన్యరాజవంశము. పుష్యమిత్రుడు విదేశీయులగు యవనులను జయించెను గావున, సందు దొరకినదిగదాయని చంకలు గొట్టుకొనుచు సావర్కారుతోపాటు శివప్రసాదుగారు అతనిని ఆకాశమున కెత్తుచుండిరి. యవనులు తిరోగమించుటకు కారణము యూక్రెటైడెస్ డెమిట్రియస్ రాజ్యముపై దండెత్తుట. యవనుల అంతఃకలహములు పుష్యమిత్రుని విజయమునకు దారితీసినవి. ఒకానొక సుందరికొరకై శకలను (ఇప్పటి సియాల్ కోట. పాకిస్థానులో నున్నది) పాలించు ప్రభువుతో యుద్ధముచేయుచు పుష్యమిత్రుడు మరణించినట్లు యుగపురాణము (కె. హెచ్. ధ్రువ సంస్కరించిన

గ్రంథము) చెప్పుచున్నది. ఒకానొక ప్రసిద్ధ చరిత్రకారుడు - ఇతడు జీవించియున్న హైందవుడే - పుష్యమిత్రునిగూర్చి యిట్లు వ్రాసెను. "Pushya-mitra was a traitor and regicide, but some modern historions have condoned his crime by holding it up as a necessity for saving the country. Too little is however known of the actual circumastances to Justify such a lenient view........." పుష్యమిత్రుని చరిత్ర యిది. అతనిని కారణజన్మునిగా పొగడలేక చచ్చిపోవుటకు జాతిమత ద్వేషములతో కూడిన పక్షపాతమే కారణము.

బాణుడు శుంగవంశ చక్రవర్తులను గూర్చి చెప్పినమాటలు ముదిగొండవారికి తెలియని యట్లున్నవి. పుష్యమిత్రుని మనుమడగు సుమిత్రుడు భోగలాలసుడై, లాస్య ప్రదర్శనవేళ మూలదేవుని చేతిలో చచ్చెను. పుష్యమిత్రుని చేతిలో బృహద్రథున కేగతి పట్టినదో, శుంగవంశ చక్రవర్తులలో చివరివాడగు దేవభూతికిని అదేగతి పట్టినది. వాసుదేవుడను మంత్రి వానిని జంపి కాణ్వవంశమును మగధసింహాసనముపై నిలిపెను. బృహద్రథవధ శుంగవంశమును వెడిసి కొట్టినట్లున్నది.

మౌర్యసామ్రాజ్య పతనమునకు బౌద్ధమతము కారణమట! హరప్రసాదశాస్త్రి, రాయచౌదరి యీసిద్ధాంతముచేసిరి. సావర్కారుయొక్క అభిప్రాయ మిదియేగదా! కొందఱు ఆసిద్ధాంతమును అందుకొనిపాడిరి. ముదిగొండవారు దానిని పట్టుకొని వ్రేలాడుచుండిరి. బౌద్ధమతము మౌర్యసామ్రాజ్యపతనమునకు కారణమయినచో శుంగసామ్రాజ్యము బూడిద బుగ్గియగుటకు కారణమేమి? పుష్యమిత్రుడు అశ్వమేధయాగము చేసెనుగదా! ఆ యాగఫలము ఏ నెట్టేటిలో కలిసినది? గుప్తసామ్రాజ్యమేల కూలిపోయినది? కాకతీయ సామ్రాజ్యమేల కకావికలయినది? విజయనగర సామ్రాజ్యమేల విధ్వస్తమయినది? రెడ్డి సామ్రాజ్యమేల యొడ్డగెడవయినది? ఈ సామ్రాజ్యపతనములకు హైందవ ధర్మము కారణము గాదా? యని నిలబెట్టి యడిగిన వారికి ముదిగొండవారేమి జవాబిత్తురు? మతమునకు, రాజ్యముల పతమునకు లంకె పెట్టుట ఈ దేశచరిత్రలో కుదురదు. కుదురునన్నచో బౌద్ధమతముతోపాటు హైందవ ధర్మము తిట్లు దినవలసియుండును. అసలు శంకర భగవత్పాదులు అవతరించిన తరువాత హైందవదేశము పతనము కాగూడదుకదా! మఱి యట్లు జరుగలేదేమి? మహాశక్తిమంతులగు ప్రభువు లయినచో రాజ్యములు నాలుగుకాలాలపాటు నిలిచినవి. అసమర్థులగు ప్రభువులైనచో అస్తమించినవి. అంతేగాని, యీ దేశములో బౌద్ధధర్మమువలన రాజ్యములు నాశనము గాలేదు. హైందవధర్మమువల్ల నిలబడనులేదు.

ప్రోలారెడ్డి కుమారుడగు దొడ్డారెడ్డినిగూర్చి తెలుగువారి కేమియు తెలియదు. మల్లారెడ్డి మోటుపల్లిరేవును పట్టుకొనెను. ఈ సన్నివేశమునుగూర్చియే ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశములో 'బాహాదర్పమునం బ్రతిపథరణీపాలావలిం దోలి' యను పద్యమున చెప్పెను. ఆ ప్రతిపథరణీపాలు డెవడో చరిత్రకారుల కంతుపట్టలేదు. ఎవరికి తోచినట్లు వారు చెప్పిరి. శివప్రసాదుగారి కల్పన యిట్లున్నది, మల్లారెడ్డి సోదరుడు దొడ్డారెడ్డిగదా! మహమ్మదీయుల దౌష్ట్యము వలన అత డొకసారి గోమాంసము తినవలసివచ్చినది. తల్లి యాతనికి తన మొగము చూపలేదు. తల్లి యొక్క వైముఖ్యమునకు బ్రాహ్మణులే కారకులని దొడ్డారెడ్డి తలంచెను. ఊరువిడిచి వెళ్లి యాతడీసారి నిజముగనే మహమ్మదీయ మతము స్వీకరించెను. అల్లాయుద్దీనని పేరు మార్చుకొనెను. దొరకిన హైందవుల నెల్ల నఱకి కాకులకు గ్రద్దలకువేసెను. నీతులు చెప్పవచ్చిన తండ్రి కనుగ్రుడ్లు పీకించెను. అతడు ఎఱ్ఱాప్రెగ్గడను మహమ్మదీయునిగా మార్చబోవుచుండగా మల్లారెడ్డి వచ్చును. అన్నదమ్ము లొకరి నొకరు గుర్తింతురు. దొడ్డారెడ్డి వంఫ్ అల్లాయుద్దీను దేశబహిష్కృతుడగును.

అసలీ కల్పనయందలి ఆదిమభాగము శివప్రసాదుగారి సొంతముగాదు. వోరి నరసింహశాస్త్రిగారు రచించిన 'మల్లారెడ్డి' నవలలో ఇరువది మూడవ అధ్యాయమున కివి నకలు. శాస్త్రిగారి నవలలో ఏవిధ

బావమ ఐది మహమ్మదీయుడై పోయినట్లు చెప్ప బడెను. అతని పేరు అలావదీను. ఇతనినుండియే మల్లారెడ్డి మోటుపల్లిని గ్రహించెను. మల్లారెడ్డి తమ్ముడగు దొడ్డారెడ్డికూడ మహమ్మదీయుడై పోయినట్లు శాస్త్రిగారు కల్పించిరి. అతని పేరు బడే సాహెబు. అతడు అలావదీను క్రింది యుద్యోగి. ముదిగొండవారు దొడ్డారెడ్డికే అల్లాయుద్దీన్ అను పేరు కట్టబెట్టి, అతని నుండియే మల్లారెడ్డి మోటుపల్లిని జయించినట్లు కల్పించిరి. వారి కల్పన యింత మాత్రమే. దొడ్డారెడ్డి మహమ్మదీయుడయిన వృత్తాంతమును శివప్రసాదుగారు 'మల్లారెడ్డి' నవలనుండియే యథాతథముగా స్వీకరించిరి. స్వీకరించియు, శాస్త్రిగారికి కృతజ్ఞత ప్రకటింపక పోవుట యట్లుండ నిండు, ఆ విషయము నెక్కడను చెప్పలేదు. ప్రోలయను పిచ్చివానిగా భావించిన రీతియు శాస్త్రిగారి కల్పనమే. నవలలో బడేసాహెబు సూర్యకవితో మాటాడిన విధానము, అలావదీను ఎఱ్ఱనతో మాటాడిన తీరు, నాటికలో అల్లాయుద్దీను ఎఱ్ఱాప్రెగ్గడతో మాటాడిన పద్ధతిలో స్పష్టముగా గోచరించుచున్నవి. శివప్రసాదుగారు 'మల్లారెడ్డి' నవలకు ఋణపడిరి. ఆ విషయమును కప్పిపుచ్చుట హైందవ ధర్మోద్ధరణమునకు పన్నైచ్చునది గాదు.

అల్లాయుద్దీన్ మల్లారెడ్డి సోదరుడని చెప్పుటచే ఏ రసము ఊరలేదు. లేనిపోని నీరస కథయైనది. దొడ్డారెడ్డియే తన పేరు మాయించి కొనినట్లు శివప్రసాదుగారు కల్పించిరి. మల్లారెడ్డి, ఎఱ్ఱాప్రెగ్గడ మాటాడిన పద్ధతి యుచితముగాలేదు. హైందవుడైన దొడ్డారెడ్డి సిదప మహమ్మదీయుడయ్యెను గదా! అందుచేత వారిరువురతోపాటు ముదిగొండవారును దొడ్డారెడ్డిని క్షమించిరి. దొడ్డారెడ్డి త్రాగిన హైందవరక్తమెంతని చెప్పగలము? అయినప్పటికి మల్లారెడ్డి వానిని జంపలేదు. చంపుటకు మల్లారెడ్డి యాత్మయేగాక శివప్రసాదుగారి యాత్మయు అంగీకరింపలేదు. ఎంతయినను, వాడు హైందవుడు గదా! దొడ్డారెడ్డి తాను చేసిన హింసాకృత్యములకు ఫలముగా మల్లారెడ్డి చేతిలో చచ్చియుండవలసినది. చచ్చియున్నచో కావ్యన్యాయము చేకూరెడిది. రెడ్డి రాజుల చరిత్రలో అతని అడపొడ కానరాకుండుటకు ప్రబల హేతువు చూపినట్లయ్యెడిది. శివప్రసాదుగారు రసోచిత కల్పనము చేయులేకపోయిరి.

తమ్ముడని తెలియకముందు, తెలిసిన తరువాత మల్లారెడ్డి మాటాడిన తీరు ధర్మద్రోహమునకు నిదర్శనము. తెలియకముందు మహమ్మదీయులపై దుమ్మెత్తిపోయును. తెలిసిన తరువాత క్షమాగుణము చూపును. ప్రోలారెడ్డి రంగముమీదకు వచ్చిన పిదప, అతని "గుడ్డి" దీయించినది, దొడ్డారెడ్డియే యని తెలిసి, మరల వెంటనే మల్లారెడ్డి యాగ్రహోద్రగుడగును. తండ్రి దొడ్డారెడ్డిని రక్షింపుమని కోరగా మల్లారెడ్డి 'నాన్నా! నీయాజ్ఞ నేను శిరసావహిస్తాను. కాని ఇది నీ ఒక్కని వ్యక్తిగత సమస్యగాదు. మన కుటుంబ సమస్యకాదు. భారతదేశ భవిష్యత్తు మొత్తాన్ని తేల్చవలసిన సమస్య. హిందూసామ్రాజ్య నిర్మాణానికి సంబంధించిన సమస్య. చేతేతులారా మమకారానికి లోబడి మతానికి ద్రోహం చెయ్యడం నా చేతకాదు' అని యనును. దొడ్డారెడ్డి శిక్షను జన్మ విముక్తిగా భావింతునని యనును. అప్పుడేమో మల్లారెడ్డి 'అబ్బా! ఏమిటి నాకీ పరీక్ష! నీవు సోదరుడవి కాకుండావుంటే ఇంతవేదన అనుభవించేవాణ్ణి గాదు. భగవాన్! ఏమిటి నా కర్తవ్యం!' అని యాక్రోశించును. దొడ్డారెడ్డి పశ్చాత్తాపతప్తుడయ్యెనని భావించిన ఎఱ్ఱన దేశబహిష్కారమే అతనికి తగిన శిక్షయని నిర్ణయించును.

ఈ సన్నివేశమంతయు హైందవ ధర్మము యొక్క ద్విముఖ ప్రవృత్తిని చాటును. తనవానికొక ధర్మము! మఱియొకనికి మఱియొక ధర్మము! హైందవుడు చేసిన దారుణ హింసాకాండ క్షమార్హము! ఏల? వాడు మహమ్మదీయుడై చేసెననియా? శివప్రసాదుగారి సంభాషణ రచనమువల్ల మల్లారెడ్డి, ఎఱ్ఱాప్రెగ్గడ హైందవ ధర్మమునందలి స్వార్థప్రవృత్తికి చిహ్నములుగా మిగిలిరి.

ప్రోలయవంటి 'ధరాత్ముని వంశంలో' అధర్ములు పుట్టరట! అందుచేత చిన్ననాడే దొడ్డారెడ్డి పవిత్రమయిన 'నందికంత పోతరాజు కటారి'తో ధేనువత్సపాదమును పొరపాటువల్ల నఱికినట్లు కల్పించిరట! ఆ పాపము దొడ్డారెడ్డిని కట్టికుడిపినదన్న మాట! దొడ్డారెడ్డి పరిస్థితుల ప్రాభవంవల్లనూ,

కొన్ని పొరపాట్లవల్లనూ దుష్కార్యాలకు లోనైనట్లు' గ్రంథకర్తగారు భావించిరట. ప్రోలయవంశములో పుట్టిన వారెల్లరు ధర్మాత్ములని యనుకొనుట పెద్ద పొరపాటు. వీరనారాయణుడు, కర్పూర వసంతరాయలు, ధర్మాత్ములైనచో వారు తమలో తామేల తన్నుకొనిరి? రెడ్డిరాజ్యమేల నశించినది? ఏవేవో తలపులతో రచనలు చేసిన నెట్లుండునో 'మహామల్లియము' తార్కాణముగా నున్నది. హైందవులు మహమ్మదీయులను జయించిరని పొంగిపోయి మిన్నుముట్టుచు, సాహిత్య సృష్టికి పూనుకొన్నచో ఇట్టి వికారములే పుట్టును.

శివప్రసాదుగారి ప్రకారము అక్బరు హంస కంస రావణుల వంటివాడు నృశంసనుడు. కామాంధుడు. హైందవ రక్తమును కళంకితము చేసినవాడు. అందుచే ఆయా పాత్రలచేత కసిదీరగా అక్బరును తిట్టించిరి. ఈ నాటకరచనమున శివప్రసాదుగారొక యుక్తి పన్నిరి. అక్బరుపైనున్న ద్వేషముకొలది యాతని శత్రువులను పొగడిరి. బైరాంఖాను తప్పులేదని నిరూపింపగా కష్టపడిరి. అక్బరు కాలమున ప్రజలు అల్లాడిపోయిరట! అక్బరు కాలము ఫ్రెంచి విప్లవకాలమును పోలియున్నదట! అతని కుమారుడైన సలీమ్ ప్రజాప్రతినిధిగా విప్లవ నాయకత్వమును వహించెనట! అబుల్ ఫైజల్ మున్నగువారు వ్రాసిన వ్రాతలు పొగడ్తలట! అక్బరు ప్రత్యర్థుల దోషములను కప్పిపుచ్చుట, అక్బరు దోషాభాసములను సత్యముతో నిమిత్తములేకుండ చాటుట, చరిత్రను తారుమారు చేయుట, యివి 'పిశాచాలరాత్రి'లో వెల్లడియగుచున్న లక్షణములు.

అక్బరు ఘనతను శివాజీ గుర్తించెను. ఔరంగజేబునకు తెలియజేసెను. పుష్యమిత్రుని పొగడుచు ముదిగొండవారు విన్సెంట్ స్మిత్ వాక్యముల నుదాహరించిరిగదా! ఆ స్మిత్తుగారే ఈ విధముగా అక్బరును కొనియాడిరి. "He was a born king of men, with a rightful claim to rank as one of the greatest Sovereigns known to history. That claim rests securely on the basis of his extrordinary natural gifts, his original ideas and his magnificent achievements...". ఔరంగజేబును గూర్చి వ్రాసిన తరువాత కొమర్రాజు లక్ష్మణరావుగారు అక్బరును ఈ విధముగా ప్రశంసించిరి. 'ఇట్టి దోషములు కొన్నియున్నను అక్బరునందు సద్గుణములు విశేషముగా నుండుటవలన "ఏకోహి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః" అను కాళిదాసోక్తి ననుసరించి యాతనిని మహాపురుషుడని చెప్పవలసియున్నది.'

రాజ్యకాంక్ష, రాజుల సహజగుణము. యుద్ధము, హింస అనునవి యీ గుణమునకు బాహ్యరూపములు. 'కాలానికి కత్తుల వంతెన' కట్టిన రాజులు చరిత్రలో నే జాతియందైన కన్పట్టుదురు. అట్లే బహుభార్యాత్వము రాజలక్షణము. సంస్కృత సాహిత్యమును, చరిత్రను చదివినచో ఈ లక్షణము రాజులచేత ఎట్టి పనులు చేయించినదో తెలియును. అక్బరునే పేరుపెట్టి వ్రేలెత్తి చూపింపనేల? అతని పెండ్లిండ్లు రాజకీయతంత్రమువల్ల జరిగినవట! భారతదేశమును పాలించిన రాజులలో ఇనుపగోచులు బిగించికొనిన రాజులెందఱుండిరి? వారి పెండ్లి పేరంటములలో ఎన్ని రాజకీయ తంత్రముతో జరుగలేదు? ఆయాసందర్భమునుబట్టి ఏ జాతివారయినను రాజులు స్త్రీల నెందఱనో చేపట్టిరి.

రాణాప్రతాపుడు వీరశిరోమణి. అతని చరిత్ర చదివినచో ఏ యుగమువారికైనను, ఏ ఖండమువారికైనను, ఏ జాతివారికైనను కండలు కదలియాడును. తనకున్న సమస్తబలమును కూడగట్టుకొని అహర్నిశలు పోరాడినను, అక్బరు రాణాప్రతాపుని వంచలేక పోయెను. రాణాప్రతాపుని గుండెదిటవు, స్థిరసంకల్పము, కష్టసహిష్ణుత చూచి ఏ వివేకి నమోవాకము నర్పింపడు? అట్టి రాజపుత్ర సింహముయొక్క ఓజస్సు, తేజస్సు అక్బరును తిట్టకుండగనే చాట

వచ్చును. పదునారవ శతాబ్దమందలి యీ మహాపురుషుల చరిత్ర చదివినవారెవ్వరు, వారి నడుమ సఖ్య సంబంధములు లేమికి ఆశ్చర్యపడరు. జె. యం. షేలత్ ఏమనెనో చూడుడు "The conflict in Mewar was a contest between two minds, one bent on establishing an empire pervading the length and breadth of India and the other on preservation of the freedom of a patrimony, which though small, had so far remained unsullied by even a semblance of subjugation. The conflict was inevitable. The issue was fought with the greatest intensity and vehemence because the two sides were represented by two of the grandest personalities of the 16 th century. Yet, even though Akbar brought to its resolution all the vast resources and the best military talent he had at his command, the issue remained unresolved till the end of his life." ఇట్టి వీరపురుషుల గాథను ఎంత రసవత్తరముగానైన చిత్రింపవచ్చును. అక్బరువిూది అక్కసుతో శివప్రసాదుగారి సాహిత్యసృష్టి కావ్యత్వమువైపునకు పోలేదు. అక్బరు రాణాప్రతాపులు వంతసానులవలె ఈ నాటికలో ఒకరినొకరు తిట్టికొనిరి.

ఇక శివప్రసాదుగారి చరిత్ర ప్రకారము అక్బరునకు మహమ్మదు అలీ యనువాడు సవతి యన్నయట! ఇదెక్కడి పేరో తెలియదు. అక్బరు సవతి యన్నపేరు మిర్జా హకీమ్. కొందరు చరిత్రకారులితనిని మహమ్మదు హకీమ్‌గా పేర్కొనిరి. ఇతడు కాబూలునకు రాజు. ఇతడు తిరుగుబాటు చేసినమాట నిజము. అదియొక పెద్దగాథ. అక్బరు ఇతనిని జయించి, క్షమించినట్లు క్షమించి, పరోక్షముగా చంపెనట! ఆధారములులేని పరమాసత్యమిది. అక్బరు ముబారక్‌ఖాన్ లోహాని చేత బైరాంఖానుని చంపించెనట! దీనికిని సాక్ష్యము లేదు. శ్రీకృష్ణదేవరాయ తిమ్మరసుల కథవలె, అక్బరు బైరాంఖానుల కథయు విషాదాంతముగా ముగిసినది. అక్బరు బైరాంఖానుని చంపింపలేదు. చంపినవాడు ముబారక్‌ఖాన్‌లోహాని. అతడు బైరాంఖాన్ శత్రుకూటములోనివాడు. కాలము అనుకూలముగా నుండుటచే, అతడు నలువదిమంది అనుచరులతో కూడి బైరాంఖానుని చంపెను. బైరాంఖాను మరణమునకు పిదప, అతని దారాపుత్రులను అక్బరు చేరదీసెను. బైరాంఖాను కుమారుడు అక్బరు కొలువులో పెద్దపారుపత్తెమును పొందెను. ఖాన్‌ఖనన్‌గా నియమింపబడెను. అక్బరు హేమూను కూడ చంపినట్లు శివప్రసాదుగారి అభియోగము. హేమూను చంపినదెవరు? అను విషయమున ఆ నాటి మహమ్మదీయ చరిత్రకారుల నడుమకాని, ఈనాటి చరిత్రకారుల నడుమకాని ఏకాభిప్రాయము లేదు. బైరాంఖాను హేమూను చంపుమని అక్బరుతో ననగా, అతడు వెనుకంజ వేసెననియు, పిదప బైరాంఖానే హేమూను చంపెననియు కొందఱు వ్రాసిరి. కొందఱేమో మొదట అక్బరు తన కత్తితో హేమూ శిరస్సును స్పృశించెననియు, పిదప బైరాంఖాను తల్లద్రుంచెననియు వ్రాసిరి. సత్యము హేమూ మరణదృశ్యము చూచినవారికే తెలియవలెను. శివప్రసాదుగారు పై హత్యలనన్నిటిని చూచి వచ్చినవారివలె నికరముగా వ్రాయుదురు. వారు బైరాంఖాను తర్దిబేగ్‌ను చంపించిన విషయము నెత్తుకోలేదు. అక్బరును దుష్టునిజేయుటకు బైరాంఖానును ప్రశంసింపవలయును. అట్టిచో బైరాంఖాన్ తప్పుల నెన్నగూడదుగద! రాజ్యారంభకాలము నాటి సన్నివేశములలో అక్బరు పాత్ర యెంతయో చెప్పలేము. అప్పటి కతడు చిన్నవాడు. పాపభారము మోయవలసి వచ్చినప్పుడు బైరాంఖాను అక్బరుకంటె ఎక్కువ పంచుకొనవలసియుండును.

శివప్రసాదుగారు అక్బరు కుమారుడగు సలీమునకు బట్టుకట్టిరి. దీనికి కారణము అక్బరుమీది ద్వేషము. ప్రజాప్రతినిధియై సలీమ్ విప్లవమును

తెవదీసినవాడుగాడు. అతనికి మహారాజ్యకాంక్షయున్నది. తండ్రి చావున కెదురు చూచినవాడు. మదపతి మైత్రేయములను స్వేచ్ఛగా ననుభవించినవాడు. మహాకోపి. కోపముతో వార్తాహరుని తోలొలిపించిన వాడు. అతనిలో హృదయ పరివర్తనము కలుగునని పితృమూర్తియగు అక్బరాశించెను. ఫలము లేకపోయి నది. అబల్ ఫైజల్ ద్వారమున సలీమును బాగుచేయ వలయునని తలంచి, అక్బరు దక్కనులోనున్న అతనికి కబురుపంపెను. సలీమ్‌చే నియుక్తుడయిన వీర్‌సింగు సైనికులు, రాజధానికి బయలుదేరిన అబల్ ఫైజల్‌ను మార్గమధ్యమున ఎదుర్కొనిరి. అతని తల ద్రుంచి సలీమునకు పంపిరి. సార్వభౌముడు కాదగిన వాడు సలీమా? లేక సలీము కుమారుడా? ఎవడు యోగ్యుడు? అక్బరు ఒక పట్టాన నిశ్చయించి కొన లేకపోయెను. సలీముచే నిర్ణయించెనని చెప్పుట కాధారము లున్నవి. మానసింగు, ఖాన్ అజమ్ సలీము కుమారుడగు ఖుస్రూపక్షము వహించిరి. సలీమును చెడబట్టగా ప్రయత్నించి విఫలులైరి. ఏది యెట్లు యైననేమి? చివరకు సలీమ్ చక్రవర్తి యాయెను. అతడే జహంగీరు. ఖుస్రూ తల్లి నల్లమందుతిని ఆత్మహత్య చేసికొన్నది. కారణము తెలియదు. సలీమ్ దుష్ప్రవర్తనమువల్ల ఆమె మరణించినదని కొందఱు వ్రాసిరి. ఇట్లు చెప్పుటకు ప్రబల సాక్ష్యము లేదు. సలీమ్ చరిత్ర యిది. మానసింగు సలీమ్ పక్షము వాడుగాడు. ఈ నాటికలో మానసింగును శత్రువుగా చిత్రించి శివప్రసాదుగారు గుండెబరువు దించుకొనిరి. అతడు అక్బరు పక్షమువాడు గదా!

అక్బరు రాజపుత్ర స్త్రీలను వివాహమాడెనే కాని, మహమ్మదీయ స్త్రీలను రాజపుత్రులకిచ్చి పెండ్లి చేయలేదేమి? యని శివప్రసాదు గారొక ప్రశ్నవేసిరి. హైందవ రక్తమును కలుషితము చేయనెంచియే అక్బరీ పనిని జేసెనని సమాధానము చెప్పిరి. అక్బరు బిహార్‌మల్లు కుమార్తెను కోరలేదు. ఆ రాజపుత్రుడే తనకూతు నిత్తుననెను. అక్బరు అంగీకరించెను. రాజపుత్రులతోడి వియ్యము అక్బరు రాజనీతికి ప్రథమోదాహరణము. పరిస్థితుల ప్రభావమువల్ల దొడ్డారెడ్డి మహమ్మదీయుడయ్యెనని ముదిగొండవారు గడగట్టి గంటవాయించిరి గదా! అమ్మంగదేవుడు తన రాజనీతిని తానే పొగడుకొనును గదా! అట్టిచో అక్బరుకూడ పరిస్థితులనుబట్టి దూరదృష్టితో రాజనీతి కౌశల్యముతో నడుచుకొనెనని యేల తలంపరాదు? తనకు నచ్చినపని యక్బరు చేయలేదని అతనిని నిందించుట ఏమిపని? ముదిగొండవారి యిష్టాయిష్టములు అక్బరున కెట్లు తెలియును?

'విజయశిథిలాలు' పై తము విచిత్రలక్షణములతో పొడగట్టును. 'పిశాచాలరాత్రి'లో అక్బరు చిత్తక్షోభను వర్ణించుటకై గతాగామి సన్నివేశములను జొనుపుట సంభవించినది. 'విజయశిథిలాలు' నాటికలో కూడ అట్టి లక్షణమే యున్నది. విజయరాఘవునిలో పౌరుషము పుట్టుటకై గుణసాగరులు రఘునాథరాయల కాలమునాటి వృత్తాంతములను తార్కాణించును. ఆ వృత్తాంతములు రెండు. మొదటిది వేంకటపతిరాయలపై గోల్కొండ సుల్తానులు దండెత్తినప్పటిది. రెండవది 'ఒక్కసారి రఘునాథులవారిపై - ఒకసారి ఒకవైపునుండి మధుర రాజులు, మరొకవైపు జింజి రాజులూ, ఇంకొకవైపు పోర్చుగీసు సైన్యమూ - విప్లవం తీసికొనివచ్చినప్పటిది. ఈ రెండింటికి తోడు చొక్కనాథుని తోడి యుద్ధమునకు సంబంధించిన భవిష్యద్వృత్తాంతము కలదు. చొక్కనాథుని చేతిలో ఎట్లును చావు తప్పదని యనుకొనుచున్న విజయరాఘవుని యభిప్రాయమునకు రూపకల్పనము ఈ మూడవ దృశ్యము.

ఈ నాటికలో గోల్కొండ బీజపూరు సుల్తానులు తంజావూరు పైబడి దోచుకొనచున్నట్లు, ఆ పోరు పడలేక వారికి లంచమిచ్చి విజయరాఘవుడు సంధి చేసికొనినట్లు! లంచమిచ్చుటకు కావలసిన సొమ్ము

నకై ప్రజలపై పన్నులు విధించినట్లు వర్ణింపబడినది. మంత్రి ప్రజల పక్షమున నిలిచి క్రొత్త పన్ను ఎత్తివేయుడని రాజును కోరినట్లు కలదు. ఏనాడును గోల్కొండ సుల్తాను తంజావూరిమీదకు రాలేదు. జింజి సంస్థానమును ఆక్రమించికొనిన గోల్కొండవారు తనపై కూడ దండెత్తుదురేమో యను భయముతో విజయరాఘవుడు వారికి లంచమిచ్చి, వారి బారినుండి తప్పించుకొనెను. బీజపూరు సుల్తానే రెండుమూడుసారులు తంజావూరుపై దండెత్తెను.

రంగాజమ్మ యింటిలో పోర్చుగీసువారి గూఢచారిశాఖకు చెందినవాడు యతీంద్రవేషమున మకాము చేసెనని కలదు. విజయరాఘవుని రాజ్యమున పోర్చుగీసువారికి స్థానము కలదని చరిత్ర చెప్పదు. మఱి డచ్చివారు ఇచ్చవచ్చినట్లు ప్రవర్తించిరని చరిత్ర చెప్పుచున్నది. వారికిచ్చిన దానము శాసనరూపమున వెండిరేకుల కెక్కినది. రంగాజమ్మ మధుర వారితో, పోర్చుగీసువారితో పొత్తు పెట్టుకొన్నట్లు నాటికలో కలదు. ఆమెయు రాజద్రోహము చేయనెంచిన దన్నమాట! దీని కాధారములేదు. రంగాజమ్మ గ్రంథమును చదివినవారెవ్వరు, ఆమె రాజద్రోహము చేయగలదని యనలేరు. గోల్కొండ బీజపూరు సేనల త్రుళ్ళ, మధురరాజుల దండయాత్ర ఏకకాలమున సంభవించినట్లు నాటికలో నున్నది. చొక్కనాథుడు తంజావూరిపయి దండెత్తునాటికి మహమ్మదీయులు దక్షిణరాజ్యముల వైపునకు రారైరి. వారికి మొగలుల యొత్తిడి యెక్కువ యగుటయే దీనికి హేతువు.

విజయరాఘవుని శీలమును నిరూపించుటకు, తంజావూరు చరిత్ర తారుమారు చేయబడినది. కల్పనలు చేయవచ్చును. కాని చారిత్రక సన్నివేశముల క్రమమున కవి విరుద్ధముగా నుండరాదు. ఈ నాటికలో జరిగినదదే. గుణసాగరులు విజయరాఘవుని చెడదిట్టును. తిట్టి సాధించినదేమి? గాంధారి వేషమున అమ్మంగదేవుడు నడచిన తీరు బాగుగనే యున్నది. ఈ కల్పనమునకు ఆధారము చరిత్రలో కానరాదు. చొక్కనాథుని దండయాత్ర, తంజావూరు రాజ్యపతనము మొదలగువానికి హేతువులు చరిత్రలో మఱొకవిధముగా నున్నవి. చరిత్రను యథాతథముగా స్వీకరించి, యుచితకల్పనలు చేసియున్నచో ఇంకను చమత్కారావహముగా నుండెడిది. విజయరాఘవుని జీవితములో ఆదిమభాగమునో; అంతిమభాగమునో వర్ణింపబూనినచో నాటిక యిట్లుండెడిదిగాదు.

‘ఉత్తమ కావ్యం లౌకికావసరాలమీద ఆధారపడి వుండదు. మానసిక సంఘర్షణమీద ఉదాత్తమైన ఆత్మీయవిషయములమీద ఇతివృత్తాన్ని నిర్మించుకుంటుంది. ఏది సత్యమూ, శివమూ, సుందరము అయినదో ఏది సార్వజనీనమై, సార్వకాలికమై వుండి శాశ్వతత్వాన్ని సంతరించుకుంటుందో అది పది కాలాల పాటు నిలుస్తుందని తాత్పర్యం. కాబట్టి భాసుడు మిగిలాడు. భవభూతి మిగిలాడు. కాళిదాసు మిగిలాడు—ఇలా అధునికులు ఎందరు నిలుస్తారో చెప్పడం కష్టం’ అని శివప్రసాదుగారనిరి. ఇది యెంతయు నిజమే. మఱి యీ నాటికల మాటేమిటి? ఇవి ‘లౌకికావసరాలమీద ఆధారపడి’యున్న నాటికలు. వానిని మనసులో నుంచికొని వ్రాసినవిగావా యీ నాటికలు? ఈ నాటికలు పేరునకు మాత్రమే చారిత్రకనాటికలుతప్ప, వర్తమానకాల స్థితిగతులను ప్రతిబింబించుకొన్నవియైనవి. వీనిలో త్రికాలాబాధితమైన కావ్యకళలేదు. వీనివల్ల ఆంధ్రయూపఃస్థాయి పెరుగదు.

—శాక్యసింహ.

కబీరు వచనావళి

[కబీరు వచనావళి: తెలుగు అనువాదం: పుట్టపర్తి నారాయణాచార్యులు. ప్రచురణ: సాహిత్య అకాడెమీ, మాఢిల్లీ; సోల్‌డిస్ట్రిబ్యూటర్స్: ఆంధ్రప్రదేశ్ బుక్‌డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు; 246 పేజీలు; వెల: రూ. 6-00.]

ఆధ్యాత్మిక చింతనమే జీవన విధానంగా, ముక్తి మార్గంగా, ఆకలి దప్పులకుమించిన ప్రాణావసరంగా యెంచిన భారత జాతిలో తత్త్వవేత్త లెందరెందరో ప్రవర్తిల్లి, తమ కర్మ, జ్ఞాన, భక్తిమార్గాలతో ఆధ్యాత్మికసీమను కాంతివంతంచేసి ధన్యాత్ములైనారు. కాని వారు వచ్చిపోయిన జాడైనా కన్పించడం లేదీనాడు భారత భూమిలో. శంకర, రామానుజ, మధ్వాచార్యులేగాక, రామకృష్ణ, వివేకానందులు, కబీరు, తుకారామ్, తులసీదాస్, సూరదాస్, వేమన, సర్వజ

మీరాబాయి, చైతన్యుడు, అరవిందుడు, రమణ మహర్షి మొదలైన వారెందరో తమ తమ మాతృ భాషలలో విజ్ఞాన ప్రబోధంతో భారత జాతికి తరుణోపాయాన్ని నిర్దేశించారు. ఈ యోగులందరు నిర్దేశించిన భావాలు వారి వారి భాషలలోనే ఉన్నా ఆసేతు శీతాచలమూ భారతజాతికి అవశ్యమూ ఆచరణీయమైనవే. ఐతే ఆ యోగులుద్బోధించిన భావాలలో పునరుక్తులు, అందరిలోనూ సమానంగా కన్పించే సార్వకాలిక సత్యాలు కోకొల్లలు. అంతమాత్రమేగాక పరస్పర వైరుధ్యాలతోకూడిన సూక్తులు ఒకే తత్త్వవేత్త బోధనలలోనూ దర్శనమిస్తాయి.

ఒక మహాతత్త్వవేత్త ప్రవర్తిల్లిన తరువాత కొంతకాలంవరకు ఆయన ప్రభావం శిష్యసంతతిపై నిలిచి క్రమంగా ఆచరణలో నీరసమై, మూఢనమ్మకాల కాకరమై లోకం దృష్టిలో ఆ మార్గంకూడ హాస్యాస్పదమౌతుంది. 'గౌతమముని ఛిన్నాస్థులకోసం కలహించిన మనదేశీయుల మౌఢ్యాన్ని' చూచి బౌద్ధమతంలోని మంచికే దూరమయ్యారు - భారతీయులు. తత్త్వవేత్తల మనస్సులలోనూ అడ్డుగోడలుంటాయి. జాతి, కుల, మత భేదాలనవి యధిగమించి సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటటంలో వెనుకంజ వేయిస్తాయి. కాని కాలాన్నే అధిగమించి ఎల్ల మానవులొక్క యింటివారేనని చెప్పి హిందూ, మహమ్మదీయ సమైక్యతను శతాబ్దాలక్రితమే ప్రచారం చేసిన కబీరూ, 'ఈశ్వర అల్లా తేరేనామ్' అని సోదర భావాన్ని పెంపొందింపజేసిన గాంధిమహాత్ముడు విశిష్టులు. భారతీయ వేదాంతాన్ని పాశ్చాత్యులకు వివరించటంలో గణనీయమైన కృషిచేసిన రవీంద్రుడు కబీరు బోధనలను 'Poems of Kabir' పేరుతో ఆంగ్లంలోనికి అనువదించారు.

కబీరు బోధనలను తెలుగువారికి తెలియజెప్ప సమకట్టి సాహిత్య అకాడెమీవారు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారిచేత అనువదింపజేశారు. శ్రీ నారాయణాచార్యులు బహుభాషా పండితులు. శివతాండవంతో ప్రశస్తిగాంచిన 'సరస్వతీ పుత్రులు.' సూరదాస్ బోధనలు కవితారూపంలో గానంచేసిన ధన్యజీవులు. కబీరు వచనావళి ననువదించటానికి అన్నివిధాలా సమర్థులే ననిపిస్తుంది. ఈ పుస్తకం పూర్తిగా చదివినతరువాత ఏదో కొంత ఆశాభంగం మిగలకుండా ఉండదు. అనువాదం గ్రాంధికంలో నడిచింది. స్వచ్ఛసుందరమైన కబీరు భావాలను తెలియజెప్పటానికి నారాయణాచార్యులవారు ప్రయోగించిన గ్రాంధికభాషకు శక్తి చాలలేదు. 'రాముని మాయలోకమంతటి వానంద పఱచును. ఎవనికి చీటియందునో వాడు వెచ్చించు వాడు.' ఈ వాక్యంలో భావం దుర్బోధంగా ఉన్నది. 'వేలకొలఁది పాపు లుండవచ్చును. కాని నిందకు డొక్కడైన నుండరాదు. ఒక నిందకుని తలపై కోటి పాపముల బరువులుండును.' ఈ వాక్యంలోని 'నిందకుడు' పదం కబీ రుద్దేశించిన భావాన్ని అందజేయటం లేదు. (అతనిని) 'సరూపుఁడో యరూపుఁడో సెప్ప గాదు. తేలికయో బరువో తూపఁగాదు.' 'సెప్పగాదు'; 'తూపగాదు' అనే మాటలు కృతకంగా, అవుసరంలేని మాటల పొదుపుగా కన్పిస్తాయి. కబీరు మార్మిక మార్గానుయాయి (Mystic). ఆయన భావాలలో క్లిష్టత ఉండటం సహజం. అనువాదంలో సులభ పద్ధతిని పాటిస్తే బాగుంటుంది. ఆంగ్లానువాదంలో రవీంద్రుడీ జాగ్రత్త వహించాడు. నారాయణాచార్యుల వారి అనువాదంలో అల్పాక్షరాలలో రచన సాగించాలనే తాపత్రయం కన్పిస్తుంది. వీరీ ప్రయత్నంలో సఫలీకృతులు కాలేకపోయా రని పాఠకులు గ్రహించగలరు.

'Lamps burn in every house, o blind one! and you cannot see them. one day your eyes shall sonddenly be opened, and you shall see: and the letters of death will fall from you.

There is nothing to say or hear, there is nothing to do: it is he who is living, yet dead, who shall never die again.'

క్లిష్టమైన వేదాంతాన్ని, అందునా భక్తి మార్గానుయాయియైన కబీరు ప్రవచనాలను అర్థం చేసికొని అనువదించటానికి, కబీరువలెనే మార్మిక మార్గాన్ని అనుసరించిన రవీంద్రుడు అన్నివిధాలా సమర్థుడే. 'గీతాంజలి'; 'తోటమాలి'వంటి పుస్తకాలలో రవీంద్రుడు మార్మికమార్గాన్నే అనుసరించాడు. భారతీయ వేదాంతాన్ని సర్వప్రపంచానికి తెలియజెప్ప ప్రయత్నించిన రవీంద్రుడు కబీరు వచనాలను ఆంగ్లంలో అనువదించటం ఎంతో బాగున్నది.

భారతదేశంలో నివారు కబీరు పేరు విన్నప్పటికీ, కబీరు తత్త్వం ఏమాత్రమూ తెలియని జిజ్ఞాసువు లెందరో ఉన్నారు. తెలుగువారిలో అట్టి జిజ్ఞాసువులకు కబీరు తత్త్వం తెలియజెప్పి శ్రీ నారాయణాచార్యులు తెలుగువారి కృతజ్ఞతకు పాత్రులయ్యారు.

15 వ శతాబ్ది మధ్యనుండి 16 వ శతాబ్దంలో చాలకాలంవరకు జీవించిన కబీరు జన్మతః మహమ్మదీయుడైనా, నాథపంథీయుల నిర్గుణోపాసనచే ప్రభావితుడై, స్వామీ రామానందుల దయాదృష్టికి పాత్రుడై, విరాగియై, మహాభక్తుడై, యోగుల సహవాసముచేసి, జ్ఞానులకును యోగుల గర్వమును పటాపంచలుచేసి వేదాంత వీధిని నూత్న మార్గముల నేర్పఱచెను. కబీరు వాదమున మొండివాడు. నమ్మిన విషయమును చిత్తశుద్ధితో గాఢముగా నమ్మెను. భక్తిమార్గమునకు మించినది ఆతనికి మరేమియు లేదు. ఒకవిధముగా నాలోచించినచో భక్తిమార్గానుయాయుడైన యోగి యితడు. మౌఢ్యము నీత డీసడించును. తులసిమాలలు దాల్చినమాత్రాన, తిరునామము మొగమున దిద్దినమాత్రాన భక్తులు గారని యాతని పరమవిశ్వాసము. 'మాల త్రిప్పుచుండగనే యుగము గడచినది. మనసు తిరుగుడులు మానలేదు. చేతిపూస పారవైచి మనసు పూస త్రిప్పుము' (స్మరణము, 136) – ఇది కబీరు విశ్వాసము, ప్రబోధము.

కబీరు సూక్తులలో కొన్ని వేమన సూక్తులను, పోతులూరి వీరబ్రహ్మము, ఏగంటివారు, మొదలైనవారి సూక్తులను బోలియుండి తెలుగు జిజ్ఞాసువులకు పూర్వపరిచితములుగానే కన్పట్టును. సకల మతములసారము ధర్మాచరణమేగదా! అందువలన తత్త్వవేత్తల సూక్తులు పువ్వులలోని దారమట్లు, ఒక విధముగానేయుండి అంతర్యములలోని మలినమును క్షాళన మొనర్చుటకు దోహదము చేయును. కొన్ని చోట్ల కబీరు సూక్తులే పరస్పర వైరుధ్యములుగా గూడ గన్పట్టును. కబీ రనును 'ఆకలికుక్కవంటిది. భజనకు భంగముచేయును. దానికి ముక్క బడవేయుము. జంకు విడిచి స్మరియింపుము'. మరియొక చోట కబీరే 'నీరసమైన సగము తిండిమేలు. విందు తిండిలో సంతోషము గలుగును. పోపు వంటకము గోరినం బాపము మూట గట్టుకొనును' అనును.

కబీరుకు పూర్వమే వేదాంతులు పెక్కురు భక్తిమార్గమును తీర్చిదిద్దిరి. హిందూ, మహమ్మదీయ మత ద్వేషములు పెచ్చుపెరిగి భారత జాతిని కలచివేయ జొచ్చెను. శైవ, వైష్ణవ భేదములు హిందూ మతమును కలత పెట్టినపుడు తిక్కన హరిహరాద్వైతమూర్తిని స్మరించి మతసామరస్యమును కొంతవరకు సాధించి పూజనీయుడయ్యెను. కబీరెదుర్కొనినది మరింత గడ్డు సమస్య. మహమ్మదీయ మతము శతాబ్దుల తరబడి భారత జాతిని కబళించి తేజోవిరాజితమై కబీరునాటికి స్థైర్యము పొందుచుండెను. మహమ్మదీయుల హింసాప్రవృత్తి కబీరునకు బాల్యమునుండియు రుచించలేదు. కబీరు రామనామోన్మాదియై నూతన ప్రవక్తగా గణుతికెక్కెను. రాముని పాదము లాశ్రయించుటలో కబీరు దైవస్వరూపమునకు గిరిగీసి కొనలేదు. సామాన్యముగా భక్తులనుసరించు బాహ్యస్వరూప ఆరాధనము కబీరునకు రుచించ దాయెను. మనస్సులోని చిన్మయ జ్యోతిని దర్శించి దానిని రామార్పణ మొనరించి, లేక దైవార్పణ మొనరించి కబీరు ధన్యుడైనాడు. బాల్యమునుండి చెప్పిన సూక్తులకును, వయస్సుక్రాలిన తరువాత చెప్పిన సూక్తులకును నించుక భేదము పొడసూపినను కబీరు భక్తి రామపాదములనే ఆశ్రయించినట్టిది. కాముకుడు కామమునుగూర్చియే యెల్లప్పుడు చింతించినట్లు కబీరు రామునిగూర్చి ధ్యానించెను. భారతీయ ప్రవక్తలలో అగ్రశ్రేణి ప్రవక్తయైన కబీరు సూక్తులు కొన్ని యిట పొందుపఱచుట సమంజస మనుకొందును.

'చందనము విదేశమునకు పోయినది. అందఱు పలాశమనిరి. పొయ్యిలో బెట్టిరి. కాలినకొలది పరిమళ మెక్కువ యయ్యెను. (పరీక్షకుడు 207). సంగతి గిరిగినంతమాత్రమున నేమి ప్రయోజనము? హృదయము కఠోరము. బల్లెము నీట నానబెట్టిన నేమగును? దాని మొన మెత్తబడదు. [దుర్జనుడు 352.]

గొప్పగొప్ప వారందఱు మోహమును వెల్లువతో

గొట్టుకొనిపోయిరి. ధర్మమొక చిన్ని మీనము. అది యేటి కెదురీదును. [దోహము 505]. మానవుడా! నీ గుణము దొడ్డది. నీ మాంసము తినుటకుఁ బనికి రాదు. ఎముకలు సొమ్ములు గావు. చర్మము తప్పెట గాదు. [759] ఇవియేగాక మధురములు, మనస్సు లోగొనునవియునగు సూక్తులు ప్రతి పుటలోనూ దర్శన మిచ్చును. కబీరు శాకాహార ప్రాశస్త్యమును మిక్కిలిగా బోధించి, మాంసాహారము పాపమనును. అన్నింటియందు మాధుకరవృత్తి మేలనును. భక్తి మార్గముననే జ్ఞానపరిపూర్ణము నొందవలెనను. మాట మాటయందు కబీరు ఏవో సంజ్ఞలను కల్పించి, సూక్తులచే జిజ్ఞాసువుల సంశయగ్రంథులను విప్పి ఆనందింపజేసి తరింపచేయును.

కబీరు హృదయము నాపాంతము ననుభవించి, అనువదించిన శ్రీ నారాయణాచార్యులవారి యనువాదమున భాష కృతకమనక తప్పదు. క్లిష్టత మతి కొంత సౌలభ్యము నపేక్షించుచున్నది. కబీరు హృదయమును వచనావళిపలన ఆంధ్రుల కందించిన నారాయణాచార్య ధన్యులు.

—రామమోహనరాయ్.

విరిగిన విగ్రహాలు

[నవల: రచన: కిషన్‌చందర్. అనువాదం: పోలు శేషగిరిరావు ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ-2. వెల: 2-50; పుటలు: 138.]

ఇది నవలకాదు, కథల సంపుటికాదు; ఒక వ్యక్తిగతానుభవస్మృతుల సంకలనము. ఇందులోని అనుభవాలన్నీ రచయిత స్వీయచరిత్రకు సంబంధించినవే అని చెప్పటానికి ఆధారంలేదు. ఇందులో వర్ణితమైన ప్రదేశము, ప్రజలు, జీవితము, రచయిత స్వయంగా ఎరిగున్నవి—కాశ్మీర ప్రాంతానివి. తత్కారణంగా ఈ రచన 'జైత్రయాత్ర'కంటే మెరుగ్గా కనిపిస్తుంది. రచయితలో 'కాల్పనికవాదపు' వాసనలు బలీయంగా ఉన్నాయి. మార్క్సిస్టు రాజకీయాలు పుచ్చుకొన్న మతం. కాని ఈ పుస్తకంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చిన విషయం—హిందూ ముస్లిమ్ సమస్య. అసలు అటువంటి సమస్యేలేదు, దాన్ని రాజకీయాలు సృష్టించాయి అంటాడు ఈ పుస్తకంలో రచయిత. నిజమే! 'వర్గకలహం'మాత్రము రాజకీయాలు కల్పించింది కాదా? కాని ఆ సంగతి ఈ రచయిత అదే ధోరణిలో అంగీకరించకపోవచ్చు! ఈ పుస్తకంద్వారా కాశ్మీర ప్రజల సాంఘిక జీవనసరణి సన్నిహితంగా తెలుసుకునే అవకాశం కొంత లభిస్తున్నది. అంతకంటె ప్రయోజనమూ, విలువా, సాహిత్యపరంగా కనిపించటం లేదు.

—ఆర్. ఎస్.

వియోగి

కావ్యం. రచయిత: శ్రీ వజ్ఝల జగన్నాథం. పుటలు: 48. వెల: 1-00. ప్రాప్తిస్థానం: శ్రీ వజ్ఝల జగన్నాథం, రాయగఢ, కోరాపుట్‌జిల్లా, ఒరిస్సా.

ముక్తావళి

ఖండకావ్య సంపుటి. రచయిత: శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి. పుటలు: 56. వెల: 1-50. ప్రాప్తిస్థానం: శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి, 8/1007, జయప్రకాశ్ నారాణ్ రోడ్, వరంగల్.

అందని ఆదర్శం

నాటిక. రచన: కె. అప్పారావు. పుటలు: 56. వెల: 1-25. ప్రాప్తిస్థానం: పద్మావతీ పబ్లికేషన్స్, 339, గిడ్డంగివీధి, నెల్లూరు.

సెలయేరు

ఖండకావ్య సంపుటి. రచన: శ్రీ వజ్ఝల జగన్నాథము పుటలు; 110. వెల: 1-50. ప్రాప్తిస్థానం - శ్రీ వజ్ఝల జగన్నాథము, రాయగఢ, కోరాపుట్‌జిల్లా. ఒరిస్సా.

నాగస్వరం

ఖండకావ్య సంపుటి. రచయిత: శ్రీ బండి నాగరాజు. పుటలు 78. వెల 1-00 ప్రాప్తిస్థానం: మిత్రమండలి, 7334, తూర్పువీధి, గూడూరు నెల్లూరుజిల్లా.

కాంతిరేఖలు

ఖండకవితా సంపుటి. రచన : జగన్నాథ్. పుటలు 74. వెల 1-50. ప్రాప్తిస్థానం— శ్రీ ఎ. జగన్నాథరావు, c/o ఎ. ఎస్. రావ్‌నాయుడు, ఎల్. ఎల్. పురం, భమారుపేట్ట, వయా పాలకొండ, శ్రీకాకుళం జిల్లా.

స్వప్నజీవులు

స్త్రీ పాత్రలేని హాస్య నాటిక. రచయిత : శ్రీ కొల్లు మధుసూదన్‌రావు. పుటలు: 46. వెల 1-00. ప్రాప్తిస్థానం : గౌమిత్రీ పబ్లికేషన్స్, 1 9-34/11 రామ్‌నగర్, హైదరాబాద్ 10.

శివానందలహరి

శ్రీ శంకర భగవత్పాదుల శ్రీ శివానందలహరికి తెనుగు. తెనుగుసేత—శ్రీ పళ్ళెల జగన్నాథం. పుటలు 66. వెల : 0-75. ప్రాప్తిస్థానం— శ్రీ పళ్ళెల జగన్నాథం, రాయగఢ, కోరాపుట్ జిల్లా, ఒరిస్సా.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna The Andhra Patrika Press 6 & 7. Thambu Chetty Street, Madras-1
Editor : S. Sambhu Prasad


గుండె జలుబును వెంటనే పోగొట్టుకోండి!
అమృతాంజనం
పైనేరాసి త్వరగా గుణాన్ని పొందండి
అమృతాంజన్ బాధా నివారిణి నిరపాయకరంగా శీఘ్రంగా గుండె జలుబుకి సాధారణ జలుబులకు అమోఘంగా గుణాన్ని కల్గించడానికి 10 రకాల ఔషధాలు చేరిన మందు. కండనొప్పులకు, తలనొప్పికి, బెణుకులకు కూడా అమృతాంజన్ అమోఘంగా పనిచేస్తుంది. కొంచెం కొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా నెలల తరబడి వస్తుంది మీ కుటుంబానికంతా. అవసరానికెప్పుడూ అందుబాటుగా అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధి పొందిన నమ్మకమైన గృహ ఔషధం.
అమృతాంజన్ నొప్పుల జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు
AMRUTANJAN
Pain Balm
అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ